THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 22-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 102 రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు బీమా ధీమా

- పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాల కల్పన
- ఏడాది దాటిన కార్మికులకు గ్రాట్యుటీ
- ఐటీ ఉద్యోగులకు ఏడో తేదీలోగా జీతాలు
- కార్మికులందరికీ సామాజిక భద్రత, రక్షణ
- అమల్లోకి వచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు



ఈనాడు - హైదరాబాద్

దేశవ్యాప్తంగా కార్మికులందరికీ సామాజిక భద్రత, న్యాయం అందించేందుకు నాలుగు కార్మిక(లేబర్) కోడ్‌లను అమల్లోకి తీసుకువచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు సకాలంలో వేతనాలు చెల్లిస్తూ ఆర్థిక భద్రత కల్పించనున్నట్లు పేర్కొంది. గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లతో సహా కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు అమల్లోకి రానున్నాయని వివరించింది. దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో రూపొందించిన.. వేతనాల కోడ్-2019, పారిశ్రామిక సంబంధాల కోడ్-2020, సామాజిక భద్రత కోడ్-2020, వృత్తిపరమైన భద్రత-ఆరోగ్యం-పనిప్రదేశాల్లో పరిస్థితుల కోడ్-2020.. ఈ 4 కార్మిక కోడ్‌లను దేశవ్యాప్తంగా ఒకేసారి శుక్రవారం నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. వీటిని నోటిఫై చేసినట్లు కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు.

కొన్ని మార్పులు ఇలా: కార్మికులందరికీ ఉద్యోగ నియామకపత్రాలు. (మిగతా 5లో)



కార్మిక సోదర సోదరీమణులకు ఇది చరిత్రాత్మకమైన రోజు. నాలుగు కార్మిక కోడ్‌లను మా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. స్వాతంత్ర్యం తర్వాత కార్మికుల ప్రయోజనాల కోసం చేసిన అతి పెద్ద సంస్కరణిది. ఇవి భారత్‌లోని కార్మికులకు మేలు చేస్తాయి. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను మరింత సులభతరం చేస్తాయి. ఈ సంస్కరణలతో ఒక బలమైన వ్యవస్థ రూపొందుతుంది. అది కార్మికుల హక్కులకు రక్షణ కల్పించడమే కాకుండా.. దేశ ఆర్థికవృద్ధికి కొత్త జవసత్వాలనిస్తుంది. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉత్పత్తి పెరుగుతుంది. వికసిత్ భారత్ దిశగా మన యాత్ర వేగవంతంగా సాగుతుంది.

– 'ఎక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ



దేశానికి ఎంత చేయగలనో అంతా చేశా

పూర్తి సంతృప్తితోనే వెళ్తున్నా

వీడ్కోలు ప్రసంగంలో సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

11లో


శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము

వాహనం దిగి తిరుమలలో భక్తులతో మాటామంతీ



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు. చిత్రంలో తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి, మంత్రి రామనారాయణరెడ్డి, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఛైర్మన్ బీఆర్ నాయుడు, పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

5లో




మిస్ యూనివర్స్ ఫాతిమా బాష్

మెక్సికో యువతికి దక్కిన అందాల కిరీటం

5లో

ఇంట్లో యువరాణి... విశ్వానికి సుందరి! వసుంధర లో

ఏప్రిల్ 1 నుంచి అందరికీ ఆరోగ్య బీమా



- సంజీవని ప్రాజెక్టు దేశానికే దిక్సూచి
- 'పీపీపీ' వైద్య కళాశాలలతో ప్రజలకు మేలు
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2026 ఏప్రిల్ 1 నుంచి అందరికీ ఆరోగ్య బీమా (యూనివర్సల్ హెల్త్ పాలసీ)ను అమల్లోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖపై శుక్రవారం ఆయన సమీక్షించారు. పేద, ధనిక తేడా లేకుండా అందరికీ యూనివర్సల్ హెల్త్ పాలసీ అందుబాటులోకి తెస్తున్నామని సీఎం తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండే (బీపీఎల్)కుటుంబాలకు ఏడాదికి రూ.25 లక్షల వరకు, ఏపీఎల్ వర్గాలకు 2.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు పొందేలా ఈ పథకాన్ని రూపొందించామని చెప్పారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణం, కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సల్ హెల్త్ స్కీంపై అధికారులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో.. ఏ వ్యాధికి ఎంత వెచ్చిస్తున్నామో విశ్లేషించాలని సూచించారు. (మిగతా 5లో)

మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

ఉగాది నాటికి 5 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల తాళాల అప్పగింత

3 నెలలకొకసారి గృహప్రవేశాలు: సీఎం

2లో



మార్చి 16 నుంచి

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు కొనసాగనున్నాయి. పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. భౌతిక, రసాయన శాస్త్రాలు కలిపి ఒక పేపర్‌గా.. జీవశాస్త్రం మరో పేపర్‌గా విడివిడిగా 50 మార్కుల చొప్పున పరీక్షలు నిర్వహిస్తారు. అన్ని సబ్జెక్టులకు పరీక్షకు పరీక్షకు మధ్య విరామం వచ్చేలా షెడ్యూల్ ఇచ్చారు. పరీక్షల షెడ్యూలు 5లో

సీఎస్ విజయానంద్ పదవీకాలం మరో 3 నెలలు పొడిగింపు

వచ్చే ఏడాది ఫిబ్రవరి తర్వాత సాయిప్రసాద్‌కు అవకాశం

'స్థానిక' సమరానికి సన్నాహాలు!

2లో





(c) eenadu

AV (4) / AERC /2025
ANDHRA UNIVERSITY
VISAKHAPATNAM, ANDHRA PRADESH, INDIA
NAAC -Accredited "A++" Grade with a CGPA of 3.74 out of four point scale "ISO 9001 : 2015 Certified"

AMENDMENT IN NOTIFICATION
Notification No.AV(4)/AERC/2025, dated.22-10-2025 issued for the Post of Director in the **AER Centre**, Andhra University, Visakhapatnam, stands cancelled.
Date:21-11-2025　　Sd/- Registrar

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (APIIC), జోనల్ ఆఫీస్, చిత్తూరు, A.P

సవరణ ప్రకటన
"ఇండస్ట్రియల్ పార్క్, గంగ్రాజుపల్లి, చిత్తూరు జిల్లాలోని వాణిజ్య ఉపయోగం కోసం ప్లాట్లు - కామన్ అమెనిటీ 1 & కామన్ అమెనిటీ 2 కోసం" ఈ-ఆక్షన్ సంబంధిత ప్రకటన "ఈనాడు"లో 08.11.2025న ఇవ్వబడిన ప్రకటనకు సూచనగా, బిడ్ స్వీకరణ మరియు ఈ ఆక్షన్ తేదీలు క్రింద ఇవ్వబడిన విధంగా మార్చబడ్డాయి.
నమోదు చివరి తేది: 24.11.2025 సమయం 11.55PM
ఈ-ఆక్షన్ తేదీ: 26.11.2025
- ప్లాట్ సం.కామన్ అమెనిటీ-1 - 11.00AM నుండి 1.00PM వరకు
- ప్లాట్ సం.కామన్ అమెనిటీ-2 - 3.00PM నుండి 5.00PM వరకు
ఇతర షరతులు & నియమాలు అవే ఉంటాయి
జోనల్ మేనేజర్

మోదీ ప్రభుత్వంలో శ్రామికులకు పెద్దపీట

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. దేశవ్యాప్తంగా 29 పాత కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కొత్త కార్మిక స్మృతులను (లేబర్ కోడ్‌లు) అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి సంస్కరణలు, విప్లవాత్మక మార్పులకు ఏ ప్రభుత్వమూ చొరవ చూపలేదని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు మాధవ్ నివాళులర్పించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఎపి పోలీసు శాఖ
టెండరు ప్రకటన
టెండరు నోటీసు నెం. EAGLE/IT-PRO/2025-26/06,　　**తేది: 20.11.2025**
TENDER ID No. 865453, EAGLE హెడ్ క్వార్టర్స్, ఎ.పి. మంగళగిరి కొరకు సర్వర్ రూమ్ నిర్మించుట మరియు క్రిటికల్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేకరణ, స్థాపన మరియు పనిచేయించుట కొరకు టెండర్లు కోరబడుతున్నవి. 20.11.2025 సా.6.30 గం. నుంచి 04.12.2025 సా.5.00 గం. వరకు **https://tender.apeprocurement.gov.in** పై టెండరు వివరాలు అందుబాటులో ఉంటాయి. సంప్రదించవలసిన వ్యక్తి: DSP, Tech, EAGLE, AP, మంగళగిరి. **ఫోన్ 86860 68888.**
సం/- ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు, EAGLE, ఎ.పి., మంగళగిరి.
DIPR No.18120/CL/ADVT/1/1/2021-22

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
Administrative Office, Lam, GUNTUR - 522 034. A.P.

e-Procurement Tender Notice
Tenders are invited from the eligible contractors, for Tender Notice No. 09-12, dated 20-11-2025 Civil work- 2 No, Electrical work-2 nos, through e-procurement. Details can be had from **www.angrau.ac.in** or from O/o the Estate Officer at the above address. Schedules can be downloaded through **http://www.apeprocurement.gov.in**. For the works 09,10&12, downloading starts from **22-11-2025 @ 11.00 A.M. Onwards & ends on 08-12-2025 upto 11.00 A.M.** For the work 11, downloading **starts from 24-11-2025 @ 03.00 P.M. onwards & ends on 08-12-2025 upto** 3.00 P.M. For further details contact: **TPA to Estate Officer: 94900 08945.**
DIPR No: 4592PP/CL/Advt/1/1/2021-2022　　**Sd/- ESTATE OFFICER**

Andhra Pradesh Centre for Financial Systems & Services. (APCFSS)
O/o. The Chief Executive Officer, 3rd floor, Nidhi Bhavan, Mangalagiri, Guntur Dist -522 503 web: www.apcfss.in (An undertaking of A.P. Govt.)

'Notice Inviting Tender (NIT)'
Selection of Consulting Agency for the Preparation of Three Detailed Project Reports (DPRs) for Comprehensive Development Initiatives in Andhra Pradesh
The Andhra Pradesh Centre for Financial Systems and Services (APCFSS) invites esteemed and qualified professional consulting agencies to submit proposals for preparing Three Detailed Project Reports (DPRs) that will serve as the framework for planning and implementing Comprehensive Development Initiatives in **Andhra Pradesh.**
Interested agencies may download the Request for Proposal (RFP) document from **www.apeprocurement.gov.in** and **www.apcfss.in** from **21-11-2025 onwards.** Agencies are required to submit their proposals in the prescribed format on or before the Proposal Due Date specified in the RFP document.
Queries and Clarifications related to the RFP can be sent to **tenders@apcfss.in**
DIPR No. 4593PP/CL/ADVT/1/1/2021-22　　Sd/- **CEO, APCFSS**

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)
54-15-1, Venkateswara Nagar, Near Yalamanchili Complex, Sonovision Building, Ring Road, Vijayawada.

REQUEST FOR PROPOSAL (RFP)
NIT No.411/ADCL/IPD/2025-26, DATED: 21.11.2025
Request for Proposal (RFP) for Engagement of **"Project Management Consultant (PMC) for the Work of Package XXXXXI:** Construction of Roads, Drains, Water Supply, Sewerage, Utility Ducts for Power & ICT, Reuse Waterline, STP & Avenue Plantation, Compatible with Trunk Infrastructure in layouts for Land Pooling Schemes for Krishnayapalem (P), Venkatapalem (P), Penumaka (P) and Undavalli (P) villages in ZONE-8 area and Penumaka Layout in adjacent zones in Amaravati Capital City, Andhra Pradesh on Lumpsum Contract (% Tender) basis including DLP of 2 years".
NIT No.412/ADCL/IPD/2025-26, DATED: 21.11.2025
Request for Proposal (RFP) for Engagement of "Project Management Consultant (PMC) for the Works of
1. Package XXXXX : World Bank and ADB Financed Amaravati Capital City Development Program Related Survey, Investigation, Design, Construction, Testing, Commissioning of Flood Pumping Station-2 at Undavalli (Capacity 8400 Cusec) and 15 Years Operation & Maintenance on Lumpsum Contract (% Tender) basis in Amaravati Capital City of Andhra Pradesh State, India.
2. Package XXXXXIII : Engineering and Construction of Two-Lane Bridge including Ship Lock and Regulator to Kondaveetivagu and Guntur Channel in Amaravati, Andhra Pradesh on Lumpsum (% Tender) basis including DLP of 2 Years".
The bid can be downloaded on AP e-procurement portal from **22.11.2025 to 15.12.2025 up to 15.00 Hrs.** Due date for submission of Bid is **15.12.2025 up to 16.00 Hrs,** Technical Bid opening is on **15.12.2025 @17.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in and www.adcl.in**
Sd/- Chairperson and Managing Director, ADCL, Vijayawada.

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA
Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders.

S. No.	Tender ID	Name of the Work	Estimate Contract Value (in Rs.)
1	865496	Tender notice for "Completion of incomplete Kreeda Vikasa Kendra at Atmakur (V&M), Atmakur Constituency, Nellore District (Part-1)	30,12,294.00/-
2	865497	-Do- (Part-2)	29,60,485.00/-
3	865499	-Do- (Part-3)	29,67,900.00/-
4	865506	-Do- (Part-4)	22,24,002.00/-
5	865508	-Do- (Part-5)	22,86,005.25/-
6	865511	Tender notice for "Completion of incomplete Kreeda Vikasa Kendra at Bangarupalem of Puthalapattu Constituency, Chittoor District (Part-1)"	30,77,907/-
7	865513	-Do- (Part-2)	30,81,460/-
8	865515	-Do- (Part-3)	31,28,499/-
9	865517	-Do- (Part-4)	31,08,085/-
10	865519	-Do- (Part-5)	27,22,061/-
11	865522	-Do- (Part-6)	13,08,952/-

Bid Starting date: 22-11-2025. Bid End date: 02-12-2025
Tender documents are available on e-procurement platform tender.apeprocurement.gov.in. Tenders will be opened in the presence of company representatives who attend the evaluation. **For further details contact: 85010 74922.**
Sd/- Vice Chairman and Managing Director
DIPR No.4590PP/CL/ADVT/1/1/2021-22

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
I.G.M.C. STADIUM, BANDAR ROAD, LABBIPET, VIJAYAWADA
PH No: 0866-2499699, Email: sportsinap@gmail.com, https://sports.ap.gov.in/

ADVERTISEMENT
SAAP/PCA/KIC & KISCE/2/2025,　　**Date: 20-11-2025**
Sports Authority of Andhra Pradesh requires the following post to work Khelo India Centres/KISCE in the state on Contract basis for a period upto 31-03-2026 (further period may extend subject to continuation of scheme by Sports Authority of India) **Khelo India Centres (PCAs):**

Sl No	Position	Khelo India Centre Name & District	Discipline	Remuneration per month
1.	Past Champion Athlete (PCA) as coach/mentor	DSA Krishna	Swimming	25,000/-
2.	Past Champion Athlete (PCA) as coach/mentor	DSA, Dr. B.R. Ambedkar Konaseema	Basketball	25,000/-
3.	Past Champion Athlete (PCA) as coach/mentor	DSA, Kakinada	Weightlifting	25,000/-
4.	Past Champion Athlete (PCA) as coach/mentor	DSA, ASR Paderu	Wrestling	25,000/-

KISCE, Dr. YSR Sports School, Kadapa:

Sl. No.	Position	Discipline/ Grade	No.of Posts	Upper Age Limit	Remuneration
1.	Masseur (Female)	Grade-I	1	35 years	35,000-55,000

Please check eligibility and engaging terms and conditions at our website: **www.sports.ap.gov.in**. The eligible candidates may submit the applications on or before **21-12-2025 by 5.00 PM** to the mail id: **apkheloindia@gmail.com & kisce.ap@gmail.com.** For further details contact: **0866-2499699**
Sd/- Vice Chairman and Managing Director
DIPR No.4591PP/CL/ADVT/1/1/2021-22

మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

- ఉగాది నాటికి 5 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల తాళాల అప్పగింత
- ప్రతి మూడు నెలలకొకసారి సామూహిక గృహప్రవేశాలు
- ఇళ్ల నిర్మాణాలపై అప్‌డేట్లన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలి
- టిడ్కో, గృహనిర్మాణశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రానున్న మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయడమే లక్ష్యంగా అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పూర్తయిన గృహాలకు ఇకపై ప్రతి మూడు నెలలకోసారి లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేయించాలని సూచించారు. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందించేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, గృహనిర్మాణ శాఖపై చంద్రబాబు సమీక్షించారు. 'అర్హులందరికీ ఇళ్ల నిర్మాణం చేపడతామని ఎన్నికల్లో హామీనిచ్చాం. 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 3 లక్షలకు పైగా ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాం. 2029 జనవరి నాటికి మిగతా లక్ష్యాన్ని వేగంగా పూర్తిచేయాలి' అని సూచించారు.

ముస్లింలకు అదనంగా రూ.50 వేలు

'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-1.0 పథకం కింద నిర్మాణం చేపట్టే ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీలకు అదనంగా ఆర్థికసాయం అందిస్తున్నాం. ఇప్పుడు ముస్లింలకూ రూ.50వేలు అదనంగా ఇవ్వాలని నిర్ణయించాం. దీనికోసం 18వేల మందికి రూ.90 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వం ఆయా వర్గాలకు అదనంగా ఇస్తున్న సాయాన్ని వారికి వివరించాలి. అర్హులంతా సద్వినియోగం చేసుకునేలా చూడాలి' అని వివరించారు.



టిడ్కో, గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి పార్థసారథి

వేగంగా లబ్ధిదారుల ఎంపిక సర్వే

'ఇళ్ల నిర్మాణ పనుల్లో పొరపాట్లకు, జాప్యానికి తావివ్వరాదు. అర్హుల ఎంపికకు సర్వే త్వరగా పూర్తిచేయాలి. వారి జాబితాను గ్రామాలవారీగా ప్రదర్శించాలి. ప్రజలు సంతృప్తి చెందితేనే నాకు సంతృప్తి. ఇంటి నిర్మాణానికి స్థలం లేనివారికి స్థలం కేటాయించాలి. తమకు స్థలాలు ఉన్నాయని, అందులో నిర్మించుకుంటామని చెబితే పొసెషన్ సర్టిఫికెట్లు అందించాలి. ఇళ్ల నిర్మాణాలపై అప్‌డేట్లన్నీ ఆన్‌లైన్‌లో ఉండేలా చూడాలి' అని స్పష్టం చేశారు.

రూ.920 కోట్లు చెల్లించని వైకాపా ప్రభుత్వం

'ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద 2014-19 మధ్య చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసిన వారికి వైకాపా ప్రభుత్వం రూ.920 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. ఈ బిల్లులు మళ్లీ మంజూరయ్యేలా కేంద్రంతో సంప్రదింపులు జరపండి. ఆ బిల్లులు ఇవ్వకుండా వైకాపా ప్రభుత్వం ఎలా అడ్డుకుందో లబ్ధిదారులకు వివరించాలి. 2014-19 మధ్య జరిగిన నరేగా పనుల బిల్లులనూ వైకాపా ప్రభుత్వం ఇలాగే నిలిపేసింది. కేంద్రంతో సంప్రదించి ఆ బిల్లులు వచ్చేలా చేశాం. ఇలాగే ఎన్టీఆర్ గ్రామీణ పథకం బిల్లులూ వచ్చేలా చూడాలి' అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

మత్స్యకారుల జీవనోపాధికి మార్గసూచి సిద్ధం

- 200 నాటికల్ మైళ్ల వరకు వేటకు అవకాశం
- కేంద్ర నిర్ణయంతో మరింత మేలు
- స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్‌లో శిక్షణ ఇప్పిస్తాం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. కాకినాడ జిల్లాలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల ప్రణాళిక అమలుకు మార్గసూచి తుదిదశకు చేరింది. తీరంలో ఉపాధిని కోల్పోతున్న మత్స్యసంపద పెంపుతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపైనా దృష్టి సారించాం. విశాఖ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, మత్స్యశాఖ సూచనల మేరకు రూపొందించిన ప్రణాళిక అమలుకు ఏర్పాట్లు చేస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం ఉప్పాడ తీరప్రాంత రక్షణకు రూ. 2 కోట్లతో ప్రత్యేక చర్యలు చేపడుతోందని, 100 రోజుల ప్రణాళికలో భాగంగా వేట వైవిధ్యాన్ని పెంచడం, ప్రత్యేక రీఫ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామని ఆయన చెప్పారు. మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ పవన్ కల్యాణ్ వెల్లడించిన అంశాలు ఇలా ఉన్నాయి..



- సముద్రంలో చేపల సంఖ్యను పెంపొందించే చర్యల్లో భాగంగా తొలిసారి ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంతాల్లో 50 వేల పండుగొప్పలను సముద్రంలో విడిచిపెట్టాం. భవిష్యత్తులో ఉప్పునీటిలో పెరిగే టైగర్ రొయ్యపిల్లలను తీర ప్రాంతాల్లో విడిచిపెట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
- మత్స్యకారులు ఇప్పటివరకు 12 నాటికల్ మైళ్ల దూరం వరకే వేటాడే అవకాశం ఉంది. ఇటీవల కేంద్రం ఈ పరిధిని 200 నాటికల్ మైళ్లకు పెంచింది. దీనివల్ల మంచి ధర లభించే టూనా చేపలు దొరుకుతాయి.
- ఉప్పాడ సమీపంలో కోనపాపపేటకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. వీటితో తుపాను నుంచి రక్షణ కల్పించే కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడుతున్నాం. వీటిలో ఆర్వో నీటి ప్లాంట్‌తో పాటు చేపలు ఎండబెట్టుకునేందుకు మూడు ప్లాట్‌ఫాంలు నిర్మిస్తాం. ఐస్ బాక్సులు, మత్స్యకారుల లొకేషన్ తెలుసుకునేందుకు జీపీఎస్ వ్యవస్థ అక్కడ ఏర్పాటుచేస్తాం.
- ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల కోసం కేరళ తరహాలో తీరప్రాంత పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్ వంటి జలక్రీడల్లో మత్స్యకార యువతకు శిక్షణ ఇప్పిస్తాం. కాకినాడ నుంచి మత్స్యకారులను కేరళ తీసుకెళ్లి అక్కడ ఎకో టూరిజం కేంద్రాల వద్ద శిక్షణ ఇప్పిస్తాం. చెన్నై హార్బర్ వద్ద తిరువళ్లువర్ కుప్పం తీరంలో విజయవంతంగా నిర్వహిస్తున్న కృత్రిమ రీఫ్ కల్చర్ సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం. 1,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టన్ను సామర్థ్యం ఉన్న కృత్రిమ రీఫ్‌లు సముద్రంలో ఉంచడం వల్ల 300 రకాల సముద్ర జీవులను ఆకర్షించే అవకాశం ఉంది. అందులో 50 రకాలు వాణిజ్య విలువలు ఉన్న చేపలు ఉంటాయి. ఈ కల్చర్ వల్ల రెండేళ్లలో మత్స్యకారులకు రూ.2 కోట్ల ఆదాయం సమకూరుతుంది. డిసెంబర్ రెండో వారంలో ఉప్పాడ, కాకినాడ తీరప్రాంత మత్స్యకారులను తమిళనాడు, కేరళ పంపించే ఏర్పాట్లు చేస్తున్నాం.

బంగాళాఖాతంలో మరో గండం!

నేడు అండమాన్ సమీపంలో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో అండమాన్ సమీపంలో శనివారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని అంచనా. తర్వాత అదే దిశలో పయనిస్తూ.. బుధవారం నాటికి నైరుతి బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముంది. దీని ప్రభావంతో రాబోయే 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. శనివారం ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

- అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో బంగాళాఖాతం నుంచి తేమ గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గింది. గురువారం రాత్రి నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 13 డిగ్రీలకు పెరిగాయి. తుపాను తీవ్రత తగ్గే వరకు చలి తీవ్రత పెద్దగా ఉండకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

సీఎస్ విజయానంద్ పదవీకాలం మరో 3 నెలలు పొడిగింపు

ఫిబ్రవరి తర్వాత సాయిప్రసాద్‌కు అవకాశం



విజయానంద్



జి.సాయిప్రసాద్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పదవీకాలాన్ని మరో మూడు నెలలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విజయానంద్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని నిర్ణయించిన నేపథ్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతారు. ఆ తర్వాత జలవనరుల శాఖ, సీఎంవో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌కు సీఎస్‌గా అవకాశం కల్పించనుంది. 2026 మే నెలాఖరు వరకూ సాయిప్రసాద్‌కు సర్వీసు ఉంది. ఆ తర్వాత కూడా కొన్నాళ్ల పాటు సీఎస్‌గా ఆయన్ను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఫలసంరక్షణ రాయితీ వినియోగించుకోండి

అరటిలో నాణ్యత పెంపుపై ఉద్యానశాఖ సూచన

ఈనాడు, అనంతపురం: ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అరటి సాగు విస్తీర్ణం పెరగడంతో రాష్ట్రంలో పంటకు డిమాండ్ పడిపోయి ధరలు తగ్గిపోయాయని రాష్ట్ర ఉద్యానశాఖ పేర్కొంది. శుక్రవారం ఈనాడులో ప్రచురితమైన 'అరటి కిలో రూపాయి' కథనానికి అధికారులు స్పందించారు. వైఎస్సార్ కడప, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో ఈ ఏడాది 40 వేల హెక్టార్లలో రైతులు అరటి సాగుచేసినట్లు ఉద్యానశాఖ తెలిపింది. ఇది గతేడాది పోలిస్తే 20% అధికమని పేర్కొంది. దీనికితోడు వర్షాల కారణంగా నాణ్యత తగ్గిపోవడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ ఏడాది జనవరిలో నాటిన మొదటి పంట డిసెంబరులో కోతకు వస్తుందని. . ఆలోపు దిగుబడిలో నాణ్యత పెంచుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఫలసంరక్షణ (ఫ్రూట్‌కేర్) కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతుకు రూ.10 వేల చొప్పున రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. రాయితీని వినియోగించుకోవాలని సూచించింది. దేశీయ మార్కెట్‌లో మంచి ధర లభించేలా ఉత్తరాది రాష్ట్రాల్లోని కొనగోలుదారులు, అమ్మకందారులతో సమావేశమవుతామని.. జిల్లా స్థాయిలోనూ ఎగుమతిదారులతో కలెక్టర్లు మాట్లాడతారని పేర్కొంది.

పోలవరాన్ని పరిశీలించిన సీడబ్ల్యూసీ సభ్యులు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని డిజైన్లు, పరిశోధన విభాగం ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఆదిత్యశర్మ, సీఈ ఎస్‌ఎస్ బక్షి, పీపీఏ అథారిటీ కార్యదర్శి ఎం.రఘురామ్ శుక్రవారం పరిశీలించారు. కీలక నిర్మాణాలు గ్యాప్-1, 2లో కొనసాగుతున్న పనులతో పాటు డయాఫ్రం వాల్ కటింగ్, డీవాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం, జలవిద్యుత్తు పనులు తనిఖీ చేశారు. స్పిల్‌వేలో గేట్ల పనితీరు, పవర్‌ప్యాక్, సిలిండర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కొనసాగుతున్న పనుల గురించి ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి వారికి వివరించారు. ప్రాజెక్టు అనుబంధ పనుల్లో భాగంగా దేవరగొంది, మామిడిగొంది గ్రామాల మధ్య జరుగుతున్న జంట సొరంగాల లైనింగ్ పనులు కూడా పరిశీలించారు. వీరి వెంట నాణ్యత ప్రమాణాల నియంత్రణ విభాగం సీఈ కె.శేషుబాబు, ఎస్ఈ కె.రామచంద్రరావు, ఈఈలు కె.బాలకృష్ణ, డి.శ్రీనివాస్, ప్రేమ్‌చంద్ తదితరులు ఉన్నారు.



డీవాల్ నిర్మాణ ప్రాంతంలో పనులు పరిశీలిస్తున్న ఆదిత్యశర్మ, ఎస్ఎస్ బక్షి తదితరులు

కుప్పంలో కరవుకు శాశ్వత పరిష్కారం: నారా భువనేశ్వరి

శాంతిపురం, న్యూస్‌టుడే: 'హంద్రీ-నీవా' కాలువ ద్వారా కృష్ణా జలాల రాకతో కుప్పం నియోజకవర్గంలో కరవుకు శాశ్వత పరిష్కారం దొరికిందని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం శాంతిపురం మండలం గుంజార్లపల్లె పంచాయతీ పరిధిలోని తుమ్మిశి పెద్ద చెరువులో జలహారతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నంగా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చి దశాబ్దాల కలను సాకారం చేశారని తెలిపారు. ఆర్టీసీ బస్సులో తుమ్మిశి పెద్దచెరువు వరకు ప్రయాణించిన భువనేశ్వరి మహిళలతో ముచ్చటించారు. నడింపల్లెలో మహిళలతో ముఖాముఖి సందర్భంగా వారితో కలిసి కోలాటం ఆడారు.



మహిళలతో కోలాటం ఆడుతున్న నారా భువనేశ్వరి

కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైకాపా అధినేత జగన్ లేఖ

ఈనాడు, అమరావతి: కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారు. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ2) ఎదుట రాష్ట్ర ప్రభుత్వ వాదనలు పేలవంగా ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తరఫున ఏకే గోయల్ సమర్పించిన అఫిడవిట్ ఇందుకు నిదర్శనమని విమర్శించారు. ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ పక్షాన వాదించిన న్యాయవాది క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా గోయల్ స్పందించిన తీరు దారుణంగా ఉందని ఆరోపించారు. కృష్ణా జలాలపై మనకున్న హక్కును కాపాడడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోందని పేర్కొన్నారు. కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. లేఖపై తేదీ ఈ నెల 19 అని ఉండగా.. ఆ లేఖను జగన్ కార్యాలయం శుక్రవారం మీడియాకు విడుదల చేసింది. బచావత్ ట్రైబ్యునల్ గతంలో కృష్ణా నికర జలాల్లో కేటాయించిన 512 టీఎంసీల నీటిలో ఒక్క టీఎంసీని మనం కోల్పోయినా, అందుకు తెదేపా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

తరగతి గదిలోనే విద్యార్థిని ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినులందరూ మధ్యాహ్న భోజనానికి వెళ్లిన సమయంలో పదో తరగతి విద్యార్థిని తరగతి గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతమిది.. ఏలూరు జిల్లా పోలీసుల కథనం.. జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడేనికి చెందిన పొడపాటి గంగాధరరావు, ఉషారాణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె కావ్య(15) జంగారెడ్డిగూడెం పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఉంటూ చదువుకుంటోంది. శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థినులతో పాటు ఆమె కూడా భోజనానికి బయలుదేరింది. మధ్యలో కంచం తీసుకొస్తానని చెప్పిన కావ్య తిరిగి తరగతి గదిలోకి వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో ఇతర విద్యార్థినులు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని కనిపించింది. ప్రిన్సిపల్ గంగాభవాని, ఇతర ఉపాధ్యాయులు కావ్యను కిందికి దింపి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కావ్య సోదరి సైతం అదే పాఠశాలలో చదువుతోంది.



పొడపాటి కావ్య

మనస్తాపమే కారణమా?

బాలిక తండ్రి గంగాధరరావు కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. తల్లి ఉషారాణి మూత్రపిండాల సమస్యతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. తల్లికి ఆరోగ్యం సరిగా ఉండకపోవడంతో తాను చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నట్లు కావ్య తోటి విద్యార్థులతో పలుమార్లు చెప్పినట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. మనస్తాపంతోనే బాలిక బలవన్మరణానికి పాల్పడిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'స్థానిక' సమరానికి సన్నాహాలు!

- 175 నియోజకవర్గాల ఓటర్ల జాబితాలు సేకరించిన ఎన్నికల సంఘం
- ఎన్నికలపై పురపాలక, పంచాయతీరాజ్ శాఖలకు లేఖలు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో మంత్రి నారాయణ భేటీ

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం అందుకు ఏర్పాట్లు చేస్తోంది. 175 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి తీసుకుంది. వీటి నుంచి మున్సిపల్, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం మున్సిపల్, పంచాయతీల్లో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయడమే తడవుగా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలన్న యోచనతో ఎన్నికల సంఘం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ శుక్రవారం కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక సంస్థలకు ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల సంఘం పురపాలక, పంచాయతీరాజ్ శాఖలకు వేర్వేరుగా ఇటీవల లేఖలు రాసింది. ప్రభుత్వ సన్నద్ధతపై మంత్రి నారాయణ ఎన్నికల కమిషనర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది.

సీఎం సూచనలతో..

- స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని సీఎం చంద్రబాబు ఈ నెల 19న తెదేపా ఎమ్మెల్యేలు, నాయకులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సూచించారు. మూణ్నాలుగు నెలల్లో ఎన్నికలొస్తున్నాయని, ఇప్పటి నుంచే ప్రజల్లో ఉండాలని ఆయన చెప్పడం ద్వారా ప్రభుత్వం స్థానిక సమరానికి సిద్ధమవుతోందన్న విషయం స్పష్టమవుతోంది.
- 2021 ఫిబ్రవరిలో పంచాయతీలకు, అదే ఏడాది మార్చిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలంలో మరో నాలుగు నెలల్లో ముగియనుంది. మూడు నెలలు ముందుగా డిసెంబరులో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సన్నద్ధత లేకుండా ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ లేఖలపై ప్రభుత్వం నుంచి అధికారికంగా ఇంకా సమాధానం రాలేదు.
- రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనల ప్రకారమైతే డిసెంబరులో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపించడం లేదు. రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియ పూర్తికి 30-45 రోజుల సమయం అవసరమని అధికారులు చెబుతున్నారు. పంచాయతీ, మున్సిపల్ ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలం ముగిశాకే ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి నెలాఖరుకు రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తిచేస్తే.. మార్చిలో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వనుంది. ఏప్రిల్‌లో మొదటి వారంలో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి.
- స్థానిక ఎన్నికలకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి అదనంగా దాదాపు లక్ష బ్యాలట్ బాక్సులు తెప్పించాలన్న యోచనతో ఎన్నికల సంఘం ఉంది. గత ఎన్నికల సమయంలోనూ ఇతర రాష్ట్రాల నుంచి వీటిని తెప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.20 లక్షల బ్యాలట్ బాక్సులు ఉన్నాయి. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే అదనపు బాక్సులు అవసరమవుతాయని భావిస్తున్నారు.
- ఎన్నికల ఏర్పాట్ల కోసం పంచాయతీరాజ్, పురపాలక శాఖల నుంచి సీనియర్ అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపాలని ఆ శాఖలను ఎన్నికల సంఘం కోరింది. ఎన్నికల సమయంలో ప్రతిసారి ఈ శాఖల నుంచి 20-25 మంది అధికారులు, సిబ్బంది సేవలను వినియోగించుకుంటోంది. రాష్ట్ర స్థాయిలో ఏర్పాట్లతోపాటు జిల్లాలతో సమన్వయం కోసం వీరిని వినియోగిస్తారు.

గ్రహం అనుగ్రహం

22–11–2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
విదియ: మ. 2-47 తదుపరి తదియ
జ్యేష్ఠ: మ. 3-31 తదుపరి మూల
వర్జ్యం: రా. 12-15 నుంచి 2-00 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-34 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-12 నుంచి 7-41 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.12; సూర్యాస్తమయం: సా.5.20

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	14.4	29.6
విజయనగరం	19.0	30.0
కర్నూలు	20.2	31.3
కడప	22.0	29.0
అనంతపురం	22.0	31.2
శ్రీకాకుళం	22.0	32.0
రాజమహేంద్రవరం	22.0	36.0
ఒంగోలు	22.1	32.1
నరసాపురం	23.0	33.6
తిరుపతి	23.5	29.2
విజయవాడ	23.6	32.4
సూర్యాపేట	24.0	33.0
నెల్లూరు	24.9	30.8
గుంటూరు	25.0	31.0
విశాఖపట్నం	25.6	32.2
తాడేపల్లిగూడెం	28.0	32.0

(c) eenadu



స్థూలకాయం.. ఇదిగో ఇలా దూరం!

ఈనాడు ఉచిత వెబినార్‌తో

వేళాపాళా లేని నిద్రాహారాలు.. కాలు కదపని కొలువులు.. నిత్యం ఒత్తిడితో సతమతమయ్యే జీవనశైలి.. వెరసి ఈతరం స్థూలకాయం బారిన పడుతోంది. ఆడామగా అనే తేడా లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ఇదో ఎడతెగని సమస్యలా మారింది. మన దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారు అంటోంది జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే. తెలుగు రాష్ట్రాల్లోనూ స్థూలకాయ బాధితుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో ఉందనే విషయం ప్రస్ఫుటం. చిన్నారులనూ వదలని ఈ ఊబకాయం... ఒక్కసారి ఒంటిని చుట్టేస్తే కుదురుగా ఉండదుగా! మధుమేహం, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు, బీపీ, ఫ్యాటీ లివర్, క్యాన్సర్‌లాంటి ప్రమాదకరమైన రుగ్మతలనూ మోసుకొస్తుంది. మరి ఇంతటి భయంకరమైన ఊబకాయం మన దరికి చేరకుండా ఉండాలంటే ఏం చేయాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఏమేం వ్యాయామాలు చేయాలి? జీవనశైలిలో చేయాల్సిన మార్పులేంటి? అందుబాటులో ఉన్న అధునాతన వైద్య చికిత్సలేంటి? ఈ వివరాలన్నింటిపై 'ఈనాడు' ప్రత్యేక ఉచిత వెబినార్ నిర్వహిస్తోంది. ప్రముఖ వైద్యనిపుణులు **డా.రాకేశ్ కలపాల, డా.పి.వి.రావు, యోగా గురు శిరీష, పోషకాహార నిపుణురాలు డా.లతాశశి** అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యాభిలాషులందరూ ఇందులో పాల్గొనవచ్చు. విలువైన సమాచారం తెలుసుకొని ఊబకాయం దరిచేరకుండా చూసుకోవచ్చు.

జూమ్ మీటింగ్, యూట్యూబ్ లైవ్‌లో వెబినార్ నిర్వహిస్తారు

వెబినార్ తేదీ: నవంబరు 23 ఆదివారం

సమయం: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

Webinar ID: 985 1335 8216
Passcode: 407923

యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి

Join from PC, Mac, iPad, or Android:
Zoom - https://hov.to/db9a07ef
Yt Live - https://hov.to/f8b4719c

కర్ణాటక కాంగ్రెస్‌లో ఆరని కుంపట్లు

- సీఎంగా నేనే కొనసాగుతా: సిద్ధరామయ్య
- 140 మందికి నేనే అధ్యక్షుడిని: డీకే

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక అధికారపక్షం కాంగ్రెస్‌లో అధికారం కోసం కొనసాగుతున్న పోరు జోరందుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ సీఎం కుర్చీ కోసం పట్టు బిగిస్తున్నారు. దిల్లీకి చేరిన కర్ణాటక పంచాయితీకి వీలైనంత త్వరగా ముగింపు పలకాలని అధిష్ఠానం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం కీలక ప్రకటన చేసి తన పట్టు మరింత బిగించారు. మైసూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న రెండేళ్లూ తానే బడ్జెట్ ప్రవేశపెడతానని ప్రకటించారు. తానే ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా కొనసాగుతానని మరోసారి చెప్పారు. ఇదే సమయంలో అధిష్ఠానం ఆదేశాలను తనతోపాటు డీకే శివకుమార్, ఎమ్మెల్యేలంతా పాటించాలన్నారు. శనివారం బెంగళూరుకు రానున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ప్రత్యేకంగా మాట్లాడతానని సిద్ధరామయ్య తెలిపారు.

సీఎంకు ఆల్ ద బెస్ట్

'నా జీవితంలో ఏనాడూ ముఠా రాజకీయాలు చేయలేదు. నా రక్తంలోనే అలాంటి రాజకీయం లేదు' అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఇదే సమయంలో దిల్లీకి వెళ్లిన మంత్రులు, ఎమ్మెల్యేల గురించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి మంత్రివర్గ విస్తరణపై ప్రకటన చేయగానే పదవుల ఆశావహులు అధిష్ఠానానికి మనవి చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్‌లోని 140 మంది ఎమ్మెల్యేలకు అధ్యక్షుడినని.. వారిని అడ్డుకునే ప్రయత్నం చేయనంటూ తన బలాన్ని పరోక్షంగా ప్రదర్శించారు. తానే ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ప్రకటించిన సిద్ధరామయ్యకు 'ఆల్ ద బెస్ట్' అంటూ.. ఆయనకు తాను సహకరిస్తానన్నారు.

అధిష్ఠానం హెచ్చరిక

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కర్ణాటక ఇన్‌ఛార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలా ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ 'నేను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో మాట్లాడాను. ఇదంతా భాజపా, కొన్ని మాధ్యమాలు సృష్టిస్తున్న వదంతి' అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనవసర వ్యాఖ్యలతో గందరగోళం సృష్టించొద్దని హెచ్చరించారు. డీకే బృందం దిల్లీకి వెళ్లగానే బెంగళూరులో సిద్ధరామయ్యకు మద్దతుగా ఉన్న నేతలంతా ప్రత్యేక విందులు ఏర్పాటుచేసి తమ వ్యూహాలకు పదును పెట్టారు. సీనియర్ మంత్రులు సతీశ్ జార్ఖిహోళి, హెచ్.సి.మహదేవప్ప, దినేశ్ గుండూరావు తదితరుల నేతృత్వంలో శుక్రవారం ఈ విందు ఏర్పాటుచేశారు.

అరటి టన్నుకు రూ.25 వేల ధర అందించాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: అరటి ధరల పతనంపై సీఎం చంద్రబాబు తక్షణమే సమీక్షించి రైతుకు టన్నుకు రూ.25 వేల గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. గల్ఫ్, ఐరోపా దేశాలకు తగ్గిన ఎగుమతులను పరిశీలించి, వాటిని పునరుద్ధరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించారు.



అనుమతి లేకుండా ఇళయరాజా పేరు, ఫొటో వాడకూడదు

- మద్రాసు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఫొటోను సామాజిక మాధ్యమాల్లో వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదంటూ మద్రాసు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. సామాజిక మాధ్యమాల్లో అనుమతి లేకుండా తన ఫొటో, బిరుదు, పేరు, స్వరాలు ఉపయోగించకూడదని, ఇదివరకే పోస్టు చేసిన ఫొటోలు తొలగించాలని, ఇప్పటి వరకూ వాటిని ఉపయోగించి పొందిన ఆదాయ వివరాలను దాఖలు చేసేలా యూట్యూబ్ ఛానళ్లకు ఉత్తర్వులు ఇవ్వాలని ఇళయరాజా పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. పేరు, ఫొటోలు ఉపయోగిస్తే ఇళయరాజాకు ఏ తరహా నష్టం వస్తుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. అలా చేయడం వల్ల వ్యక్తిగత హక్కులు ప్రభావితమవుతున్నాయని ఇళయరాజా తరఫున న్యాయవాది తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి సామాజిక మాధ్యమాల్లో ఇళయరాజా ఫొటోలను అనుమతి లేకుండా ఉపయోగించొద్దని ఉత్తర్వులిస్తూ, ఇళయరాజా అభ్యంతరాలపై యూట్యూబ్ ఛానళ్లు జవాబివ్వాలని, విచారణను వాయిదా వేశారు.

సెక్రటేరియట్‌లోని సునీల్‌కుమార్ ఇన్‌ఫార్మర్లపై చర్యలు తీసుకోండి

సీఎస్‌కు ఉపసభాపతి రఘురామకృష్ణరాజు లేఖ

ఈనాడు, అమరావతి: 'అంబేడ్కర్స్ ఇండియా మిషన్‌తో సంబంధం ఉన్న.. సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్‌కుమార్ సహాయకులు సచివాలయంలోని వివిధ శాఖల రహస్య సమాచారాన్ని అనధికారికంగా తీసుకుంటున్నారు' అని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన సీఎస్ విజయానంద్‌కు లేఖ రాశారు. 'సునీల్‌కుమార్ సహకారంతో ఈ వ్యక్తులు సచివాలయంలో ముఖ్యమైన శాఖల్లోకి ప్రవేశించి, అక్కడ రహస్య సమాచారాన్ని రాడికల్ గ్రూపులకు అందజేస్తున్నారు. కాకినాడ నుంచి సమాచార హక్కు చట్టం దరఖాస్తులనూ పెడుతున్నారు. ఇలాంటి చర్యలు గోప్యతకు భంగం కలిగించడమే కాకుండా, రాష్ట్ర పరిపాలన సమగ్రతనూ దెబ్బతీస్తాయి. ఓవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేంద్రంగా ప్రమోట్ చేయడంతోపాటు పలు ప్రాజెక్టులను తీసుకువస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇలాంటి ఇన్‌ఫార్మర్ల చర్యలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది' అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను ఆయన కోరారు.

నౌహీరాషేక్ ఆస్తిని వేలం వేసిన ఈడీ

ఈనాడు, హైదరాబాద్: అధిక ఆదాయం ఆశచూపి జనాల్ని నిలువునా ముంచిన హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకురాలు నౌహీరాషేక్‌కు చెందిన స్థిరాస్తిని రూ.19.64 కోట్లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు వేలం వేశారు. కొనుగోలు చేసిన వ్యక్తి పేరు మీద సదరు ఆస్తిని శుక్రవారం రిజిస్ట్రేషన్ చేశారు. ఈ మేరకు ఈడీ ఒక ప్రకటన విడుదల చేసింది. తాజాగా నిర్వహించిన వేలంతో కలిపి నౌహీరాషేక్ ఆస్తులు అమ్మడం ద్వారా ఈడీ ఇప్పటివరకు రూ.25 కోట్లు రాబట్టింది. మిగిలిన ఆస్తులకు కూడా వేలం నిర్వహించి, తద్వారా వచ్చిన డబ్బును బాధితులకు పంపిణీ చేయనుంది.



అమరావతి క్వాంటమ్ కంప్యుటేషన్ సెంటర్‌కు టెండర్లు

బిడ్‌ల దాఖలుకు 28 వరకు గడువు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో 50 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న క్వాంటమ్ వ్యాలీలో భాగంగా.. అమరావతి క్వాంటమ్ కంప్యుటేషన్ సెంటర్ (ఏక్యూసీసీ) భవన నిర్మాణానికి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ఈ భవనాన్ని 2 ఎకరాల విస్తీర్ణంలో, జీ+1 విధానంలో నిర్మిస్తారు. భవనం నిర్మిత ప్రాంతం 45,000 చదరపు అడుగులు. భవన నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.99.62 కోట్లుగా నిర్ణయించారు. పన్నులు, ఇతర ఖర్చులు కలిపి రూ.125 కోట్లు అవుతుందని అంచనా. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఐబీఎం తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇదే భవనంలో ఏర్పాటు చేస్తుంది. ఈ భవన నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని ఐటీ శాఖ భరిస్తుంది. సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతుంది. బిడ్‌ల దాఖలుకు ఈ నెల 28 వరకు గడువు ఉంది.

అత్యంత కట్టుదిట్టంగా నిర్మాణం

క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేసే ఏక్యూసీసీ భవనాన్ని కఠినమైన పర్యావరణ, వైబ్రేషన్ ఐసోలేషన్, ఎలక్ట్రో మాగ్నెటిక్ కంపాటిబిలిటీ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. ఈ భవనంలో నియంత్రిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు అవసరమైన ప్రత్యేక పరికరాలు, సర్వీసులకే నిర్మాణ వ్యయంలో 70 శాతం వరకు ఖర్చవుతుందని అంచనా. దీనికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక బిడ్‌లను క్వాంటమ్ మిషన్ కోసం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ పరిశీలించి, గుత్తేదారును ఖరారు చేస్తుంది.

అమరావతిలో భారీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు

- మంత్రి టి.జి.భరత్



జ్యోతి వెలిగించి ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి భరత్

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: వివిధ వ్యాపార, పారిశ్రామిక సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించుకునేలా అమరావతిలో భారీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. ఆధునిక హంగులు, సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించి త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్, చెన్నైకి చెందిన యునైటెడ్ ఎగ్జిబిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విజయవాడ లబ్బీపేటలోని ఎస్.ఎస్. కన్వెన్షన్‌లో నిర్వహించే బీ2బీ జ్యువెలరీ ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. ఔత్సాహిక వ్యాపారవేత్తలను, ప్రస్తుతం వ్యాపార రంగంలో ఉన్న వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు.

యూపీలో హోటల్ కేంద్రంగా డిజిటల్ అరెస్ట్

ఏపీ ఎమ్మెల్యేను మోసగించిన కేసులో సూత్రధారుల వేటలో పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను డిజిటల్ అరెస్ట్ అంటూ మోసం చేసిన వ్యవహారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని హోటల్ కేంద్రంగా జరిగినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధుల సెల్‌ఫోన్ నంబర్లు, వ్యక్తిగత సమాచారం సేకరించిన సైబర్ మాయగాళ్లు సీబీఐ, ఈడీ అధికారులమంటూ ఫోన్ చేసి పలువురు ఎంపీ, ఎమ్మెల్యేలను బెదిరించారు. ఆ జాబితాలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మోసగాళ్ల చేతికి చిక్కినట్టు గుర్తించారు. ఏపీ, దిల్లీ, హరియాణా, తమిళనాడు, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 15-20 మంది ఈ వ్యవహారంలో పాల్గొన్నట్టు సమాచారం. నగదు లావాదేవీలను పూర్తిగా తనిఖీ చేసి ఎమ్మెల్యే ఖాతాలోకే పంపిస్తామని ప్రధాన నిందితులు విడతల వారీగా రూ.1.07 కోట్లు కాజేశారు. ఆ సొమ్మును కమీషన్ ఆశచూపి సేకరించిన అద్దె బ్యాంకు ఖాతాల్లో జమ చేయించుకున్నారు. మరో రూ.60లక్షలు ఇస్తే న్యాయస్థానం నుంచి నిరభ్యంతర పత్రం ఇప్పిస్తామంటూ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో నగర సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఇప్పటి వరకు 8 మంది అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసి సూత్రధారుల కోసం గాలిస్తున్నారు.

భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించండి

- హైకోర్టులో పిటిషన్ వేసిన జర్నలిస్ట్ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: శ్రీవారి పరకామణిలో కానుకల చోరీ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించాలంటూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, ప్రాణహాని ఉన్న నేపథ్యంలో భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తిరుపతికి చెందిన జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు దాఖలు చేసిన వ్యాజ్యంపై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ అభ్యర్థనపై అభిప్రాయం చెప్పాలని సీఐడీ, తిరుపతి పోలీసులను ఆదేశించింది. విచారణను శనివారానికి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఈ ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది కుర్రా శ్రీనివాసులు వాదనలు వినిపిస్తూ.. పరకామణిలో చోరీ కేసు దర్యాప్తు ముగిసే వరకు భద్రత కల్పించాలని కోరుతూ తిరుపతి ఎస్పీ, అలిపిరి ఠాణా ఎస్‌హెచ్‌వోకు ఈనెల 15న వినతి ఇచ్చామన్నారు. వారి నుంచి స్పందన లేదన్నారు. పిటిషనర్‌కు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు.

పాఠశాల వేదిక నిర్మాణ పనుల్లో అపశ్రుతి

- క్రేన్ బకెట్ మీదపడి ఉపాధ్యాయిని మృతి



జ్యోత్స్న బాయ్

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలలో వేదిక నిర్మిస్తుండగా.. క్రేన్ బకెట్ ఊడిపడటంతో ఉపాధ్యాయిని ప్రాణాలు కోల్పోయారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరం ఉన్నత పాఠశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం కళా వేదిక నిర్మిస్తున్నారు. శుక్రవారం వేదిక పైకప్పు వేసేందుకు నిర్వాహకులు క్రేన్ ఏర్పాటు చేశారు. ఓ వైపు పనులు చేస్తుండగా, పాఠశాల యథావిధిగా నడుస్తోంది. ఈ క్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయిని నెల్లి జ్యోత్స్నబాయ్ (47) రికార్డు గదిలోకి వెళ్తుండగా.. పైనుంచి నిర్మాణ సామగ్రి తీసుకెళ్తున్న క్రేన్ బకెట్ ఒక్కసారిగా తెగి ఆమెపై పడింది. ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. తునిలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందారు. జ్యోత్స్నకు ఇద్దరు పిల్లలు. భర్త గతేడాది చనిపోయారు. డీఈవో అప్పారావునాయుడు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయిని మృతి చెందడంపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫోన్‌లో వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఉపాధ్యాయిని జ్యోత్స్న మృతి చెందడం బాధాకరమని విద్యాశాఖ మంత్రి లోకేశ్ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని, ప్రమాదంపై దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏపీఎంఎస్ఐడీసీ జీఎం అక్రమాస్తులు రూ.6 కోట్లు

- సూర్యకళను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) జనరల్ మేనేజర్ మల్లాది వెంకట సూర్యకళ అక్రమాస్తులపై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడల్లోని మొత్తం 4 ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఏకకాలంలో సోదాలు చేపట్టారు. సూర్యకళ రూ.6 కోట్ల మేర అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. ఆమెను అరెస్టు చేసి విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యకళ, ఆమె సంబంధీకుల పేరిట మొత్తం 27 స్థిరాస్తులు ఉన్నట్లు సోదాల్లో గుర్తించారు. అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లతో పాటు వ్యవసాయ భూములు భారీగా కూడబెట్టినట్లు తేల్చారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు బ్యాంక్ బ్యాలెన్స్ రూ.2 కోట్లు ఉన్నట్లు సోదాల్లో వెల్లడైంది. రూ.9 లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై టోల్‌ఫ్రీ నంబర్ 1064 లేదా 9440440057కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ కోరారు.



(c) eenadu

ఈనాడు

ఆరోగ్య సిరికి సేంద్రియ సేద్యం

'అప్పట్లో మా తిండి వేరు.. ఇప్పుడు మందులతో పండించినవి తింటున్న మీకు బలం ఎక్కణ్నుంచి వస్తుంది' అని ఇళ్లలో పెద్దలు తరచూ అంటుంటారు. నాలుగడుగులు వేయగానే ఆయాసపడే కుర్రకారును చూసి వాళ్లు అలా పెదవి విరుస్తుంటారు. జంక్ ఫుడ్‌తో పెరుగుతున్న స్థూలకాయం సమస్యను అలా ఉంచితే- ఆహార ధాన్యాల్లో నేడు పోషక విలువలు తరిగిపోతున్నాయన్నది ఒక చేదునిజం. అదే సమయంలో రసాయనాల వాడకంతో పంట భూములు నిస్సారమవుతుండటం ఆందోళనకరమైన మరో వాస్తవం. అధిక దిగుబడుల ఆశతో నిరుడు దేశవ్యాప్తంగా ఆరున్నర కోట్ల టన్నుల కృత్రిమ ఎరువులను పొలాల్లో గుమ్మరించినట్లు అంచనా. దాదాపు 68వేల టన్నుల కీటకనాశనులనూ వెదజల్లారు. ఈ రసాయన సేద్యంతో పంటల్లో ప్రమాదకర అవశేషాలు పోగుపడి అలర్జీలు, క్యాన్సర్లు వంటివి కోరచాస్తున్నాయి. పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగిపోయి అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. వీటికి పరిష్కారంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాలను కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ తాజాగా సూచించినట్లు- రైతులు ఒక్కొక్కరు ఒక్కో ఎకరాతో మొదలుపెట్టి సేంద్రియ సాగును క్రమంగా పెంచుకుంటూ వెళ్తే నూతన సేద్య విప్లవానికి అది నాంది అవుతుంది. అందుకోసం రైతాంగాన్ని సమాయత్తం చేయడానికి రాష్ట్రాలు ప్రత్యేక చొరవ చూపాలి!

రసాయనాల్లో ముంచి తేల్చిన తిండి తిని, కష్టపడి కూడబెట్టుకున్న సొమ్మును ఆసుపత్రులకు ధారపోయడం కన్నా ముందే మేల్కొంటే మేలనే చైతన్యం ప్రజల్లో నెమ్మదిగా పెరుగుతోంది. దాంతో సేంద్రియ ఉత్పత్తులకు గిరాకీ అధికమవుతోంది. దీన్ని గుర్తించి ఇప్పటికే ఎందరో సాగుదారులు సంబంధిత సేద్యం వైపు మళ్లుతున్నారు. 2023-24 నాటికి దేశీయంగా 45 లక్షల హెక్టార్ల సాగు భూముల్లో సేంద్రియ పద్ధతిలో పంటలు పండుతున్నాయి. ఈ విషయంలో ఆస్ట్రేలియా తరవాతి స్థానం ఇండియాదే! ఇక ప్రపంచంలో అత్యధికంగా ఇండియాలోనే 23 లక్షల మంది దాకా రైతులు సహజ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే- సేంద్రియ సేద్యంలో సిక్కిం అగ్రభాగాన నిలుస్తోంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లు ఆ తరవాతి స్థానాల్లో కనిపిస్తాయి. తెలుగు రాష్ట్రాలు ఈ విషయంలో వెనకపట్టున ఉండటం విచారకరం! భారత ఆర్గానిక్ ఆహార విపణి 22శాతం వార్షిక చక్రీయ వృద్ధి రేటుతో రాబోయే పదేళ్లలో పదకొండువందల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. ఎగుమతులకూ విస్తృత అవకాశాలున్న నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం రైతులకు లాభసాటి కాగలదు!

హరిత విప్లవం ముందు వరకూ దేశీయంగా సేద్యం సేంద్రియ పద్ధతుల్లోనే సాగింది. కాలక్రమంలో రసాయనాల వినియోగం హెచ్చుమీరి ప్రజారోగ్యంతో పాటు పర్యావరణమూ సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం నెలకొంది. మన దేశంలో 85శాతం చిన్న సన్నకారు రైతులే కాబట్టి, వారిని సేంద్రియం వైపు నడిపించడం సులువేనని నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రారంభంలో ఇందుకు పెట్టుబడి కాస్త ఎక్కువగా పెట్టాల్సి వస్తుంది. జీవ ఎరువులూ కీటకనాశనుల కొరత, ఫలసాయాల ధ్రువీకరణ, మార్కెటింగ్, మౌలిక వసతుల సమస్యలు సైతం వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వాలు పరిష్కారాలు చూపిస్తే కచ్చితంగా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. ఇటీవల పట్టణాల్లో మిద్దె పంటలు బహుళ ప్రాచుర్యం పొందుతున్నాయి. అవకాశం ఉన్న కుటుంబాలు తీరిక చేసుకుని ఇంటి దగ్గరే సేంద్రియ పద్ధతిలో కూరగాయలూ ఆకుకూరల సాగుకు శ్రీకారం చుడితే- ఆరోగ్యం, ఆహ్లాదం రెండూ సొంతమవుతాయి.. నెలవారీ ఖర్చులూ కలిసివస్తాయి!




ఇతరులు మనల్ని నమ్మాలి, గౌరవించాలి అంటే ముందు మనకి మనమీద నమ్మకం ఉండాలి. మనల్ని మనం గౌరవించుకోవాలి.

– అనుజ్ తివారీ, రచయిత

సత్యసాయి సందేశం

ప్రతి మనిషిలో భగవంతుడు ఆత్మస్వరూపుడుగా ఉంటాడు. గతి తప్పి నడిచేవారికి అంతర్యామి ఆత్మప్రబోధం గావించినా 'నేను' అనే అహంకారం సక్రమ మార్గంలోకి రానీయదు. అన్ని ప్రాణులు తమ సహజ ధర్మాలతో వివరించక జీవిస్తాయి. మనిషి మాత్రమే మానవతా విలువలు మరచి భ్రాంతితో పనులు చేస్తాడు. అసహజమైన యాంత్రిక జీవితాన్ని గడుపుతాడు. ఆ ప్రవర్తనలో మార్పు తీసుకుని రావడమే ఆధ్యాత్మిక జీవన పరమార్థం. అశాంతికి మూల కారణం తనలోనే ఉన్న శాంతిని మరచిపోవడం. 'నాకు శాంతి కావాలి' అనుకునేవారు 'నాకు' అనే స్వార్థం, 'కావాలి' అనే దురాశను తొలగిస్తే మిగిలేది శాంతేనంటారు సత్యసాయి బాబా.

శ్రీకృష్ణుడు భగవద్గీతలో కర్మ, భక్తి, జ్ఞానమార్గాలను యోగంగా చెప్పాడు. నిష్కామ కర్మ ఆచరిస్తూ, పవిత్ర భక్తి సూత్రాలు పాటిస్తూ, జ్ఞానంతో అందరిలో, అన్నింటిలో భగవంతుణ్ని దర్శించడం నిజమైన వేదాంతం. 'అందరినీ ప్రేమించు అందరినీ సేవించు' అనే ఒక్క మహా వాక్యం మన జీవితాన్ని మహోన్నతం చేస్తుంది ఉన్నత స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరడమే మోక్షమని బాబా బోధించారు.



అంతర్యామి

'ప్రేమతో సేవ చేయండి, అది ఇరు హృదయాలను ప్రేమ బంధంతో ముడివేస్తుంది. కుటుంబం, ఇరుగు పొరుగు, స్నేహితులు, ఎవరికైనా సరే మీవంతు సేవలు అందించండి. ప్రచారం, ఆర్భాటం, ప్రదర్శన కోసం చేసే సేవ మీ కీర్తిప్రతిష్ఠలు పెంచవచ్చు కానీ అది సమాజానికి మంచి సందేశాన్ని స్ఫూర్తిని ఇవ్వలేదు' అన్నది సత్యసాయి ప్రబోధాల సారాంశం.

ప్రఖ్యాత విద్యావేత్త ఈశ్వర చంద్ర విద్యాసాగర్ ఒక పట్టణంలో ఉపన్యాసం ఇవ్వడానికి రైలు దిగి వెళ్తున్నారు. అక్కడే ఓ ఉన్నతాధికారి తన పెట్టె మోసే వ్యక్తి కోసం చూశారు. పక్కనే ఉన్న విద్యాసాగర్ అతనితో 'ఇది చాలా చిన్నగా ఉంది, దీనికి కూలీ ఎందుకు? మీరు పట్టుకెళ్లొచ్చు కదా' అన్నారు. 'నేను అధికారిని, కూలీని పెట్టుకోగల డబ్బుంది నా దగ్గర' అని సమాధానమిచ్చాడు. 'సరే మీ పెట్టె నేను తెస్తాను' అని దాన్ని రిక్షా దగ్గరకు చేర్చారు. కూలీ ఇవ్వబోతే సున్నితంగా తిరస్కరించి 'ఇది నేను మీకు చేసిన సేవగా భావించండి. కూలి డబ్బులు అతనికే ఇవ్వండి' అన్నారు విద్యాసాగర్. అధికారి కూడా సభలో పాల్గొనడానికి వచ్చాడు. సభలో విద్యాసాగర్‌ను చూసి 'క్షమించండి మీరెవరో తెలియక పెట్టె మోయించాను' అన్నాడు. విద్యాసాగర్ చిరునవ్వుతో 'విద్యతో ఉద్యోగం, ధనం రావాలి కానీ అహంకారం కాదు' అన్నారు. ఈ కథను సత్యసాయి విద్యార్థులకు చెబుతూ 'మనలో సేవాభావం ఉంటే, అది వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. ఉన్నతమైన గుణసంపదను ఇస్తుంది' అని బోధించేవారు.

భక్తి, నియమబద్ధత, కర్తవ్య పాలన, వినయం, దృఢసంకల్పం... ఈ అయిదు మెట్లు మనిషిని విజయానికి చేరువ చేస్తాయని బాబా ఎప్పుడూ చెప్పేవారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస విలువలు పాటించే ప్రతి మనిషి ఒక నడిచే దేవుడు- అనేది సత్యసాయి సందేశం.

– రావులపాటి వెంకట రామారావు

గోప్యతకు రక్షణ గోడ!

రోజూ కోట్ల సంఖ్యలో పౌరులు ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా వేదికలు, అమెజాన్ లాంటి ఈ-కామర్స్ పోర్టళ్లు, మొబైల్ యాప్‌లు, ప్రభుత్వ వెబ్‌సైట్లు... ఇంకా అనేక డిజిటల్ మార్గాల్లో తమ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకుంటున్నారు. ఈ ప్రక్రియలో సమాచార 'యజమాని'గా పౌరుడి హక్కులనూ, సమాచారాన్ని వినియోగించడంలో ఆయా సంస్థల బాధ్యతలనూ డీపీడీపీ చట్టం స్పష్టంగా పేర్కొంటుంది. సేకరించిన సమాచారాన్ని నిల్వ చేయడం, నిర్వహించడంలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించాలో కూడా నిర్దేశిస్తుంది. ఒక వ్యక్తిని గుర్తించడానికి అవకాశమిచ్చే ఏ సమాచారమైనా ఈ చట్టం పరిధిలోకి వస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ, ఆధార్, పాన్ నంబర్లు, వేలిముద్రలు వంటి బయోమెట్రిక్ సమాచారం, సోషల్ మీడియా పోస్టులు మొదలైనవన్నీ వ్యక్తిగత సమాచారం కిందకే వస్తాయి. భారత దేశం ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సృష్టికర్తగా, డేటా వినియోగ మార్కెట్‌గా ఎదుగుతున్న ప్రస్తుత సమయంలో ఆ ప్రయోజనాలు అన్ని వర్గాలకూ అందాలి. పౌరుల వ్యక్తిగత సమాచారం సురక్షితంగా ఉండాలి. డేటా నియంత్రణ వల్ల కొత్త ఆవిష్కరణలకు భంగం కలగకూడదు... ఇవీ ఈ చట్టం ప్రధాన ఉద్దేశాలు.

వ్యక్తిగత సమాచార భద్రతపై కీలక ముందడుగు పడింది. మన దేశంలో డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టాన్ని 2023లోనే చేశారు. దానికి సంబంధించి పూర్తిస్థాయి నిబంధనలు తాజాగా అధికారికంగా అమల్లోకి వచ్చాయి. ఐరోపా సమాఖ్య తరహాలో డేటా నియంత్రణకు ప్రత్యేక చట్టం అమలు చేస్తున్న దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరడం విశేషం.



ప్రత్యేక హక్కుల కల్పన

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుల్లో భాగమని పేర్కొంటూ 2017లో జస్టిస్ పుట్టస్వామి కేసులో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. ఆ క్రమంలో వచ్చిందే డీపీడీపీ చట్టం. దీన్ని అమల్లోకి తేవడం ద్వారా పౌరులకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించినట్లయింది. తమకు సంబంధించి ఏ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరు తీసుకుంటున్నారో తెలుసుకోగలగడం, దానికి అంగీకారం తెలపడం, సమ్మతిని ఉపసంహరించుకోవడం, సమాచారాన్ని సరిదిద్దమని లేదా తొలగించమని అడగడం, ఫిర్యాదులపై నిర్ణీత సమయంలోపు స్పందించడం మొదలైన హక్కులు పౌరులకు సంతరించాయి. డేటాకు సంబంధించి ఆయా సంస్థలు పౌరుల సమ్మతి పొందే క్రమంలో- ఆ వ్యక్తులు ఏ సమాచారం ఇస్తున్నారు, అది ఏ అవసరం కోసం, ఎంతకాలం నిల్వ చేస్తారు లాంటి వివరాలను స్పష్టంగా, సులభమైన రీతిలో, భారతీయ భాషల్లో అందుబాటులో ఉండాలి. డేటా వినియోగానికి సంబంధించి పౌరులు ఎప్పుడైనా సరే తామిచ్చిన సమ్మతిని వెనక్కి తీసుకోవచ్చు. సమాచారం పంచుకునే క్రమంలో పౌరులు అనేక వెబ్‌సైట్లలో, యాప్‌లలో అనేక రకాలుగా తమ 'సమ్మతి'ని తెలుపుతుంటారు. వీటన్నింటినీ సులభంగా ఒకే దగ్గర చూసుకునే, మార్చుకునే వెసులుబాటు కోసం- సమాచారం సేకరించిన సంస్థకు, పౌరుడికి మధ్య తటస్థ అంగీకార నిర్వహణ (కన్సెంట్ మేనేజర్) వ్యవస్థను డీపీడీపీ ఏర్పరుస్తోంది. పౌరుల కోసం ఇలాంటి 'ఏక గవాక్ష' సౌలభ్యం ఇతర ఏ దేశాల్లోనూ లేకపోవడం గమనార్హం.

వ్యక్తిగత సమాచారం పొరపాటున లీకయ్యే సందర్భాల్లో సంస్థలు నిర్దిష్ట సమయంలోపు ఆ విషయాన్ని సంబంధిత వ్యక్తులకు, డేటా రక్షణ ప్రాధికార సంస్థకు తెలియజేయాల్సి ఉంటుంది. పిల్లలకు సంబంధించిన సమాచార గోప్యత ఈ చట్టంలో మరో ముఖ్యమైన విషయం. 18 ఏళ్ల లోపు పిల్లల సమాచారం ప్రాసెస్ చేయాలంటే తల్లిదండ్రుల తరఫున స్పష్టమైన అంగీకారం తప్పనిసరి. ఆన్‌లైన్‌లో పిల్లల అలవాట్లను గమనించే పోకడలు, వారిని లక్ష్యంగా చేసుకుని చేసే ప్రకటనలను నియంత్రించడం కూడా ఈ చట్టం లక్ష్యాల్లో ఒకటి. భారీ స్థాయిలో డేటాను సేకరించే సోషల్ మీడియా కంపెనీలు, టెక్ దిగ్గజ సంస్థలను ఈ చట్టం ప్రత్యేకంగా పరిగణిస్తుంది. స్వతంత్ర ఆడిట్లు, అధ్యయనాలు, కట్టుదిట్టమైన సైబర్ భద్రతా చర్యలు వంటి కఠినమైన బాధ్యతలు ఉంటాయి.

సురక్షిత డిజిటల్ భవితకు...

సాంకేతికత, గోప్యతతో ముడిపడిన విషయం కావడంతో డీపీడీపీ చట్టంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నాస్కామ్ వంటి సంస్థలు చట్టాన్ని స్వాగతించినా, నిబంధనల అమలుతో చిన్న సంస్థలు, స్టార్టప్‌లపై వ్యయభారం పెరుగుతుందన్నాయి. చట్టంలో ఉపయోగించిన 'సరైన' భద్రతా ప్రమాణాలు, 'సముచిత' సాంకేతిక చర్యలు లాంటి పదాలపై స్పష్టత కావాలని కోరాయి. ప్రభుత్వ విభాగాలకు ఎక్కువ మినహాయింపులు ఇచ్చారనీ, సమాచార హక్కు చట్టాన్ని బలహీనపరిచే అంశాలున్నాయని, చట్ట ప్రకారం ఏర్పాటైన డేటా రక్షణ బోర్డుకు తగిన స్వతంత్రత లేదంటూ కొన్ని పౌరసమాజ సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. పిల్లల విషయంలో తల్లిదండ్రుల సమ్మతి వంటి నిబంధనల అమలు మనలాంటి దేశంలో సవాలే అంటున్నారు నిపుణులు. డీపీడీపీ చట్టం వల్ల టెక్ సంస్థలపై బాధ్యతలు పెరిగిన మాట వాస్తవం. అయితే, మెరుగైన డేటా రక్షణ విధానాలు, పారదర్శకమైన 'సమ్మతి' ప్రక్రియ, అంతర్గత నియంత్రణలు వంటివి వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంచేందుకు దోహదం చేస్తాయి. ఈ క్రమంలో దీర్ఘకాలంలో ఆయా సంస్థల పురోగతికి తోడ్పడే అవకాశం ఉంది. వస్తుసేవలను రూపొందించే క్రమంలోనే గోప్యతను దృష్టిలో పెట్టుకోవాలనే దృక్పథం ఈ చట్టం ద్వారా మరింతగా బలపడనుంది. డేటా రక్షణ చట్టం, నిబంధనలు రావడం ఒక ఎత్తయితే, ప్రజానీకంలో సైబర్ భద్రతపై అవగాహన ఇంకా పెరగాల్సి ఉంది. డిజిటల్ కార్యకలాపాల్లో అప్రమత్తంగా ఉండటం, వెబ్‌సైట్లు, యాప్‌లలో ఎలాంటి సమాచారం, అనుమతులు ఇస్తున్నారో సరిచూసుకోవడం, కఠిన పాస్‌వర్డ్‌లు వాడటం, అపరిచిత లింకులను క్లిక్ చేయకపోవడం వంటివి చాలా ముఖ్యం. ప్రభుత్వం, టెక్నాలజీ సంస్థలు, పౌర సమాజం, ప్రజలు కలిసి పనిచేస్తే- భారత డిజిటల్ భవిత మరింత ఉజ్జ్వలంగా, సురక్షితంగా రూపుదిద్దుకుంటుంది.



ఈదర రవికిరణ్

ఐఆర్ఎస్ అధికారి, అదనపు డైరెక్టర్ జనరల్, నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్(నాసిన్)- వైజాగ్

(అభిప్రాయాలు వ్యక్తిగతం)



ఎవరో ఏదో చేశారని...

నాకు ఉద్యోగం లేదనే దానికన్నా నాతోటి వాళ్లంతా మంచిగా సెటిల్ అయిపోయారనే బాధ నాలో పెరిగిపోతోంది. ఇక లాభం లేదనుకుని 'నాన్నా నా ఫ్రెండ్ ఒకడు మూడు లక్షల రూపాయలు కట్టి బ్యాక్‌డోర్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ తెచ్చుకున్నాడు. నువ్వు మూడు లక్షలు ఇస్తే.. నా జీవితం సెటిల్ అయిపోతుంది' అన్నాను. ఎప్పుడూ నా నిర్ణయాలను తప్పు పట్టే నాన్న ఈసారి మాత్రం మరో మాట మాట్లాడకుండా డబ్బులు ఇచ్చేశారు.

ఆ డబ్బులు కట్టి ఎలాగోలా ఏడాదికి ఎనిమిది లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ కొలువు సాధించాను. నా అంతటి వాడు ఈ లోకంలోనే లేడనేంతలా రెచ్చిపోయాను. ఇంకేముంది.. నెక్స్ట్ స్టెప్ పెళ్లే ఇక... అన్న నిర్ణయానికి వచ్చేశాను. ఆ ఊహల్లో ఊరేగుతూ ఉద్యోగ నైపుణ్యాలు పెంచుకోవడం మీద ధ్యాస పెట్టలేదు. ఆఫీసులో నా బ్యాక్‌డోర్ కహానీ తెలిసిపోయి జాబ్ పీకేశారు. ఉన్నారుగా అన్నీ భరించే నాన్న. ఆయన దగ్గరికే వెళ్లి విషయం చెప్పి బోరుమన్నాను. రూపాయి వృథా చేసినా తిట్టే నాన్న ఈసారి ఏం మాట్లాడలేదు. ఆయన మౌనం కారణంగా సగం చచ్చిపోయాను. అయినా ఊరుకోకుండా 'ఒక ఫ్రెండ్ రూ.5 లక్షల పెట్టుబడితో రెండేళ్లలో 20 లక్షలు సంపాదించాడు. రూ.5 లక్షలు ఇవ్వు నాన్నా ఈసారి కచ్చితంగా సెటిల్ అవుతాను' అని ధీమాగా అడిగాను. అప్పు చేసి అయిదు లక్షలూ ఇచ్చారు. కానీ మూడు నెలల్లోనే బిజినెస్ దివాళా తీసింది. నాన్నకు ముఖం ఎలా చూపించాలో అర్థం కాలేదు. ఖాళీగా ఉండలేక మరొక రోజు 'నాన్నా, మన పక్కింటతను షేర్‌మార్కెట్‌లో రూ.లక్ష పెట్టి.. నెలలో రూ.5 లక్షలు సంపాదించాడు' అన్నాను. 'నా దగ్గర ఒక్క రూపాయి లేదు' అని నాన్న కోపంగా అరిచేశారు. 'నేను బాగుపడటం ఇష్టం లేకే నువ్వు నాకు డబ్బులు ఇవ్వడం లేద'ని నోరు జారాను.

'పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు... వాళ్లది చేశారు... వీళ్లిది చేశారని ఇప్పటికే లక్షలకు లక్షలు తగలేశావ్... నీ ఫ్రెండ్ బ్యాక్‌డోర్‌లో జాయిన్ అయినా స్కిల్స్ పెంచుకుని ఉద్యోగం కాపాడుకున్నాడు. ఇంకో ఫ్రెండ్ మొదట్లో నష్టాలు వచ్చినప్పటికీ తట్టుకుని నిలబడ్డాడు. లాభాలు చూశాడు. మరి నువ్వెందుకు ఫెయిలవుతున్నావో ఆలోచించావా? ఎవరో ఏదో చేశారని కాదు, నీ టాలెంట్‌కు, ఆసక్తికి తగ్గ పనిని ఎంచుకుంటే సరిగ్గా చేయగలుగుతావు. పక్కవారిమీద పెట్టే దృష్టి నీ మీద నువ్వు పెట్టుకుంటే ఈపాటికి ఎక్కడో ఉండేవాడివి...' అంటూ క్లుప్తంగానే అయినా కాస్త ఘాటుగానే నాన్న చేసిన హితబోధ మొత్తానికి పనిచేసింది. నా ఆసక్తి నాకు తెలుసుగా... అందులో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో చేరిపోయా. కొత్త ఏడాదిలోపల నా ప్రతిభతో ఉద్యోగం తెచ్చుకుని అప్పులు తీర్చేస్తా..!

(ఇది ఏ ఒక్కరి కథో కాదు, చాలా మంది యువతీ యువకుల వ్యథ)

– పంగా సాంబశివారెడ్డి



శతాయుష్మాన్ భవ!

మెరుగైన వైద్య వసతులు అందుబాటులోకి రావడం, పరిశుభ్రత- ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరగడం వంటివాటి వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆయుర్దాయం అధికమవుతోంది. అయితే, గత యాభై ఏళ్లలో ఆసియా, ఆఫ్రికా ప్రజల ఆయుర్దాయంలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. కానీ, మిగిలిన ప్రపంచంతో పోలిస్తే ఆఫ్రికాలో సగటు ఆయుర్దాయం నేటికీ తక్కువగానే ఉంది. 1974, 2024ల్లో ఆయా ఖండాల్లో ప్రజల ఆయుర్దాయం...

ఖండం	1974	2024
ఉత్తర అమెరికా	72	80
ఐరోపా	71	79
ఓషియానియా	68	79
లాటిన్ అమెరికా	61	76
ఆసియా	56	75
ఆఫ్రికా	46	64

(ఆధారం: ఐరాస వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్-2024)

వనరుల పొదుపు... ప్రగతికి మదుపు!

దేశంలో వ్యవసాయానికి నీటిపారుదల వ్యవస్థలు, భూగర్భ జలాలే మూలాధారం. రైతులకు సాగు నీటిని అందించడానికి ప్రభుత్వాలు విద్యుత్తును సరఫరా చేస్తున్నాయి. దీనివల్ల ఆహార భద్రత సమకూరినా సహజ వనరులపై పడుతున్న అధిక ప్రభావాన్నీ దృష్టిలో ఉంచుకోవాలి. ఇండియాలో హరిత విప్లవానికి నీరు, విద్యుత్, ఆహారోత్పత్తి త్రయం ఉపకరించింది. అదే సమయంలో భూగర్భ జలాలు బాగా తరిగిపోయాయి. పర్యావరణానికి నష్టం కలుగుతోంది. మరోవైపు ఉచిత విద్యుత్ సరఫరా ఆర్థిక భారమవుతోంది. ఇలాంటి సమస్యలను అధిగమించాలంటే నవీన సాంకేతికతలను వాడాలి, సమగ్ర నిబంధనావళిని రూపొందించాలి. సుస్థిరాభివృద్ధి ఆవశ్యకతపై ప్రజలు, శాసనకర్తలు పూర్తి అవగాహనతో ముందుకుసాగాలి.

సహజ వనరులను హరించకూడదు. పర్యావరణానికి హాని చేయకూడదు. భావి తరాల ఎదుగుదలకు ఆటంకం కలిగించకూడదు. అలా వ్యవహరిస్తూ ప్రస్తుత తరం సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం వనరులను సమర్థంగా వినియోగించుకోవడమే సుస్థిరాభివృద్ధి అంటే. నీరు-విద్యుత్-ఆహారోత్పత్తి వంటి అవసరాలను తీర్చుకునేటప్పుడు ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి.

భూగర్భ జలాలకే గిరాకీ


దేశంలో 80-90శాతం నీటిని వ్యవసాయానికే వినియోగిస్తుండగా, అందులో 60శాతం భూగర్భ జలాలే. వీటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు మోటారు పంపు ఆన్ చేసి తోడుకునే సౌలభ్యం ఉంది. దీంతో వరి, గోధుమ రైతులు భూగర్భ జలాలనే ఎక్కువగా వాడుకుంటారు. పంజాబ్, హరియాణా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ పరిస్థితిని గమనించవచ్చు. దీనివల్ల ఆహారోత్పత్తి పెరిగినా భూగర్భ జలాలు హరించుకుపోతూ భావి ఆహార భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. దీర్ఘకాలంలో రైతుల జీవనోపాధిపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హరిత విప్లవం వల్ల మొదట్లో దేశమంతటా పంట దిగుబడులు, రైతుల ఆదాయాలూ పెరిగినా గుజరాత్, రాజస్థాన్, పంజాబ్‌లలో క్రమంగా భూగర్భ జలాలు తరిగిపోయాయి. అధికమైన విద్యుత్తు గిరాకీని తీర్చడానికి బొగ్గు, డీజిల్‌తో నడిచే విద్యుత్ కేంద్రాలు విస్తరించి కర్బన ఉద్గారాలు పెరిగిపోయాయి. ఉచిత సరఫరా విధానాలు రాష్ట్రాల విద్యుత్ బోర్డులను ఆర్థికంగా కుదేలు చేశాయి. విద్యుత్తు, నీటి దుబారా ఎక్కువైంది. భూగర్భ జలాలను మితిమీరి తోడేస్తే, అవి హరించుకుపోయి, పర్యావరణానికి తీరని నష్టం వాటిల్లుతుంది.



దేశంలో నీరు, విద్యుత్, ఆహారోత్పత్తి మధ్య నెలకొన్న సంబంధం వాతావరణ మార్పులకూ దారితీస్తోంది. ఈ సమస్యను ఎదుర్కోవడానికి విధానపరంగా, సాంకేతికపరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాడుకున్న విద్యుత్తును లెక్కించడం ద్వారా పొదుపుగా నీరు వాడుకునేలా ప్రోత్సహిస్తున్నారు. పంజాబ్‌లో 'పానీ బచావో పైసా కమావో' పథకాన్ని ఇక్కడ ఉదాహరించాలి. కేంద్రం 'కుసుమ్' పథకం ద్వారా వ్యవసాయానికి సౌర విద్యుత్ వినియోగించడాన్ని ప్రోత్సహిస్తోంది. వాడుకోగా మిగిలే సౌర విద్యుత్తును రైతులు ప్రభుత్వానికే విక్రయిస్తున్నారు. కుసుమ్ విద్యుత్ గ్రిడ్ మీద ఒత్తిడి తగ్గిస్తోంది. అతిగా నీటిని వినియోగించే వరి, చెరకు వంటి పంటల నుంచి వేరే పంటలకు మారడం వల్ల భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరాపై ఒత్తిడి తగ్గుతుంది. బిందు, తుంపర్ల సేద్యం కూడా నీటి పొదుపునకు వీలు కల్పిస్తుంది.

పునరుత్పాదక వనరులే మేలు

సేద్యంలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం మంచిదే. అయితే, అది అతిగా భూగర్భజల వినియోగానికి దారితీయకుండా నిబంధనలు విధించాలి. గ్రిడ్‌తో సౌర విద్యుత్తును అనుసంధానించి మిగులు విద్యుత్తును ఇతరులకు సరఫరా చేయాలి. గుజరాత్‌లో సౌరశక్తి సహకార సంఘాలు ఈ పనే చేస్తున్నాయి. నీరు, విద్యుత్, ఆహార త్రయ ప్రభావం వ్యవసాయానికే పరిమితం కాదు. దేశంలో ఇప్పటికీ పెద్దయెత్తున విద్యుత్తు థర్మల్ కేంద్రాల నుంచే ఉత్పత్తి జరుగుతోంది. ఇవి భారీగా నీటిని వాడుకుంటాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పులు, సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. శిలాజ ఇంధనాలపై కాకుండా సౌర, పవన తదితర పునరుత్పాదక ఇంధన వనరులతో విద్యుదుత్పాదన నీటి దుబారాను తగ్గిస్తుంది. పరిశ్రమల్లో వ్యర్థ జలాలను పునర్వినియోగార్హంగా శుద్ధి చచేయడం నీటి నష్టాన్ని అరికడుతుంది. సాంకేతికతతో నిఘా వేయడం, స్మార్ట్ గ్రిడ్లు, ఆధునిక పైపులైన్లు, బిందు, తుంపర్ల సేద్య పద్ధతులు... జల, విద్యుత్తు వినియోగంలో పొదుపును సాధిస్తాయి. 2030కల్లా దేశంలో నీటికి గిరాకీ ఎక్కువై కొరత ఏర్పడుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు హరించుకుపోతూ, సమృద్ధిగా వానలు కురిసిన సంవత్సరాల్లో కూడా నీటి కొరత ఏర్పడుతోంది. అందుకని, అందరిలో నీటిని పొదుపుగా వాడుకునే అలవాటు పెరగాలి. మరోవైపు, జలాశయాల్లో తేలియాడే సౌర ఫలకాల ద్వారా, బయోగ్యాస్‌తో విద్యుదుత్పాదన సాగించే ప్రక్రియను అనుసరించాలి.



ప్రొఫెసర్ మెతుకు దేవేందర్ రెడ్డి

డా.డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యా సంస్థ డైరెక్టర్

ఎలా గుర్తుపెట్టుకుంటాయో?

నేస్తాలూ..! మనం స్కూల్ నుంచి వచ్చేటప్పుడు లేదంటే ఎటైనా బయటికి వెళ్లినప్పుడు.. ఎలాంటి సందేహం లేకుండా మన ఇంటికే వెళ్లిపోతాం. అసలు మర్చిపోయే ఛాన్సే ఉండదు కదా! ఎందుకంటే మనకు ఆలోచించే శక్తి ఉంది. రెండుమూడు సార్లు చూసిన దారి ఇట్టే గుర్తుండిపోతుంది. మరి పక్షులు ఎలా ఆహారం కోసం ఎక్కడెక్కడో తిరిగి తిరిగి.. మళ్లీ నేరుగా వాటి గూటినే చేరుకుంటాయి. అసలు వాటికి డైరెక్షన్స్ ఎలా తెలుసు? మీకెప్పుడైనా ఇలాంటి సందేహం వచ్చిందా?

మనం రోజూ చూసే పక్షులన్నీ ఆహారం కోసం చాలా చోట్లకు వెళతాయి. కష్టపడి వాటంతట అవే ఆహారాన్ని సంపాదించుకుంటాయి. చక్కగా సాయంత్రానికి గూటికి చేరుకుంటాయి. ఇదెలా సాధ్యమంటే పక్షులకు కూడా జ్ఞాపకశక్తి ఉంటుంది.



అవి వాటి గూటికి దగ్గర్లో ఉన్న ల్యాండ్‌మార్క్స్‌ని గుర్తుపెట్టుకుంటాయట. అంటే.. ఆ చుట్టుపక్కల ఉన్న చెరువు, కాలువలు లేదంటే కొండలు, పర్వతాలను, సూర్యుడు ఉదయించే.. అస్తమించే దిశలను, వాసనను గుర్తుపెట్టుకుంటాయట. రాత్రి తిరిగే పక్షులేమో నక్షత్రాలను గుర్తుపెట్టుకుంటాయి. మరో విషయం ఏంటంటే పక్షుల కళ్లలో క్రిప్టాక్రోమ్ అనే ప్రొటీన్ ఉంటుంది. సూర్యుడి నుంచి వచ్చే నీలికాంతి వాటి కళ్లలో పడినప్పుడు అది చక్కగా పని చేస్తుంది. ఒక విధంగా ఆ ప్రొటీన్ వాటికి మ్యాగ్నటిక్ కంపాస్‌లా పని చేస్తుంది. అంటే.. మనం రోడ్డు మీద ప్రయాణిస్తుంటే చాలా సైన్‌బోర్డులు కనిపిస్తాయి కదా! అలాగ పక్షులకు ఆ ప్రొటీనే దారులను చూపిస్తుంది.

హాయ్! బుజ్జీ!!

అలా అవి తమ గూటిని చేరుకుంటాయన్నమాట. మీకో విషయం తెలుసా.. కొన్ని పక్షులైతే వాటికి హాని చేయాలని చూసిన మనుషులను, ఇతర జంతువులను కూడా నాలుగైదేళ్ల వరకూ మర్చిపోవట!

★

ఆ ఒక్కటి ఏది?

కింద ఇచ్చిన వాటిలో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి.

1. పిజ్జా, అరటిపండు, బెలూన్, పైనాపిల్
2. కుందేలు, నెమలి, కుక్కపిల్ల, పిల్లి
3. వయొలిన్, గిటార్, పియానో, మౌస్

(c) eenadu

శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



తిరుమలలో కాన్వాయ్ దిగి భక్తులకు అభివాదం చేస్తున్న రాష్ట్రపతి

ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే-తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం పద్మావతి అతిథిగృహం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి తొలుత శ్రీభూవరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి సాదరంగా ఆహ్వానించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికింది. అనంతరం ధ్వజ స్తంభానికి రాష్ట్రపతి తల ఆనించి మొక్కుకున్నారు. గరుడ పటాన్ని ఆవిష్కరించే ప్రదేశంలో ఆకాశంలోకి చూస్తూ శ్రీవారిని ప్రార్థించారు. తర్వాత స్వామి మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం రంగ నాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, తీర్థం అందించారు. బీఆర్ నాయుడు, సింఘాల్‌లు.. వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని, 2026 క్యాలెండర్, డైరీలను రాష్ట్రపతికి ఇచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, తితిదే బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, భానుప్రకాష్‌రెడ్డి, అర్చకులు, వేద పండితులు వేర్వేరుగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ఫొటోలు దిగారు. రాష్ట్రపతి వెంట ఉన్న మనమరాళ్లు రంగనాయకుల మండపంలో కొంతసేపు సందడి చేశారు.

చిన్నారులకు చాక్లెట్ల పంపిణీ

దర్శనం పూర్తయ్యాక పద్మావతి అతిథిగృహానికి కాన్వాయ్‌లో రాష్ట్రపతి బయలుదేరారు. రాంభగీచా బస్టాండ్ వద్ద దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను పలకరించడానికి ఆమె వాహనం దిగారు. ప్రొటోకాల్ పక్కన పెట్టి నడుచుకుంటూ వెళ్లి యాత్రికులతో మాట్లాడారు. కొందరు ఆమెతో కరచాలనం చేశారు. చిన్నారులకు రాష్ట్రపతి, కుటుంబసభ్యులు చాక్లెట్లు ఇచ్చారు. తర్వాత పద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లారు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ద్రౌపదీ ముర్ము తిరుమలకు రావడం ఇది రెండోసారి.



శ్రీవారి ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుతున్న రాష్ట్రపతి ముర్ము

మిస్ యూనివర్స్ ఫాతిమా బాష్

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో జరిగిన మిస్ యూనివర్స్-2025 పోటీల్లో మిస్ మెక్సికో ఫాతిమా బాష్ విజేతగా నిలిచింది. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటాన్ని అందజేశారు. ఈ పోటీల్లో 120 మంది పాల్గొనగా, వారందరినీ వెనక్కినెట్టి ఫాతిమా అందాల కిరీటాన్ని దక్కించుకుంది. తొలి రన్నరప్‌గా థాయ్‌లాండ్‌కు చెందిన ప్రవీణార్ సింగ్, రెండో రన్నరప్‌గా వెనెజువెలాకు చెందిన స్టిఫానీ అబాసలీ నిలిచారు. ఈ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మణికా విశ్వకర్మ స్విమ్‌సూట్ రౌండ్‌తో టాప్ 30 వరకు చేరుకుంది. న్యాయనిర్ణేతల్లో మన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఉండటం విశేషం.

గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు బీమా ధీమా

(మొదటి పేజీ తరువాయి)

■ గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లతో సహా అందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సామాజిక భద్రత పథకాలు

■ అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు

■ 40 ఏళ్లు దాటిన కార్మికులకు వార్షిక ఆరోగ్య పరీక్షల నిర్వహణ, ముందస్తు ఆరోగ్య సంరక్షణ

■ కార్మికులందరికీ సకాలంలో వేతనాలు చెల్లించడం ద్వారా ఆర్థిక స్థిరత్వం కల్పించడం

■ దేశవ్యాప్తంగా ఒకే రిజిస్ట్రేషన్, లైసెన్సు, రిటర్నులతో మరింత సులభతరంగా నిర్వహణ.

వివిధ రంగాల్లోని కార్మికులకు..

■ కాంట్రాక్టు కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా సామాజిక భద్రత ఉంటుంది. ఏడాది సర్వీసు పూర్తి చేస్తే గ్యాట్యుటీకి అర్హులవుతారు. వీరికి ఉచిత వార్షిక వైద్యపరీక్షలు ఉంటాయి.

■ గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు ఆధార్ అనుసంధాన విశిష్ట గుర్తింపు సంఖ్య లభిస్తుంది. తద్వారా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినా సంక్షేమ పథకాలు, సేవలు పొందవచ్చు. అగ్రిగేటర్లు తమ వార్షిక టర్నోవర్‌లో 1-2 శాతం(కార్మికులకు చెల్లించే మొత్తంలో 5 శాతం వరకు) సామాజిక భద్రత నిధికి కేటాయించడం తప్పనిసరి.

> స్థిరకాల పరిమితి(ఫిక్స్‌డ్ టర్మ్) ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగుల తరహాలో అన్ని సదుపాయాలు అందుతాయి. ఐదేళ్ల సర్వీసుకు బదులుగా ఏడాది సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులు. శాశ్వత ఉద్యోగులతో సమాన వేతనాలు అందుతాయి. ఈకారణంగా ఒప్పంద నియామకాలు తగ్గి.. ప్రత్యక్ష నియామకాలు పెరుగుతాయి.

■ టెక్స్‌టైల్ రంగంలో పనిచేసే వలస కార్మికులు.. సమాన వేతనాలు, సంక్షేమ పథకాలు, పీడీఎస్ పోర్టబిలిటీకి అర్హులు.

■ మహిళలకు సమానపనికి సమాన వేతనం అందుతుంది. లింగ వివక్ష చట్టబద్ధంగా నిషేధం. మైనింగ్, భారీ మిషన్లలో పనిచేసేందుకు, రాత్రివేళల్లో విధులు నిర్వహించేందుకు అనుమతి ఉంటుంది. మహిళా ఉద్యోగుల కుటుంబంలో అత్తమామలను చేర్చడం ద్వారా వారికి అన్ని సదుపాయాలు కల్పించాలి.

■ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, యువ కార్మికులందరికీ కనీస వేతనాలు, నియామకపత్రాలు తప్పనిసరి. చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లోని కార్మికులకు క్యాంటీన్, తాగునీరు, విశ్రాంత ప్రదేశాలు తప్పనిసరి. నిర్దిష్ట పనిగంటలకు మించితే ఓవర్‌టైమ్ జీతాలు చెల్లించాలి. వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి.

■ బీడీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి. రోజుకి 8-12 గంటల చొప్పున పనిచేయాలి. వారానికి 48 గంటలు మించొద్దు. అంతకు మించి పనిచేస్తేవారికి రెండింతల జీతం చెల్లించాలి. ఏడాదిలో 30 రోజులు పనిచేసిన బోనస్ పొందేందుకు అర్హులు.

■ ప్లాంటేషన్ వర్కర్లు సామాజిక భద్రత కోడ్ పరిధిలోకి వస్తారు. కెమికల్స్ నిర్వహణపై శిక్షణ అవసరం. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ వైద్య సదుపాయాలతో పాటు.. పిల్లలకు విద్యసౌకర్యం తప్పనిసరి.

■ డిజిటల్, ఆడియో వీడియో వర్కర్లు, ఎలక్ట్రానిక్ మీడియాలోని జర్నలిస్టులు, డబ్బింగ్ ఆర్టిస్టులు, స్టంట్ పర్సన్‌లు ఇక నుంచి పూర్తి సదుపాయాలు పొందుతారు. అందరికీ నియామక పత్రాలివ్వాలి. గడువులోగా జీతాలు చెల్లించాలి. అదనపు పనిగంటలు పనిచేసిన వారికి రెండింతల జీతం చెల్లించాలి.

■ గని కార్మికులు వారానికి 48 గంటలు పనిచేయాలి. పనిచేసే ప్రాంతం, కొన్ని సందర్భాలకు లోబడి.. కొన్ని ప్రమాదాలను ఉద్యోగ ప్రమాదాలుగా పరిగణిస్తుంది. కార్మికులందరికీ ఆరోగ్య భద్రత తప్పనిసరిగా ఉండాలి.

■ ప్రమాదకరమైన పరిశ్రమల్లో పనిచేసే వారికి వార్షిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. పరిశ్రమలో ప్రమాదరకమైన రసాయనాల నిర్వహణ, పనిప్రదేశం భద్రత సమీక్షించేందుకు భద్రత కమిటీ తప్పనిసరి.

■ జౌళి పరిశ్రమలో కార్మికులు పెండింగ్ బకాయిల కోసం మూడేళ్ల పాటు క్లెయిములు చేయవచ్చు. నిర్ణీత పని గంటలకు మించి పనిచేసే వారు రెండింతల ఓవర్‌టైమ్ వేతనాలకు అర్హులు.

■ ఐటీ పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులకు ప్రతినెల ఏడోతేదీ నాటికి వేతనాలు చెల్లించాలి. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి. మహిళలు రాత్రి షిఫ్టుల్లో పనిచేసేందుకు సదుపాయాలు కల్పించాలి. వేధింపులు, వివక్ష వేతన సమస్యలను గడువులోగా పరిష్కరించాలి. ఉద్యోగులకు సామాజిక భద్రత పథకాలు, నియామక పత్రాలు జారీ చేయాలి.

■ డాక్ వర్కర్లకు గుర్తింపు, న్యాయరక్షణ లభిస్తుంది. ఒప్పందం, తాత్కాలిక కార్మికులకు పీఎఫ్, పింఛను, బీమా సదుపాయాలివ్వాలి. వార్షిక ఆరోగ్య పరీక్షలతో పాటు కార్మికులకు వైద్య సదుపాయాలు, ప్రాథమిక చికిత్స తదితరాలన్నీ తప్పనిసరి చేయాలి.

■ ఎగుమతుల రంగంలో పనిచేసే కార్మికులకు గ్రాట్యుటీ, పీఎఫ్ లభిస్తాయి. ఏడాదిలో 180 రోజులు పనిచేసిన తరువాత వార్షిక సెలవులకు అర్హులు. సీలింగ్ లేకుండా సకాలంలో జీతాలివ్వాలి. మహిళలు ఈరంగంలో రాత్రిపూట పని చేయవచ్చు. అలాగే వారి భద్రతకు చర్యలు చేపట్టాలి.

ఏప్రిల్ 1 నుంచి అందరికీ ఆరోగ్య బీమా

(మొదటి పేజీ తరువాయి)

ప్రజారోగ్యంలో ప్రివెంటివ్, క్యురేటివ్ విధానం ద్వారా వైద్య రంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంతోపాటు ప్రజల వ్యక్తిగత ఖర్చులు కూడా తగ్గేలా చూడాలని స్పష్టంచేశారు.

పేదలకు మెరుగైన సేవలకే 'పీపీపీ'

పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య కళాశాలలను నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. వైద్య కళాశాలలు పీపీపీ పద్ధతిలో చేపడుతున్నా.. పర్యవేక్షణ, అజమాయిషీ ప్రభుత్వానిదే. వైద్య కళాశాలల ద్వారా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే అందే ఆధునిక వైద్య సదుపాయాలు ఇక గ్రామీణ ప్రాంతాలకూ అందుతాయి. ప్రజలకు, విద్యార్థులకు.. అంతిమంగా సమాజం మొత్తానికీ వీటి ద్వారా ప్రయోజనం కలుగుతుంది. ఆసుపత్రుల్లో 70 శాతం పడకలు పేదలకు ఉచితంగా కేటాయిస్తున్నాం. వైద్య సేవలు కూడా ఉచితంగా అందుతాయి' అని అన్నారు.

■ పీపీపీ కింద తొలి విడతలో చేపడుతున్న ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల వైద్యకళాశాలలపై సీఎం ఆరా తీశారు. వీలైనంత త్వరగా వీటి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో నాలుగు దశలు దాటామని, వచ్చే నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. ఒక్కో కళాశాల నిర్మాణానికి 50 ఎకరాల చొప్పున కేటాయించామన్నారు. 25 ఎకరాల్లో వైద్య కళాశాల, ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని, మిగిలిన 25 ఎకరాల్లో నర్సింగ్, పారామెడికల్, డెంటల్, ఆయుర్వేద, వెల్‌నెస్ సెంటర్, యోగా కేంద్రాలు కూడా ఏర్పాటుచేసి అనుసంధానించాలని సీఎం సూచించారు.

రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా 'సంజీవని'

కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలవుతున్న సంజీవని ప్రాజెక్టు వైద్య రంగంలో రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, దేశానికి దిక్సూచిగా నిలిచే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. టాటా-బిల్‌గేట్స్ ఫౌండేషన్‌లతో కలిసి చేస్తున్న ఈ ప్రాజెక్టు దేశానికి ఆదర్శం కావాలన్నారు. ఈ ప్రాజెక్టులో డిజిటల్ హెల్త్‌కార్డుల ద్వారా ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రస్తుతం కుప్పంలో అమలవుతున్న సంజీవని ద్వారా 3.38 లక్షల మంది ఆరోగ్య వివరాలు సేకరించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికను తయారుచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా నేచురోపతి ఆసుపత్రితో పాటు, యోగా కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

■ కుప్పంలో రిజిస్టర్ అయిన వారికి పరీక్షలు నిర్వహించి వ్యాధుల ప్రొఫైల్ సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా కుప్పంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై డిజిటల్ హెల్త్ రికార్డులు సిద్ధం చేశామని వివరించారు. 49 వేల మంది రోగులకు సంబంధించిన డేటా సేకరించామన్నారు. 2026 జనవరి 1 నుంచి చిత్తూరు జిల్లా మొత్తానికి సంజీవని ప్రాజెక్టు ప్రారంభిస్తామని తెలిపారు.

■ ఎన్టీఆర్ వైద్యసేవకు ఆసుపత్రుల నుంచి ప్రస్తుతం 12 లక్షల క్లెయిమ్‌లు వస్తున్నాయని, నెలకు రూ.330 కోట్లు ఖర్చవుతోందని అధికారులు సీఎంకు వివరించారు. వీసీ ద్వారా మంత్రి సత్యకుమార్ హాజరుకాగా.. సమీక్షలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కార్యదర్శి వీరపాండియన్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా వివిధ మోడళ్లలో నిర్వహిస్తున్న ఆసుపత్రులను అధ్యయనం చేసి, రోగులకు నాణ్యమైన, మెరుగైన సేవలు సులభంగా అందించాలన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఆసుపత్రులకు రేటింగ్ ఇవ్వాలని, నీతి ఆయోగ్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రమాణాలు, నిబంధనలు ఉండాలని చంద్రబాబు ఆదేశించారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూలు

తేదీ	సబ్జెక్టు
మార్చి 16	మొదటి భాష కాంపొజిట్ తెలుగు పేపర్-1
18	రెండో భాష
20	ఆంగ్లం
23	గణితం
25	భౌతిక, రసాయనశాస్త్రం
28	జీవశాస్త్రం
30	సాంఘిక శాస్త్రం
31	కాంపొజిట్ తెలుగు పేపర్-2 ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ (సంస్కృతం, అరబిక్, పార్శి) పేపర్-1
ఏప్రిల్ 1	ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ (సంస్కృతం, అరబిక్, పార్శి) పేపర్-2 ఎస్ఎస్‌సీ వృత్తివిద్య కోర్సు థియరీ

సామాజిక సృజనలకు 'ఇన్ఫోసిస్' పురస్కారాలు

ఈనాడు, బెంగళూరు: ఇన్ఫోసిస్ ఫౌండేషన్ నాలుగో ఆరోహణ్ సామాజిక సృజన (సోషల్ ఇన్నోవేషన్) పురస్కారాలను ప్రకటించింది. బెంగళూరులో శుక్రవారం ప్రకటించిన వివరాల ప్రకారం.. విద్య, ఆరోగ్యం, పర్యావరణ విభాగాల్లో ఇద్దరు చొప్పున ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. ప్రతి విభాగానికీ రూ.50 లక్షలు, సామాజిక ఆవిష్కరణలకు సంబంధించి మరో 5 విభాగాల్లో ప్రోత్సాహకంగా రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.2 కోట్ల నగదును పురస్కారాల కింద అందజేస్తారు. ఈ పురస్కారాలకు మొత్తం రెండు వేల ఎంట్రీలు రాగా ఆధునిక సాంకేతికత, సృజనలతో సమాజాన్ని ప్రభావితం చేసే ఆవిష్కరణలను జ్యూరీ ఎంపిక చేసింది. విద్యా విభాగంలో స్టెమ్ విద్య బోధన కోసం 'కనెక్టింగ్ ది డాట్స్' ప్రోగ్రామ్ సృష్టికర్తలు రాజేశ్‌రావ్, రవీంద్రరావు (బెంగళూరు), ఆరోగ్య విభాగంలో నీటి శుద్ధిని గుర్తించే పోర్టబుల్ ఏఐ, ఐఓటీ వాటర్ క్వాలిటీ ఎనలైజర్ (క్లూక్స్ సీ012)ను తయారు చేసిన చిత్రంజన్ సింగ్, రాబిన్ సింగ్ (దిల్లీ), పర్యావరణ విభాగంలో రోబోటిక్ ఆర్టిఫిషియల్ బోర్‌వెల్ సృష్టికర్తలు రాహుల్ సురేశ్, వినీత్ మోరేశ్వర్(పుణె)లు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు.



'రైతన్నా... మీ కోసం'లో నేనూ పాల్గొంటా: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఏర్పాటుచేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలని అధికారుల్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ నెల 24 నుంచి 29 వరకు జరిగే 'రైతన్నా మీ కోసం', ఇందులో భాగంగా డిసెంబర్ మూడో తేదీ జరిగే వర్క్‌షాపుల్లో తాను పాల్గొంటానని వివరించారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖపై శుక్రవారం ఆయన సమీక్షించారు. అరటి ధర పడిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి రైతులు నష్టపోకూడదని, అవసరమైతే కేంద్రానికి లేఖ రాయాలని తెలిపారు.

క్వింటాల్ 5 వేలకిస్తారా... 6 వేలకిస్తారా?

గ్రామాల్లో పత్తి రైతులతో వ్యాపారుల బేరాలు

- సీసీఐ కేంద్రాలకు వెళితే... తేమ ఉంది.. రంగు మారిందంటూ సతాయింపులు
- చేసేదిలేక ప్రైవేటుగానే నష్టానికి అమ్మకం
- పలు గ్రామాల్లో తొలి తీత తర్వాత దున్నేస్తున్న వైనం



కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్ యార్డులో పత్తిలో తేమను పరిశీలిస్తున్న సిబ్బంది

ఈనాడు, అమరావతి: ఎన్నో కష్టనష్టాలకోర్చి పండించిన పత్తిని అమ్ముకోవడం రైతులకు సమస్యగా మారింది. చాలా గ్రామాల్లో క్వింటాల్ రూ.5 వేలకు ఇస్తారా.. రూ.6 వేలకు ఇస్తారా.. అని ప్రైవేటు వ్యాపారులు అడుగుతున్నారు. ఈ రేటు.. మద్దతు ధర(పొట్టి పింజ రూ.7,710, పొడవు పింజ రూ.8,110)తో పోలిస్తే సగటున క్వింటాల్‌కు రూ.2,500 తక్కువ. పత్తి తీత ఖర్చులే క్వింటాల్‌కు రూ.2 వేల దాకా అవుతున్నాయి. వ్యాపారులకు కాకుండా భారత పత్తి సంస్థ(సీసీఐ) కేంద్రంలో అమ్ముదామని తీసుకెళ్తే తేమ ఉంది, రంగు మారిందంటూ నిబంధనల పేరుతో సిబ్బంది సతాయిస్తున్నారు. అంతో ఇంతో ధర తగ్గించి తీసుకునేందుకూ ససేమిరా అంటున్నారు. చేసేది లేక తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి తలెత్తింది.

ఎకరాకు సగటున 4 క్వింటాళ్లలోపే..

■ రాష్ట్రంలో ఈ ఏడాది 11.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఇందులో 5.65 లక్షల ఎకరాలు(50%) కర్నూలు జిల్లాలోనే ఉంది. పల్నాడు జిల్లాలో 2.27లక్షల ఎకరాల్లో(20%) వేశారు. తర్వాత స్థానాల్లో అనంతపురం, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాలున్నాయి.

■ పత్తి సాగుకు ఎకరాకు రూ.35 వేలపైనే పెట్టుబడి అవుతోంది. కౌలు రూ.15 వేలపైనే. దిగుబడి ఎకరాకు 10 క్వింటాళ్లైనా వస్తుందని ఆశిస్తే.. సగటున 4 క్వింటాళ్లే వస్తోంది. కొన్ని చోట్ల అదీ లేదు. క్వింటాల్ రూ.5 వేల ప్రకారం చూస్తే 4 క్వింటాళ్లకు రూ.20 వేలు.. అంటే ఎకరాకు రూ.15 వేలు నష్టం.

■ పత్తి రైతుకు ఈ ఏడాది ఆరంభం నుంచీ కష్టాలే. తొలుత వర్షాలు అనుకూలించలేదు. కొన్ని చోట్ల రెండోసారి విత్తనాలు నాటాల్సి వచ్చింది. సాగు మొదలయ్యాక యూరియా బస్తా రూ.300 నుంచి రూ.500 చొప్పున కొనాల్సి వచ్చింది.

■ అక్టోబరు నెలంతా మొంథా తుపానుతోపాటు ఎడతెరపిలేని వానలతో కాయలు కుళ్లిపోయాయి. పూత, పిందె రాలిపోయాయి. తీతకు సిద్ధమైన పత్తి తడిచి రంగుమారింది.

■ పత్తి రెండు నుంచి మూడు తీతలు వస్తుంది. ఈ ఏడాది ఒక తీతతోనే సరి. ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల తొలితీత తర్వాత పొలాలు దున్నేస్తున్నారు.

పెట్టుబడి రాయితీకి నోచుకోక..

భారీవర్షాలతో పత్తి రైతుకు ఇబ్బందేమీ లేదనేది వ్యవసాయ అధికారుల మాట. మొంథా సమయంలో నష్టాన్ని తగ్గించి చూపారు. తొలి కాపు నష్టపోయినా మరోకాపు వస్తుందని లెక్కలేస్తున్నారు. మళ్లీ ఎరువులు వేసి, పురుగుమందులు పిచికారీ చేస్తేనే ఎంతోకొంత దిగుబడి వస్తుంది. అంటే అదనపు పెట్టుబడి పెట్టాల్సిందే. ఇది రైతుకు భారం. రెండోతీత నుంచి గులాబీ రంగు పురుగు ప్రభావం మొదలవుతుంది. ఈ ఇబ్బందులు అధికారులకు పట్టడంలేదు.

మరెలా అమ్ముకోవాలి?

సెప్టెంబరు ఆఖరున మొదలైన భారీవర్షాలు. నవంబరు మొదటి వారం వరకు ఆగలేదు. ఈ క్రమంలో పత్తి తడవదా? తీసిన పత్తిలో తేమ ఉండదా? మేం కొనం.. అని తిరస్కరిస్తే ఎవరికి అమ్ముకోవాలి? అని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

■ పది మంది రైతులు పత్తిని తెస్తే.. నలుగురి నుంచే కొంటున్నారు. తేమ 8-12 శాతం ఉంటేనే సీసీఐ కొంటోంది. ఎక్కువమంది రైతులు తెచ్చే పత్తిలో తేమ 14-18 శాతం పైగా ఉంటోంది. సీసీఐ దాన్ని తిరస్కరిస్తోంది.

■ తడిచి రంగు మారిన పత్తినీ ధర తగ్గించి కొనాలని కోరుతున్నా.. నిబంధనల్ని సడలించడం లేదు. కేంద్రం నుంచి అనుమతి వచ్చేదాకా.. రైతులు పత్తిని నిల్వ ఉంచుకోలేరు. ఏదో ఒక ధరకు అమ్ముకోవాల్సిందే.

తప్పని ఆపసోపాలు...

పత్తిని అమ్ముకోవడంలో రైతులకు యాప్‌ల కష్టాలూ తప్పడం లేదు. పంట వేశాక ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలి. దిగుబడి వచ్చాక అమ్ముకోవడానికి రైతుసేవా కేంద్రానికి వెళ్లి సీఎం యాప్‌లో.. తర్వాత సీసీఐకి చెందిన కపాస్ యాప్‌లో నమోదు చేసుకోవాలి. ఈ మూడూ అనుసంధానమైతేనే రైతులు పత్తి అమ్ముకోగలరు. వాటిని నిర్వహించే ప్రైవేటు సంస్థలు వేర్వేరు. ఈక్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జిన్నింగ్ మిల్లులు.. కొత్త చిక్కుముడి

జిన్నింగ్ మిల్లుల్నీ కొనుగోలు కేంద్రాలుగా మార్చి రైతుల్ని అక్కడకు పంపిస్తున్నారు. ఎల్1, ఎల్2, ఎల్3 అని విభజించి స్లాట్లు కేటాయిస్తున్నారు. రైతులు తమకు దగ్గర్లోని మిల్లులకు కాకుండా దూరంగా ఉన్న మిల్లులకు వెళ్లాల్సిన పరిస్థితి. దీన్ని తప్పించాలని కోరుతున్నా పట్టించుకునే వారు లేరు.

■ పత్తి దిగుమతులకు కేంద్రం అనుమతించడమూ రైతులకు శరాఘాతమే. ఈ ఏడాది పత్తి తీతలు మొదలయ్యే సమయంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో వ్యాపారులు విదేశాల పత్తిని కొనేందుకు మొగ్గు చూపిస్తున్నారు.



(c) eenadu



పారాహుషార్... పొగ ముంచు!

దేశవ్యాప్తంగా చలి తీవ్రత ప్రారంభమైంది. శీతాకాలం అందమైన ప్రకృతి దృశ్యాలతో పాటు రోడ్లపై సవాళ్లనూ సృష్టిస్తుంది. తెల్లవారుజామున దట్టంగా పొగ మంచు కమ్ముకోవడం వల్ల వెలుతురు తగ్గిపోతుంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.



● దేశంలో ఏటా శీతా కాలంలో పొగమంచు కారణంగా 30 వేలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇవి మొత్తం ప్రమాదాల్లో 7.1 శాతం.

● ఈ ఏడాది ఫిబ్రవరిలో వ్యవసాయ కూలీలను తీసుకెళ్తున్న ఆటోడ్రైవర్ పొగమంచు కారణంగా రోడ్డు కనిపించక ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

జాగ్రత్తలు పాటించాలి..

● రాత్రి వేళల్లో వేగం పెరిగే కొద్దీ ఎక్కువ దూరం చూడలేరు. కాబట్టి రోడ్డును స్పష్టంగా చూడగలిగేంత వేగంతోనే వాహనాన్ని నడపాలి.
● వాహనం నడిపేటప్పుడు ఇతరులకు స్పష్టంగా కనిపించేలా లైట్లు ఆన్ చేసి ఉంచాలి.
● ఇతర వాహనాలు గమనించేలా హజార్డ్ (బ్లింకర్లు) లైట్ ఉపయోగించాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూసుకోవాలి.
● జాతీయ రహదారులు, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితమైన దూరం పాటించాలి.
● విండ్ స్క్రీన్, సైడ్ అద్దాలపై మంచు పొరను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
● రోడ్డు స్పష్టంగా కనిపించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనాన్ని నిలిపివేయాలి. అది ఇతర వాహనదారులకు కనిపించేలా ఉండాలి.
● ముందు వెళ్లే వాహనాలను ఓవర్‌టేక్ చేయవద్దు.
● వాహనం నేర్చుకుంటున్నా, పూర్తిగా డ్రైవింగ్ రాకున్నా మంచులో నడపడం మంచిది కాదు.
● వాహనం నడిపేటప్పుడు తినడం, తాగడం, పొగ తాగడం చేయరాదు. డ్రైవింగ్‌పైనే దృష్టి కేంద్రీకరించాలి.
● రాత్రి సమయాల్లో, తెల్లవారుజామున వాహనాలు నడిపే డ్రైవర్లు నిద్రమత్తులో ఉంటారు. ఒక్కోసారి అకస్మాత్తుగా నిద్రలోకి జారుకుంటారు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది.
● టోల్‌ప్లాజాల వద్ద అనౌన్స్‌మెంట్ ద్వారా జారీ చేసే సూచనలు పాటించాలి.
● మీరు నెమ్మదిగా వెళ్తే.. వెనక నుంచి మరొక వాహనం ఢీకొనే అవకాశాలు ఎక్కువ. అలాంటి ప్రమాదాలు జరగకుండా అకస్మాత్తుగా మలుపు తిప్పడం, రోడ్డు మధ్యలో ఆగిపోవడం వంటివి నివారించాలి. వాహనం నిలుపుదలకు ముందుగా బ్లింకర్లను వినియోగించాలి.

ప్రయాణించే మార్గంలో రోడ్లపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలి. మీకు బాగా తెలిసిన మార్గాన్నే ఎంచుకోవాలి. దట్టమైన పొగమంచులో షార్ట్‌కట్లు, తెలియని మార్గాల్లో వెళ్లడం నివారించాలి.

ప్రభుత్వాలు చేయాల్సినవి..

■ రహదారులపై చెరిగిపోయిన రహదారి చిహ్నాలను పునరుద్ధరించడంతోపాటు కాలిబాట గుర్తులను సరిదిద్దాలి.
■ నివాసాలకు సమీపంలో, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో తీవ్రత తెలిసేలా గుర్తులు, సూచికలు, నిర్మాణాలు జరిగే ప్రదేశాల్లో బ్లింకర్లు ఏర్పాటు చేయాలి.
■ జాతీయ రహదారుల వెంట డెలినేటర్లు, రెట్రో రిఫ్లెక్టివ్ టేపులు, భద్రతా సంకేతాల బోర్డులు, మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలి.



- ఈనాడు, విశాఖపట్నం

మన వేడుకలో మనమే స్టార్.. ఆడాలి తీన్‌మార్



ఇంట్లో అన్నయ్య పెళ్లి.. దూంధాం చేయాల్సిందే. నెల రోజుల్లో పెళ్లి.. బంధువులు, స్నేహితులతో చేసే సందడి జీవితాంతం గుర్తుండిపోవాలి. ఇలా పెళ్లిళ్ల సమయంలో ఆటపాటలకు ఇప్పుడు కుటుంబాల్లోని యువతీయువకులతో పాటు పెద్దలు, బంధువులు ప్రాధాన్యం ఇస్తున్నారు. నృత్యాలు, కేరింతల మధ్య సంగీత్ నైట్ తప్పనిసరిగా ఉండేలా చూసుకుంటున్నారు. 'సాదాసీదాగా కాదు మామా..' అంటూ నృత్య ప్రదర్శనకు ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. హైదరాబాద్‌లో సుమారు 100 మందికిపైగా కొరియోగ్రాఫర్లు పెళ్లిళ్ల సీజన్‌లో ఈ శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. ఆన్‌లైన్‌లో జిల్లాల్లోని వారికి శిక్షణ అందిస్తున్నారు.


సులువైన బాలీవుడ్ స్టెప్పులు (హిప్ హాప్, కాంటెంపరరీ), గ్రూప్ డ్యాన్స్ (కుటుంబం మొత్తం), కపుల్ డ్యాన్స్ (వధువు, వరుడు), సోలో (వధువుల కోసం ప్రత్యేకం) విభాగాలుగా కళాకారులు శిక్షణ అందిస్తున్నారు. 15 నుంచి 45 నిమిషాల ప్రదర్శన ఉండేలా టాలీవుడ్, బాలీవుడ్, ఇంగ్లిష్ పాటలను ఎంచుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో బుకింగ్..

కొరియోగ్రాఫర్ శిక్షకుల వివరాలు, వారి ప్రదర్శనలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటంతో సులువుగా సంప్రదించి వేడుకకు రెండు నెలల ముందు నుంచే నృత్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో ప్యాకేజీ గ్రూప్ డ్యాన్స్‌లు, ఫొటోగ్రఫీ కలిపి చేసేవారు, కస్టమ్ కొరియోగ్రఫీ, ట్రెడిషనల్ వెడ్డింగ్ డ్యాన్స్ స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నారు. 15 నుంచి 30 నిమిషాల ప్రదర్శన కొరియోగ్రఫీకి రూ.20,000 నుంచి రూ.1,00,000 వరకు వసూలు చేస్తున్నారు.

ఇందులో కుటుంబ ప్రాధాన్యాన్ని బట్టి నాలుగు నుంచి ఆరు పాటలు ఎంచుకోవచ్చు. 10 నుంచి 50 మంది వరకు పాల్గొనవచ్చు. రెండు నుంచి మూడు సెషన్లు రిహార్సల్స్ చేయిస్తున్నారు. - ఈనాడు, హైదరాబాద్

ఈ నారసింహుడి చూపే శాసనం!



దేశ సంపదను పడవల్లో స్వదేశానికి తరలించుకుపోతున్న బ్రిటిష్‌వారిని మూడు పడవలను నీట ముంచిన నరసింహస్వామి కథ ఇది. ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి యోగ నిద్రలో దర్శనమిస్తారు. మిగిలిన ఆలయాలకు భిన్నంగా ముఖద్వారం నుంచి చూస్తే ఇక్కడి మూలమూర్తి కనిపించదు. దీని వెనుక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. ఆలయ చరిత్ర ప్రకారం.. బ్రిటిష్ వారి కాలంలో మన దేశ సంపదను సముద్రంలో నావలపై తరలించుకుపోయేవారు. ఈ ప్రాంతంలో ప్రయాణించే నౌకల్లో ఉన్నట్టుండి అగ్ని ప్రమాదాలు జరిగి కాలిపోయేవి. దీనికి కారణమేంటా అని దర్యాప్తు చేసిన బ్రిటిష్ అధికారులు.. పాకల సముద్ర తీరానికి సమీపంలోని సింగరాయకొండ దేవాలయంలోని నరసింహస్వామి మహోగ్ర దృష్టి పడవలపై పడుతుందని భావించారు. దీంతో దేవుడి ముందు గోడకట్టి.. ముఖద్వారాన్ని కాస్త పక్కకు మార్పించారు. ఆ తర్వాత ప్రమాదాలు తగ్గాయి. ముఖద్వారాన్ని జరిపించడంతో పరిహారంగా నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఏటా ఈ ఆలయానికి ఖర్చు కూడా చెల్లించేదని శాసనాల్లో పేర్కొన్నారు. -ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే-సింగరాయకొండ గ్రామీణం



బాతు బలగం.. భూమికి బలం

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బాతుల గుంపులు సందడి చేస్తున్నాయి. బాతుల పెంపకందారులు.. వరి కోతలు పూర్తయిన పొలాల్లోకి వాటిని మేతకు తీసుకొస్తున్నారు. చేలల్లోని చిన్న చిన్న పురుగులను ఇవి తినేస్తూ పర్యావరణానికి మేలు చేస్తాయి. మరోవైపు బాతుల విసర్జితాలతో పొలాలకు బలం చేకూరుతుంది. ఇలా బహుళ ప్రయోజనాలు అందించే వీటి రాకకోసం అన్నదాతలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని ఉర్లుగొండలో నాగులబండ గుట్ట మీదుగా ఉదయం మేతకు వెళ్తున్న బాతుల గుంపు ఇది.
– ఈనాడు, నల్గొండ; న్యూస్‌టుడే, మోతె

కేరళలో 'ప్రైమరీ అమీబిక్ మెనింగో ఎన్‌కెఫలైటిస్'

నదీ స్నానాల్లో ముక్కులోకి నీరు పోనివ్వొద్దు

అయ్యప్ప భక్తులకు సూచనలు



కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి మండలం-మకరవిళక్కు పూజలు మొదలయ్యాయి. ఇప్పటికే భక్తులు పెద్దసంఖ్యలో శబరిమల చేరుకున్నారు. రెండు నెలల పాటు కొనసాగే ఈ సీజన్‌లో లక్షల మంది స్వామి దర్శనానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ప్రైమరీ అమీబిక్ మెనింగో ఎన్‌కెఫలైటిస్ కేసులు నమోదవుతుండటంతో నదీస్నానాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కేరళ ప్రభుత్వం సూచించింది.

ఎలా వ్యాపిస్తుందంటే.. ప్రైమరీ అమీబిక్ మెనింగో ఎన్‌కెఫలైటిస్ అనే వ్యాధి నెగ్లేరియా ఫౌలెరి అనే అమీబా వల్ల వ్యాపిస్తుంది. దీన్నే బ్రెయిన్ ఈటింగ్ అమీబాగా పిలుస్తారు. ఇది చెరువులు, సరస్సులు, కాలువల్లో వెచ్చని నీటిలో నివసిస్తుంది. ప్రవాహం లేని నదుల్లోనూ ఉండే అవకాశాలు ఎక్కువ. ఆ నీటిలో మునగడం, ఈత కొట్టడం వల్ల అమీబా ముక్కు ద్వారా శరీరంలోకి వెళ్తుంది. నాడుల ద్వారా మెదడుకు చేరి అక్కడి కణజాలాన్ని నాశనం చేస్తుంది.

లక్షణాలు ఇవీ.. తీవ్రమైన తలనొప్పి, జ్వరం రావడంతో పాటు వాంతులు అవుతాయి. వ్యాధి తీవ్రమయ్యే కొద్దీ మూర్ఛ, మానసిక ఆందోళన, కోమా వంటి లక్షణాలు ఏర్పడతాయి. రెండు వారాల్లోనే ఇది ప్రాణాంతకమయ్యే ప్రమాదముంది. మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలున్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

జాగ్రత్తలతో మేలు.. శబరిమల యాత్రకు వెళ్లే క్రమంలో భక్తులు దారిపొడవునా నదీస్నానాలు చేస్తుంటారు. అయ్యప్ప దర్శనానికి వెళ్లే ముందు పంబలో స్నానం చేయడం పరిపాటి. ఈ క్రమంలో ముక్కులోకి నీరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడి చేసిన నీటిని తాగాలి. ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్య రికార్డులు, ప్రాథమిక మందులు వెంట తీసుకెళ్లాలని చెబుతున్నారు. శబరిమల పరిసర ప్రాంతాల్లోని చెరువులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని ఇప్పటికే అక్కడి ప్రభుత్వం ఆదేశించింది.

అప్రమత్తంగా ఉండాలి

– డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, సూపరింటెండెంట్, గుంటూరు జీజీహెచ్

నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్యాక్టీరియా, అమీబా ఎక్కువగా ఉంటాయి. ఆ నీటిలో స్నానం చేసినప్పుడు అమీబా ముక్కు ద్వారా మెదడుకు చేరి అక్కడి కణజాలాన్ని దెబ్బతీస్తుంది. కొన్నిసార్లు నోటి ద్వారానూ శరీరంలోకి ప్రవేశిస్తుంది. దీని బారిన పడిన వ్యక్తిలో ఇంక్యుబేషన్ పీరియడ్ కాగానే లక్షణాలు బయటపడతాయి. ఆరుబయట జలవనరుల్లో స్నానాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.
–ఈనాడు, అమరావతి

కిలోకి ఒకటే క్యారెట్..!



సాధారణంగా క్యారెట్ బరువు 100-250 గ్రాముల వరకు ఉంటుంది. విశాఖలోని కంచరపాలెం రైతుబజారులో మాత్రం శుక్రవారం 880 గ్రాముల బరువున్న పెద్ద సైజు క్యారెట్ కనిపించింది. దేవి అనే రైతు దీనిని తీసుకొచ్చారు.
– న్యూస్‌టుడే, విశాఖపట్నం



అలంకార ప్రియుడికి ఆభరణాలు సమర్పిద్దామిలా..

శ్రీవేంకటేశ్వరస్వామి ఎంతటి నైవేద్యప్రియుడో అంతే ఉత్సవప్రియుడు. అంత కంటే ఎక్కువ అలంకారప్రియుడు. అందుకే సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడి దివ్యమంగళ స్వరూపాన్ని ఆపాదమస్తకం చూడాలంటే రెండు కళ్లు సరిపోవంటే అతిశయోక్తి కాదు. మూలవిరాట్టే కాదు ఉత్సవమూర్తులను దర్శించినా ఇదే తన్మయత్వం. శ్రీవారికి దాతలు విరివిగా వెండి, బంగారం, వజ్రాలు బహూకరిస్తుంటారు. అయితే వాటితో ఆభరణాలు చేయించాలంటే దాతలు ఎవర్ని సంప్రదించాలి? దానికి సంబంధించిన విధివిధానాలేంటో చూద్దాం.

దరఖాస్తు ఇలా..

● దాతలు తొలుత ఎన్ని కిలోలతో బంగారు ఆభరణాలు చేయించాలనుకుంటున్నారో వివరిస్తూ.. తిరుమల తిరుపతి దేవస్థానానికి (ఈవో, అదనపు ఈవో, డిప్యూటీ ఈవో, ఆలయ పేష్కార్ పేరిట) దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.
● వచ్చిన దరఖాస్తును డిప్యూటీ ఈవో/ఆలయ పేష్కార్ పరిశీలించి.. స్వామివారికి ప్రస్తుతం ఎలాంటి ఆభరణాలు కావాలి? ఏయే కొలతలు, పరిమాణాలు.. తదితర వివరాలు నమోదు చేసి తితిదే ఈవోకి నివేదిస్తారు.
● అనంతరం ఈవో సూచనల మేరకు.. ఆలయ పేష్కార్ కార్యాలయం నుంచి ఆభరణాల వివరాలను దాతకు పంపిస్తారు.
● ఆయా ఆభరణాలకు కావాల్సిన కొలతలు తీసుకునేందుకు దాత, అతనితో పాటు స్వర్ణకారుడి(గోల్డ్‌స్మిత్)ని బయోమెట్రిక్ ద్వారా ఆలయంలోకి అనుమతిస్తారు. అక్కడి బొక్కసంలో అధికారుల సూచనల మేరకు వారు కొలతలు తీసుకోవచ్చు.
● ఆ ప్రకారంగా ఆభరణాలు చేయించి డిప్యూటీ ఈవో/ఆలయ పేష్కార్లకు తెలియజేసి వారి సూచనలతో ఆలయంలో ఉన్నతాధికారుల సమక్షంలో అందజేయాలి. ఆ సమయంలో దాతతో పాటు అతని కుటుంబ సభ్యులకు వీఐపీ దర్శనం చేసుకొనే వెసులుబాటును తితిదే కల్పిస్తుంది.
● ఏటా 70 నుంచి 100 మంది వరకు దాతలు స్వామివారికి ఆభరణాలు చేయిస్తుంటారు.
● ముడి వెండి, బంగారం మాత్రం నేరుగా హుండీలో వేయాల్సి ఉంటుంది.

- ఈనాడు డిజిటల్, తిరుపతి



ఒక్క నిమిషం గోడ కుర్చీ వేస్తే..


రోజుకు ఒక్క నిమిషం గోడ కుర్చీ వేయండి. నడుము మొత్తాన్ని గోడకు ఆన్చి, పాదాలను పూర్తిగా నేలపై పెట్టి, చేతులను కాస్త ఎడం చేసి, మోకాళ్లు 90 డిగ్రీల కోణంలో ఉండేలా కూర్చోండి. దీనివల్ల కాళ్ల కండరాలు బలోపేతమవుతాయి. శరీరంలో కొవ్వు కరుగుతుంది. రక్తపోటు తగ్గుతుంది.
– కర్లిన్ విల్సన్, వెల్‌నెస్ కోచ్

యాపిల్ తోటలో జపనీస్ పండ్లు



యాపిల్ సాగుకు పేరొందిన హిమాచల్ ప్రదేశ్ కొండల్లో జపనీస్ పండు పెర్సిమన్ వైపు ఇటీవలి కాలంలో రైతులు మొగ్గు చూపుతున్నారు. తక్కువ పెట్టుబడి, శ్రమతో ఎక్కువ లాభాలు వస్తున్నందున కుల్లూ జిల్లా ఉద్యాన రైతులు పెర్సిమన్ సాగును క్రమంగా పెంచుతున్నారు. ఈ జిల్లాలో రెండేళ్ల కిందట 200 హెక్టార్లున్న వీటి సాగు ఇప్పుడు 404 హెక్టార్లకు చేరింది. మార్కెట్లో ఈ పండ్ల ధర కిలో రూ.వంద నుంచి రూ.200 వరకు పలుకుతోంది. పెట్టుబడి ఎక్కువ, ధర తక్కువ ఉండటంతో తాను దానిమ్మ తోటలను తొలగించి పెర్సిమన్ సాగు ప్రారంభించినట్లు యోగరాజ్ ఠాకూర్ అనే రైతు తెలిపారు. సెప్టెంబరు నెల నుంచే ఈ పండ్లు మార్కెట్లోకి వస్తున్నాయి. ఈ పండ్ల మొక్కలు కావాలని మిగతా ప్రాంతాల నుంచి ఉద్యానశాఖకు వినతులు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ పంట సాగుకు హెక్టారుకు రూ.62,500 రాయితీ ఇస్తోంది. పెర్సిమన్‌లో పోషక విలువలు కూడా మెండుగా ఉన్నట్లు ఉద్యానశాఖ నిపుణుడు డాక్టర్ ఉత్తమ్ పరాశర్ తెలిపారు. హిమాలయ పర్వత శ్రేణుల్లోని ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్‌లలోనూ ఈ పండ్ల సాగు పెరుగుతోంది. –ఈటీవీ భారత్

తిరుక్కురళ్.. ఇక గోండులూ చదువుకోవచ్చు



ప్రపంచవ్యాప్తంగా తెలుగు సహా అరవైకి పైగా భాషల్లోకి అనువాదమైన తమిళ ప్రాచీన గ్రంథం తిరుక్కురళ్. ఆంగ్లేయుల పాలన సమయంలోనే ఇందులోని సూక్తులను తమిళ పాఠ్యాంశాల్లో చేర్చారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన ఈ గ్రంథం ఇప్పుడు గోండి భాషలోకి అనువాదమైంది. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఆదివాసీ యువకుడు సిడాం వరప్రసాద్ దీనిని తన మాతృభాషలోకి అనువదించి.. ఆ భాష వచ్చిన వారంతా చదువుకునే అవకాశం కల్పించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం మత్తడిగూడకు చెందిన వరప్రసాద్.. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ చదివారు. గోండి సాహిత్యంలో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్, ద్రవిడిజం రివైవల్ సెంటర్ సహకారంతో ప్రముఖ తమిళ కవి తిరువళ్లువర్ రాసిన 'తిరుక్కురళ్'ను సిడాం వరప్రసాద్ గోండి భాషలోకి అనువాదం చేశారు. ఈ గ్రంథం తమిళ సంస్కృతి, సాహిత్యం, నైతికత, సామాజిక విలువలను ప్రతిబింబిస్తుంది. గోండి అనువాద గ్రంథాన్ని కేంద్ర మంత్రి దుర్గాదాస్ ఉయికె చేతుల మీదుగా వచ్చే జనవరిలో ఆవిష్కరించనున్నట్లు రచయిత తెలిపారు.



సిడాం వరప్రసాద్

– న్యూస్‌టుడే, ఉట్నూరు

వైనతేయ తీరంలో 3వ శతాబ్దపు వైభవం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైనతేయ గోదావరి తీరంలోని మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామంలోని ఆది బౌద్ధ స్తూపం నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన ఈ కట్టడం భారతీయ పురాతత్వ శాఖ పర్యవేక్షణలో ఉంది. ప్రధాన స్తూపంపై ఉన్న అశోక చక్రంతో పాటు ఉప స్తూపాలు, ప్రార్థనా మందిరాలు, చుట్టూ పచ్చదనం డ్రోన్ కెమెరా వీక్షణలో ఇలా కనిపించాయి.
– న్యూస్‌టుడే, మామిడికుదురు

సామాజిక మాధ్యమాల్లో...

ఊరికి ఉపకారులు!

సోషల్ మీడియా అనగానే చాలామందికి ఫొటోలు, సెల్ఫీలు, వీడియోలు తీయడం, అప్‌లోడ్ చేయడమే గుర్తొస్తుంది.
మరికొందరేమో రీల్స్ చేస్తూ, షార్ట్స్ చూస్తూ వాటితోనే కాలక్షేపం చేస్తారు.
కానీ కొందరున్నారు... జనహితమే అభిమతంగా ఈ మాధ్యమాలను వినియోగిస్తున్నారు.
తమకు తెలిసిన విషయాలను ఇతరులకు తెలుపుతూ సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారు.
ఆహారం, ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యవసాయం.. ఇలా ఎన్నో అంశాలపై వీడియోలు తీస్తూ, విలువైన సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తూ సామాజిక మాధ్యమాలను ప్రజాప్రయోజన వేదికగా మలుస్తున్నారు. వారిలో కొందరు..

రుణాలు.. మోసాలు.. ఫిర్యాదులు

◆ కౌశికూ.. ఓ కౌశికూ.. ఇదేంటీ.. ఇలా జరిగింది..?.. ఈ పదాలు చదవగానే సోషల్ మీడియా ఖాతా ఉన్నవారికెవరికైనా వారెవరో ఇట్టే తెలిసిపోతుంది.
◆ కౌశిక్ మరిడి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా వేదికగా 'బాస్ వాలాతెలుగు' పేరిట బ్యాంకు రుణాలు, వడ్డీ శాతం, ఫిక్స్‌డ్ డిపాజిట్, బీమా, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, .. ఇలా చాలా విషయాలను వివరిస్తున్నారు.
◆ ఏ బ్యాంకు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తుంది, ఎందులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే, ఏ పాలసీ చేయిస్తే లాభాలు ఉంటాయి లాంటి విషయాలు ఎన్నో చెప్పేస్తుంటారు.
◆ రైలు ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకుంటే, పార్కింగ్ నుంచి కారు మాయమైతే, రెస్టారెంట్లు ఎక్కువ బిల్లులు ఇస్తే ఎక్కడ... ఎలా ఫిర్యాదు చేయాలి? న్యాయం ఎలా జరుగుతుంది?.. ఇలా పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఉద్యోగాలు.. ఉపకారవేతనాలు.. ఆరోగ్యం..



◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సహా ఎన్నో సంస్థలు విద్యార్థుల చదువుల కోసం అందిస్తున్న ఉపకారవేతనాలు, నిరుద్యోగులకు కల్పించే ఉద్యోగావకాశాల గురించి విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు చిన్నారావు చిటికెల.
◆ పిల్లల కోసం అందుబాటులో ఉన్న సీబీఎస్ఈ సింగిల్ గర్ల్ చైల్డ్ మెరిట్ స్కాలర్‌షిప్, ఏఐసీటీఈ ప్రగతి, ఇన్ఫోసిస్, సంతూర్, మహీంద్రా ఎంపవర్... ఇలా ఎన్నో ఉపకార వేతనాల వివరాలు, అర్హతల గురించి వివరిస్తున్నారు.
◆ ఎస్సెస్సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ అర్హతలతో ఉన్న ఉద్యోగావకాశాలతోపాటు ఆర్మీ, నేవీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలైన నాబార్డ్, కేంద్ర సహకార బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, సెబీ, ఐఆర్‌సీటీసీ, బీఎస్ఎన్ఎల్, ఓఎన్‌జీసీ, టీహెచ్‌డీసీ, బీఈఎల్ తదితర శాఖలు, సంస్థల్లో ఉన్న ఖాళీలు, ఉద్యోగాల గురించి చెబుతారు.
◆ వీటితోపాటు ఆరోగ్యం, ప్రభుత్వ పథకాలు, టెక్నాలజీ గురించి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో చక్కగా వివరిస్తున్నారు.

సాగులో మెలకువలు

◆ రైతుల కోసం 'రైతు పలక', 'తెలుగు రైతుబడి' తెలుగు యువరైతు' తదితర ఛానళ్ల ద్వారా కర్షకులకు సమాచారాన్ని అరచేతిలో పెట్టేస్తున్నారు.
◆ పొలాల గట్లమీద బంతి మొక్కలు పెంచడంతో కలిగే లాభాలు, అడవి జంతువుల నుంచి పంటను కాపాడుకోవడానికి చిట్కాలు, ఎరువులు, పురుగు మందుల వాడకంలో మెలకువలవంటివన్నీ చెబుతున్నారు.



◆ ఏ కాలంలో ఏ పంట సాగుచేస్తే లాభాలు అధికం, ఆవులు, గేదెలు, కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకం తదితరాల గురించి ఎంతో విలువైన సమాచారం అందిస్తున్నారు.
◆ తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, రాయితీలు, రుణాల గురించి వివరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు..

◆ పేదలు, నిరుద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు, రాయితీలు, రుణాలు అందిస్తున్నా అవగాహన లోపంతో వాటికి అర్హులు నోచుకోవడం లేదు. వాటన్నిటినీ ఒకే వేదికపై తీసుకొచ్చి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాల్లో వివరిస్తున్నారు బి.విక్రం తన 'రంగమ్మ ఛానల్' ద్వారా.
◆ ఎలాంటి వడ్డీ లేకుండా 50 శాతం రాయితీతో మహిళలకు అందించే ఉద్యోగిని లోన్‌తోపాటు ముద్రా, పీఎంఈజీపీ, నేషనల్ లైవ్ స్టాక్, స్టార్ట్ అప్ ఇండియా తదితర పథకాల కింద రాయితీతో కేంద్రం అందిస్తున్న రుణాల గురించి వివరిస్తున్నారు.

-ఈనాడు, నిజామాబాద్ డెస్క్

(c) eenadu

కాణిస్తే సరి.. కాదంటే కొర్రీ

ఇబ్రహీంపట్నం మండలంలో తెదేపా గ్రామ స్థాయి నాయకుడు ఒకరు ఇటీవల ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసేందుకు వీఆర్వో దగ్గరకు వెళ్లారు. ఆయన మరో రెవెన్యూ అధికారితో మంతనాలు చేసి రూ.10 వేలు ఇస్తేనే ధ్రువపత్రమన్నారు. మీకెందుకు సొమ్ము ఇవ్వాలని సదరు నాయకుడు ప్రశ్నించగా ఇక్కడ ఇంతేనండి అని బదులిచ్చారు. నాయకుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి వ్యవహారం బయటపెట్టడంతో వారికి పత్రం ఇచ్చారు.

మొవ్వ మండలంలో ఓ రెవెన్యూ అధికారి కుటుంబ సభ్యుల ధ్రువపత్రం జారీలో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఆయన పరిధిలో ఏ దరఖాస్తు వచ్చినా కనీస పరిశీలన లేదు. రూ.10 వేల వరకు వసూలు చేసి విచారణ లేకుండా ఒక్క రోజులో పత్రం ఇస్తున్నారు. లొసుగులు ఉంటే రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. నెలలో పదుల సంఖ్యలో పత్రాలు జారీ చేస్తున్నారంటే దందా ఏపాటిదో తెలుస్తోంది.

ఈనాడు, అమరావతి



కుటుంబ సభ్యత్వ ధ్రువపత్రం జారీకి వసూళ్లు

ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్ జారీ.. ముడుపులిస్తేనే ఆమోద ముద్ర అన్నట్లు సాగుతోంది. కనీస పరిశీలన, విచారణ లేకుండా మామూళ్లు ఇవ్వడమే అర్హతగా వ్యవహారం సాగుతోంది. చాలా మంది తహసీల్దార్లు వెనకుండి.. వీఆర్వోలు, ఆర్ఐల ద్వారా కథ నడిపిస్తున్నారు. అడ్డగోలుగా జారీ చేస్తున్న పత్రాలతో ఆయా కుటుంబ సభ్యుల మధ్య అనేక వివాదాలు తలెత్తుతున్నాయి.

చాలా కీలకం...

మరణించిన వ్యక్తికి చెందిన ఆస్తులు, బీమా పొందడానికి మిగిలిన కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్ చాలా కీలకం. దరఖాస్తు చేశాక స్థానిక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో చుట్టుపక్కల వారిని, కుటుంబ సభ్యులను విచారణ చేయాలి. చనిపోయిన వారికి వీరు కాకుండా ఇతర వారసులు, ఉన్నారా లేదా అని పరిశీలించాలి.

★ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ★ కృష్ణా కలెక్టర్‌ను చరవాణి ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

వీరికి కాసులే ముఖ్యం..

ఇవేవి లేకుండానే ఆమ్యామ్యాలు తీసుకుని ఒక్క రోజులోనే ఇచ్చేస్తున్నారు. ఒక్కో పత్రానికి సవ్యంగా ఉంటే రూ.10 వేలు.. అవకతవకలు ఉంటే రూ.50 వేల వరకు దండుకుంటున్నారు. ఇందులో వీఆర్వోలు పాత్రధారులు కాగా తహసీల్దార్లు సూత్రధారులుగా కథ నడిపిస్తున్నారు. సొమ్ములో వాటాలు వేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితోనే దందా నడుస్తోందని ప్రజలు వాపోతున్నారు.

ఆయేషామీరా హత్య కేసు విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: సంచలనం సృష్టించిన ఆయేషామీరా హత్య కేసు విచారణను కోర్టు వాయిదా వేసింది. విజయవాడలో సీబీఐ కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో శుక్రవారం విచారణకు వచ్చింది. కోర్టు ఆదేశం మేరకు పునర్విచారణ నివేదికను మృతురాలి తల్లిదండ్రులకు అందజేశామని సీబీఐ తరఫు న్యాయవాది గోపీనాథ్ చెప్పారు. కేసు హైకోర్టు పరిధిలో ఉన్నందున.. అక్కడి నుంచి ఆదేశాలు రావాల్సి ఉందనీ, ఇందుకు విచారణ వాయిదా వేయాలని కోరారు. దీంతో సీబీఐ కోర్టు న్యాయాధికారి అన్నపూర్ణ.. తదుపరి విచారణను వచ్చే నెల 19కి వాయిదా వేశారు.

నిర్మాణ నిపుణత.. తరగని నాణ్యత



కంకిపాడు-గన్నవరం రహదారిపై రైవస్ కాలువపై వంతెనను 1939 అక్టోబరు 30న అప్పటి కృష్ణాజిల్లా బోర్డు అధ్యక్షుడు ఖాన్ బహదూర్ జమీందార్ ప్రారంభించారు. ఒక్కో వాహన గరిష్ఠ బరువు(సామర్థ్యం) 10 టన్నులు, రోజుకి 200 వాహనాల రాకపోకలు అంచనాతో నిర్మించారు. విజయవాడ నగరానికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం.. త్వరితగతిన అభివృద్ధి చెందడంతో ప్రస్తుతం రోజుకు 5వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు 50 టన్నుల బరువున్న రబ్బీష్, కంకర, ఇసుక టిప్పర్లు నిత్యం వందల సంఖ్యలో నడుస్తున్నాయి. అంటే నిర్ధారిత సామర్థ్యానికి ఐదు రెట్లు, వాహనాల సంఖ్య 25 రెట్లు పెరిగింది. వంతెన మనుగడ 50 ఏళ్లుగా అంచనా వేశారు. ఇప్పటి వరకు దాదాపు 5 కోట్ల వాహనాలు రాకపోకలు సాగించాయని అంచనా. శిథిలావస్థకు చేరడంతో గత 20 ఏళ్లుగా ప్రత్యామ్నాయ వంతెన నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. నాటి ఇంజినీరింగ్ నిపుణత, నిర్మాణంలో నాణ్యతతోనే ఇంతకాలం నిలిచిందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

\- న్యూస్‌టుడే, కంకిపాడు



నమోనమామి.. సదాస్మరామి

ప్రధాన కూడళ్ల, రహదారుల పక్కన స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నాయకులు, రాజకీయ నాయకుల విగ్రహాలు ఉండడంతో ట్రాఫిక్‌కు అడ్డంకిగా … ఉన్న నేపథ్యంలో నూతన ఆలోచనతో నందిగామలోని గాంధీ సెంటర్లో అన్ని విగ్రహాలను ఒకే చోటకు చేర్చారు. ఈ కూడలిలో ఒక ప్రత్యేక వేదిక నిర్మించి రాకపోకలు సాగించే వారందరికీ కనిపించేలా ఎన్టీఆర్, అబ్దుల్ కలాం, ఇందిరా గాంధీ, డా.బి.ఆర్.అంబేడ్కర్, భగత్‌సింగ్ తదితర పదిమందికి పైగా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. - ఈనాడు, అమరావతి

నవయువ రాకెట్టు.. గగనాన మెరిసేట్టు..

❖ అంతరిక్ష ప్రయోగాలపై విద్యాలయాల్లో ఆసక్తి పెంపు

ఈనాడు, అమరావతి: అంతరిక్షం... అంతుపట్టని బ్రహ్మ పదార్థం.. ఎన్నో ఆసక్తుల సమ్మేళనం.. పిల్లలకైతే ఎంతో తెలుసుకోవాలన్న ఉత్సుకత. సరైన అవగాహన లేకపోవడం, మార్గనిర్దేశకత్వం చేసేవారు లేక ఈ రంగాన్ని ఎంచుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు అమరావతిలోని విద్యాలయాలు ముందడుగేస్తున్నాయి. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై దృష్టి పెట్టాయి. ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలు సహా ఇస్రో సహకారంతో విద్యార్థుల్లో అంతరిక్షంపై ఆసక్తి పెంచుతున్నాయి.

వారే స్ఫూర్తి



సూక్ష్మ ఉపగ్రహాలతో రూపకర్తలు

నాలుగేళ్ల క్రితం వర్జిన్ గెలాక్టిక్ యూనిటీ వ్యోమనౌక ద్వారా అంతరిక్షంలోకి వెళ్లిన భారత సంతతి మహిళగా చరిత్ర సృష్టించారు గుంటూరు బిడ్డ శిరీష బండ్ల. తెనాలికి చెందిన దివ్య సూక్ష్మ ఉపగ్రహాల తయారీలో ప్రతిభ చూపి భళా అనిపించారు. గుంటూరులో స్థిరపడిన కడపవాసి హర్షవర్ధన్ నాసాలో కొలువు సాధించి ప్రశంసలందుకున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకున్న విద్యార్థులను విద్యాలయాలు ప్రోత్సహిస్తున్నాయి. అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఎగ్జిబిషన్స్‌తోపాటు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తోంది. వాతావరణంలో వస్తున్న మార్పులు, అంతరిక్ష పరిశోధనలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీలు చేయిస్తోంది.

❖ కేఎల్‌యులో ఇప్పటికి 11 ఫెమ్టో శాటిలైట్స్‌ను సిద్ధం చేశారు. లాంచ్ చేయడానికి ఇస్రో, కొన్ని ప్రైవేటు అంతరిక్ష పరిశోధనా సంస్థలతోనూ సంప్రదింపులు జరుపుతున్నారు. సౌండింగ్ రాకెట్స్ స్లాట్స్ కోసం వేచి ఉన్నారు. ఎస్ఈసీ కళాశాల విద్యార్థులు గతంలో మినీ రాకెట్ చేసి ప్రయోగించారు.

ఉపగ్రహ ప్రయోగాల్లో...

కేఎల్ యూనివర్సిటీ రెండేళ్ల క్రితం కేఎల్ శాట్ ప్రయోగం చేపట్టగా.. ఈ ఏడాది ఒకేరోజు కేఎల్‌శాట్-2, క్యాన్‌శాట్, కేఎల్ జాక్.. ఉపగ్రహాలను నింగిలోకి ప్రయోగించింది. ఫెమ్టో శాటిలైట్స్ తయారీపై దృష్టి పెట్టింది. కిలోకంటే తక్కువ బరువున్న అతి చిన్న ఉపగ్రహాలే ఈ ఫెమ్టోస్. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాన్ని పొందే ఉద్దేశంతో వీటి తయారీపై ఆసక్తి చూపుతున్నారు.

ఇస్రో కార్యక్రమాలివే..



స్పేస్ ఆన్ వీల్స్ పేరుతో ప్రత్యేక వాహనాన్ని విద్యార్థుల వద్దకే తీసుకొస్తోంది ఇస్రో. ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను దత్తత తీసుకుని ప్రోత్సహిస్తోంది. అమరావతి పరిధిలో ఆర్‌వీఆర్‌జేసీ, విజ్ఞాన్, విట్ ఏపీ, ఎస్ఈసీ.. ఇలా అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు.. విశ్వవిద్యాలయాల్లో ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఆర్వీఆర్ జేసీలో అంతరిక్ష వారోత్సవాలు

23న జిల్లా అండర్- 12 క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 23న స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో జిల్లా అండర్- 12 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘ కార్యదర్శి ఎం.రవీంద్ర చౌదరి తెలిపారు. సెప్టెంబరు ఒకటి, 2013 తర్వాత ఆగస్టు 31, 2015 లోపు పుట్టిన వారు ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువపత్రంతో పాటు సొంత కిట్‌తో అదే రోజు ఉదయం 8 గంటలకు స్టేడియంలోని జిల్లా క్రికెట్ సంఘ కార్యాలయం వద్ద హాజరవ్వాలని ఆయన సూచించారు.

ఇంట్లో పత్తి.. కంట్లో కత్తి

"వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సీసీఐ.. పత్తి కొనుగోలు చేయడం లేదు. వేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాల్సిన సీసీఐ మొహం చాటేస్తుంది. ఈ పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో అమ్మితే కూలీల ఖర్చులూ రావని పత్తి తీయకుండానే పొలంలోనే దున్నేస్తున్నారు. ధరపై ఆశతో ఇళ్లల్లో నిల్వ చేసిన వారికి దిక్కుతోచకుంది. మంత్రి అచ్చెన్నాయుడు నిబంధనలు సడలించి పత్తి కొనాలని కేంద్రానికి నివేదించారు. నిబంధనలు మారిస్తేనే కొంటామనీ. లేకుంటే కుదరదని బయ్యర్లు స్పష్టం చేస్తున్నారు."

యార్డుల్లో కొనుగోళ్లు బంద్

న్యూస్‌టుడే, నందిగామ, పెనుగంచిప్రోలు

జిల్లాలో ఖరీఫ్‌లో 77 వేల ఎకరాల్లో సాగుచేశారు. నందిగామ, జగ్గయ్యపేటల్లోనే 45 వేల ఎకరాలు ఉంది. అధిక వర్షాలతో దిగుబడి బాగా తగ్గింది. మొంథా తుపానుతో చేతికొచ్చిన పత్తి పొలంలోనే తడిసి నాణ్యత దెబ్బతింది. ఈతరుణంలో నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, మైలవరం, గంపలగూడెం ఏఎంసీల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. నందిగామ యార్డులో కేవలం 400 క్వింటాళ్లు కొన్నారు. జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం యార్డుల్లోనూ కొనుగోళ్లు అంతంతే.



నందిగామలో గడప దాటని నిల్వలు

యార్డులో కొనం.. గుంటూరు రండి.. నందిగామ యార్డులో పత్తి కొనమని సీసీఐ బయ్యర్ తేల్చిచెప్పారు. సీసీఐ నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని పత్తి తీసుకోమన్నారు. గుంటూరులో జిన్నింగ్ మిల్లుకు తెస్తే తీసుకుంటామని అదే బయ్యర్ చెప్పడం విశేషం. అక్కడి వరకు వెళ్లాలంటే బోరానికి రూ.450 భరించాల్సిందే. అంతేనా.. నాణ్యత లేదని క్వింటాకు 5, 6 కిలోల తరుగు తీసి.. ధరలోనూ కోత విధిస్తున్నారు. క్వింటా మద్దతు ధర రూ.8,110 ఉంటే రైతుకు దక్కేది రూ.6,500 మాత్రమే. ఇలా నందిగామ బయ్యర్ గుంటూరులో 3,200 క్వింటాళ్లు కొన్నారు. బయ్యర్ తిరస్కరిస్తే గుంటూరు దాకా వెళ్లినా.. వెనక్కి తెచ్చుకోలేక.. అక్కడే క్వింటా రూ.5-6 వేలకు అమ్ముకోవాల్సిన దుస్థితి.

స్లాట్లు బయ్యర్ల చేతుల్లోనే..

సీసీఐకి పత్తి అమ్మాలంటే 'కిసాన్ కపాస్' యాప్‌లో స్లాట్ బుక్ చేయాలి. ఆ తేదీల్లోనే పత్తి తీసుకెళ్లాలి. ఇవన్నీ బయ్యర్ల చేతుల్లో ఉండటంతో స్లాట్‌లు ఓపెన్ చేయట్లేదు. వారి ఇష్టారీతితో అన్నదాతలు దిక్కుతోచక విపణిలో తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. క్వింటా పత్తితీతకు కూలీలకు రూ.3 వేలవుతుంది. అమ్మితే కూలీ ఖర్చులూ రాక పత్తి దున్నేస్తున్నారు.

వెలుగుల ఖిల్లా.. విలవిల్లా!

"కొండపల్లి ఖిల్లాపై గత తెదేపా జమానాలో రూ.6 కోట్లతో లేజర్‌షో, త్రీడీ ప్రొజక్షన్ మ్యాపింగ్ సమకూర్చారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన యంత్ర పరికరాలను వైకాపా ఏలుబడిలో గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రొజెక్టర్లు, యంత్రాలను రూ.6 లక్షలతో బాగుచేయించింది."

"లేజర్‌షో బాగానే సాగుతున్నా.. మొంథా తుఫాను దెబ్బకు మళ్లీ ఆగింది. మూడు ప్రొజెక్టర్లలో రెండు పని చేస్తుండగా, ఒకటి పాడైంది. పర్యాటకులకు అద్వితీయ అనుభూతినిచ్చే ప్రదర్శనను దరిచేర్చేలా.. త్వరగా మరమ్మతులు చేయించాలనే విజ్ఞప్తులు వస్తున్నాయి."



చక్కదిద్దితే పూర్వవైభవమే...!

ఈనాడు, అమరావతి: కొండపల్లి ఖిల్లాకు.. రూ.10.90 కోట్లతో గత తెదేపా ప్రభుత్వంలో అధునాతన సౌకర్యాలను కల్పించారు. కోటను పాలించిన రాజులే.. స్వయంగా వచ్చి.. తమ చరిత తెలిపేలా.. ఆగ్‌మెంటెడ్ రియాలిటీతో ఏర్పాట్లు చేశారు. కోట గోడలపై నిత్యం ప్రదర్శించే.. లేజర్ షో, త్రీడీ ప్రొజక్షన్ మ్యాపింగ్ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని సమకూర్చారు. శిథిలమైన కోట గోడలు, గదులను.. పూర్వం ఏ పదార్థాలను వాడి కట్టారో వాటితోనే బాగుచేశారు. గానుగ సున్నం, బెల్లం, కరక్కాయ నీళ్లను కలిపి నానబెట్టగా వచ్చిన మెటీరియల్‌తో బాగుచేశారు. బెల్లం ఊట, కలబంద, గోగునారలతో కలిపిన మిశ్రమంతో.. అలనాటి రూపాన్ని తెచ్చారు.

సాంకేతిక నిపుణుల కొరత...

జర్మనీ.. అధునాతన, సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన ప్రదర్శన ఇది. దీనికి మరమ్మతులు చేసే నిపుణులు ఇక్కడ లేరు. వారిని దిల్లీ, హైదరాబాద్ నుంచి తేవాలి. అందుకే చిన్న మరమ్మతులొచ్చినా.. నెలలుగా ప్రదర్శన ఆగిపోతోంది. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో నిపుణులను తెచ్చి మరమ్మతులు చేయిస్తామని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

అధునాతన సౌకర్యాలు.. కోటను రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామని 2019లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పురావస్తు, పర్యాటక శాఖ, కలెక్టర్ నేతృత్వంలో కొండపల్లి ఫోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ పెడతామన్నారు. ఇప్పటికే లేజర్‌షోను 500 మంది కూర్చుని తిలకించేలా తీర్చిదిద్దారు. రాజుల జ్ఞాపకాలు, నాటి గుర్తులు, పెయింటింగ్స్‌ను.. గ్యాలరీల్లో భద్రపరిచారు. దర్బార్‌హాల్ గ్యాలరీని సెంట్రల్ ఏసీ, వైఫైతో అనుసంధానించారు. ఖిల్లాకు ప్రత్యేక యాప్ తయారుచేసి.. గూగుల్ ప్లేస్టోర్‌లో పెట్టారు. యాప్ డౌన్‌లోడ్ చేసి పెయింటింగ్స్ స్కాన్ చేస్తే.. నాటి రాజులే చరితను చెప్పే ఏర్పాట్లు చేశారు.

బీఎస్ఎన్ఎల్ 'వాయిస్ ఓవర్ వైఫై' సేవలు ప్రారంభం

విజయవాడ (చుట్టుగుంట), న్యూస్‌టుడే : బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆ సంస్థ సీఎండీ ఎ.రాబర్ట్ జెరార్డ్ రవి సూచించారు. విజయవాడ చుట్టుగుంటలోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రంలోని పలువురు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సంస్థ 'వాయిస్ ఓవర్ వైఫై' సేవలను లాంఛనంగా ప్రారంభించారు. దీనిద్వారా వినియోగదారులు ఏదేని ప్రదేశంలో టవర్ నెట్‌వర్క్ లేనప్పటికీ, అక్కడ ఉన్న వై-ఫై జోన్ ఆధారంగా వాయిస్ కాల్స్ చేసుకోవచ్చని చెప్పారు. స్వదేశీ 4జీ సేవలు ప్రారంభమైన తర్వాత తీసుకోవాల్సిన చర్యలు తెలిపారు. ఆకర్షణీయమైన టారిఫ్‌లతో మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. ఫైబర్ సేవలు పొందుతున్న కార్పొరేట్ సంస్థలను కలిసి.. వారికి టెలికామ్ సేవలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం విజయవాడ నుంచి అమరావతి రోడ్డు మార్గంలో నెట్‌వర్క్‌ను పరిశీలించి... పలు సూచనలు చేశారు. సర్కిల్ సీజీఎంటీ ఎం.శేషాచలం, అధికారులు పాల్గొన్నారు.

WALK-IN-INTERVIEW
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED
REQUIRES ASSISTANTS IN BUSINESS DEVELOPMENT CUM RECOVERIES, ACT ASST., COMPUTER OPERATOR, BID PAYABLE ASST. & OFFICE BOY FOR OUR PROPOSED NEW BRANCH AT JAGGAIAHPET
BUSINESS DEVELOPMENT CUM RECOVERIES ASSISTANTS & BID PAYABLE ASST:
Male graduates with pleasing personality below 30 years with 2/3 years of experience in relevant fields. Candidates having valid two wheeler driving licence are preferred. The above posts are mainly field oriented. Experience in chit fund/ financial institutions will be given preference.
Act Asst. & Computer Operator:
The Candidate should be graduate and below 30 years of age with either B.Com. (General) or (Computers) and should have thorough knowledge of accounts, computers and good communication skills.
OFFICE BOY -1 POSITION:
SSC Passed male candidate with pleasing personality below 30 years of age.
Note: The selected candidates will have to undergo training at our Vijayawada branch for about 1 to 2 months in all areas of operations of chit fund transactions and thereafter will be posted at our proposed new branch at Jaggaiahpet.
Please attend WALK-IN-INTERVIEW ON 23rd November, 2025 (SUNDAY) AT OUR VIJAYAWADA BRANCH from 10.30 A.M. to 2.00 P.M. alongwith latest Resume, xerox copies of certificates/ testimonials, recent colour passport size photographs and copy of Pan Card, Aadhaar card & Bank passbook first page at the following address:
The Senior Branch Manager,
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED.
1st Floor, Ammanna Estates, Museum Road, Governorpet, VIJAYAWADA - 520002, A.P
Phone No. 0866-2433270 / 2432870 / 2435280.

బంకుల్లో సౌకర్యాలు ఉచితం గురూ..!

ఇవ్వకుంటే ఫిర్యాదు చేయచ్చు


ఈనాడు, అమరావతి: బంకుల్లో పెట్రోలు కొట్టించుకునే వారిలో చాలా మందికి అక్కడ నిర్వాహకులు కల్పించాల్సిన సౌకర్యాలపై అవగాహన ఉండదు. దీన్ని ఆసరాగా చేసుకుని నిర్వాహకులు వాటికి ఎగనామం పెట్టేస్తుంటారు. అడిగినా పట్టించుకోరు.. ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక.. ఏం చేయలేక చాలా మంది మదన పడుతుంటారు. ఇంకెందుకు ఆలస్యం తెలుసుకుందాం పదండి..



బంకుల్లో ఎలక్ట్రానిక్ ఎయిర్ ఫిల్ యంత్రం ఉండాలి. దాని ద్వారా ఉచితంగా వాహనాల్లో గాలి నింపాలి. ఇందు కోసం ప్రత్యేకంగా ఓ ఉద్యోగి విధుల్లో ఉండాలి. ఇంధనం పోయించుకున్న వారికే ఉచితంగా గాలి పెడతారని చాలా మందికి అపోహ ఉంది. ఏ వాహనానికైనా నింపాల్సిందే. ఈ నిబంధనల తెలియక చాలా మంది మెకానిక్‌ల వద్ద గాలి నింపినందుకు రూ.20-30 ఖర్చు చేస్తున్నారు.



వినియోగదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలి. చాలా దుకాణాల్లో ఉదయం ఒక బాటిల్ పెట్టి నీరు అయిపోయాక మళ్లీ పెట్టకుండా వదిలేస్తున్నారు. పెట్రోల్ బంకు పనిచేస్తున్నంత సేపు తాగునీరు అందుబాటులో ఉంచాలి.



అత్యవసర సమయం, లేదా ప్రమాదాలు సంభవించినప్పుడు బంధువులు, అవసరమైన వ్యక్తులకు ఫోన్ చేసుకునేందుకు బంకుల్లో ఫోన్ సదుపాయం ఉండాలి.

వినియోగదారులకు ఉచిత మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. వాటిని శుభ్రంగా ఉంచాలి.

ప్రమాదాలు, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో బంకుల్లో తప్పనిసరిగా ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలి.



ఇంధనం నింపే వేళ లేదా ఇతర సమయాల్లో మంటలు రేగితే అదుపునకు అగ్నిమాపక పరికరాలు ఉండాలి. నిర్వాహకులు, ఏజెన్సీ వివరాలు, ఫోన్‌నంబర్లు ప్రదర్శించాలి.

ఇలా చేయవచ్చు.. ఉమ్మడి జిల్లాలో 340 పెట్రోల్ బంకులున్నా 70శాతం పైగా నిబంధనల ఊసేలేదు. ఇబ్బందులను జీవీ పోర్టల్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో లేదా మండల, జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా తహసీల్దార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి, సదరు ఏజెన్సీకైనా ఫిర్యాదు చేయవచ్చు.

ఇన్నోవేషన్ హబ్‌తో పారిశ్రామిక నైపుణ్యాలు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పారిశ్రామిక నైపుణ్యాలు, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)తో ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం అగిరిపల్లి సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల శుక్రవారం ఒప్పందం చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, ఆర్‌టీఐహెచ్ సీఈవో జి.కృష్ణన్ సమక్షంలో కళాశాల ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలను ప్రయోగాత్మక పరిష్కారాలుగా మార్చేందుకు ఇన్నోవేషన్ హబ్ తోడ్పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సి.నాగభాస్కర్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆవిష్కరణలు, సమస్యల పరిష్కారం, స్టార్టప్ స్ఫూర్తి, పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించే దిశగా పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, ఆర్‌టీఐహెచ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రం చూపుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా, ఆర్‌టీఐహెచ్ సీఈవో కృష్ణన్, ప్రిన్సిపల్ నాగభాస్కర్ తదితరులు

మావోల... ఉనికిపాట్లు!

ఇరుగుపొరుగుతో మాటల్లేవ్
నెలలుగా ఇళ్లకే పరిమితం..

"అడవుల నుంచి జనారణ్యంలోకి వచ్చిన మావోయిస్టులు.. ఎక్కడా తమ ఉనికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కనీసం ఇరుగుపొరుగుతో మాటలైనా కలపకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. రాకపోకల వేళ అప్రమత్తంగా ఉండేవారు. పక్కఇళ్ల వారు.. వీరితో మాట్లాడబోయినా ఆసక్తి చూపేవారు కాదు."

\- ఇదీ.. ఇటీవల విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో అరెస్టయిన మావోల వ్యవహార శైలి. వీరు మావోయిస్టులని తెలుసుకుని హడలిన స్థానికులు.. పోలీసులొచ్చి వారిని అదుపులోకి తీసుకునే దాకా తమకు విషయం తెలియదని 'ఈనాడు'కు వివరించారు.

ఈనాడు, అమరావతి

రామవరప్పాడు రైల్వేస్టేషన్ ఆనుకుని ఉన్న వీధిలో.. రైవస్ కాలువ ఒడ్డున ఓ రేకుల ఇంటిని రెంగు, మంగి అద్దెకు తీసుకున్నారు. విద్యుత్తు శాఖలో లైన్‌మెన్‌గా పనిచేసి రిటైరైన మధుసూదన్‌రావు ఇంట్లో ఆగస్టులో చేరారు. ఇద్దరికీ తెలుగు రాదనీ.. హిందీలోనే మాట్లాడేవారని తెలిసింది. ఈ ఇంటికి తరచూ మరో ఇద్దరు వచ్చేవారు. తెలుగు మాట్లాడే వ్యక్తి.. ఇంటికి కూరగాయలు, నీటి క్యాన్లను తెచ్చిచ్చేవాడు. దుస్తులు ఉతకడానికే మంగి బయటకు వచ్చేది. మిగిలినవేళ ఇంట్లోనే ఉండేది. కిటికీ తలుపు మాత్రమే తీసి బయటకు చూసేదని తెలిసింది.



ప్రసాదంపాడులో రైలు పట్టాల పక్కన ఇల్లు


ఇంట్లోనే ఉన్నా.. బయట తాళం .. తొలుత.. ఇంటి అద్దె ఫోన్‌పే చేశారనీ, తర్వాత నగదుగా ఇచ్చేవారని చెబుతున్నారు. ఇంటి యజమాని వచ్చినా లోపలకు పిలిచేవారు కాదు. మావోయిస్టు రెంగు బయటకు వెళ్లేటప్పుడు మంగిని ఇంట్లోనే ఉంచి బయట తాళం వేసేవాడు. ద్విచక్ర వాహనం ఇంటి వద్ద కాకుండా దూరంగా ఆపేవారు. స్థానికులు గుచ్చిగుచ్చి అడిగితే.. తాము రోడ్డు పనుల కాంట్రాక్టు తీసుకున్నామనీ.. పర్యవేక్షణకు వచ్చామని చెప్పేవారు. మంగి గురించి అడిగితే.. ఆమె తమ యజమాని భార్య అనీ.. ఆయన రాత్రుళ్లు వస్తుంటాడని చెప్పేవారు.



రామవరప్పాడులోని ఇంటి లోపల భాగం

భర్త చనిపోయాడని నమ్మించి..

ప్రసాదంపాడులో రైలు పట్టాల పక్కన ఇంట్లో మొదటి అంతస్తులో మూడు నెలల కిందట మావోలు చేరారు. నెలకు రూ.5,500 అద్దెకు మాట్లాడి.. నెల అడ్వాన్సు ఇచ్చారు. ఈ ఇంట్లో చిన్మయ్ అలియాస్ మనీలా ఉండేది. ఇద్దరు మావోయిస్టులు వచ్చి.. ఆమె తమ చెల్లెలనీ.. భర్త చనిపోయాడని.. చాలా కష్టాల్లో ఉందని యజమానిని నమ్మించారు. తాము బదిలీపై వెళ్తున్నామని.. తమతో తీసుకెళ్లడానికి అత్తమామలు అంగీకరించలేదని. అందుకే ఇల్లు తీసుకుని ఉంచుతున్నామని చెప్పారు.



(c) eenadu

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు


గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిటీ సభ్యులు

పాయకాపురం, న్యూస్‌టుడే : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ-పీఎన్‌డీటీ) చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. సమన్వయ శాఖల అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ- సరోగసీ చట్టాల అమలుపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో లింగ నిర్ధారణలపై ఫిర్యాదులు వస్తే, త్వరితగతిన విచారించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమం, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. కొత్తగా స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్‌లకు 12, రెన్యూవల్ 13, మార్పుల చేర్పులకు 19 చొప్పున దరఖాస్తులు రాగా.. కమిటీ పరిశీలించిందని చెప్పారు. వాటిపై చర్చించి ఆమోదించినట్లు తెలిపారు. సరోగసీకి సంబంధించి నాలుగు దరఖాస్తులకు ఆమోదం తెలిపామని వివరించారు. సుఖ ప్రసవానికి యోగాసనాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. యోగాసనాల ప్రచార పత్రాలను కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఆడ పిల్లలను రక్షించాలని తెలిపే గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మి, డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దివ్యదీపం.. భవ్య తేజం


నదిలో దీపాలు వదులుతున్న మహిళలు, యువతులు




దుర్గాఘాట్‌లో జల్లు స్నాన మాచరిస్తున్న భక్తులు

దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో అరటి దొప్పల్లో దీపాలను వదిలిన మహిళలు అనంతరం దుర్గమ్మను దర్శనం చేసుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.
- ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
దూదేకుల/ నూర్ భాషా కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు దూదేకుల/ నూర్ భాషా కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, దూదేకుల/ నూర్ భాషా కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (22 & 23 నవంబరు 2025)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 83744 45190
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

పోటీలతో వెలుగులోకి ప్రతిభ


పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు అవసరమని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో 22 నుంచి 24 వరకు ఆంధ్రా చెస్ సంఘం, స్టెల్లా కళాశాల వ్యాయామ విద్య విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఏపీ ఓపెన్ ఇంటర్నేషనల్ బిలో 1800 ఫిడే చెస్ టోర్నీ'ని శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తలపడే అవకాశాలను పెంపొందించడంలో ఉపయోగపడే కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. అనంతరం కాసేపు చెస్ ఆడారు. కార్యక్రమంలో ఆంధ్ర చెస్ సంఘం సీఈవో కేవీ శర్మ, స్టెల్లా కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నయమ్మ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పోరుబాట


పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నిరసనకారులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : దేశంలో ఓటర్ల జాబితా అవకతవకలు, బాజాపా, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఏఐసీసీ పిలుపు మేరకు యువజన కాంగ్రెస్ చేపట్టిన చలో ఎన్నికల సంఘం కార్యాలయం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఆంధ్ర రత్న భవన్ నుంచి నాయకులు ఎన్నికల సంఘం కార్యాలయానికి బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ప్రదర్శనకు అనుమతి లేదని నిలువరించారు. నాయకులు ముందుకు దూసుకువెళ్లేందుకు ప్రయత్నించగా.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసుల వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కొద్ది సేపటి తర్వాత వేరే మార్గం ద్వారా వెళ్లిపోయి మహాత్మా గాంధీ రోడ్డులోని 'హెచ్‌డీఎఫ్‌సీ భవన సముదాయం' వద్దకు చేరుకున్నారు. అక్కడ బైఠాయించి నినాదాలు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి.. కార్యాలయంలోకి వెళ్లనీయలేదు. యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, కార్యదర్శి మమతా నాగిరెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడారు. మోదీ దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని దుయ్యబట్టారు. బాజాపా దుర్మార్గపు పాలన కొనసాగిస్తోందని, కేంద్ర ఎన్నికల సంఘం నరేంద్ర మోదీ ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించి వినతిపత్రం ఇస్తామంటే పోలీసులు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, జిల్లా అధ్యక్షుడు పీటర్ జోసెఫ్, ఇతర జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాలకు నేరుగా విమాన సర్వీసులు నడపాలి


లేఖలు చూపుతున్న బొండా ఉమ

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: గన్నవరం విమానాశ్రయం నుంచి దుబాయ్, దోహాలకు నేరుగా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకి లేఖలు రాశారు. శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు గన్నవరం విమానాశ్రయం నుంచి 1.39 కోట్ల ప్రయాణాలు నమోదైనట్లు తెలిపారు. గల్ఫ్ దేశాలకు నేరుగా విమానాలు లేకపోవడంతో హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోందన్నారు. హైదరాబాద్‌లో రాత్రి సమయంలో దిగడం వల్ల అదనపు ప్రయాణం, రాత్రి బసకు.. వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విజయవాడ, గుంటూరు, అమరావతి, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల ప్రజలకు గన్నవరం విమానాశ్రయం అత్యంత సౌకర్యమని చెప్పారు. విజయవాడ నుంచి దుబాయ్, దోహాలకు నేరుగా వెళ్లేలా సర్వీసులు పరిశీలించాలని కోరారు. హైదరాబాద్ మార్గం ద్వారా వెళ్లే ప్రయాణికుల డేటాను సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఎమిరేట్స్, ఫ్లై దుబాయ్, ఖతార్ ఎయిర్‌వేస్, ఇండిగో, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వంటి ఎయిర్‌లైన్స్‌తో చర్చలు జరపాలని కోరారు. గల్ఫ్ దేశాల ప్రయాణాలు అందుబాటులోకి వస్తే రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ ప్రయాణం సులభతరమవుతుందని, టూరిజం అభివృద్ధి చెందుతుందని ఉమ వివరించారు.

భక్తులకు గాజుల ప్రసాదం పంపిణీ


గాజులు పంపిణీ చేస్తున్న సిబ్బంది, పక్కన ఛైర్మన్ రాధాకృష్ణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తికమాసం ముగింపు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనం చేసుకున్న మహిళలకు గాజుల ప్రసాదాన్ని దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం పంపిణీ చేశారు.

కార్తిక మాస వేడుకలు ముగింపు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై పూర్ణాహుతి క్రతువుతో నెల రోజులుగా నిర్వహిస్తున్న కార్తికమాసం వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. నెల రోజుల పాటు శివయ్య మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దీపార్చన, ఆదిదంపతులకు ఊంజల్ సేవలను అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, మాల ధరించిన భక్తులు దుర్గామల్లేశ్వరులను దర్శించుకున్నారు. యాగశాల ప్రాంగణంలో దుర్గగుడి ఛైర్మన్ బుర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దంపతులతో స్థానాచార్య ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కలశ ఉద్వాసన చేశారు. పాలకమండలి సభ్యులు ధర్మారావు, రాఘవ రాజు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు పాల్గొన్నారు.

నలుగురు సెక్యూరిటీ సిబ్బంది తొలగింపు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని దేవస్థానం అధికారుల ఆదేశాల మేరకు ఏజెన్సీ నిర్వాహకులు శుక్రవారం తొలగించారు. సెక్యూరిటీ సిబ్బంది రాజేష్ నాయక్, రమేష్ నాయక్, శ్రీధర్, సాయికుమార్‌లపై చర్యలు తీసుకున్నారు. వ్యక్తిగత విభేదాలు దేవస్థాన ప్రతిష్ఠ దెబ్బతినకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఈవో శీనానాయక్ ఏజెన్సీ నిర్వాహకులను సూచించడంతో చర్యలు తీసుకున్నారు. వారిని విధుల నుంచి తొలగించారు. విచారణ పూర్తి అయిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని ఈవో పేర్కొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్లు

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే: ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ జోన్-2 పరిధిలో గల 7 జిల్లాలలోని 27 ఖాళీ స్థలాలకు 15 ఏళ్ల కాల వ్యవధితో ఓఎస్-15 స్కీం ద్వారా వ్యాపార నిమిత్తం అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ఏపీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్ www.apsrtc.ap.gov.inను చూడాలన్నారు.

టెండర్లను ఆహ్వానించిన ప్రాంతాలు: ★ తూర్పు గోదావరి జిల్లాలో అనపర్తి, కొవ్వూరు-2, రామచంద్రపురం ★ ఏలూరులో కలిదిండి-2 ★ పశ్చిమ గోదావరి ఆకివీడు, తాడేపల్లిగూడెం, ★ కాకినాడలో కాకినాడ-4 పెద్దాపురం, తుని, నార్త్ సైడ్ ★ కోనసీమలో మండపేట, అంబాజీపేట ★ కృష్ణాజిల్లాలో పామర్రు, నాగాయలంక, ఉంగుటూరు, ఉయ్యూరు ★ ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట-3, నందిగామ, తిరువూరు-3, విస్సన్నపేటలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

25న ఆర్బీఐ పూర్వ గవర్నర్ దువ్వూరి రాక

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ప్రముఖ ఆర్థికవేత్త, భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఈ నెల 25న సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించే ప్రత్యేక ప్రసంగానికి హాజరవుతారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేశ్ అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25న జరిగే కార్యక్రమంలో నాయకత్వ పాఠాలపై దువ్వూరి ఉపన్యాసం చేస్తారని, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛాన్సలర్, భారత మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఆత్మూరి ప్రశాంత్, బిజినెస్ బోర్డు అమరేందర్, కోశాధికారి దాసరి మురళీమోహన్ మాట్లాడుతూ.. డిసెంబరు 21, 22 తేదీల్లో కళాశాల స్వర్ణోత్సవ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ పాల్గొని సమ్మేళనం విజయవంతం చేయాలని, మరిన్ని వివరాలకు 94941 33447, 98482 44552 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ₹ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

రైల్వే సొత్తు చోరీ కేసులో ఏడాది జైలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్వే సొత్తు చోరీ చేసిన కేసులో ఆరుగురు నిందితులకు జైలు శిక్ష విధించారు. ఈ కేసులో ఒక రైల్వే ఇంజనీరు కూడా ఉండడం గమనార్హం. 2022 డిసెంబరు 9న రాజమహేంద్రవరంలో రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి వద్ద రైల్వేకు సంబంధించి 20 పాత ఐరన్ ఛానల్స్ తీసి కొత్త వాటిని వేశారు. అయితే పాత వాటిని చోరీ చేశారు. రూ.37 వేల విలువ చేసే రైల్వే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు కర్రి మోహన్‌బాబు, కుంపట్ల లక్ష్మణరావు, ఎన్.నాగేశ్వరరావు, కంచశెట్టి మణిసాయి, చిలకలపూడి కోటేశ్వరరావుతో పాటు రైల్వే జూనియర్ ఇంజినీర్ ఎం.చిన్న మల్లయ్యలపై రాజమహేంద్రవరం ఆర్పీఎఫ్‌లో సీఐ సైదయ్య కేసు నమోదు చేశారు. మొత్తం 12 మంది సాక్ష్యులు, పత్రాలను పరిశీలించి రైల్వే ఆస్తిని స్వాధీనం చేసుకొని కోర్టు ముందు హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఏడాది జైలు శిక్షణ విధిస్తూ శుక్రవారం రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.శర్మ తీర్పు చెప్పారు. కోర్టు కోరినప్పుడు వారిని ప్రొబేషనరీ అధికారి పర్యవేక్షణలో ఉంచాలని తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ఆర్పీఎఫ్ పీపీ టి.మురళి వాదనలు వినిపించారు.

మితిమీరిన వేగానికి ఐటీ ఉద్యోగి బలి


వరప్రసాద్ (పాత చిత్రం)

హైదరాబాద్, న్యూస్‌టుడే: నిబంధనల ఉల్లంఘన, అతివేగానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడు. పోచారం ఐటీకారిడార్ సీఐ రాజు వర్మ వివరాల ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన బోసుకొండ వరప్రసాద్(29) రెండేళ్లుగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మల్కాజిగిరిలో స్నేహితుడు రూపేశ్‌తో కలిసి ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై మల్కాజిగిరికి వెళ్తుండగా వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి జోడిమెట్ల వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన గ్యాస్ ట్యాంక్ లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి.. అతని వద్ద ఉన్న స్నేహితుడి ఫోన్ నంబరుకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఏడాదిన్నర వయసున్న పాప ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భవతి కావడంతో విజయవాడలోని అత్తామామ వద్ద ఉంటుంది. వారు విజయవాడ నుంచి నగరానికి బయల్దేరారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

APSRTC
టెండరు ప్రకటన

విజయవాడ జోన్-2 పరిధిలో గల 7 జిల్లాలలోని 27 ఖాళీ స్థలములు 15 సంవత్సరాల కాల వ్యవధితో వ్యాపార నిమిత్తం అద్దె ప్రాతిపదికన కేటాయించుటకు టెండర్లు పిలువడమైనది. (1) Schedule Download : Start Date & Time : 22.11.2025, 10:30 hrs, End Date & Time : 08.12.2025, 17:00 hrs. (2) Tenders submission Date & Time (Off-line) : 09.12.2025, 10:30 hrs to 14:00 hrs, & Tenders Opening Time (Off-line): 15:00 hrs, at Executive Director's Office, Vijayawada, (3) ప్రీ బిడ్ మీటింగ్ తేది. 27-11-2025న ఉ.10.30 గం.లకు జిల్లా ప్రజారవాణా అధికారి వారి కార్యాలయం, రాజమహేంద్రవరం నందు, తేది.28-11-2025న ఉ.10.30 గం.లకు జిల్లా ప్రజారవాణా అధికారి వారి కార్యాలయం, ఏలూరు నందు మరియు తేది.29-11-2025న ఉ.10.30 గం.లకు మెయిన్ కాన్ఫరెన్స్ హాలు, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, విజయవాడ నందు నిర్వహించబడును. (4) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ : www.apsrtc.ap.gov.in లో Tenders ను చూడగలరు. (5) ఏదేని కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

T.No.:797(10)/OS-15 Zone- II/2025-26, తేది:20.11.2025 సం/- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-II, విజయవాడ.

బ్యాంక్ ఆఫ్ ఇండియా
Bank of India — Relationship beyond banking
విజయవాడ బ్రాంచి, చిరునామా: 27-21-39, మా నాన్న నిలయం, కాళేశ్వరరావు రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002. ఫోన్: 0866-2573165

స్వాధీనతా ప్రకటన
రూల్-8(1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారము

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు సదరు చట్టంలోని సెక్షన్ 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీత: M/s.నూజెన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున **శ్రీ తోటకూర శ్రీనివాస రాజశేఖర్ & శ్రీమతి తోటకూర సుష్మిత,** డి.నెం. 54-16-1/7C, వెటర్నరీ కాలనీ, రోడ్డు నెం.01, గుణదల ఏరియా, విజయవాడ-520008 వారిని బకాయిసొమ్ము **రూ.34,73,786.53 (అక్షరాల ముప్పై నాలుగు లక్షల డెబ్బై మూడు వేల ఏడు వందల ఎనభై ఆరు రూపాయలు మరియు యాభై మూడు పైసలు మాత్రమే) (అసలు మంజూరు పరిమితి రూ.1,00,00,000/- తరువాత 07.07.2025 నుండి రూ.30,00,000/-లకు తగ్గించబడింది)+ 21-08-2025 నుండి జమకూడని వడ్డీ మరియు ఛార్జీలు** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.11.09.2025 న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.**
ఋణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **21 నవంబర్ 2025న స్వాధీనం చేసుకున్నారని** ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని, ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **చెల్లించవలసిన బకాయి రూ. 6,23,97,082.06 (అక్షరాల ఆరు కోట్ల ఇరవై మూడు లక్షల తొంభై ఏడు వేల ఎనభై రెండు రూపాయలు మరియు ఆరు పైసలు) + జమకూడని వడ్డీ + అనుషంగిక ఛార్జీలు** కోసం **బ్యాంక్ ఆఫ్ ఇండియా** హక్కుకు లోబడి ఆ విధంగా చేయవచ్చునని ముఖ్యంగా ఋణగ్రహీతను, మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది.
బ్యాంకు నుండి పొందిన ఇతర రుణ బాధ్యతలకు ఈ ఆస్తిని పొడిగించబడింది. వివరాలు ఈ దిగువన:

పేరు	సదుపాయం యొక్క స్వభావం	మంజూరైన లిమిట్ (రూ.)	బకాయిసొమ్ము (రూ.)	13(2) జారీచేసిన తేది	13(4) జారీచేసిన తేది
M/s. నూజెన్ ఎంటర్‌ప్రైజెస్	ఓవర్ డ్రాఫ్ట్	రూ. 1,90,00,000/-	రూ.1,96,37,644.71 + 22-08-2025 తేదీ నుండి జమకూడని వడ్డీ + ఛార్జీలు ఏవైనా	11-09-2025	17-11-2025
శ్రీ టి.శ్రీనివాస రాజశేఖర్ & శ్రీమతి టి.సుష్మిత	హౌసింగ్ లోన్	రూ. 3,87,00,000/-	రూ.3,92,85,750.82 + 30-07-2025 తేదీ నుండి జమకూడని వడ్డీ + ఛార్జీలు ఏవైనా	29-08-2025	03-11-2025

సదరు చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతకు విన్నవించుటమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు
విజయవాడ-520008, గుణదల ఏరియా, రోడ్డు నెం.01, వెటర్నరీ కాలనీ, డి.నెం.54-16-1/7C, మునిసిపల్ వార్డు నెం.33, ఆర్.యస్.నెం.396/3A నందు శ్రీ టి.శ్రీనివాస రాజశేఖర్ మరియు శ్రీమతి టి.సుష్మితలకు ఉమ్మడిగా సొంతమైన 450 చ॥గ॥ లేదా 376.256 చ॥మీ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ స్థలము మరియు అందులో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ జి+2 ఫ్లోర్ ట్రిప్లెక్స్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **భవనము యొక్క సరిహద్దులు: తూర్పు:** వెంకటేశ్వర ఐకాన్ అపార్ట్‌మెంట్స్ ప్లాట్ నెం.26; **దక్షిణం:** 60 అ॥ వెడల్పుగల మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు; **పడమర:** నల్లినేని భవానీ యొక్క ఆస్తి; **ఉత్తరం:** పెద్ది వెంకట రత్నం యొక్క ఆస్తి ప్లాట్ నెం.53.


తేది: 21.11.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

మాక్ అసెంబ్లీకి ఎంపిక


పావనిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని రేగండ్ల పావని మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. అసెంబ్లీలో ప్రత్యేకంగా నిర్వహించనున్న మాక్ అసెంబ్లీల్లో ఈమె పాల్గొననుంది. ఈ సందర్భంగా పెనుగంచిప్రోలు వచ్చిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య విద్యార్థినికి శాలువా కప్పి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను మాక్ అసెంబ్లీలో ప్రస్తావించాలని సూచించారు. విద్యార్థులకు అసెంబ్లీలో కార్యక్రమాల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేకంగా మాక్ అసెంబ్లీ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవ్యవస్థను బెదిరించేలా జగన్ ప్రవర్తన'


మాట్లాడుతున్న నాగుల్ మీరా

పటమట, న్యూస్‌టుడే : మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాంపల్లిలోని సీబీఐ కోర్టు వెలుపల ప్రవర్తించిన తీరుపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయని.. న్యాయవ్యవస్థను బెదిరించేలా ఆయన తీరు ఉందని నూర్‌బాషా సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్ మీరా విమర్శించారు. శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ కోర్టుకు హాజరైన తీరుపై న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని కోరారు. వైకాపా నేతలకు జైలు నుంచి వచ్చే సమయంలో.. కోర్టులకు హాజరయ్యే సమయంలో పెయిడ్ బ్యాచ్‌లతో ఊరేగింపులు నిర్వహించడం అలవాటుగా మారిందన్నారు. హైదరాబాద్‌లో ఊరేగింపునకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి డబ్బులు ఇచ్చి ప్రజలను తరలించారంటూ ఆరోపించారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ప్రజలు మెచ్చేలా వ్యవహరించాలని.. ప్రజలు అసహ్యించుకునేలా ప్రవర్తించకూడదని పేర్కొన్నారు. మైనార్టీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూర్‌బాషా కార్పొరేషన్‌కు రూ.100 కోట్ల ప్రకటించినందుకు సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కొండలరావు కస్టడీకి ఏసీబీ పిటిషన్

ఈనాడు - అమరావతి: వైకాపా హయాంలో అగ్నిమాపక శాఖలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టు అయిన కొండలరావు (ఏ4) కస్టడీ కోరుతూ ఏసీబీ అధికారులు శుక్రవారం అనిశా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో తమకు వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని ఆ పిటిషన్‌లో అభ్యర్థించారు. దీనిపై విచారణ జరిపిన అనిశా కోర్టు.. ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఇదే కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు కొండలరావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారణ నిర్వహించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని ఆదేశిస్తూ.. విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేశారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజ్ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2021 July Model, Mahindra Thar M.T- Maroon Colour, 60,000 km is for Sale. ✆ 98482 42831.

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

FLAT FOR SALE

3BHK సెమీ ఇండిపెండెంట్ ఫ్లాట్స్ IMMEDIATE OCCUPATION పోరంకి - నిడమానూరు రోడ్డులో అమ్మకమునకు కలవు. ✆ 85229 12999.

3BHK 1930 Sft. N/F 13Y. old Flat at Patamata, Nr. Benz Circle, Lift, Car Park, Generator. ✆ 97011 12559, 98404 27849, 88262 93015.

Kothapet- Near Jain Mandir, 3 BHK, 1160 Sft, E/F, 4th Floor, Car park, 10 yrs old, 68-L. ✆ 98491 93899

విజయవాడ గురునానక్‌కాలనీ దగ్గర CTO కాలనీలో 1940Sft గల 5th ఫ్లోర్ 3BHK ఫ్లాట్ 2 కార్ల పార్కింగ్‌తో అమ్మకమునకు కలదు. ✆ 94408 57075

LAND FOR SALE

మెగా అవకాడో పామ్‌ల్యాండ్ 11సెంట్లు 6లక్షలు. 5వ సం॥- 40 సం॥వరకు ఏటా 2-5 లక్షల ఆదాయం. 5ఎకరాల క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్ ✆ 9398621767.

ప్రకాశం జిల్లా కురిచేడు మండలం 30+15 కలిపి లేక విడివిడిగా 45 ఎకరాల మంచి వ్యవసాయ పొలం NSP మేజర్ కాల్వ ఆనుకొని మొత్తం పైపులైన్లతో అమ్మబడును. ✆ 78425 99975

PLOT FOR SALE

బందరురోడ్డు 6లైన్ హైవేకి దగ్గరలో 100Ft.ఫ్రం. రోడ్డుని ఆనుకొని CRDAప్లాట్ అమ్మకం. 80% బ్యాంక్‌లోన్. గజం: కేవలం 18K మాత్రమే. 94905 14626

విజయవాడ సిటీ, బెంజ్‌సర్కిల్‌కి 5 మినిట్స్ జర్నీలో ★ మంచి ప్రశాంతమైన వాతావరణంలో ఈస్ట్&వెస్ట్ ఫేస్ రెడీటూ కన్‌స్ట్రక్షన్‌కి అనువైన 133 గజాలు ప్లాట్లు కేవలం 30 లక్షలు పైనలోలేటుతో అమ్మకం. 77320 51576

చతుర్భుజ ప్రాపర్టీస్ గేటెడ్ కమ్యూనిటీలో CRDA అప్రూవ్ ఓపెన్ Plots కంచికచర్ల, పాములు, పరిటాల, పెనమలూరులో కలవు. ✆ 99481 10645.

AP రాజధాని అమరావతిలో MLA క్వార్టర్స్ రాయపూడి E-11 రోడ్‌కి దగ్గరగా 780గ॥ & AP సెక్రటేరియట్ ఎదురు 180,360 గ॥ కమర్షియల్ LPS ప్లాట్లు అమ్మకం. ✆ 92907 63488

GOLLAPUDI

విజయవాడ గొల్లపూడి కొత్త బైపాస్ వద్ద C కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్ పక్క రోడ్డులో 200, 400గ॥ ఉడా లేఔట్ ప్లాట్లు గజం:25000/-లకే ✆ 92907 63488

LEASE/ RENT

లీజు/ అద్దెకు
విజయవాడ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలని, NH ఆనుకొని Hotel Novotel సర్వీస్ రోడ్‌లో ICICI బ్యాంక్ ప్రక్కన D.No: 54-15-9 సత్యరాజ్ కాంప్లెక్స్ నందు 1800 చ॥అ॥ అన్ని సౌకర్యాలతో వ్యాపార సంస్థలకు, ప్రత్యేకంగా హాస్పిటల్స్‌కు అనువుగా ఉన్నది. ✆ 98482 78888 90520 22862

PROPERTY FOR SALE

విజయవాడ భవానీపురంలో HYD-VJA బైపాస్‌రోడ్డుకి దగ్గర్లో 585గ॥ కమర్షియల్ G+1 బిల్డింగ్ అమ్మకానికి కలదు. ✆ 92913 23563.

TO LET

1 BHK Semi Furnished. Families / Employees Only, Near SVR Neuro Hospital, Labbipet, VJA ✆ 95024 38911, 94936 85811

COMMERCIAL

VJA ఆటోనగర్ 100 ఫీట్‌రోడ్డు కనకదుర్గ ఫైనాన్స్‌ఎదురుగా (G+1) బిల్డింగ్ 13,000 Sft. లోడింగ్, అన్‌లోడింగ్ వీలుగా గోడౌన్ అద్దెకు ✆ 84312 51822.

విజయవాడ గురునానక్ కాలనీలో స్టార్‌బక్స్‌కి ఎదురుగా SBH కాలనీలో (ప్లాట్ నెం. 22) 3,000 చ.అ.లు విస్తీర్ణం ఉన్న బిల్డింగ్ ఆఫీసులకు/ బ్యాంకులకు కమర్షియల్‌గా అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి ✆ 98481 21859.

JOBS

Wanted Male Floor/ Campus Incharges, Data Entry Operators & Hostel Wardens to work in Sri Medha Jr. College, Labbipet, Exp. Min 3 Years. Age: 30-40 Yrs. Qual: Any Degree/ B.Tech. 91542 10069.

Wanted MBA Marketing/ Business Development/ Supply chain management to work a reputed company at Guntur. Mini 2 years experience. Contact: 91333 99257.

VJAలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేయుటకు తెలుగు/ఇంగ్లీష్ అను కీబోర్డు (పేజ్‌మేకర్) వచ్చిన టైపిస్ట్ (M) 10th/ ఇంటర్ ఆఫీస్‌బాయ్ కావలెను ✆70320 60786

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 - 29000. వ: 18-35. ✆: 77309 58410.

విజయవాడలో ప్రముఖ 3 స్టార్ హోటల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ మార్కెటింగ్ మేనేజర్ మరియు యువతి యువకులు కావలెను. ✆ 91001 17227.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. A:25-30Y, Sal:18-25k, Qul: డిగ్రీ. ✆ 99495 58181,81215 58181.

హిందుస్తాన్ సోలార్ ఎంటర్‌ప్రైజెస్ విజయవాడనందు పనిచేయుటకు డిగ్రీ చదివిన ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ (Male) కావలెను.జీ: 15k+ Incentive. ✆ 95021 07544

ACCOUNTING

Accountants & Store Keepers with 5 years experience to work in Jharkhand construction sites. WhatsApp resume to: 95023 93999.

ENGINEERING

CIVIL ENGINEERS with 5 yrs exp. to work in Jharkhand Thermal Power Plant. CISCONS Pvt. Ltd, . WhatsApp resume to: 95023 93999.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

'రానున్న ఎన్నికల్లో వైకాపా ఒక్క సీటుకే పరిమితం'

గొల్లపూడి, న్యూస్‌టుడే : గత ఎన్నికల్లో జగన్ సిద్ధం..సిద్ధం అంటే ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని, ఇప్పుడు రప్పా..రప్పా అంటున్న వారిని ఒక్క సీటుకే పరిమితం చేస్తారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ వేల కోట్లు దోచేసి సాక్షి, భారతి సిమెంట్స్‌లో పెట్టుబడులు పెట్టారని ఆరోపించారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూములను దోచుకున్న వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. తండ్రి వైఎస్ఆర్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ. వేల కోట్లు దోచుకున్నారని, జగన్ ఆర్థిక నేరాలపై సీబీఐ 11, ఈడీ 9 ఛార్జిషీట్లు దాఖలు చేసిందన్నారు.


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

తిరువూరు
• తిరువూరు • మైలవరం

బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడు పీఏసీఎస్ సభ్యుడైన చిమట మురళీకృష్ణ ఇటీవల మృతి చెందారు. జనతా బీమా కింద మంజూరైన రూ.2 లక్షల నగదును శుక్రవారం అతని కుటుంబానికి అందజేసినట్లు సహకార సంఘం అధ్యక్షుడు చిల్లపల్లి కృష్ణ తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.


నాగకల్యాణికి బీమా సొమ్ము అందిస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

◆ స్థానిక బీసీ కాలనీ శివారు జంగాల బజారులో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా 'న్యూస్‌టుడే' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

◆ కొండపల్లి 28వ డివిజన్‌లోని కాలువల్లో పూడిక పేరుకుని మురుగు ప్రవహించడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. దీనిపై పురపాలిక సిబ్బంది స్పందించి జేసీబీతో కాలువల్లోని పూడికను శుక్రవారం తొలగించారు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

◆ స్థానిక మూడో వార్డులోని డ్రెయినేజీలో పూడిక పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికులు అధికారులకు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించి కార్మికులను పంపించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం** ◆ తాటకూట్ల యాదవుల బజారులో డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగు రహదారిపై నిలుస్తుందని స్థానికులు అధికారులకు తెలిపారు. ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు, ఏవో ప్రసాద్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కచ్చా కాల్వలు తవ్వించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట** ◆ తిరువూరు 5వ వార్డులోని డ్రెయిన్‌లో మట్టి, చెత్త, పేరుకుందని స్థానికుడు మాధవరావు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ తమ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్న చిట్టినేని సుబ్బారావుకు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతి ఉత్తర్వులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ చేతుల మీదుగా ఆయన శుక్రవారం అందుకున్నారు. ఈ మేరకు సుబ్బారావును పలువురు నాయకులు, ఉద్యోగులు అభినందించారు.

ఉపాధి హామీ పథకం పనులపై తీర్మానం

తిరువూరు టౌన్, గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధి ఆంజనేయపురంలో సర్పంచి ఎం.కుటుంబరావు అధ్యక్షతన శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. 2025-26 ఆర్థిక ఏడాదిలో గ్రామంలో చేయనున్న ఉపాధి పనులపై అధికారులు చర్చించారు. గ్రామాభివృద్ధికి ఉపయుక్తంగా ఉండే పనులు చేసేందుకు తీర్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శి లావణ్య, టీఏ భాస్కర్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అపార్‌మైన కష్టాలు!

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఆధార్‌లో వివరాల మార్పునకు ఇబ్బందులు

మైలవరం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతో పాటు విజయవాడ రూరల్ మండల పరిధిలోని గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి కాలనీల్లో పదో తరగతి విద్యార్థులు 1640 మంది ఉండగా వారిలో 107 మందికి అపార్ ఐడీ జారీ కాలేదు. రెండు వేలకు పైగా ఉన్న ఇంటర్ విద్యార్థుల్లో 236 మందికి కూడా ఐడీలు జారీ కాలేదని విద్యా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఫీజులు చెల్లించే వెసులుబాటు..

నూతన జాతీయ విద్యా విధానంలో విద్యార్థులకు తప్పని సరి చేసిన అపార్ గుర్తింపు సంఖ్య కేటాయించడానికి నియోజకవర్గ వ్యాప్తంగా సరైన వివరాలు అందించలేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) ఐడీ కేటాయించాలి. ఇది ఉంటేనే విద్యార్థులు పది, ఇంటర్ పరీక్షలకు ఫీజులు చెల్లించే వెసులుబాటు ఉంటుంది. దీంతో ఈ మేరకు విద్యా శాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది. గుంటుపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యా శాఖ సిబ్బంది విద్యార్థులందరికీ సామూహికంగా అపార్ నమోదు చేపట్టారు. దీనికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆధార్ కార్డులు తప్పనిసరి. కానీ ఇక్కడే సమస్య తలెత్తుతోంది. పాఠశాల దస్త్రాల వివరాలకు ఆధార్ వివరాలు సరిపోక వాటిని సరి చేయించుకోవడానికి పాఠశాల స్థాయిలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయినా అత్యధిక తల్లిదండ్రులకు వీటిపై అవగాహన లేకపోవడంతో వాటి సేవలను సద్వినియోగం చేసుకో లేకపోయారు. మరికొద్ది రోజుల్లో పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షల రుసుము చెల్లించే తేదీ దగ్గర పడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.


గుంటుపల్లిలో సామూహికంగా అపార్ వివరాలు నమోదు చేస్తున్న విద్యా శాఖ సిబ్బంది

అక్షర దోషాలతో...

పాఠశాల దస్త్రాలు యూడైస్ ప్లస్ వివరాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆధార్ కార్డుల్లోని వివరాల్లో తేడా లేకుంటేనే అపార్ ఐడీ వస్తుంది. ఆధార్‌లో విద్యార్థి పుట్టిన తేదీ, ఇంటి పేరు, విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లలో అక్షర దోషాల కారణంగా పాఠశాల దస్త్రాల వివరాలతో సరిపోక చాలా మందికి కార్డులు జారీ చేయడం లేదు. పుట్టిన తేదీ ధ్రువపత్రం లేక వాటిని పొందడం సులభం కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు ఇబ్బందులు పడుతున్నారు.

తప్పులు సరి చేసుకోవాల్సిందే

మండల విద్యాశాఖాధికారి లాగిన్‌లో విద్యార్థులు తమ పేర్లు తదితరాలు సరి చేయించుకోవచ్చు. ఆధార్‌లో తప్పు ఉంటే సరి చేయించుకోవాల్సిందే. అపార్ వివరాల నమోదు కోసం గ్రామ స్థాయిలోని పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. వాటిలో ఆధార్ కార్డుల్లోని తప్పులను సవరణ చేయించుకుంటే మేలు.

- పుష్పలత, ఎంఈవో, ఇబ్రహీంపట్నం

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం


సభలో ప్రసంగిస్తున్న చక్రాణి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : మత్స్యకారులు, ఆక్వా రైతులకు ప్రభుత్వం అనేక రకాల పథకాలను ప్రవేశ పెట్టి లబ్ధి చేకూరుస్తుందని జిల్లా మత్స్య శాఖ అధికారి చక్రాణి తెలిపారు. ఆ శాఖ ఆధ్వర్యంలో మత్స్యకార దినోత్సవాన్ని ఇబ్రహీంపట్నం ఫెర్రీలో శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు వేట సమయాల్లో నదుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం కొందరు మత్స్యకారులను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్ శ్రీను, కూటమి నాయకులు ఫణి, రైతులు, కొన్నిరు పాల్గొన్నారు.

మహిళల సహాయ డెస్క్‌పై గ్రామాల్లో ప్రచారం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : మహిళల సహాయ డెస్క్‌పై తిరువూరు మండలంలోని మహిళలు, బాలికలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టినట్లు ఎస్సై కె.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మహిళలు, ఆడపిల్లల భద్రతకు ప్రభుత్వం, పోలీస్ శాఖ అమలు చేస్తున్న భద్రతా కార్యక్రమాలను మైక్ ప్రచారం ద్వారా వివరిస్తున్నట్లు చెప్పారు.

ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన

గంపలగూడెం, న్యూస్‌టుడే : తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో ఏర్పాటు చేస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు అన్నారు. జనం అందించే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అధికారులు పరిష్కరించేందుకు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 245 మంది పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారుల వద్దకు దరఖాస్తులను పంపించారు. ప్రజాదర్బార్ వద్ద వైద్య శిబిరం, అర్జీదారులకు భోజన సదుపాయం కల్పించారు. తహసీల్దార్ వి.రాజకుమారి, ఎంపీడీవో బి.సరస్వతి, ఎస్సై జి.అనిల్, హౌసింగ్ ఈఈ విజయభాస్కరరాజు, జడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, గంపలగూడెం ఉప సర్పంచి కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారికి అసౌకర్యం లేకుండా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే : గంపలగూడెం మార్కెట్ యార్డులో ప్లాట్‌ఫారాలపై ఆరబెట్టిన ధాన్యాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం విక్రయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తూకం వేసేందుకు ధాన్యాన్ని రైతులతో కలిసి గోనె సంచుల్లో నింపారు.

లక్ష్యాన్ని చేరుకునే దిశగా కృషి

గొల్లపూడి, న్యూస్‌టుడే : పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, ఆ దిశగా కృషి చేయాలని డీసీపీ కె.జి.వి.సరిత పేర్కొన్నారు. గొల్లపూడిలోని రవీంద్ర భారతి నెక్స్ట్‌జెన్ పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు సరిత హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నత స్థానానికి చేరవచ్చని తెలిపారు. చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సబ్ కలెక్టర్ కె.కృష్ణచైతన్య, పాఠశాల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి, సీఈవో గౌతమ్‌కృష్ణ, ప్రిన్సిపల్ జి.సరిత పాల్గొన్నారు.


చిన్నారులతో సంభాషిస్తున్న డీసీపీ సరిత


విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు

ఎమ్మెల్యే చొరవతోనే రహదారి అభివృద్ధి

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ కృషితోనే మైలవరం- నూజివీడు మార్గంలో అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెదేపా సీనియర్ నాయకులు లీలాప్రసాద్, శోభన్ బాబు పేర్కొన్నారు. కానీ కొంతమంది పనిగట్టుకొని ఎమ్మెల్యేపై విమర్శలు, ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అనేక అవాంతరాలు, ర.భ. అధికారుల ఇబ్బందులను తొలగించుకుని, పనులు ప్రారంభానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారని వివరించారు. మైలవరంలో రూ.కోట్లు వెచ్చించి, రహదారుల అభివృద్ధి పనులు చేయించిన ఘనత ఆయనదేనన్నారు. నాయకులు లీలాశ్, కరీం, బాలకృష్ణ, అంకారావు, వెంకట నారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మైలవరం : మాట్లాడుతున్న తెదేపా నాయకులు

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కోపా ట్రస్ట్ విస్సన్నపేట వారిచే 2025-26కు సంబంధించి ఇంటర్ నుంచి పీజీ వరకు విస్సన్నపేట, నూజివీడు, మైలవరం, ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, చాట్రాయి, రెడ్డిగూడెం పరిధిలోని పేద కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం జరుగుతుందని కోపా డైరెక్టర్ తుంగల నరేంద్ర బాబు తెలిపారు. శుక్రవారం విస్సన్నపేటలో జరిగిన కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఎయిడ్ ఫర్ పూర్ ఛారిటబుల్ ట్రస్ట్ (కోపా) సమావేశం పురస్కరించుకొని ఉపకార వేతనాల గురించి సంఘం బ్రోచర్‌ని విడుదల చేశారు. డిసెంబరు 15వ తేదీలోగా విద్యార్థులు తమ దరఖాస్తులను విస్సన్నపేటలోని సంఘ కార్యాలయానికి పంపించాలని కోరారు.

కొనుగోళ్లు ప్రారంభం.. రైతులకు అవకాశం

గంపలగూడెం, న్యూస్‌టుడే

భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో గంపలగూడెం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు 400 క్వింటాళ్ల దూదిని విక్రయించారు. సీసీఐ బయ్యర్ బాలనరసింహ నాణ్యత పత్తిలో తేమ శాతాన్ని యంత్రం ద్వారా పరీక్షించారు. 12 శాతం తేమ ఉండటంతో క్వింటాకు గరిష్ఠంగా రూ.7,785 ధర నిర్ణయించారు. కొనుగోలు చేసిన పత్తిని వెంటనే కాటా వేసి లారీల్లో జిన్నింగ్ మిల్లులకు ఎగుమతి చేశారు. ఏఎంసీ కార్యదర్శి బి.రాజబాబు మాట్లాడుతూ ఇకపై రైతులు కేంద్రానికి గోనె సంచుల్లోనే పత్తి తీసుకురావాలని సూచించారు. సీసీఐలో పత్తి విక్రయించేందుకు సచివాలయాలు, మార్కెట్ కమిటీ కార్యాలయంలోని సిబ్బంది రైతులకు స్లాట్ బుక్ చేస్తారన్నారు. తెదేపా మండల మాజీ అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, ఏఎంసీ సూపర్‌వైజర్ నాగేంద్ర పాల్గొన్నారు. తదుపరి తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.


గంపలగూడెం : పత్తిలో తేమ శాతం పరిశీలిస్తున్న అధికారులు

నెలన్నర ఆలస్యంగా..

ఈ ఏడాది తొలిసారిగా సీసీఐ ఆధ్వర్యంలో శుక్రవారం పత్తి కొనుగోళ్లు చేశారు. రైతులు తెచ్చిన పత్తిలో తేమ ఎక్కువగా ఉండటంతో కేసీఐ మద్దతు ధర కంటే క్వింటాకు రూ.325 తక్కువగా కొనుగోలు చేశారు. 8 శాతం వరకు తేమ ఉంటే గరిష్ఠ ధర రూ.8,110 లభిస్తోంది. ఇప్పటికే రైతులు ప్రైవేటు వ్యాపారులకు దూదిని విక్రయించారు. సీసీఐ కేంద్రం నెలన్నర ఆలస్యంగా తెరిచారు. అక్టోబరులో తెరిస్తే చాలా వరకు పత్తిని అన్నదాతలు సీసీఐ కేంద్రానికి తెచ్చేవారు. సాగుదారులు కూడా నాణ్యత, తేమ శాతం పరిశీలించుకుని గోనె సంచుల్లో తీసుకొస్తే కనీస మద్దతు ధర పొందేందుకు అవకాశం ఉంది. సీసీఐ కేంద్రానికి హమాలీల సమస్య కూడా తలెత్తింది. గతంలో అవసరం మేరకు పత్తి కాటా వేసి లారీలకు లోడు చేసేందుకు వీరు అందుబాటులో ఉన్నారు. ఐదేళ్లుగా ఇక్కడి కేంద్రంలో పత్తి కొనుగోళ్లు లేకపోవడంతో హమాలీలు రావడం లేదు. ప్రస్తుతం ముఠా కూలీలంతా ధాన్యం కాటాలు, లారీల్లో లోడు చేయడంలో నిమగ్నమయ్యారు.

మౌలిక వసతులు లేక.. వెతలు తీరక




కేతనకొండలో బలహీన వర్గాల కోసం ఏర్పాటు చేసిన మోడల్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వం కాలనీని అభివృద్ధి చేయడంలో విఫలమైంది. దీంతో కాలనీవాసులు రహదారులు, తాగునీరు తదితర వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ నుంచి జాతీయ రహదారి వరకు సరైన రోడ్డు లేక అవస్థలకు గురవుతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం బలహీన వర్గాల వారికి తక్కువ వ్యయంతో ఎక్కువ మౌలిక వసతులతో పక్కా గృహాలు నిర్మించాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో వివిధ స్వచ్ఛంద సంస్థలతో దాదాపు 25కు పైగా గృహాలను నిర్మించింది. అనంతరం నిరుపయోగంగా ఉన్న వాటిని నిబంధనల మేరకు బలహీన వర్గాలకు కేటాయించింది. తర్వాత ప్రభుత్వాలు మారడం, కాలనీ గ్రామానికి దూరంగా ఉండటంతో పాలక వర్గాలు కాలనీలో మౌలిక వసతులు కల్పించలేదు. **- ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే**

పర్యవేక్షణ లోపంతో నిరుపయోగం



చెత్త నుంచి సంపద కాదు. వ్యర్థాల మాటున సంపద తయారీ కేంద్రాలు చందంగా తయారైంది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్లు, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. మండలంలోని పుల్లూరు పంచాయతీకి సంబంధించి బుడమేరు వాగు ఒడ్డున కొత్తగూడెంలో ఒకటి, బాడవ చెరువు వద్ద జాతీయ రహదారి పక్కన మరొకటి దాదాపు పదేళ్ల కిందటే నిర్మించారు. అప్పటి నుంచి కనీసం రూపాయి ఆదాయం రాలేదు సరికదా, కనీసం ఆయా షెడ్లు ఉన్నాయన్న సంగతిని అధికారులు విస్మరించారు. కొత్తగూడెం వద్ద కేంద్రం పైకప్పు రేకులు గాలికి ఎగిరిపోయి మూడేళ్లయినా నేటికీ ఎవరికీ పట్టడం లేదు. కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. **- న్యూస్‌టుడే, మైలవరం**

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి


నందడిగా మారిన పవిత్ర సంగమం

కొండపల్లి, న్యూస్‌టుడే : పోలి పాడ్యమిని పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజామున నియోజకవర్గంలోని మహిళా భక్తులు పవిత్ర సంగమం ప్రాంతానికి చేరుకొని పూజలు నిర్వహించారు. పుణ్యస్నానాల అనంతరం కార్తిక దీపాలు వెలిగించి నదిలో వదిలారు. కొండపల్లి పురపాలిక సంఘం ఆధ్వర్యంలో ఘాట్ల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. సీఐ చంద్రశేఖర్, మహిళా ఎస్సై బృందాలు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డ్రోన్ల సాయంతో భక్తులకు సేవలందించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా శుక్రవారం తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని శివ, వైష్ణవాలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. వైష్ణవాలయాల్లో మూలవిరాట్‌లకు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు.

వైభవంగా అష్టోత్తర శత దీపాలంకరణ సేవ


నెమలి కృష్ణాలయంలో ఉత్సవమూర్తులకు పూజలు

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం రాత్రి అష్టోత్తర శత దీపాలంకరణ సేవను నిర్వహించారు. అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. ఉత్సవమూర్తులకు అద్దాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

పార్కింగ్ ద్వారా ఆదాయం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం వాహనాల పార్కింగ్‌కు నిర్వహించిన వేలం పాట ద్వారా రూ.1.10 లక్షలు ఆదాయం లభించినట్లు సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది నవంబరు 30 వరకు కాలపరిమితితో నిర్వహించగా గ్రామస్థుడైన పి.సత్యనారాయణ హెచ్చుపాటతో దక్కించుకున్నాడు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

మైలవరం, న్యూస్‌టుడే : మండల వ్యాప్తంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు నిమిత్తం ఆర్ఎస్‌కేల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనుగోలు చేస్తుండగా చంద్రగూడెం, చంద్రాల, మొర్సుమిల్లి, పుల్లూరు, తోలుకోడు, వెల్వడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కేంద్రాలను ప్రారంభించారు. వరి కోతలు ఇప్పుడిప్పుడే మొదలవగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాంతో వరి కోత యంత్రాలకు గిరాకీ ఏర్పడింది.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : శ్రీరాంపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జె.సుశీలాదేవి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అన్నదాతలు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొంది లబ్ధి పొందాలని సూచించారు. సర్పంచి అట్లూరి శ్రీనివాసరావు, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్‌వో రాజేష్, వీఏఏ సంపత్, రైతులు పాల్గొన్నారు.


శ్రీరాంపురం: కొబ్బరికాయ కొడుతున్న తహసీల్దార్ సుశీలాదేవి, పక్కన అధికారులు

డిసెంబరు 9 నుంచి అమరావతి బాలోత్సవ్

కొండపల్లి: ఉరుకుల పరుగుల జీవితంలో నిత్యం చదువులే కాకుండా కళలు, సంప్రదాయాలకు విద్యార్థులు సమయం కేటాయించాల్సిన అవసరం ఉందని అమరావతి బాలోత్సవ్ కమిటీ సభ్యుడు కామేశ్వరరావు అన్నారు. అమరావతి బాలోత్సవ్- 8 సందర్భంగా బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని కొండపల్లిలో శుక్రవారం నిర్వహించారు. డిసెంబరు 9 నుంచి 11 వరకు విజయవాడ మొగల్‌రాజ్‌పురం సిద్ధార్థ కళాశాలలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్యులు సీతారామారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మురళీ మోహన్, సర్దార్ సాహెబ్, యలమందయ్య పాల్గొన్నారు.

థియేటర్లలో నిబంధనలు పాటించాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : సినిమా థియేటర్లలో ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తిరువూరు ఆర్డీవో మాధురి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సినిమా థియేటర్లను తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్ఐ సుజాత, పంచాయతీ కార్యదర్శి కేశవ హరికృష్ణ కుమార్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.


మౌలిక వసతులు తనిఖీ చేస్తున్న మాధురి తదితరులు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం గుంటుపల్లి గ్రామంలో శుక్రవారం సామూహిక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పచ్చదనం- పరిశుభ్రతపై అవగాహన ప్రదర్శన చేపట్టారు. ఎంపీడీవో శకుంతల, డిప్యూటీ ఎంపీడీవో మనోజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మురళీ తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : పినపాక గ్రామంలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్ పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీవో కృపా కుమార్, కార్యదర్శి నారాయణరావు, సర్పంచి వేములకొండ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని కుదప గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకరరావు, మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : తిరువూరు మండలం అక్కపాలెంలో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీవో ఏవి.రమణ, ఎంపీడీవో రవిబాబు, శ్రీనివాస్, సర్పంచి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లైన 5 నెలలకే వేధింపులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పెళ్లైన అయిదు నెలలకే అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, ఇతర బంధువులపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం భీమరాజుగుట్టకు చెందిన యువతికి.. అఖిల్ అనే యువకుడితో ఈ ఏడాది జూన్ 5న వివాహమైంది. ఆ సమయంలో రూ.లక్ష కట్నం, ఒక బంగారు ఉంగరం ఇచ్చారు. కొద్ది రోజులు బాగానే చూసుకున్న అఖిల్.. తన తల్లి, తోబుట్టువుల మాటలు విని భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. అతడి మేనమామ చెవిటి విజయ్‌కుమార్.. మరో రూ.3 లక్షలు కట్నం తీసుకురావాలంటూ యువతిపై ఒత్తిడి తెచ్చాడు. దీనికి అత్త నిర్మల కుమారి, ఆడపడుచులు సౌజన్య, హెప్సిబా వత్తాసు పలుకుతున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు. దీనిపై మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : ఈ ఏడాది మార్చిలో జరిగిన పది, ఇంటర్ తుది పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం(తోసా) ఆధ్వర్యంలో శుక్రవారం దాతల ఆర్థిక సౌజన్యంతో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పట్టణంలోని బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదివిన విద్యార్థులకు ప్రథమ స్థానానికి రూ.10 వేలు, ద్వితీయ రూ.5 వేలు చొప్పున బోళ్ల బేబమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు రాంబాబు రూ.70 వేలు ఇచ్చారు. బీటెక్ చదువుతున్న ఒక విద్యార్థినికి తిప్పిశెట్టి చెల్లాయమ్మ జ్ఞాపకార్థం కుమారులు రామ్ గోపాల్, నరసింహారావు ల్యాప్‌టాప్ అందించారు. తోసా ఆధ్వర్యంలో చిట్టేలకు చెందిన అక్షయ అనే విద్యార్థినికి కళాశాల రుసుం కోసం రూ.40 వేలు సాయం చేశారు.


తిరువూరు : విద్యార్థులతో తోసా సభ్యులు

జూద శిబిరంపై దాడి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మండలం చిట్యాలలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి వాహనాలు, నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

దౌర్జన్యం కేసులో ఇద్దరు అరెస్ట్

మైలవరం: వెల్వడంలో అప్పు విషయమై ఇంటికెళ్లి దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ నమోదు అయిన కేసులో ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. వెల్వడానికి చెందిన రవీంద్ర, భరత్ స్నేహితులు. తన వద్ద రవీంద్ర రూ.2 లక్షలు అప్పుగా తీసుకుని ఇవ్వడం లేదంటూ భరత్ బుధవారం వెల్వడంలోని అతని ఇంటికి కొందరు వ్యక్తులను తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో తన ఇంటికొచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ రవీంద్ర ఫిర్యాదు మేరకు భరత్, మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. భరత్, అతనికి తోడుగా వచ్చిన అమర్‌చంద్‌ను అరెస్ట్ చేశామని ఎస్సై వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ఈనాడు బిజినెస్

యూరోపియన్ టిప్స్‌తో యూపీఐ అనుసంధానం

ఆర్‌బీఐ ప్రతిపాదన

భారత్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన మొబైల్ చెల్లింపుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ని, యూరోపియన్ చెల్లింపుల వ్యవస్థ టార్గెట్ ఇన్‌స్టంట్ పేమెంట్ సెటిల్‌మెంట్ (టిప్స్)తో అనుసంధానం చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. భారత్-ఐరోపా ప్రాంతాల మధ్య నగదు బదిలీ (రెమిటెన్స్)ని సులభతరం చేసే లక్ష్యంతో, యూపీఐ-టిప్స్‌ను జత చేయాలనే ప్రతిపాదన రూపొందించినట్లు పేర్కొంది. దీనివల్ల రెండు ప్రాంతాల వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపింది. ఇతర దేశాలకు చెల్లింపులను మరింత మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన జీ20 ప్రతిపాదనల్లో భాగంగా దీన్ని తీసుకొస్తోంది. ఫలితంగా ఎంతోమంది ప్రవాసులకు సమర్థ, పారదర్శక, సులభమైన చెల్లింపు మార్గాలు అందుబాటులోకి రానున్నాయి. ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ దీనికోసం యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ)తో చర్చిస్తున్నట్లు తెలిపింది.

కోటక్ బ్యాంక్ 1:5 నిష్పత్తిలో షేర్ల విభజన

కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరును 1:5 నిష్పత్తిలో విభజించే ప్రతిపాదనకు ఆ బ్యాంకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం.. రికార్డు తేదీ నాటికి మదుపర్లు తమ వద్ద ఉన్న ప్రతి రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుకు, రూ.1 ముఖ విలువ గల 5 షేర్లు పొందుతారు. కోటక్ మహీంద్రా బ్యాంక్ 40వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటున్న వేళ, బోర్డు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అయితే షేర్ల విభజనకు రికార్డు తేదీని బ్యాంకు వెల్లడించలేదు. త్వరలో ఈ వివరాలు వెల్లడించనుంది. గత 15 ఏళ్లలో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు విభజన జరగడం ఇప్పుడే. 2010లో రూ.10 ముఖ విలువ కలిగిన షేరును రూ.5 ముఖ విలువ కలిగిన 2 షేర్లుగా విభజించింది.

విస్తరణ బాటలో సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్

ఈనాడు, హైదరాబాద్: ట్రూజన్ సోలార్ బ్రాండు పేరుతో ఇళ్ల పైకప్పులపై సౌరవిద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేసే హైదరాబాద్ సంస్థ సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్, తన వ్యాపార కార్యకలాపాలను ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాలనేది తమ ప్రధాన లక్ష్యమని సన్‌టెక్ ఎనర్జీ ఎండీ భవాని సురేష్ వివరించారు. వినియోగదార్లకు మరింత దగ్గర కావడానికి డీలర్ల వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని సీఈఓ జె.శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం-కుసుమ్ కింద అధిక సామర్థ్యం గల సౌరవిద్యుత్తు యూనిట్లు అందించడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థకు సినీ హీరో మహేష్ బాబు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు.

కోడి గుడ్లు

22న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	640
వరంగల్	642
విజయవాడ	660
తూ/ప గోదావరి	645
విశాఖపట్నం	635
చిత్తూరు	673

అవి.. ఇవి కావు

- ఇంట్రాడే ట్రేడింగ్ చిట్కాలు ఇచ్చే సంస్థలకు దూరంగా ఉండాలి
- పెట్టుబడి సలహా సంస్థలు, ఇవి వేర్వేరు
- సెబీ గుర్తింపూ వర్తించదు

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌ఓ) డెరివేటివ్స్ విభాగంలో ట్రేడ్ చేస్తున్న మదుపర్లలో దాదాపు 90% మంది నష్టపోతున్నారని సెబీ అధ్యయనం చెబుతోంది. ఈ తరహా స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు చిన్న మదుపర్లను దూరం చేసేందుకు సెబీ పలు చర్యలు చేపట్టింది. అయినా స్వల్పకాలంలో అధిక లాభాలు ఆర్జించొచ్చనే ఆశతో, ఈ ట్రేడింగ్ కొనసాగిస్తూ నష్టపోతున్న వాళ్లున్నారు. 'మా సలహాలు పాటిస్తే, ఇంట్రాడే ట్రేడింగ్‌లో తప్పకుండా లాభాలు వస్తాయంటూ' మదుపర్లను ఇందులోకి దించుతున్నాయి కొన్ని సంస్థలు. ట్రేడింగ్ కాల్ ప్రొవైడర్స్ (టీసీపీలు)గా వ్యవహరించే ఇవి 'షేర్ల కొనుగోలు-అమ్మకంపై సలహాలు, ఇంట్రాడే కాల్స్, డెరివేటివ్ ట్రేడ్ సిఫార్సులు' చేస్తుంటాయి. సామాజిక మాధ్యమాలు / మెసేజింగ్ యాప్‌లలో వీటి సిఫార్సులు వచ్చి పడుతుంటాయి. వీటిల్లో సెబీ దగ్గర నమోదు కాని టీసీపీలే ఎక్కువ. దీర్ఘకాలిక పెట్టుబడుల ప్రణాళికలపై సలహాలు ఇచ్చే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్, టీసీపీల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేక పోతున్నందునే, మదుపర్లు ఈ సలహాల ఆధారంగా పెట్టుబడులు పెడుతూ నష్టపోతున్నారు.



ఈ వ్యత్యాసం గమనించాలి

దీర్ఘకాలిక పెట్టుబడుల సలహా సంస్థల (ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్) కోసం 2013లో రూపొందించిన విధానాన్ని టీసీపీలు దుర్వినియోగం చేస్తున్నాయి. పెట్టుబడి సలహా సంస్థలుగా సెబీ వద్ద నమోదై, రోజువారీ ట్రేడింగ్ కాల్స్ ఇస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. మదుపర్ల నుంచి ఇష్టానుసారం రుసుములు వసూలు చేస్తున్నాయనే ఫిర్యాదులూ ఉన్నాయి. వీటికి ముకుతాడు వేసేందుకు, 2024 డిసెంబరులోనే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్ (ఐఏ) నిబంధనల్లో సెబీ కీలక సవరణలు చేసింది. దీని ప్రకారం ట్రేడింగ్ కాల్స్, ఇంట్రాడే సంకేతాలు, డెరివేటివ్ సిఫార్సులను చేసే టీసీపీలను పెట్టుబడి సలహాదారులుగా పరిగణించరు. రుసుము తీసుకుని, షేర్లపై పరిశోధనను అందించే సంస్థలు రీసెర్చ్ అనలిస్ట్‌లుగా నమోదు కావాలి. ఇంట్రాడే కాల్స్, డెరివేటివ్ సిఫార్సులను చేసే టీసీపీలు, విశ్వసనీయ పెట్టుబడి సలహా సంస్థల మధ్య తేడాను గుర్తించేందుకు మదుపర్లకు ఇది ఉపయోగపడుతుంది.

అసోసియేషన్ ఆఫ్ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్ గణాంకాల ప్రకారం..

- గత పదేళ్లలో మొత్తం 218 చట్టపరమైన ఆదేశాలు వెలువడగా.. ఇందులో మూడింట రెండొంతులు సెబీ వద్ద నమోదు కాని సంస్థలపైనే వచ్చాయి. ఇవన్నీ టీసీపీలే. నమోదిత సంస్థలపై 71 ఆదేశాలు వెలువడగా.. ఇందులోనూ 90% టీసీపీలే.
- గత ఆర్థిక సంవత్సరంలో గుర్తింపులేని టీసీపీలపై వచ్చిన ఫిర్యాదుల్లో తప్పుడు ప్రకటనలు, కచ్చితమైన ప్రతిఫలం హామీలు, అనధికారిక సలహా సేవలు లాంటివి ఎక్కువగా ఉన్నాయి.
- గత ఆర్థిక సంవత్సరం నమోదు కాని సంస్థలపై సెబీ తీసుకున్న చర్యల్లో 87% వరకు మదుపర్ల ఫిర్యాదులు, మీడియా కథనాల ఆధారంగా చేపట్టినవే.

సెబీ నిఘాలో లేకుంటేనే ముప్పు

కొత్త నిబంధనల ప్రకారం.. నమోదిత టీసీపీలకు ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్లుగా కొనసాగే అర్హత లేనప్పటికీ, రీసెర్చ్ అనలిస్ట్‌లుగా సెబీ నిఘాలోనే ఉంటాయి. వాటి దస్త్రాలు, రుసుములు, క్లయింట్ జాబితాను సెబీ పరిశీలించే అవకాశం ఉంటుంది. ఏమైనా లోపాలు, ఉల్లంఘనలు ఉంటే సెబీ జరిమానా విధించగలదు. అవసరమైతే ఆయా సంస్థల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయగలదు.

- సెబీ వద్ద నమోదు కాని టీసీపీలతోనే మదుపర్లకు ముప్పు పొంచి ఉంది. ఎందుకంటే ఇవి సెబీ పర్యవేక్షణలో ఉండవు. జాక్‌పాట్ కాల్స్ లేదా 100% లాభాలు తెచ్చిపెడతామని సందేశాలు పంపుతూ, మదుపర్లను ఆకర్షించే పనిలో ఇవి ఉంటాయి. కొందరు మదుపర్లు ఇలాంటి సంస్థల ప్రతినిధుల ఆకర్షణీయ మాటలు నమ్మి, తమ ట్రేడింగ్ ఖాతాల నిర్వహణ బాధ్యత కూడా అప్పగిస్తున్నారు. ట్రేడ్ లాభాలొస్తే అందులో కొంత కమీషన్ వాళ్లకు ఇవ్వాలి. నష్టాలొస్తే మదుపర్లే మునిగిపోతారు. ఇలా నష్టపోయిన వాళ్లే ఎక్కువ. గుర్తింపు లేని ఈ సంస్థల చిరునామాలు, సంప్రదించే వివరాలు కూడా సరిగ్గా ఉండవు. వాటిని కనుగొనడం, ఫిర్యాదు చేయడం కష్టమే. అందుకే గుర్తింపు లేని టీసీపీలను నియంత్రించేందుకు సెబీ చర్యలు చేపడుతోంది.
- అయితే ఈ చర్యల వల్ల నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్లకు నిబంధనల భారం పెరిగింది. అధిక నిర్వహణ వ్యయాలు, కఠిన డాక్యుమెంటేషన్, మరింత నిఘాను ఈ సంస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఫలితంగా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్లుగా కొనసాగేందుకు చిన్న సంస్థలు ఆసక్తి చూపడం లేదు. కొత్త సంస్థలు ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టేందుకు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుంటున్నాయి.

- ఈనాడు వాణిజ్య విభాగం

అమెరికాలో ఏఐ హార్డ్‌వేర్ తయారీ

ఓపెన్‌ఏఐతో ఫాక్స్‌కాన్ భాగస్వామ్యం



తైపీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోని అమెరికా దిగ్గజ సంస్థ ఓపెన్‌ఏఐ, తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్‌తో కీలక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. అమెరికాలో ఏఐ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు రెండు సంస్థలూ కలిసి, ఏఐ డేటా సెంటర్లకు అవసరమైన కీలక హార్డ్‌వేర్‌ను డిజైన్ చేసి, అక్కడే ఉత్పత్తి చేయనున్నాయి. యాపిల్ సంస్థ ఐఫోన్‌లను అసెంబుల్ చేయడంతో పాటు, ఎన్విడియా కోసం ఏఐ సర్వర్లనూ ఫాక్స్‌కాన్ తయారు చేస్తోంది. ఈ కొత్త ఒప్పందంలో భాగంగా ఓపెన్‌ఏఐతో కలిసి ఏఐ డేటా సెంటర్ ర్యాక్‌లను రూపకల్పన చేసి, అభివృద్ధి చేయనుంది. ఏఐ డేటా సెంటర్లకు అవసరమైన నెట్‌వర్కింగ్, పవర్ సిస్టమ్స్, కేబుళ్ల వంటి ఉత్పత్తులను ఫాక్స్‌కాన్ తన అమెరికా ఫ్యాక్టరీలలో తయారు చేయనుంది. వీటిని ఓపెన్‌ఏఐ ముందుగానే తన అవసరాల మేరకు కొనుగోలు చేసేలా ఒప్పందం ఉంది. ఏఐ యుగంలో ప్రధాన సాంకేతికతలు అమెరికా నుంచే వస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకునేందుకు ఈ భాగస్వామ్యం ఒక ముందడుగు అని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు.

టాటా డిజిటల్‌లో 50% ఉద్యోగాల కోత!

టాటా గ్రూపు సంస్థల్లోనూ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే టీసీఎస్‌లో 12,000 మందిని తొలగించారనే వార్తలతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పుడు ఇ-కామర్స్, డిజిటల్ విభాగమైన టాటా డిజిటల్‌లోనూ పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించేందుకు సన్నద్ధమతున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. రెండేళ్ల క్రితం ఆవిష్కరించిన టాటా న్యూ యాప్ ఆశించినంతగా రాణించడం లేదు. ఈ నేపథ్యంలో, సంబంధిత విభాగంలోనే సిబ్బంది తొలగింపులు అధికంగా ఉంటాయని చెబుతున్నారు. మొత్తం సిబ్బందిలో 50% కంటే ఎక్కువ మందినే తగ్గించాలని యోచిస్తున్నట్లు వెల్లడిస్తున్నాయి. కొత్త సీఈఓ సజిత్ శివానందన్ నేతృత్వంలో చేపట్టిన భారీ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కార్యకలాపాలను సులభతరం చేసేందుకు, ఖర్చులను తగ్గించేందుకు, టాటా డిజిటల్ తన అన్ని డిజిటల్ విభాగాలను ఒకే ప్లాట్‌ఫామ్‌గా ఏకీకృతం చేస్తోంది. ఈ కీలక మార్పు ఉద్యోగులపై గణనీయ ప్రభావాన్ని చూపిస్తోందని, ఫలితంగా భారీగా తొలగింపులు తప్పవని నివేదికలు వస్తున్నాయి.

క్రిప్టో విలువలు క్షీణిస్తున్నాయ్

ఈనాడు వాణిజ్య విభాగం: ఈనెలలో క్రిప్టోకరెన్సీల విలువలు భారీగా క్షీణిస్తున్నాయి. వీటిల్లో ఎక్కువ ప్రాచుర్యం ఉన్న బిట్‌కాయిన్ విలువ ఈ నెలలోనే 25% పతనమైంది. 2022 తరవాత ఇంతగా విలువ తగ్గడం ఇప్పుడే. శుక్రవారం కూడా బిట్‌కాయిన్ విలువ 7.6% తగ్గి 80,553 డాలర్లకు పరిమితమైంది. ఈనెల మొదట్లో ఈ విలువ 1.10 లక్షల డాలర్లుగా ఉంది. ఈథర్ విలువ 8.9% పతనమై 2700 డాలర్ల దిగువకు వచ్చింది. మొత్తం క్రిప్టో కరెన్సీల మార్కెట్ విలువ 3 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.264 లక్షల కోట్ల) కంటే దిగువకు వచ్చిందని వీటిపై పరిశీలన చేసే కాయిన్‌గెకో తెలిపింది. సెమీకండక్టర్ సంస్థ ఎన్‌విడియా లాభాల ఫలితంగా దూసుకెళ్లిన అమెరికా స్టాక్ మార్కెట్లు, గురువారం నుంచి నష్టపోతున్నాయి. ఏఐ సంస్థల విలువలపై ఆందోళనలు, డిసెంబరులో ఫెడరల్ రిజర్వ్ రేట్ల కోత ఉండదనే సందేహాలు ఇందుకు కారణం. ఈ అనిశ్చితుల్లోనే క్రిప్టోకరెన్సీలూ నష్టపోతున్నాయని చెబుతున్నారు.

11,529 అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కార్లను వెనక్కి రప్పిస్తున్న టొయోటా



కాంబినేషన్ మీటర్ విడిభాగంలో లోపం కారణంగా 11,529 అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కార్లను టొయోటా కిర్లోస్కర్ మోటార్ వెనక్కి (రీకాల్) రప్పిస్తోంది. 2024 డిసెంబరు 9 నుంచి 2025 ఏప్రిల్ 29 మధ్య తయారైన ఈ మోడల్ కార్లకు రీకాల్ వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. స్వచ్ఛంద రీకాల్ కార్యక్రమంలో భాగంగా కాంబినేషన్ మీటర్‌ను పరిశీలించి, లోపం ఉందని గుర్తిస్తే దాని స్థానంలో కొత్తది వేయనున్నట్లు పేర్కొంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని కారు యజమానులకు తమ డీలర్లు అందిస్తారని వెల్లడించింది.

122 రైల్వేస్టేషన్లలో ఫుడ్ ఆన్ ట్రెయిన్

రైలు ప్రయాణికులు ఆర్డరు ఇస్తే, వారి కోచ్ దగ్గరకే ఆహారాన్ని అందించే సేవను 122 రైల్వేస్టేషన్లకు విస్తరిస్తున్నట్లు ఆహార డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ శుక్రవారం తెలిపింది. ఇంతవరకు ప్రయాణానికి 24 గంటల ముందు మాత్రమే ఆహారాన్ని ఆర్డరు చేసే అవకాశం ఉండగా, ఇప్పుడు దాన్ని 96 గంటల (4 రోజుల) ముందు వరకు అనుమతించనున్నారు. కొత్తగా ఈ సేవ ప్రారంభించిన స్టేషన్లలో అనంతపూర్ (ఆంధ్రప్రదేశ్), మధురై (తమిళనాడు), ఆల్వార్ (రాజస్థాన్), కోజికోడ్ (కేరళ), ఖుర్దారోడ్ (ఒడిశా), యశ్వంత్‌పూర్ (కర్ణాటక), గోండా (ఉత్తర్‌ప్రదేశ్) ఉన్నాయి.

భారత్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య త్వరలో ఎయిర్ కార్గో సేవలు



భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఎయిర్ కార్గో సేవలు త్వరలో ప్రారంభమవుతాయని విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి ఆనంద్ ప్రకాశ్ శుక్రవారం వెల్లడించారు. ఆఫ్ఘనిస్థాన్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి అల్-హజ్ నూరుద్దీన్ అజీజీ భారత పర్యటనలో భాగంగా ఆనంద్ ప్రకాశ్ ఈ ప్రకటన చేశారు. 'కాబూల్-దిల్లీ సెక్టార్, కాబూల్-అమృత్‌సర్ మార్గాల్లో ఎయిర్ ఫ్రైట్ కారిడార్‌ను కార్యాచరణలోకి తెచ్చాం. ఈ మార్గాల్లో సరకు రవాణా విమానాలు అతి త్వరలో ప్రారంభమవుతాయి' అని ఆనంద్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య అనుసంధానత గణనీయంగా పెరుగుతోందని, వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని వెల్లడించారు. ద్వైపాక్షిక వాణిజ్య సహకారాన్ని పర్యవేక్షించడానికి, మద్దతు కోసం రాయబారి కార్యాలయంలో ఒక వాణిజ్య ప్రతినిధిని నియమించడానికి ఇరు దేశాలు అంగీకరించాయని వివరించారు. భారత్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచేందుకు వాణిజ్యం, పెట్టుబడులపై ఉమ్మడి కార్యాచరణ బృందాన్ని పునరుద్ధరిస్తామన్నారు.

నవీ ముంబయి నుంచి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు: నవీ ముంబయి విమానాశ్రయం నుంచి డిసెంబరు 25న తమ సర్వీసులు ప్రారంభం కానున్నట్లు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది. తొలి విమానం నవీ ముంబయి నుంచి బెంగళూరుకు బయలుదేరుతుందని వెల్లడించింది. నవీ ముంబయి- బెంగళూరు సర్వీసులు రోజు నిర్వహిస్తామని, నవీ ముంబయి-దిల్లీ సర్వీసులు వారానికి 5 రోజులు ఉంటాయని పేర్కొంది. 2026 జనవరి నుంచి ఈ 2 మార్గాల్లో రోజుకు 2 విమాన సర్వీసులు నిర్వహిస్తామని వెల్లడించింది.

కేఎన్‌ఆర్‌కు రూ.319 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక వసతుల సంస్థ కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్‌కు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.319.24 కోట్ల పనులు లభించాయి. శాస్త్రీపురం నుంచి చింతల్‌మెట్ వరకు మీరాలం ట్యాంక్‌ను అనుసంధానం చేస్తూ నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జ్ పనులు లభించాయని సంస్థ బీఎస్ఈకి వెల్లడించింది. ఈపీసీ పద్ధతిలో 24 నెలల్లో దీన్ని పూర్తి చేయాల్సి ఉందని పేర్కొంది.

అనుబంధ సంస్థలో ఇండిగో రూ.7,270 కోట్ల పెట్టుబడి

విమానాల కొనుగోలు నిమిత్తం తన అనుబంధ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్‌సీ ప్రైవేట్ లిమిటెడ్‌లో సుమారు రూ.7,270 కోట్ల (82 కోట్ల డాలర్ల) పెట్టుబడి పెడతామని ఇండిగో తెలిపింది. ఈక్విటీ షేర్లు, నాన్ క్యుములేటివ్ ఆప్షనల్లీ కన్వర్టబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్ల జారీ ద్వారా ఒకటి లేదా మరిన్ని విడతల్లో ఈ పెట్టుబడిని ఇండిగో పెట్టనుంది.

డిజిటల్ పసిడిని నియంత్రించబోం

- అవి మా పరిధిలో లేవు
- సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే



డిజిటల్ పసిడి లేదా ఇ-పసిడి పథకాలను నియంత్రించాలని తాము భావించడం లేదని, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే శుక్రవారం స్పష్టం చేశారు. డిజిటల్ పసిడి/ఇ-పసిడి పథకాలు తమ పరిధిలోకి రావని అన్నారు. రీట్స్, ఇన్విట్స్-2025పై జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. మ్యూచువల్ ఫండ్‌లు అందించే ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్‌లు), ట్రేడయ్యే పసిడి సెక్యూరిటీల ద్వారా నియంత్రణ కలిగిన పసిడి ఆధారిత పథకాల్లో పెట్టుబడులు పెట్టొచ్చని పాండే తెలిపారు. అధికారిక నియంత్రణ కోసం డిజిటల్ పసిడి ప్లాట్‌ఫామ్స్‌ను సెబీ పరిధిలోకి తీసుకురావాలని డిజిటల్ పసిడి పరిశ్రమ కోరిన కొన్ని రోజుల్లోనే, ఈ అంశంపై పాండే స్పష్టత ఇచ్చారు. డిజిటల్ లేదా ఇ-పసిడి పథకాల్లో పెట్టుబడులపై ఈ నెల ప్రారంభంలో మదుపర్లను సెబీ హెచ్చరించింది. నియంత్రణ పరిధిలో లేని ఈ పథకాల్లో పెట్టుబడుల వల్ల, గణనీయమైన నష్టాలు మదుపర్లకు రావొచ్చనీ పేర్కొంది. బంగారాన్ని లోహం రూపంలో కొనడానికి బదులుగా కొన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ పసిడి లేదా ఇ-పసిడి పథకాలను ప్రోత్సహిస్తున్నాయని సెబీ గుర్తించిన అనంతరం ఈ హెచ్చరికలు జారీ చేసింది.

సూచీల్లో రీట్స్‌ను చేర్చడానికి చర్చలు

మార్కెట్ సూచీల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల (రీట్స్)ను చేర్చడానికి పరిశ్రమ వర్గాలతో సెబీ చర్చలు జరపనుందని పాండే వెల్లడించారు. తద్వారా రీట్స్‌లో నగదు లభ్యత గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. స్థిరాస్తి ప్రాజెక్టులకు సొంతమైన, నిర్వహించే కంపెనీలను రీట్స్ అంటారు. అధిక ధరలు కలిగిన స్థిరాస్తుల్లో మదుపర్ల పెట్టుబడుల్లో పెట్టి, కాలానుగుణంగా డివిడెండ్ ఆదాయాన్ని పొందే అవకాశాన్ని ఇవి కల్పిస్తాయి. మార్కెట్లలో రీట్స్‌ను చేర్చిన తర్వాత, సాధారణంగానే వీటికి నగదు లభ్యత మెరుగుపడుతుందని పాండే తెలిపారు. రీట్స్, ఇన్విట్స్ కోసం వ్యాపారాన్ని సులభతరం చేయడానికి అదనపు చర్యలు చేపట్టే అవకాశాలను మదింపు చేస్తున్నామన్నారు. పెట్టుబడిదార్ల భద్రతను కాపాడుతూనే, రీట్స్, ఇన్విట్స్ పెట్టుబడి పెట్టగలిగే లిక్విడ్ మ్యూచువల్ ఫండ్ పథకాలను పెంచాలనే ప్రతిపాదనను సెబీ పరిశీలిస్తోంది. సరికొత్త ప్రాజెక్టుల్లో ప్రైవేట్ ఇన్విట్స్ పెట్టుబడులను అనుమతించే అంశంపైనా సాధ్యాసాధ్యాలను చూస్తున్నామని పాండే వివరించారు. ఈ పథకాల్లో భాగస్వామ్యం పెంచేందుకు, సంస్థాగత మదుపర్లతో కలిసి పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణకు ఆర్థిక శాఖ, పలు రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, ఈపీఎఫ్ఓ కింద సంస్థలతో కూడా పెట్టుబడుల కోసం పని చేస్తున్నట్లు పాండే పేర్కొన్నారు.

ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్‌లో మ్యూచువల్ ఫండ్లపై నిషేధం

యాంకర్ రౌండ్లలో పాల్గొనొచ్చు: సెబీ



ప్రీ- ఐపీఓ (తొలి పబ్లిక్ ఆఫర్) షేర్ ప్లేస్‌మెంట్‌లో మ్యూచువల్ ఫండ్ సంస్థలు పాల్గొనకుండా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. యాంకర్ రౌండ్లలో మాత్రం ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నగదు లభ్యత, ఐపీఓలకు వచ్చే కంపెనీల విలువల్లో పారదర్శకత పెంచేందుకు సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. తొలి పబ్లిక్ ఆఫర్లలో యాంకర్ మదుపర్ల కోసం షేర్ల కేటాయింపు నియమావళిని సెబీ ఈ నెల ప్రారంభంలో సవరించింది. మార్కెట్లలో మ్యూచువల్ ఫండ్లు, బీమా కంపెనీలు, పింఛన్ నిధి సంస్థల వంటి దేశీయ సంస్థాగత మదుపర్ల భాగస్వామ్యాన్ని పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ మార్పులు చేపట్టింది. దీని కింద, యాంకర్ వాటాలో రిజర్వేషన్‌ను 33% నుంచి 40 శాతానికి పెంచింది. ఇందులో మ్యూచువల్ ఫండ్‌లకు 33 కేటాయిస్తారు. మిగతా 7 శాతాన్ని బీమా సంస్థలు, పింఛన్ సంస్థలకు కేటాయిస్తారు. ఈ 7 శాతానికి వాటి నుంచి స్పందన రాకపోతే, ఈ వాటానూ ఫండ్స్‌కే ఇచ్చేస్తారు.

అదానీ విల్మర్ నుంచి అదానీ బయటకు

అదానీ విల్మర్ లిమిటెడ్‌లో తనకు మిగిలిన 7% వాటాను బ్లాక్ డీల్ ద్వారా అదానీ గ్రూపు విక్రయించింది. ఈ వాటా విక్రయానికి సంస్థాగత మదుపర్ల నుంచి విశేష గిరాకీ లభించింది. వ్యాన్‌గార్డ్, చార్లెస్ స్కావాబ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, టాటా ఎంఎఫ్, క్వాంట్ ఎంఎఫ్, బంధన్ ఎంఎఫ్ తదితర దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఈ వాటా విక్రయంలో పాల్గొన్నాయని సమాచారం. సింగపూర్, యూఏఈ, ఇతర ఆసియా మార్కెట్ల నుంచి పలువురు అంతర్జాతీయ మదుపర్లు కూడా అదానీ విల్మర్‌లో వాటాలు కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

పెరిగిన గ్రో లాభం

స్టాక్‌బ్రోకింగ్ సంస్థ గ్రో (బిలియన్ బ్రెయిన్స్ గారేజ్ వెంచర్స్), సెప్టెంబరు త్రైమాసికంలో రూ.471.33 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.420.16 కోట్ల కంటే ఇది 12% అధికం. ఖాతాదారుల సంఖ్యతో పాటు ఆస్తుల విలువ పెరగడం ఇందుకు కారణమని పేర్కొంది. కార్యకలాపాల ఆదాయం మాత్రం రూ.1125.4 కోట్ల నుంచి 1018.74 కోట్లకు తగ్గింది. ఈ సమయంలో ఖాతాదారుల సంఖ్య 27% వృద్ధితో 1.9 కోట్లకు చేరింది. ఖాతాదారుల ఆస్తుల విలువ 33% పెరిగి రూ.2.70 లక్షల కోట్లుగా నమోదైంది.

యాక్సెసబిలిటీ నిబంధనలతో ఓటీటీలపై భారం

దిల్లీ: వినికిడి, దృష్టి లోపం ఉన్న వారి కోసం ప్రత్యేకంగా ఆడియో-విజువల్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలంటూ ఆన్‌లైన్ క్యూరేటెడ్ కంటెంట్ (ఓటీటీ ప్లాట్‌ఫామ్స్)కు తెచ్చిన యాక్సెసబిలిటీ నిబంధనలను అమలు చేయాలంటే, భారీ వ్యయాలు తప్పవని పరిశ్రమ సంఘం ది ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఆదాయాలకు మించి ఈ ఖర్చులుంటాయి కనుక, వాణిజ్యపరంగా సాధ్యం కాకపోవచ్చని పేర్కొంది. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కు యాక్సెసబిలిటీ ప్రమాణాల ముసాయిదాను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అక్టోబరులో విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల వల్ల ప్రాంతీయ, చిన్న ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఐఏఎంఏఐ తెలిపింది. నిర్వహణపరమైన, సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు వస్తాయని పేర్కొంది.

విదేశీ ప్రతికూలతలు.. సూచీలకు నష్టాలు

- రూ.4 లక్షల కోట్ల సంపద ఆవిరి
- డాలరు @ రూ.89.66

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.1766.05 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు... రూ.3161.61 కోట్లు

సెన్సెక్స్ ▼401 85232
నిఫ్టీ ▼124 26068



సూచీల రెండు రోజుల వరుస లాభాలకు వారాంతంలో అడ్డుకట్ట పడింది. విదేశీ మార్కెట్ల ప్రతికూల సంకేతాల ప్రభావంతో శుక్రవారం మన స్టాక్ మార్కెట్ నష్టాలతో ముగిసింది. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు ఆజ్యం పోశాయి. డిసెంబరులో అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల కోత ఉండకపోవచ్చనే అంచనాలతోనూ మార్కెట్ సెంటిమెంటు దెబ్బతింది. అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 98 పైసలు తగ్గి రూ.89.66కు దిగివచ్చింది. ఇది తాజా జీవనకాల కనిష్ఠ స్థాయి. గత మూడు నెలల్లోనే ఒక రోజులో రూపాయి విలువకు అత్యధిక క్షీణత ఇదే. బ్రెంట్ ముడి చమురు 0.92% నష్టంతో 62.80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.19 లక్షల కోట్లు తగ్గి రూ.472.22 లక్షల కోట్ల (5.33 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

నష్టాలతోనే మొదలు..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,632.68 తో పోలిస్తే) 285 పాయింట్ల నష్టంతో 85,347.40 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత మరింతగా డీలాపడి 85,187.84 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని చేరింది. చివరకు 400.76 పాయింట్ల నష్టంతో 85,231.92 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 124 పాయింట్లు కోల్పోయి 26,068.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,052.20 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 26,179.20 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

13 కంపెనీల షేర్లు డీలా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 13 లాభాల్లోను, 17 నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 2.8%, బజాజ్ ఫైనాన్స్ 2.29%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2.25%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.01%, బెల్ 1.61%, ఎటర్నల్ 1.61%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.06%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.95% చొప్పున నష్టపోయాయి. మారుతీ సుజుకీ 1.14%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.89%, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 0.69%, ఏషియన్ పెయింట్స్ 0.6% పెరిగాయి.

✦ చెన్నైలోని ఏపీఐ ప్లాంట్‌ను తనిఖీ చేసిన అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ, ఏడు అభ్యంతరాలతో ఫారం 483 జారీ చేసిందని **నాట్కో ఫార్మా** వెల్లడించింది. ఈ నెల 17-21 తేదీల్లో యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు చేపట్టింది. ఆ అభ్యంతరాలపై సమాధానం ఇస్తామని నాట్కో ఫార్మా పేర్కొంది.

కేపిలరీ టెక్నాలజీస్ షేరు శుభారంభం

కేపిలరీ టెక్నాలజీస్ ఇండియా షేరు, స్టాక్ ఎక్స్ఛేంజీ అరంగేట్రం సానుకూలమైంది. ఇష్యూ ధర రూ.577తో పోలిస్తే బీఎస్ఈలో 2.94% తక్కువగా రూ.560 వద్ద ఈ షేరు నమోదైంది. ఆ తర్వాత బలంగా పుంజుకొని 9.7% పెరిగి రూ.633 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 5.18% లాభంతో రూ.606.90 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 0.88% తక్కువగా రూ.571.90 వద్ద కంపెనీ షేర్ల ట్రేడింగ్ ప్రారంభమైంది. చివరకు 5.11% పెరిగి రూ.605.50 వద్ద ఇవి ముగిశాయి. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేనాటికి కేపిలరీ టెక్నాలజీస్ మార్కెట్ విలువ రూ.4,813.43 కోట్లుగా నమోదైంది.

✦ ఎక్సెల్‌సాఫ్ట్ టెక్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ముగిసే సరికి 43.19 రెట్ల స్పందన లభించింది. రిటెయిల్ మదుపర్ల విభాగంలో 15.62 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

✦ సుదీప్ ఫార్మా ఐపీఓ మొదటి రోజున 1.42 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల నుంచి 1.5 రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయి.

✦ మన విదేశీ మారకపు నిల్వలు నవంబరు 14తో ముగిసిన వారంలో 5.543 బిలియన్ డాలర్లు (సుమారు రూ.49,000 కోట్లు) పెరిగి 692.576 బిలియన్ డాలర్ల (సుమారు రూ.61 లక్షల కోట్ల)కు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు 152 మిలియన్ డాలర్లు పెరిగి 562.29 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

అనుకోని ప్రమాదం.. ఆస్పత్రిలో వివాహం



కొచ్చిన్: కళ్లలో కోటి కాంతులు.. పెళ్లిరోజు గుండెలో గంపెడు ఆశలతో బయలుదేరింది పెళ్లికూతురు. భారీ పూలతో అలంకరించిన మండపం.. వందల మంది బంధువుల సమక్షంలో మరి కొన్ని గంటల్లో అంగరంగ వైభవంగా పెళ్లి జరిగేది. కానీ, తాను ప్రయాణిస్తున్న కారుకు అనుకోని ప్రమాదం జరిగింది. కారు వెళ్లి చెట్టును తగలడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆస్పత్రికి తరలించగా వెన్నెముకకు గాయమైనట్లు తేలింది. అయితే అక్కడికి చేరుకున్న ఇరు కుటుంబాల సభ్యులు, బంధువులు ముహూర్తానికే పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని వైద్యులకు తెలియజేయగా వారు అంగీకరించారు. దీంతో ఎమర్జెన్సీ వార్డు పెళ్లి వేదిక కాగా.. వైద్యులు, కుటుంబ సభ్యుల మధ్య వధువు మెడలో వరుడు తాళికట్టాడు. తంజంబోలికి చెందిన వీఎం శరత్, కొమ్మాడికి చెందిన అవనిల వివాహం జరిగిన తీరిది. శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు జరగాల్సిన ఈ పెళ్లికి కేరళలోని కొచ్చిన్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి వేదికైంది. అవనికి త్వరలోనే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.

'దెబ్బ'కు తిరిగొచ్చిన జ్ఞాపకశక్తి!

- 45 ఏళ్ల తర్వాత కుటుంబాన్ని కలిసిన హిమాచల్ వాసి



శిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో అచ్చం సినిమా స్టోరీలాంటి సంఘటన చోటుచేసుకుంది. 16 ఏళ్ల వయసులో తలకు దెబ్బ తగిలి జ్ఞాపక శక్తిని కోల్పోయిన యువకుడు.. 45 ఏళ్ల తర్వాత 61వ ఏట మళ్లీ అలాంటి దెబ్బే తగిలి అంతా గుర్తుకు తెచ్చుకున్నాడు. తన కుటుంబాన్ని వెతుక్కుంటూ వచ్చి కలిశాడు. హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లా నది గ్రామానికి చెందిన రిఖి 1980లో ఉపాధి కోసం హరియాణాలోని యమునా నగరకు వెళ్లి హోటల్‌లో పనికి కుదిరాడు. అక్కడ అంబాలా వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలంగా గాయం కావడంతో తన పేరును, ఊరును పూర్తిగా మర్చిపోయాడు. దీంతో స్నేహితులు.. అతడికి రవి చౌదరి అని పేరు పెట్టారు. ఆ తర్వాత రవి ముంబయికి, అక్కడి నుంచి నాందేడ్‌కు వెళ్లిపోయాడు. అక్కడ ఓ యువతిని పెళ్లాడాడు. వారికి ముగ్గురు పిల్లలు. కొన్ని నెలల క్రితం తలకు మళ్లీ దెబ్బ తగిలింది. దీంతో గతమంతా గుర్తుకు వచ్చింది. ఇంటర్నెట్ ద్వారా తన గ్రామం గురించి తెలుసుకుని 45 సంవత్సరాల తర్వాత భార్యా పిల్లలతో కలిసి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు.

నైజీరియాలో 52 మంది బడిపిల్లల అపహరణ!

అబుజా: నైజీరియాలో సాయుధ దుండగులు మరోసారి బడి పిల్లల అపహరణకు తెగబడ్డారు. గుర్తు తెలియని సాయుధులు పశ్చిమ నైజీరియాలోని సెయింట్ మేరీస్ కేథలిక్ గురుకుల పాఠశాలపై శుక్రవారం తెల్లవారుజామున దాడిచేసి పలువురు బడిపిల్లల్ని అపహరించుకుపోయారని నైజర్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి అబూబకర్ ఉస్మాన్ ప్రకటించారు. కిడ్నాపైనవారు ఎందరు అన్నది తెలపలేదు. అయితే 52 మందిని అపహరించారని ఆర్జేటీ టీవీ ప్రకటించింది. సాయుధులు 25 మంది పాఠశాల విద్యార్థుల్ని అపహరించిన వారం గడవకముందే ఈ సంఘటన జరిగింది. నైజీరియాలో క్రైస్తవులకు వ్యతిరేకంగా సాగుతున్న మారణహోమాన్ని నిలిపివేయకుంటే సైనిక చర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ అపహరణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



పిల్లల ముందు తల్లిదండ్రులు ఇలా ఉండొద్దు

- ✦ చీటికి మాటికి ఒకరిపై ఒకరు గట్టిగా అరవడం.
- ✦ గొడవ తర్వాత అహంతో ఇద్దరూ రోజుల తరబడి మాట్లాడుకోకపోవడం.
- ✦ పొద్దస్తమానం టీవీ, ఫోన్లు చూస్తూ గడపడం.
- ✦ ధూమపానం, మద్యం సేవించడం.
- ✦ అనారోగ్యకరమైన ఆహారం భుజించడం.

తల్లిదండ్రులు ఎలా ఉండాలంటే..

- ✦ పరస్పరం ప్రోత్సహించుకోవడం.
- ✦ ముచ్చట్లు చెప్పుకోవడం మనసారా నవ్వడం. ✦ పుస్తకాలు చదవడం.
- ✦ వ్యాయామాలు చేయడం.
- ✦ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం.

– నేట్ నోర్మన్, లైఫ్ కోచ్

దేశానికి ఎంత చేయగలనో అంతా చేశా

- పూర్తి సంతృప్తితోనే వెళ్తున్నా
- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి
- సంప్రదాయ వీడ్కోలు ధర్మాసనంలో ప్రసంగం



దిల్లీ: దేశానికి ఎంత చేయగలనో అంత చేశానన్న పూర్తి సంతృప్తితోనే పదవి విరమణ చేస్తున్నానని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. న్యాయస్థానం నుంచి దశాబ్దాలపాటు న్యాయవాదిగా, న్యాయమూర్తిగా పని చేసిన తాను ప్రయాణం ముగింపులో మళ్లీ న్యాయ విద్యార్థిగానే వెళ్తున్నానని తెలిపారు. ఆదివారం పదవీ విరమణ చేయనున్న జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కు శుక్రవారం చివరి పనిదినం. దీంతో సంప్రదాయ వీడ్కోలు ధర్మాసనాన్ని (సెర్మోనియల్) ఏర్పాటు చేశారు. ఇందులో సీజేఐతోపాటు నూతన సీజేఐగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్.. తన అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. సాయంత్రం సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలోనూ సీజేఐ మాట్లాడారు. 'మీ అందరి ప్రసంగాలు, మీ సెంటిమెంట్లు, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కవితలు విన్న తర్వాత నా గొంతు భావోద్వేగంతో నిండిపోయింది. పూర్తి సంతృప్తితోనే నేను ఈ కోర్టు గదిని వీడుతున్నాను. అంతులేని కృతజ్ఞతలు' అని న్యాయాధికారులు, సీనియర్, యువ న్యాయవాదులతో కిక్కిరిసిన కోర్టు గదిలో సీజేఐ అన్నారు.

రాజ్యాంగ మూల సూత్రాల ఆధారంగానే..

'రాజ్యాంగంలోని సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సోదరభావం అనే నాలుగు మూల సూత్రాలకు ప్రతి వ్యక్తి, ప్రతి జడ్జి, ప్రతి న్యాయవాది కట్టుబడి పని చేస్తారని నేను నమ్ముతా. ఈ నాలుగు దిశల్లోనే నేను నా విధులను నిర్వర్తించా. నా 40 ఏళ్ల ప్రయాణంలో న్యాయవాదిగా, హైకోర్టు జడ్జిగా, సుప్రీం కోర్టు జడ్జిగా, సీజేఐగా పూర్తి సంతృప్తితో పనిచేశా' అని సీజేఐ వివరించారు.

అధికారం కాదు.. సేవకు అవకాశం

'ఏ పదవి చేపట్టినా దానిని ఒక అధికారంగా భావించకూడదు. సమాజానికి, దేశానికి సేవ చేసేందుకు వచ్చిన అవకాశంగా భావించాలి. నా న్యాయ భావజాలం.. అంబేడ్కర్ కట్టుబడిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయానికి అనుగుణంగానే సాగింది. నేను ఇచ్చిన తీర్పులన్నీ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా స్వేచ్ఛను ప్రసాదించే దిశగానే ఇచ్చాను' అని పేర్కొన్నారు.

- జస్టిస్ గవాయ్ తనకు సోదరుడి కంటే ఎక్కువని, ఆయన తనకు సోదరుడి లాంటి వారని కొత్త సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.
- సీజేఐ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పేరులో ఉన్నట్లే ఆయన న్యాయవ్యవస్థకు ఆభరణం లాంటి వారని అటార్నీ జనరల్ వెంకటరమణి ప్రశంసించారు.
- ఈ కార్యక్రమంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది మే 14వ తేదీన 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బి.ఆర్.గవాయ్.. ఈ నెల 23వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. జస్టిస్ బాలకృష్ణన్ తర్వాత.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన రెండో దళిత వ్యక్తిగా రికార్డు సృష్టించారు. బౌద్ధాన్ని పాటించే తొలి సీజేఐగా నిలిచారు.

అతిరథులు దిగి వచ్చిన వేళ..

- ఉదయపూర్‌లో వైభవోపేతంగా ఎన్నారై పారిశ్రామికవేత్త కుమార్తె వివాహ వేడుకలు
- ప్రత్యేక అతిథిగా ట్రంప్ కుమారుడు

ఉదయపూర్ నుంచి ప్రకాశ్ భండారి

అత్యంత వైభవోపేతమైన వివాహాలకు గమ్యస్థానంగా పేరొందిన ఉదయపూర్ మరో భారీ పెళ్లి వేడుకకు వర్ణశోభితంగా ముస్తాబైంది. సర్వాంగ దిన వచ్చింది! అన్నట్లుగా విలాసవంతమైన సరస్సులతో, సుందరమైన అలంకరణలతో రాజప్రాసాదాలు అతిథులకు స్వాగతం పలుకుతున్నాయి. వధూవరులిద్దరూ తెలుగు మూలాలున్నవారే కావడం విశేషం. అమెరికాలో నివసిస్తున్న ఎన్నారై బిలియనీర్ రామరాజు మంతెన కుమార్తె నేత్ర మంతెన వివాహం.. ఆ దేశంలోనే ఉంటున్న వంశీ గాదిరాజుతో ఈ నెల 23న జరగనుంది. నాలుగు రోజుల పాటు కొనసాగే పెళ్లి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వివిధ దేశాల నుంచి 600 మందికి పైగా ప్రముఖులు హాజరవుతుండడంతో ఈ వేడుకలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు ట్రంప్ జూనియర్, ఆతని స్నేహితురాలు ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. బాలీవుడ్ నటులు హృతిక్ రోషన్, షాహిద్ కపూర్, రణబీర్ కపూర్‌లతో పాటు.. మాధురీ దీక్షిత్, కృతి సనన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తదితరులు వివాహమహోత్సవంలో పాల్గొంటున్నారు. ప్రపంచ ప్రసిద్ధ గాయని జెన్నిఫర్ లోపెజ్ కూడా విచ్చేయనున్నారు. చారిత్రక కట్టడాలైన లీలా ప్యాలెస్, మానెక్ చౌక్, జెనానా మహల్ మొదలైనవి ఈ వివాహ వేడుకలకు వేదికలయ్యాయి. అమెరికాలోని ఆర్లాండో ఫ్లోరిడాలో స్థిరపడిన రామరాజు మంతెన ఇంజెనస్ ఫార్మాస్యూటికల్స్ సీఈవో. 2017లో 28 కిలోల బంగారు సహస్ర నామ కాసుల హారాన్ని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి బహూకరించారు. వరుడు వంశీ గాదిరాజు.. 'సూపర్‌ఆర్డర్' సహ వ్యవస్థాపకుడు. 2024 ఫోర్బ్స్ అండర్ 30 జాబితాలో చోటుదక్కించుకున్నారు.



వంశీ గాదిరాజు – నేత్ర

వన్‌తారా, తాజ్‌మహల్‌ల సందర్శన

భారత పర్యటనలో భాగంగా ట్రంప్ జూనియర్, ఆతని స్నేహితురాలు.. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, కోడలు రాధికా మర్చంట్‌తో కలిసి గురువారం గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న గణపతి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో సంప్రదాయ దాండియా ఆడారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న అతిపెద్ద వన్యప్రాణి సంరక్షణ పునరావాస కేంద్రం వన్‌తారాను కూడా సందర్శించారు. అంతకుముందు ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించి.. కట్టడ చరిత్ర, శిల్పకళ గురించిన వివరాలు తెలుసుకున్నారు.

నేలకూలిన తేజస్ యుద్ధవిమానం

- దుబాయ్ ఎయిర్‌షోలో ఘటన.. పైలట్ దుర్మరణం



నమాంశ్ స్యాల్

దుబాయ్/ దిల్లీ: భారత వైమానిక దళానికి చెందిన తేజస్ యుద్ధవిమానం శుక్రవారం దుబాయ్‌లో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో పైలట్.. వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ ప్రాణాలు కోల్పోయారు. దుబాయ్ ఎయిర్‌షోలో.. నేల నుంచి తక్కువ ఎత్తులో విన్యాసాలు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ జెట్ అకస్మాత్తుగా ఆకాశం నుంచి కిందకి జారిపోతూ సెకన్ల వ్యవధిలోనే దుబాయ్ వరల్డ్ సెంటర్‌లోని మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నేలను ఢీ కొట్టి పేలిపోయి భారీగా మంటలు చెలరేగాయి. భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 3.40 గంటలకు ఈ ఘటన జరిగింది. వెంటనే అత్యవసర బృందాలు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ఘటనపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తేజస్ తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) అధికారులు విచారం వ్యక్తం చేశారు. పైలట్ మృతికి సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంపై భారత వాయుసేన విచారణకు ఆదేశించింది. స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ రూపొందించిన తేజస్ కూలిపోవడం ఇది రెండోసారి. గత ఏడాది మార్చి 12న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో 'భారత్ శక్తి' విన్యాసాలు జరిగే సమయంలో తొలిసారిగా ఈ జెట్ కూలింది. తాజా ప్రమాదంలో చనిపోయిన పైలట్ నమాంశ్ స్వస్థలం హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో ఉన్న నగ్రోటా భగవాన్ పట్టణం. ఆయన భార్య అఫ్సానా కూడా భారత వాయుసేనలో పైలట్‌గా పనిచేస్తున్నారు. వారికి ఒక కుమార్తె ఉంది.

జొహన్నెస్‌బర్గ్ చేరుకున్న మోదీ

ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో భేటీ

దిల్లీ, జొహన్నెస్‌బర్గ్: జీ20 దేశాల 20వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ శుక్రవారం దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్ చేరుకున్నారు. ఇక్కడి గౌటెంగ్‌లోని ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో మోదీకి సంప్రదాయబద్ధంగా స్వాగతం లభించింది. మోదీ జొహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో భేటీ అయ్యారు. రక్షణ, అణు ఇంధనం సహా పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై చర్చించారు.



అల్బనీస్‌తో ప్రధాని మోదీ

నీతీశ్ కేబినెట్ నిండా నేరగాళ్లు, అవినీతిపరులే

- ప్రశాంత్ కిశోర్ విమర్శ

బెట్టియా: బిహార్‌లో నీతీశ్‌కుమార్ నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన మంత్రివర్గం అవినీతి పరులు, నేరగాళ్లతో నిండి ఉందని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపక నేత ప్రశాంత్ కిశోర్ శుక్రవారం ఆరోపించారు. పశ్చిమ చంపారన్‌లో గాంధీ ఆశ్రమం వద్ద రోజంతా మౌనవ్రతం నిర్వహించిన అనంతరం ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ జనవరి 15 నుంచి బిహార్ నవ నిర్మాణ సంకల్ప యాత్రను ప్రారంభిస్తుందని, ఈ యాత్ర సందర్భంగా జన్ సురాజ్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటినీ సందర్శిస్తారని ఆయన తెలిపారు. బిహార్ మంత్రి మండలిలో స్థానం పొందిన వారిని చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌లకు బిహార్ ప్రగతి పట్ల ఎలాంటి ఆసక్తి లేదని అవగతం అవుతోందన్నారు. దాదాపు కోటి మందికి పైగా మహిళల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున బదిలీ చేయడం ద్వారా అధికార కూటమి ఓట్లను కొనుగోలు చేసిందని ఆరోపించారు.



పశ్చిమ చంపారన్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్ కిశోర్

ముంబయి విమానాశ్రయంలో.. రూ.53 కోట్ల విలువైన డ్రగ్స్, బంగారం పట్టివేత

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.53 కోట్ల విలువైన గంజాయి, బంగారం, వజ్రాలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ కేసుల్లో దాదాపు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. నవంబరు 13 నుంచి 20 తేదీల మధ్య చేపట్టిన ఆపరేషన్లలో ఈ పట్టివేతలు చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యకలాపాల్లో భాగంగా మొదట దాదాపు రూ.25 కోట్లు విలువ చేసే 25 కిలోల హైడ్రోపోనిక్ వీడ్(గంజాయి)ను స్వాధీనం చేసుకున్నారు. వాటితో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేశారు. మరో ఏడు కేసుల్లో దాదాపు రూ.27 కోట్లు విలువ చేసే 27 కేజీల గంజాయిని పట్టుకున్నారు. దీనికి సంబంధించి 8 మందిని అరెస్టు చేశారు. అదేవిధంగా బంగారు అక్రమ రవాణాకు సంబంధించి రూ.65 లక్షలు విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో రూ.54 లక్షల విలువైన వజ్రాలను సీజ్ చేశారు.

బొగ్గు మాఫియాపై ఈడీ దాడులు

- రూ.10 కోట్ల విలువైన నగదు, బంగారం స్వాధీనం

రాంచీ/కోల్‌కతా: ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో "బొగ్గు మాఫియా"కు వ్యతిరేకంగా నమోదైన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం రెండు రాష్ట్రాల్లో పలుచోట్ల సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో రూ.10 కోట్ల విలువైన నగదు, బంగారు జప్తు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ దాడులు సాయంత్రం వరకూ కొనసాగాయి. దాదాపు 40 చోట్ల సోదాలు నిర్వహించారు. దాదాపు 100 మంది అధికారులు, ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రూ.8 కోట్ల విలువైన నగదు, బంగారు జప్తు కాగా, ఝార్ఖండ్‌లో జరిపిన సోదాల్లో రూ.2.2 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఝార్ఖండ్‌లో జరిపిన దాడుల్లో దాదాపు 120 భూమి పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈడీ బృందాలకు కేంద్ర బలగాలు భద్రత కల్పించాయి. పలు నివాసాలు, కార్యాలయాలు, టోల్ సేకరణ బూత్‌లు, చెక్‌పోస్టులపై కూడా ఈడీ బృందాలు దాడులు నిర్వహించాయి. అనిల్ గోయల్, సంజయ్ ఉద్యోగ్, ఎల్.బి. సింగ్, అమర్ మండల్ అనే వ్యక్తులకు చెందిన ఆవాసాలపై దాడులు నిర్వహించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.



సోదాల్లో స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

నదిలో పడిపోయిన బస్సు


కాంబోడియాలో 16 మంది దుర్మరణం

ఫ్నోమ్ పెన్: కాంబోడియాలో వంతెనపై నుంచి ఓ బస్సు అదుపు తప్పి నదిలో పడిపోవడంతో 16 మంది మృతిచెందారు. 24 మంది గాయపడ్డారు. గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రసిద్ధమైన ఆంగ్‌కోర్ వాట్ ఆలయ సముదాయంలోని సీమ్ రీప్ నుంచి రాజధాని ఫ్నోమ్ పెన్ వస్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. మృతుల్లో డ్రైవర్ ఉన్నాడా? లేదా అనే విషయాన్ని మాత్రం అధికారులు వెల్లడించలేదు.

కేరళలో 'సర్'పై ఎన్నికల సంఘానికి నోటీసు

- 26న సుప్రీంకోర్టు విచారణ

దిల్లీ: కేరళలో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కసరత్తును నిర్వహించాలన్న ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సమ్మతించింది. ఈ వ్యవహారంపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి ధర్మాసనం శుక్రవారం ఈసీకి నోటీసు జారీ చేసింది. ప్రైవేటు వ్యక్తులు కాకుండా వివిధ రాజకీయ పార్టీల నాయకులు 'సర్'ను సవాల్‌చేస్తూ ముందుకు రావడం మంచిదేనని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ నెల 26న విచారణకు వచ్చే కేసుల జాబితాలో చేర్చాలని కోర్టు సిబ్బందిని ఆదేశించారు. ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో 'సర్' కసరత్తుపై దాఖలైన వ్యాజ్యాలను డిసెంబరు మొదటి లేదా రెండో వారంలో విచారణకు చేపడతారు.



మహిళా లాయర్లపై లైంగిక వేధింపుల కేసులో కేంద్రం, బీసీఐలకు సుప్రీంకోర్టు నోటీసు

బార్ కౌన్సిళ్ల పరిశీలనలోని ఫిర్యాదులకు పోష్ చట్టం వర్తించదనడంపై పిటిషన్

దిల్లీ: న్యాయవాదులపై బార్ కౌన్సిళ్లలో మహిళా లాయర్లు చేసిన ఫిర్యాదులకు 'పని స్థలాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం' (పోష్ యాక్ట్) వర్తించదంటూ బాంబే హైకోర్టు జులై 7న ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం వేసిన ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం శుక్రవారం కేంద్ర ప్రభుత్వంతో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)కి నోటీసు జారీ చేసింది. ఇటువంటి వివాదానికే సంబంధించిన మరో పిటిషన్‌తో ఈ కేసును జత చేసింది. బార్ కౌన్సిళ్ల ముందున్న ఫిర్యాదులకు పోష్ చట్టం వర్తించదని తీర్పునివ్వడం వల్ల న్యాయం పొందే అవకాశం తమకు లేకుండా పోయిందని మహిళా న్యాయవాదుల సంఘం తెలిపింది. మహిళా లాయర్లు తమ ఇబ్బందులపై న్యాయవాదుల చట్టం-1961లోని సెక్షన్ 35 ప్రకారం బార్ కౌన్సిళ్లను సంప్రదించాలన్న హైకోర్టు తీర్పును సంఘం సవాల్ చేసింది. సెక్షన్ 36... వృత్తిపరమైన దుష్ప్రవర్తనకు శిక్షించటానికి సంబంధించినది మాత్రమేనని, లైంగిక వేధింపుల కేసులు దీనికి భిన్నమైనవని పిటిషనర్లు పేర్కొన్నారు.

చైనీయులు ఎక్కడి నుంచైనా

పర్యాటక వీసాలకు దరఖాస్తు చేసుకోవచ్చు

వెసులుబాటు కల్పించిన భారత్

దిల్లీ: చైనా పౌరులు ప్రపంచంలోని ఏ భారత కాన్సులేట్, మిషన్ల నుంచి అయినా పర్యాటక వీసాలకు దరఖాస్తు చేసుకోవడానికి భారత్ వెసులుబాటు కల్పించింది. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో మన దేశం ఈ నిర్ణయం తీసుకుంది. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత చైనీయులకు పర్యాటక వీసాలను భారత్ నిలిపేసింది. గత జులైలోనే మళ్లీ పునరుద్ధరించింది. తాజాగా ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

భారత్‌లో 30 శాతం మహిళలపై సన్నిహిత భాగస్వామి హింస

డబ్ల్యూహెచ్‌వో నివేదిక వెల్లడి

దిల్లీ: భారత్‌లో 2023 సంవత్సరంలో 15-49 ఏళ్ల వయసు గల మహిళల్లో ఐదో వంతు మంది సన్నిహిత భాగస్వామితో హింసకు గురవ్వగా, దాదాపు 30 శాతం మంది వారి జీవితకాలంలో ఈ సమస్య బారినపడ్డారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తెలిపింది. నవంబరు 25న 'మహిళలు, బాలికలపై హింస నిర్మూలన దినోత్సవం' సందర్భంగా ప్రపంచ వ్యాప్త పరిస్థితులపై డబ్ల్యూహెచ్‌వో నివేదిక విడుదల చేసింది. 'ప్రపంచ వ్యాప్తంగా దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరు, మొత్తంగా 840 మిలియన్ల (84 కోట్లు) మంది వారి జీవితకాలంలో లైంగిక హింస ఎదుర్కొన్నారు. 2000 నుంచి ఈ సంఖ్యలో పెద్దగా మార్పులేదు. ప్రపంచంలో 15-49 సంవత్సరాల వయసు గల మహిళల్లో 8.4 శాతం మంది భాగస్వామి కాని వ్యక్తుల నుంచి లైంగిక హింసకు గురవుతున్నారని అంచనా. భారత్‌లో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న మహిళల్లో దాదాపు 4 శాతం మంది భాగస్వామి కాని వ్యక్తుల నుంచి లైంగిక హింసను ఎదుర్కొంటున్నారని అంచనా' అని నివేదిక తెలిపింది. 'మహిళలపై హింస మానవాళిలో అత్యంత పురాతన, విస్తృత అన్యాయాల్లో ఒకటి. ఇప్పటికీ అతి తక్కువగా పరిష్కార చర్యలు తీసుకుంటున్న వాటిలో ఒకటి' అని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ అన్నారు. మహిళలు, బాలికలకు సాధికారత కల్పించడం ఐచ్ఛికం కాదని.. శాంతి, అభివృద్ధి, ఆరోగ్యానికి ఇది తప్పనిసరని ఆయన పేర్కొన్నారు.

నెహ్రూ రాతలు దిక్సూచి లాంటివి: రాహుల్

భారత తొలి ప్రధాని రచనలు 100 సంపుటాలుగా డిజిటలీకరణ

దిల్లీ: భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రచనలు కేవలం చరిత్ర ఒక్కటే కాదని, దేశ పరిణామ క్రమానికి మనస్సాక్షి లాంటి రికార్డులని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. మన ప్రజాస్వామ్య ప్రయాణాన్ని అధ్యయనం చేయాలని అనుకునేవారికి అవి శక్తిమంతమైన దిక్సూచి లాంటివని అభిప్రాయపడ్డారు. ఆధునిక భారతదేశాన్ని రూపొందించడంలో ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాల గురించి లోతైన విశ్లేషణను ఆయన రచనలు అందిస్తాయన్నారు. ఎంపిక చేసిన నెహ్రూ రచనల డిజిటలీకరణ ప్రక్రియ పూర్తికావడంపై శుక్రవారం రాహుల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ రచనలు ఇప్పుడు ఆన్‌లైనులో 100 సంపుటాలుగా అందుబాటులో ఉన్నాయి. దాదాపు 35,000 దస్తావేజులు, 3,000కు పైగా దృష్టాంతాలు పొందుపరిచన ఈ రచనలను http://nehruarchive.in లో ఉచితంగా డౌన్‌లోడు చేసుకోవచ్చు. నెహ్రూ గురించి, దేశం కోసం ఆయన సాధించిన అద్భుతమైన విజయాల గురించి వక్రీకరణ, దుష్ప్రచారం జరుగుతున్న తరుణంలో ఈ రచనలు డిజిటల్ రూపంలో అందుబాటులోకి రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్' ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ల్యాప్‌టాప్ మాదిరిగా స్మార్ట్‌ఫోనులోనూ సులువుగా చూసుకునేలా నెహ్రూ రచనల డిజిటలీకరణ చేసినట్లు 'జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్' (జేఎన్ఎంఎఫ్) ట్రస్టీ, కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ తెలిపారు.



మత్స్యకారులకు భద్రత, గౌరవం కల్పించాలి

దేశవ్యాప్తంగా మత్స్యకారుల జీవన ప్రమాణాలకు మరింత భద్రత, న్యాయమైన ధరలు, గౌరవంతోపాటు ఆధునిక వసతులు కల్పించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. 'ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం' సందర్భంగా శుక్రవారం 'ఎక్స్' ద్వారా ఆయన స్పందిస్తూ.. ఈ వర్గం దేశానికి ఆహారం అందిస్తూ, మన ఆర్థిక వ్యవస్థ ప్రగతికి దోహదపడుతోందన్నారు.



కాప్ సదస్సులో అగ్నిప్రమాదం.. 21 మందికి గాయాలు

బెలెమ్: బ్రెజిల్‌లోని బెలెమ్‌లో నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ - 30 (కాప్) సదస్సులో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 21 మంది గాయపడ్డారు. వివిధ దేశాలు నెలకొల్పిన పెవిలియన్లు, మీడియా సెంటర్ ఉన్న 'బ్లూ జోన్'లో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మైక్రోవేవ్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు బ్రెజిల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. వీరిలో 19 మంది దట్టమైన పొగ పీల్చడంతోనే అస్వస్థతకు గురైనట్లు వివరించారు. వారిలో 12 మంది డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ప్రమాద సమయంలో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అక్కడే ఉన్నారు. యూఎన్ భద్రతా రక్షణ అధికారులు గుటెరస్‌తో పాటు మిగిలిన వారిని బయటకు తరలించారు. ఈ సదస్సుకు భారత్ తరఫున హాజరైన పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ సురక్షితంగా బయటపడినట్లు మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు.

గంభీర్‌పై కొవిడ్ డ్రగ్స్ కేసును కొట్టేసిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: ఓ కేసు విషయంలో టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు దిల్లీ హైకోర్టు ఉపశమనం కల్పించింది. కొవిడ్ రెండో దశ సమయంలో గంభీర్‌పై దాఖలైన క్రిమినల్ ఫిర్యాదును దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. కొవిడ్-19 రెండో దశ సమయంలో మందులను అక్రమంగా నిల్వ చేసి పంపిణీ చేశారని గౌతమ్ గంభీర్ ఫౌండేషన్‌పై అప్పట్లో కేసు నమోదైంది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టేసింది. గంభీర్ భాజపా ఎంపీగా ఉన్న సమయంలో కొవిడ్ మందులను అక్రమంగా నిల్వ చేసినట్లు అతడిపైన, ఫౌండేషన్ ట్రస్టీలైన గంభీర్ భార్య నటాషా, తల్లి సీమా, కంపెనీ సీఈవోలపై దిల్లీ ప్రభుత్వ డ్రగ్ కంట్రోల్ విభాగం ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ట్రయల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను గంభీర్ దిల్లీ హైకోర్టులో సవాలు చేశారు. సెప్టెంబరు 2021లో ఈ కేసులో ట్రయల్ కోర్టు కార్యకలాపాలపై హైకోర్టు స్టే విధించింది. ట్రయల్ కోర్టుపై విధించిన స్టేను ఏప్రిల్ 9న హైకోర్టు ఎత్తేయడంతో గంభీర్ హైకోర్టును ఆశ్రయించారు.

(c) eenadu

ఛాంపియన్

నిరుడు న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైతే అది అనుకోకుండా ఎదురైన పరాభవమని.. సొంతగడ్డపై మళ్లీ ఇలాంటి పరాజయాలు ఎదురవ్వవని అనుకున్నారు అభిమానులు! కానీ గత వారం దక్షిణాఫ్రికా చేతిలోనూ అనూహ్య ఓటమి ఎదురవ్వడంతో టీమ్‌ఇండియాకు ఏమైంది.. అంటూ అందరిలో నిట్టూర్పు! ఈడెన్ గార్డెన్స్‌లో రెండు రోజులు పైచేయి సాధించి.. మూడో రోజు మ్యాచ్‌ను కోల్పోవడం జట్టుకు పెద్ద షాకే. ఈ స్థితి నుంచి భారత్ ఎలా పుంజుకుంటుందన్నది ప్రశ్న. తొలి టెస్టు నుంచి అర్ధంతరంగా తప్పుకొన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేడు. మరి రిషబ్ పంత్ సారథ్యంలో టీమ్‌ఇండియా.. దక్షిణాఫ్రికాకు రివర్స్ పంచ్ ఇస్తుందా? టెస్టు వేదికగా అరంగేట్రం చేస్తున్న గువాహటి భారత్‌కు అత్యావశ్యక విజయాన్నందిస్తుందా?


రిషబ్ పంత్

"ఏదో ఒక్క టెస్టు మ్యాచ్‌కు కెప్టెన్‌గా ఉండడం అంత బాగా అనిపించదు. అదే సమయంలో బీసీసీఐ నాకీ గౌరవం ఇచ్చినందుకు గర్విస్తున్నా. ఏ పరిస్థితుల్లో అయినా సరే జట్టును నడిపించడం గర్వకారణమే. కొన్నిసార్లు సంప్రదాయబద్ధంగా వెళ్లడం బాగుంటుంది. కొన్నిసార్లు కొత్తగా ప్రయత్నించడం వల్ల మంచి ఫలితాలు రాబట్టవచ్చు. రెంటికీ మధ్య సమతూకం పాటించడం కీలకం. ఆటగాళ్లు పరిస్థితులను బట్టి స్పందిస్తారని, సరైన నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నా. నేను ఆటను ఆస్వాదిస్తూ జట్టు కోసం చేయాల్సింది 100 శాతం చేస్తా"

– రిషబ్ పంత్

సమమా.. సమర్పణమా?

- ఒత్తిడిలో టీమ్‌ఇండియా
- దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు నేటి నుంచే

ఉదయం 9 నుంచి

గువాహటి

సొంతగడ్డపై మరో సిరీస్ ఓటమి ముప్పు పొంచి ఉండగా.. గువాహటిలో కీలక పోరుకు సిద్ధమైంది టీమ్‌ఇండియా. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్య పరాజయం చవిచూసిన భారత్.. గువాహటిలో శనివారం నుంచి సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టు ఆడబోతోంది. ఈ మైదానంలో జరగనున్న తొలి టెస్టు మ్యాచ్ ఇదే కావడం విశేషం. శుభ్‌మన్ గైర్హాజరీలో టీమ్‌ఇండియా పగ్గాలు చేపట్టిన రిషబ్ పంత్‌కు జట్టును గెలిపించి సిరీస్‌ను సమం చేయడం సవాలే. సుదీర్ఘ విరామం తర్వాత భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలిచేందుకు వచ్చిన అవకాశాన్ని విడిచిపెట్టకూడదని సఫారీ జట్టు పట్టుదలతో ఉంది.

మార్పులు చేర్పులు..: ఒక స్పెషలిస్టు బ్యాటర్‌ను తగ్గించుకుని, ఏకంగా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. అందుకు భారీ మూల్యమే చెల్లించుకుంది. ప్రత్యర్థికి ఉచ్చు బిగిద్దామనుకుని తయారు చేయించుకున్న స్పిన్ పిచ్.. చివరికి భారత్ మెడకే చుట్టుకుంది. రెండో రోజు నుంచే బంతి విపరీతంగా తిరిగిన పిచ్‌పై బ్యాటింగ్ చేయడం భారత బ్యాటర్లకూ సవాలుగా మారింది. మూడో రోజు కేవలం 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక 93 పరుగులకే కుప్పకూలి అవమాన భారాన్ని మూటగట్టుకుంది భారత్. దీంతో జట్టుపైనే కాక కోచ్ గౌతమ్ గంభీర్ మీదా తీవ్ర విమర్శలు తప్పలేదు. ఈ నేపథ్యంలో రెండో టెస్టు విషయంలో అన్ని విషయాల్లోనూ జాగ్రత్త పడాల్సిన అవసరం పడింది. గువాహటి పిచ్ సమతూకంతోనే ఉండొచ్చనే అంచనాలున్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడడంతో అనివార్యంగా తుది జట్టులో ఒక మార్పు తప్పదు. అంతే కాక ఈ మ్యాచ్‌కు ఒక స్పిన్నర్‌ను తగ్గించుకోనుంది భారత్. అక్షర్ పటేల్ మీద వేటు పడనుంది. సాయి సుదర్శన్‌తో పాటు పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తుది జట్టులోకి రానున్నారు. గువాహటి పిచ్ పేసర్లకు అనుకూలమన్న అంచనాల నేపథ్యంలో నితీశ్‌ను ఆడించబోతున్నారు. సుదర్శన్ ఎప్పట్లాగే మూడో స్థానంలో బ్యాటింగ్ చేయనుండగా.. గిల్ ఆడుతున్న నాలుగో స్థానంలో ధ్రువ్ జురెల్ దిగుతాడు. జడేజా, సుందర్, కుల్‌దీప్ స్పిన్ బాధ్యతలు నిర్వర్తించనుండగా. . బుమ్రా, సిరాజ్ కొత్త బంతిని పంచుకోనున్నారు. మరి వీరిలో వికెట్ల వేటలో దూసుకెళ్లేదెవరో చూడాలి. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ మీద పెద్ద బాధ్యతే ఉంది. బౌలింగ్ పిచ్‌పై తడబడ్డ ఈ ఇద్దరూ ఈ మ్యాచ్‌లో పెద్ద ఇన్నింగ్స్‌లతో జట్టుకు బలమైన పునాది వేయాల్సి ఉంది. పునరాగమనంలో సుదర్శన్ ఎలాంటి ఇన్నింగ్స్ ఆడతాడో చూడాలి. పంత్, జురెల్‌ల మీదా జట్టు ఎన్నో ఆశలతో ఉంది.

ఉత్సాహంతో దక్షిణాఫ్రికా ..: ప్రాక్టీస్‌లో గాయపడి తొలి టెస్టుకు దూరమైన దక్షిణాఫ్రికా రబాడ.. రెండో టెస్టులోనూ బరిలోకి దిగట్లేదు. పేస్‌కు అనుకూలించే గువాహటిలో భారత్‌కు ఇది సానుకూలాంశమే. కానీ ఈడెన్‌లో సత్తా చాటిన పొడగరి మార్కో యాన్సెన్ నుంచి ముప్పు పొంచి ఉంది. కార్బిన్ బోష్ అతడితో కలిసి పేస్ దాడిని ఆరంభిస్తాడు. ఇక తొలి టెస్టులో భారత్ పతనాన్ని శాసించిన స్పిన్నర్ సైమన్ హార్మర్‌ను.. ఈ మ్యాచ్‌లో అయినా మన బ్యాటర్లు సమర్థంగా ఎదుర్కొంటారేమో చూడాలి. కేశవ్ మహరాజ్ కూడా ప్రతిభాంతుడైన స్పిన్నరే. వీళ్లిద్దరికీ తోడుగా ముల్డర్ స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ సెనురాన్ ముత్తుస్వామిని ఆడించాలని దక్షిణాఫ్రికా చూస్తోంది. కెప్టెన్ టెంబా బవుమాకు తోడు మార్‌క్రమ్, రికిల్‌టన్, జోర్జి, స్టబ్స్, వెరీన్‌లతో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. బోష్, యాన్సెన్ సైతం బ్యాటుతో ఒక చేయి వేయగల వాళ్లే. 15 ఏళ్ల తర్వాత భారత్‌లో టెస్టు మ్యాచ్ గెలిచిన ఉత్సాహంలో.. 25 ఏళ్ల తర్వాత సిరీస్‌నూ సొంతం చేసుకోవాలని సఫారీ జట్టు చూస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్: యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రిషబ్ పంత్ (కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, ర్యాన్ రికిల్‌టన్, ముల్డర్/ సెనురాన్ ముత్తుస్వామి, టోనీ డి జోర్జి, టెంబా బవుమా (కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరీన్, కార్బిన్ బోష్, మార్కో యాన్సెన్, సైమన్ హార్మర్, కేశవ్ మహరాజ్.


టోనీ డి జోర్జి, హంజా


గంభీర్, జైస్వాల్

- భారత్‌లో ఇప్పటి దాకా దక్షిణాఫ్రికా ఒక్క సారి మాత్రమే టెస్టు సిరీస్ నెగ్గింది. 2000లో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆ జట్టు క్లీన్‌స్వీప్ చేసింది.

పిచ్ ఎలా?

గువాహటిలో జరగనున్న తొలి టెస్టు మ్యాచ్ ఇదే. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు, బౌలింగ్‌కు సమానంగా సహకరిస్తుందని అంచనా. తొలి రెండు రోజులు పేసర్లకు అవకాశముంటుంది. నిలదొక్కుకుంటే బ్యాటింగ్ చేయడం తేలికే. మూడో రోజు నుంచి స్పిన్నర్లకు అవకాశముంటుంది.

టీ ముందు, లంచ్ తర్వాత..

గువాహటిలో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా లంచ్, టీ విరామాల వేళలను మార్చారు. ఉదయం 9 గంటలకే ఆట ఆరంభం కానుండగా.. 11 గంటలకు టీ బ్రేక్ ఇస్తారు. 1.20కి లంచ్ విరామం ఉంటుంది.

57 టెస్టుల్లో కెప్టెన్ అయ్యాక బవుమా బ్యాటింగ్ సగటు. సారథ్యం చేపట్టకముందు తన సగటు 34.53 మాత్రమే.

ముంబయికి శుభ్‌మన్


గిల్

గువాహటి: మెడ గాయం కారణంగా రెండో టెస్టుకు దూరమైన టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టు నుంచి విడుదలయ్యాడు. ఫిట్‌నెస్‌పై సందేహాలున్నప్పటికీ అతను కోల్‌కతా నుంచి రెండో టెస్టు వేదికైన గువాహటికి వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారానికి కోలుకునే అవకాశం లేదని తేలడంతో రెండు రోజుల ముందే మ్యాచ్‌కు గిల్ దూరమవుతున్నట్లు వార్తలొచ్చాయి. మ్యాచ్‌కు ముందు రోజు శుభ్‌మన్‌ను జట్టు నుంచి విడుదల చేయగా.. అతను ముంబయికి బయల్దేరాడు. అక్కడ అతడి గాయం తీవ్రతను అంచనా వేయనున్నారు. ఈ నెల 30 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో ఆడేదీ లేనిదీ రెండు మూడు రోజుల్లో స్పష్టత రావచ్చు.

యాషెస్‌ను చూస్తే అసూయగా ఉంది


బవుమా

గువాహటి: భారత్‌తో తమ టెస్టు సిరీస్‌ను రెండు మ్యాచ్‌లకు పరిమితం చేయడంపై దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌ల మధ్య శుక్రవారం మొదలైన అయిదు టెస్టుల యాషెస్ సిరీస్‌ను చూస్తే తనకు అసూయ కలిగిందని అతనన్నాడు. "ఈ రోజు ఉదయం నిద్ర లేవగానే యాషెస్ చూశా. ఈ సిరీస్‌లో వాళ్లు అయిదు టెస్టులు ఆడనున్నారని తెలిసి నాకు కొంత అసూయ కలిగింది. సమీప భవిష్యత్తులో భారత్‌తో మేం కూడా నాలుగు టెస్టుల సిరీస్ ఆడతామని ఆశిస్తున్నా" అని బవుమా అన్నాడు.

స్టార్క్.. స్టోక్స్ వేటాడేశారు

- యాషెస్ టెస్టులో తొలి రోజు.. 19 వికెట్లు
- ఇంగ్లాండ్ 172 ఆలౌట్
- ఆసీస్ 123/9


స్టార్క్ 7/58


స్టోక్స్ 5/23

పెర్త్: పేస్‌కు స్వర్గధామమైన పెర్త్‌లో తొలి టెస్టు. ఊహించినట్లే తొలి రోజు పేసర్లు బ్యాటర్లను వణికించారు. కానీ ఊహించని విధంగా ఆట మొదటి రోజే దాదాపుగా రెండు ఇన్నింగ్స్ ముగిసిపోయాయి. ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ మధ్య అయిదు టెస్టుల యాషెస్ సిరీస్ ఆసక్తికరంగా మొదలైంది. బౌలర్లు పండగ చేసుకోవడంతో శుక్రవారం పెర్త్‌లో ఆరంభమైన తొలి టెస్టులో తొలి రోజే 19 వికెట్లు కూలాయి. ఇంగ్లాండ్ 200లోపే కుప్పకూలినా.. మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం దిశగా సాగుతోందంటే పేసర్లు ఎంతటి ప్రతాపం చూపించారో అర్థం చేసుకోవచ్చు. పిచ్‌పై పేస్, బౌన్స్‌ను ఉపయోగించుకున్న మిచెల్ స్టార్క్ (7/58) ధాటికి మొదట ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (52; 61 బంతుల్లో 5×4, 1×6), ఒలీ పోప్ (46; 58 బంతుల్లో 4×4) రాణించారు. బెన్ స్టోక్స్ (5/23) విజృంభించడంతో ఆట చివరికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 123/9తో కష్టాల్లో పడింది. లైయన్ (3), డాగెట్ (0) క్రీజులో ఉన్నారు. కేరీ (26), గ్రీన్ (24), ట్రావిస్ హెడ్ (21) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆర్చర్ (2/11), కార్స్ (2/45) కూడా రాణించారు. చేతిలో ఒక వికెటే ఉన్న ఆస్ట్రేలియా ఇంకా 49 పరుగులు వెనుకబడి ఉంది.

వికెట్లు టపటపా..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్‌ను ఆరంభం నుంచి ఆసీస్ పేసర్లు కుదురుకోనీయలేదు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే క్రాలీ (0)ని ఔట్ చేయడం ద్వారా స్టార్క్ వికెట్ల పతనాన్ని మొదలుపెట్టాడు. డకెట్ (21; 20 బంతుల్లో 4×4) కాసేపు నిలవడంతో ఇంగ్లాండ్ 30/1తో కుదురుకుంది. కానీ స్వల్ప తేడాతో డకెట్, రూట్ (0)లను ఔట్ చేసిన స్టార్క్.. ఇంగ్లాండ్‌ను గట్టి దెబ్బ తీశాడు. ఈ స్థితిలో పోప్, బ్రూక్ ఆదుకోవడంతో ఇంగ్లాండ్ 84/3తో కోలుకుంది. లంచ్‌కు ముందు పోప్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న గ్రీన్.. ఈ జోడీని విడగొట్టాడు. విరామం తర్వాత బెన్ స్టోక్స్ (6) ఔటైనా.. బ్రూక్, జేమీ స్మిత్ (33; 22 బంతుల్లో 6×4) దూకుడుగా ఆడారు. ఒక దశలో 152/5తో ఇంగ్లిష్ జట్టు మెరుగైన స్థితిలోనే కనిపించింది. బ్రూక్‌ను అరంగేట్ర పేసర్ బ్రెండన్ డాగెట్ (2/27) పెవిలియన్ చేర్చడంతో ఇంగ్లాండ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. చివరి రెండు వికెట్లను వరుస బంతుల్లో పడగొట్టిన స్టార్క్.. ఇన్నింగ్స్‌కు తెరదించాడు. ఆఖరి 6 వికెట్లను ఇంగ్లాండ్ 67 పరుగులకే కోల్పోయింది. తక్కువ స్కోరుకే ఆలౌటైనా.. స్టోక్స్ సేన 5పైన రన్‌రేట్‌తో పరుగులు సాధించింది. ఇంగ్లాండ్ మాదిరే ఆస్ట్రేలియా కూడా తొలి ఓవర్ నుంచే తడబడింది. ఇన్నింగ్స్ రెండో బంతికే అరంగేట్ర బ్యాటర్ జేక్ వెదరాల్డ్ (0)ను ఆర్చర్ ఔట్ చేశాడు. తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్ (17), లబుషేన్ (9) కాసేపు వికెట్ల పతనాన్ని ఆపారు. ఆర్చర్, కార్స్ విజృంభించడంతో స్కోరు 31/4గా మారిపోయింది ఈ స్థితిలో హెడ్, గ్రీన్ నిలవడంతో ఆసీస్ 76/4తో కోలుకుంది. కానీ స్టోక్స్ దెబ్బకు ఆస్ట్రేలియా పతనం మళ్లీ మొదలైంది. 45 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు పోగొట్టుకుని ఆ జట్టు కష్టాల్లో చిక్కుకుంది.

- యాషెస్ తొలి టెస్టు తొలి రోజు 19 వికెట్లు కూలడం ఇదే మొదటిసారి. 1888 సిడ్నీ టెస్టులో 18 వికెట్లు పడడమే ఇప్పటి దాకా అత్యధికం.

భారత్-ఎకు షాక్

- సెమీస్‌లో బంగ్లా చేతిలో ఓటమి
- రైజింగ్ స్టార్స్ ఆసియా కప్

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియాకప్ టోర్నీలో టైటిల్ ఫేవరెట్ భారత్-ఎ ఓడిపోయింది. శుక్రవారం ఉత్కంఠభరిత సెమీఫైనల్లో బంగ్లాదేశ్-ఎ.. సూపర్ ఓవర్లో భారత్‌ను ఓడించింది. మొదట బంగ్లా 20 ఓవర్లలో 6 వికెట్లకు 194 పరుగులు చేసింది. హబిబుర్ సోహన్ (65; 46 బంతుల్లో 3×4, 5×6), మెహ్రాబ్ (48 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 6×6) చెలరేగారు. నమన్ ధీర్ వేసిన 19వ ఓవర్లో మెహ్రాబ్ 4 సిక్స్‌లు, ఒక ఫోర్ కొట్టాడు. ఆఖరి రెండు ఓవర్లలో బంగ్లా ఏకంగా 50 పరుగులు రాబట్టింది. బదులుగా భారత్ సరిగ్గా 6 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. ప్రియాంశ్ ఆర్య (44; 23 బంతుల్లో 4×4, 3×6), వైభవ్ సూర్యవంశీ (38; 15 బంతుల్లో 2×4, 4×6) శుభారంభం అందించారు. ఆ తర్వాత కెప్టెన్ జితేశ్ శర్మ (33), నేహల్ వధేరా (32) నిలవడంతో 14 ఓవర్లకు 132/3తో భారత్ విజయం దిశగా సాగింది. కానీ జితేశ్ ఔటయ్యాక జట్టు ఒత్తిడిలో పడింది. సూపర్ ఓవర్లో మొదట భారత్ సున్నాకే రెండు వికెట్లు కోల్పోయింది. రిపాన్ తొలి రెండు బంతులకే జితేశ్, అశుతోష్‌లను ఔట్ చేశాడు. బంగ్లా ఒక వికెట్ నష్టానికి లక్ష్యాన్ని అందుకుంది. మరో మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్ 5 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. ఆదివారం బంగ్లాదేశ్ -ఎ, పాకిస్థాన్ షహీన్స్ మధ్య ఫైనల్ జరుగుతుంది.

శౌర్యకు రజతం


శౌర్య

టోక్యో: డెఫ్లింపిక్స్‌లో యువ షూటర్ శౌర్య సైని మెరిశాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో రజతంతో సత్తా చాటాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో శౌర్య 450.6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. మథియాస్ ఎరిక్ హెస్ (459.8- జర్మనీ) స్వర్ణం సాధించాడు. కుశాగ్రసింగ్ రజావత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీలో భారత్ ఇప్పటి వరకు 4 స్వర్ణాలు, 6 రజతాలు, 3 కాంస్యాలు సహా మొత్తం 13 పతకాలు కైవసం చేసుకుంది.

భారత్‌తో సిరీస్ నుంచి రబాడ ఔట్

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కాగిసో రబాడ భారత్‌తో శనివారం మొదలయ్యే రెండో టెస్టుతో పాటు వన్డే, టీ20 సిరీస్‌ల్లో ఆడట్లేదు. పక్కటెముకకు గాయమైన అతడు స్వదేశానికి వెళ్లబోతున్నాడు. మరోవైపు ఈనెల 30న మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టుకు టెంబా బవుమా సారథ్యం వహించనున్నాడు. వన్డే ఫార్మాట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించి ఇటీవల పాకిస్థాన్‌తో సిరీస్‌తో పునరాగమనం చేసిన ఓపెనర్ క్వింటన్ డికాక్‌ను కూడా సెలక్టర్లు జట్టులో కొనసాగించారు. డిసెంబర్ 9న మొదలయ్యే అయిదు టీ20ల సిరీస్‌లో ఆడే సఫారీ జట్టుకు మార్‌క్రమ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

దక్షిణాఫ్రికా వన్డే జట్టు: బవుమా (కెప్టెన్), మార్‌క్రమ్, బార్ట్‌మ్యాన్, బ్రీట్జ్‌కే, బ్రెవిస్, బర్గర్, డికాక్, టోని జోర్జి, రుబిన్ హెర్మన్, యాన్సెన్, కేశవ్ మహరాజ్, ఎంగిడి, రికిల్‌టన్ సుబ్రాయెన్

టీ20 జట్టు: మార్‌క్రమ్ (కెప్టెన్), బార్ట్‌మ్యాన్, బోష్, బ్రెవిస్, డికాక్, టోనీ జోర్జి, ఫెరీరా, హెండ్రిక్స్, యాన్సెన్, జార్జ్ లిండ్, కేశవ్ మహరాజ్, మపాకా, మిల్లర్, ఎంగిడి, నోకియా, స్టబ్స్

స్మృతి పెళ్లికూతురాయెనే..

బెంగళూరు: మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచి కల నెరవేర్చుకున్న భారత ఓపెనర్ స్మృతి మంధాన.. ఇదే నెలలో పెళ్లి పీటలు ఎక్కేస్తోంది. కొన్నేళ్లుగా తాను ప్రేమలో ఉన్న సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌ను ఆదివారం ఆమె పెళ్లాడబోతోంది. ఈ నేపథ్యంలో స్మృతిని శుక్రవారం పెళ్లికూతురిని చేశారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ఆమె హల్దీ (పసుపు రాయడం) వేడుకలో పాల్గొంది.


సహచర క్రికెటర్లతో స్మృతి నృత్యం

క్వార్టర్స్‌లో భారత్

ప్రపంచ మహిళల టీమ్ చెస్

ఈనాడు-అమరావతి: స్పెయిన్‌లో జరుగుతున్న ప్రపంచ మహిళల టీమ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. పూల్-బి చివరి పోరులో ఉజ్బెకిస్థాన్‌ను 2.5-1.5తో ఓడించింది. మూడు గేమ్‌లు డ్రా కాగా.. చివరి గేమ్‌లో కలిలోవాపై శ్రీజ శేషాద్రి గెలిచి భారత్‌కు విజయాన్ని అందించింది. దీంతో పూల్-బిలో నాలుగో స్థానంలో నిలిచి భారత్ (పద్మిని, శ్రీజ, సవిత, సరయు) నాకౌట్ చేరింది. భారత్‌కు సురేశ్ అడుసుమిల్లి టీమ్‌హెడ్‌గా, స్వయమ్స్ మిశ్రా, సరితాఎం.రెడ్డి కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు.


భారత జట్టు సభ్యులతో టీమ్ హెడ్, కోచ్‌లు

ఆయుష్‌పై లక్ష్య పైచేయి


లక్ష్యసేన్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 23-21, 21-11తో సహచర ఆటగాడు ఆయుష్ శెట్టిపై విజయం సాధించాడు. సెమీస్‌లో చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్యసేన్ తలపడనున్నాడు. మరోవైపు పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి జోడీ పోరాటానికి తెరపడింది. క్వార్టర్స్‌లో టాప్ సీడ్ సాత్విక్- చిరాగ్ జోడీ 19-21, 15-21తో ఫజర్ అల్ఫియాన్- మహ్మద్ షోహిబుల్ ఫిక్రి (ఇండోనేసియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

73 స్థానాలు.. 277 మంది క్రికెటర్లు

డబ్ల్యూపీఎల్ వేలం 27న

దిల్లీ: మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో 73 స్థానాల కోసం 277 మంది క్రికెటర్లు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. బదిలీ ప్రక్రియ ముగియడంతో, వేలానికి సిద్ధమైన క్రికెటర్లతో డబ్ల్యూపీఎల్ జాబితాను రూపొందించింది. ఈనెల 27న జరిగే వేలంలో 19 మంది క్రీడాకారిణులు తమ కనీస ధరను రూ.50 లక్షలుగా నమోదు చేసుకున్నారు. 11 మంది రూ.40 లక్షలు.. 88 మంది రూ.30 లక్షలు కనీస ధరగా నిర్ణయించుకున్నారు. "వేలం జాబితాలో 194 మంది భారతీయ క్రికెటర్లు ఉన్నారు. వారిలో 52 క్యాప్డ్, 142 అన్‌క్యాప్డ్ క్రీడాకారిణులకు చోటు దక్కింది. విదేశీ క్రికెటర్లలో 66 క్యాప్డ్, 17 అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఉన్నారు" అని డబ్ల్యూపీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది. దీప్తిశర్మ, హర్లీన్ డియోల్, ప్రతీక రావల్, పూజ వస్త్రాకర్, ఉమా ఛెత్రి, క్రాంతి గౌడ్.. సోఫీ డివైన్, అమేలియా కెర్ (న్యూజిలాండ్), సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లాండ్), అలీసా హీలీ, మెగ్ లానింగ్ (ఆస్ట్రేలియా)లు రూ.50 లక్షల కనీస ధరలో ఉన్నారు. అయిదు ఫ్రాంఛైజీలలో ప్రతి జట్టు గరిష్టంగా 18 మంది క్రికెటర్లతో జట్టును ఎంపిక చేసుకోవచ్చు.

ఆటను ఆపిన భూకంపం

మీర్పూర్: బంగ్లాదేశ్, ఐర్లాండ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టుకు భూకంపం కొద్దిసేపు అంతరాయం కలిగించింది. శుక్రవారం ఉదయం 10.38 గంటలకు 5.7 తీవ్రతతో ఢాకా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో భూకంపం సంభవించింది. స్టేడియంలో బలమైన ప్రకంపనలు రావడంతో ఆటగాళ్లు, ప్రేక్షకులు గందరగోళానికి గురయ్యారు. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 165/5 స్కోరుతో ఉన్నప్పుడు ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆట నిలిపేసి పెవిలియన్ చేరిన ఆటగాళ్లు కాసేపటి తర్వాత తిరిగి ఆట కొనసాగించారు. ఈ మ్యాచ్‌పై బంగ్లా పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 98/5తో శుక్రవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 265 పరుగులకు ఆలౌటైంది. తైజుల్ ఇస్లామ్ (4/76) విజృంభించడంతో బంగ్లాకు 211 పరుగుల ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 156 పరుగులు సాధించింది. మరో రెండ్రోజుల ఆట మిగిలివుంది. ప్రస్తుతం బంగ్లా ఖాతాలో 367 పరుగులు ఉన్నాయి.

(c) eenadu

ఐదో రోజూ అంతే!

- సిట్ విచారణలో నోరు విప్పని చిన్న అప్పన్న
- కస్టడీ ముగియడంతో నెల్లూరు జైలుకు తరలింపు

ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేర విభాగం): తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితుడు, తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను ఐదో రోజైన శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారించింది. ఈ నెల 17 నుంచి 21 వరకు ఆయన కస్టడీకి నెల్లూరులోని ఏసీబీ కోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ గడువు శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు కూడా అధికారులు అడిగిన ప్రశ్నలకు చిన్న అప్పన్న పెద్దగా నోరు విప్పలేదని సమాచారం. కల్తీ నెయ్యి కేసులో తన ప్రమేయం లేదని, టెండర్లు కట్టబెట్టడం, బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వంటి వ్యవహారాలన్నీ తితిదే అధికారుల చేతుల్లోనే ఉంటాయని సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. వైవీ సుబ్బారెడ్డితో పరిచయం ఉన్నందున అడపాదడపా తిరుపతి, తిరుమలకు వస్తుంటానని చెప్పారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కేందుకు మీరు సహకరించారా అని మరోసారి అడగ్గా అంతా నిబంధనల మేరకే జరిగిందని బదులిచ్చారని సమాచారం. ఆ సంస్థ ప్రతినిధులు హవాలా రూపంలో రూ.50 లక్షలు ఇచ్చారా? లేదా అని ప్రశ్నించగా మౌనంగా ఉన్నారని తెలిసింది. ఐదు రోజుల విచారణకు చిన్న అప్పన్న సహకరించలేదు. కస్టడీ ముగియడంతో తిరుపతి రుయా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించేందుకు చర్యలు

- విద్యార్థి సంఘాల నేతలతో మంత్రి నారా లోకేశ్ భేటీ

ఈనాడు, అమరావతి: పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సాధ్యమైనంత త్వరగా వర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీచేస్తామని, విద్యాసంస్థల్లో రాజకీయ ప్రసంగాలు, జెండాలను అనుమతించబోమని వెల్లడించారు. ఉండవల్లి నివాసంలో శుక్రవారం విద్యార్థి, యువజన సంఘాల ఐకాస నేతలతో మంత్రి సమావేశమయ్యారు. వారు 11 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'ఫీజుల విషయంలో ప్రైవేటు కళాశాలలు ఒత్తిడి చేస్తే చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.4,200 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. ఆ సొమ్మును సైతం ఆర్థిక వెసులుబాటు చూసుకుని దశల వారీగా చెల్లిస్తాం. విద్యాసంస్థల పనివేళలు పూర్తయ్యాక రాజకీయేతర సమస్యలను విన్నవించడానికి విద్యార్థి సంఘ నాయకులకు ప్రత్యేక వేదికపై అవకాశం కల్పిస్తాం' అని తెలిపారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి మార్గం నవీన భారత్‌కు ఆదర్శం

- మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్
- పుట్టపర్తిలో ముగిసిన అంతర్జాతీయ యువజన సదస్సు





సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ◆ కేరళవాసికి ఈ-ఆటో తాళం చెవి అందజేస్తున్న దేవేంద్ర ఫడణవీస్, కంభంపాటి హరిబాబు, ఆర్జే రత్నాకర్, పల్లె సింధూరరెడ్డి తదితరులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికత, ప్రేమతత్వంతో ప్రపంచ మానవాళిని సేవామార్గం వైపు నడిపించిన సత్యసాయిబాబా చూపిన మార్గం నవీన భారత్‌కు ఆదర్శమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పేర్కొన్నారు. బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయికుల్వంత్ మందిరంలో రెండోరోజు శుక్రవారం అంతర్జాతీయ యువజన సదస్సు జరిగింది. "ప్రపంచశాంతి స్థాపనకు మార్గాలు" అన్న అంశంపై వక్తలు ప్రసంగించారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రారంభోపన్యాసం చేసి, సత్యసాయి సేవాసంస్థలు, ట్రస్టు ఆశయాలు, లక్ష్యాలను విస్తృతం చేద్దామని పిలుపునిచ్చారు. దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ సత్యసాయి సేవాసంస్థలు అందిస్తున్న నిస్వార్థ సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఐదు దశాబ్దాలుగా తమ కుటుంబానికి బాబాతో అనుబంధం ఉందన్నారు. అంతకుముందు సత్యసాయి మహాసమాధిని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, మాజీ సీఎం అశోక్ చవాన్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు దర్శించుకున్నారు. శ్రీసత్యసాయి జీవనోపాధి పథకంలో భాగంగా కేరళకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఈ-ఆటోలను సీఎం, గవర్నర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ప్రభుత్వాలతో సాధ్యం కాని సేవలను బాబా చేసి చూపారు

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ "ప్రభుత్వాలతో సాధ్యం కాని సేవా కార్యక్రమాలను సత్యసాయిబాబా ఆధ్యాత్మికత, ప్రేమతో ఆచరణలో చేసి చూపించారు. ఇక్కడి ఆసుపత్రుల్లో నయాపైసా ఖర్చు లేకుండా అత్యాధునిక వైద్యం అందిస్తున్నారు. గుక్కెడు నీటికి ఇబ్బందులు పడే ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించిన మహనీయులు సత్యసాయి" అన్నారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌చవాన్ మాట్లాడుతూ.. "మానవాళిని సత్యసాయి తన బోధనలతో సేవ, సన్మార్గం వైపు నడిపించారు. సాయిభక్తులు సమాజసేవలో భాగస్వాములు కావాలి" అన్నారు.

నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి రాక

ఈనాడు, పుట్టపర్తి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం పుట్టపర్తికి రానున్నారు. ఉదయం 10.30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెకు స్వాగతం పలుకుతారు. అనంతరం ప్రశాంతి నిలయంలో జరిగే సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ఆమె పాల్గొంటారు. మధ్యాహ్నం 12.20 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి దిల్లీకి బయలుదేరుతారు.

దస్తగిరిని జైల్లో బెదిరించిన వ్యవహారం.. నాటి కడప జైలు అధికారులపై క్రమశిక్షణ చర్యలు

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి వివేకా హత్యకేసులో అప్రూవర్ షేక్ దస్తగిరిని జైల్లో బెదిరించిన కేసులో నాటి కడప జైలు అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి వైద్యశిబిరం నిర్వహణ ముసుగులో జైల్లోకి అనుమతించిన నాటి కడప జైలు సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ కె.జవహర్‌బాబు, డీసీఎస్ డా.జి.పుష్పలత ముగ్గురూ విధినిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని అభియోగాలు మోపింది. విచారణాధికారిగా కోస్తాంధ్ర రీజియన్ జైళ్లశాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేసు ప్రజెంటింగ్ అధికారిగా రాజమహేంద్రవరం జైలు సూపరింటెండెంట్ రాహుల్‌ను నియమించింది. మూడు నెలల్లోగా విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఐఎన్‌హెచ్ ప్రకాష్ నెల్లూరులోని ఏపీ స్టాఫ్‌లో, జవహర్‌బాబు విశాఖపట్నం కేంద్ర కారాగారంలో, డా పుష్పలత కడప జీజీహెచ్‌లో పనిచేస్తున్నారు.

వైద్య శిబిరం పేరిట జైల్లోకి వెళ్లి..: వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి 2023 అక్టోబరు 31న ఓ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఆ తర్వాత నవంబరు 28న అధికారులు జైల్లో వైద్యశిబిరం నిర్వహించారు. దీనికి వివేకా హత్య కేసులో ఏ5గా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డితో పాటు కడప శ్రీకర ఆసుపత్రికి చెందిన మరికొందరు వైద్యులొచ్చారు. అప్పుడే చైతన్యరెడ్డి జైల్లో దస్తగిరిని బెదిరించినట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదైంది.

ఆక్వాను ఆశాకిరణంలా తీర్చిదిద్దుతాం: సీఎం

ఈనాడు, అమరావతి: 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రాష్ట్రంలోని 1,29,178 మంది మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయంగా రూ.259 కోట్లు అందించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆక్వా రంగాన్ని రాష్ట్రానికి ఆశాకిరణంలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులు, ఆక్వా రైతులకు 'ఎక్స్' వేదికగా సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి

'కలలకు రెక్కలు' పథకం అమలు

- విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఐదుగురు సభ్యులతో కమిటీ
- విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సమీక్షలో మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉన్నత విద్య చదివే విద్యార్థినులకు 'కలలకు రెక్కలు' పథకాన్ని అమలు చేసేందుకు విధివిధానాలను సిద్ధం చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. స్వదేశంతో పాటు విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకున్న విద్యార్థినులకు ఈ పథకం కింద సాయం అందిస్తామని తెలిపారు. శుక్రవారం ఉండవల్లి నివాసంలో.. కళాశాల విద్య, ఇంటర్మీడియట్, పాఠశాల విద్య, నైపుణ్యాభివృద్ధి-శిక్షణ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆత్మహత్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. "విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు మార్గాలను సూచించేందుకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఉమ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తున్నాం. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు రెసిడెన్షియల్ కళాశాలల్లో సౌకర్యాల మెరుగుకు, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. అనుమతులు లేకుండా నడిచే ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలి. ఐఐటీ, ఎన్ఐటీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలి" అని లోకేశ్ సూచించారు.

డిప్లొమా కోర్సుల పాఠ్యప్రణాళిక మార్పు

"పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 26 డిప్లొమా కోర్సుల పాఠ్యప్రణాళికలో మార్పులు చేస్తున్నాం. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు గుజరాత్‌కు చెందిన నామ్‌టెక్ సంస్థ రాష్ట్రంలో మూడు హబ్‌లు, 13 స్పోక్స్‌లను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. 83 ఐటీఐలను భారీ పరిశ్రమలతో అనుసంధానిస్తున్నాం. పీఎం కౌశల్ వికాస్ యోజన కింద 21,540 మందికి స్వల్పకాలిక శిక్షణ అందించడానికి కేంద్రం నుంచి అనుమతి లభించింది. రాష్ట్రంలో డిగ్రీ, పీజీ, వర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో 485 ఉపాధి కల్పనా నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేశాం. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న విద్యార్థులతో మాక్ అసెంబ్లీని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి. డిసెంబరు 5న మెగా పీటీఎంను మరింత సమర్థంగా చేపట్టాలి' అని లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో విదేశీ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు అనుమతించే అంశంపై అధికారులతో చర్చించారు. మంత్రి లోకేశ్ ఇటీవల ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా వివిధ వర్సిటీల ప్రతినిధులతో జరిపిన చర్చల పురోగతిపైనా సమీక్షించారు. 50శాతం గ్లోబల్ వర్క్‌ఫోర్స్ విశాఖ నుంచే సిద్ధం కావాలన్నది సీఎం చంద్రబాబు మనోభీష్టమని చెప్పారు. ఉపాధ్యాయుల టెట్ అర్హత పరీక్షకు సంబంధించిన కేసు పురోగతిపై మంత్రి ఆరా తీశారు. విదేశీ విద్య పథకాన్ని ఎలా అమలు చేయాలన్న దానిపైనా చర్చించారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఉండవు

ఉపాధ్యాయులకు ఇకపై బోధనేతర బాధ్యతలు ఉండవని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపైనే దృష్టిపెట్టాలని మంత్రి లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించి, పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. ఉండవల్లి నివాసంలో శుక్రవారం ఏపీటీఎఫ్ అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్‌తో మంత్రి భేటీ అయ్యారు. "గత 17నెలల్లో 424 సమస్యలను ప్యాప్టో ద్వారా నా దృష్టికి తెచ్చారు. ఇందులో 200 సమస్యలు పరిష్కరించాం. 81 పరిష్కార యోగ్యమైనవి కావు. 72 విజ్ఞాపనలు పాలసీ అంశాలకు సంబంధించినవి. 71 సమస్యలు.. కోర్టుల పరిధిలో ఉన్నాయి" అని లోకేశ్ వివరించారు.

కొవిడ్ తర్వాత పెరిగిన పిల్లల అక్రమ రవాణా

దేశంలో నాలుగో స్థానంలో ఏపీ

ఈనాడు, దిల్లీ: కొవిడ్ తర్వాత దేశవ్యాప్తంగా పిల్లల అక్రమ రవాణా (ట్రాఫికింగ్) పెరిగినట్లు సుప్రీంకోర్టు అడ్వొకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ వెలువరించిన నవంబర్ సంచిక వెల్లడించింది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉంది. తొలి మూడు స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, దిల్లీ ఉన్నాయి. ఏపీలో గుంటూరు, నెల్లూరు, శ్రీకాకుళం, కర్నూలు, భీమవరం ట్రాఫికింగ్ హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి. కొన్ని ప్రాంతాలు హైరిస్క్ జోన్‌లుగా మారినట్లు నివేదిక పేర్కొంది. ఈ గణాంకాల ఆధారంగా జిల్లాలవారీ ప్రణాళిక రూపొందించి ట్రాఫికింగ్‌ను నియంత్రించాలని సిఫార్సు చేసింది. ప్రత్యేక అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసి దానికి విస్తృత ప్రచారం కల్పించాలని పేర్కొంది. కాల్ లాగ్ రికార్డు చేసి, నిరంతరం పరిశీలించాలని, ఈ హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫోన్‌కాల్స్‌ని ఆధారంగా ట్రాఫికింగ్ నివారణకు కార్యాచరణ చేపట్టాలని నివేదిక పేర్కొంది. ఈ నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి.. సీజేఐ వీడ్కోలు కార్యక్రమంలో విడుదల చేశారు.

2020 తర్వాత బాలల ట్రాఫికింగ్ ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు

రాష్ట్రం	సంఖ్య
యూపీ-	26,71,214
బిహార్-	5,43,703
దిల్లీ-	63,106
ఆంధ్రప్రదేశ్-	50,210
కర్ణాటక-	6,110

ఏపీలో ట్రాఫికింగ్ హాట్‌స్పాట్‌లు

పేరు	నమోదైన కేసులు
గుంటూరు	208
నెల్లూరు	125
శ్రీకాకుళం	98
కర్నూలు	74
భీమవరం	28

భారతి సిమెంట్ లీజుల రద్దుకు వారంలో తాఖీదులు!

- రామ్‌కో, ఏసీసీ సిమెంట్స్‌కు కూడా..
- నిబంధనలు ఉల్లంఘించి గనులు పొందడమే కారణం

ఈనాడు, అమరావతి: జగన్ ప్రభుత్వ హయాంలో.. ఆయన సతీమణి డైరెక్టర్‌గా ఉన్న భారతి సిమెంట్ కంపెనీ కేంద్ర గనుల శాఖ నిబంధనలు ఉల్లంఘించి దక్కించుకున్న 2 లీజుల రద్దుకు రంగం సిద్ధమైంది. వారం రోజుల్లో ఆ కంపెనీ యాజమాన్యానికి తాఖీదులిచ్చి, ఆ తర్వాత లీజులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ మేరకు డ్రాఫ్ట్ తాఖీదు తయారు చేసినట్లు తెలిసింది. అసోసియేట్ సిమెంట్ కంపెనీ (ఏసీసీ), రామ్‌కో సిమెంట్స్‌కు చెందిన ఒక్కో లీజులదీ ఇదే పరిస్థితి. నోటీసులు ఇచ్చాక ఆయా కంపెనీలు వివరణ ఇచ్చేందుకు 15 రోజులు గడువు ఇస్తారు. వివరణలు తీసుకున్నా.. కేంద్ర గనులశాఖ నిర్దేశం ఆధారంగా ఈ కంపెనీల 4 సున్నపురాయి లీజులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత వాటికి ఈ-వేలం నిర్వహిస్తారు.

చాకచక్యంగా లీజులు దక్కించుకొని..

గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 2న భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట.. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలంలో 509.18 ఎకరాలు, ఎర్రగుంట్ల మండలంలో 235.56 ఎకరాల్లో సున్నపురాయి గనులకు లీజులు మంజూరు చేస్తూ అప్పటి వైకాపా ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ఇందుకు ఎంతో చాకచక్యంగా కథ నడిపించింది.

◆ వాస్తవానికి ఈ 2 లీజులకు ప్రాథమిక అనుమతి కింద ఎల్‌వోఐని రఘురాం సిమెంట్స్ లిమిటెడ్‌కు 2008 జారీ చేశారు. వీటిని 2009లో భారతి సిమెంట్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. ఎల్‌వోఐ జారీచేసిన 6 నెలల్లో మైనింగ్ ప్లాన్ అనుమతి, పర్యావరణ అనుమతుల వంటివన్నీ పొందితే, పూర్తిస్థాయి లీజు మంజూరు చేస్తారు. కానీ, అనుమతులేవీ పొందలేదు.

◆ లీజులు భారతి సిమెంట్‌కు మారిన విషయాన్ని 60 రోజుల్లో గనుల శాఖకు తెలియజేయాలి. అలా చేయలేదని అధికారులు గుర్తించి, ఆ లీజుల దరఖాస్తులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని 2016లో అప్పటి ప్రభుత్వం తాఖీదు ఇచ్చింది.

◆ దీనిపై భారతి సిమెంట్ అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో వచ్చింది. వాళ్ల విజ్ఞప్తిని తెలుసుకొని, తగిన నిర్ణయం తీసుకోవాలని 2023లో హైకోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో వైకాపా ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 2న లీజులు మంజూరు చేసింది.

2015 తర్వాత వేలంతోనే లీజులు

దరఖాస్తు చేసుకుంటే మేజర్ మినరల్స్ లీజులు కేటాయించే విధానం గతంలో ఉండగా, 2015 నుంచి మాత్రం వేలంలో కేటాయించాలంటూ కేంద్ర గనుల శాఖ సవరణ నిబంధన తీసుకొచ్చింది. ఒకవేళ అప్పటికే ఎల్‌వోఐలు పొందిన లీజుదారులు.. రెండేళ్లలో అన్ని అనుమతులు తెచ్చుకోవాలని పేర్కొంది. లేకపోతే ఎల్‌వోఐలు రద్దయినట్లే. కానీ, భారతి సిమెంట్ అన్ని అనుమతులు పొందలేకపోయింది. అంటే దీని ప్రకారం ఆ లీజుల ఎల్‌వోఐ రద్దు కావాలి. ఇదేమీ లేకుండా భారతి సిమెంట్ పాత విధానంలోనే 2024లో గనుల లీజులు పొందింది.

ఏసీసీ ఆదేశాలను చూపించి..

అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీకి వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలంలోని గనులకు 2010లో అప్పటి ప్రభుత్వం ఎల్‌వోఐ జారీచేసింది. అది కూడా 2017 నాటికి అన్ని అనుమతులు పొందలేదు. దీంతో హైకోర్టులో కేసు వేసింది. తర్వాత 2022లో ఏసీసీని అదానీ సిమెంట్స్ టేకోవర్ చేశాక సీను మారిపోయింది. లీజుదారుడి వాదన విన్నాక, తగిన నిర్ణయం తీసుకోవాలని 2023లో హైకోర్టు ఆదేశించింది. దీంతో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, అప్పటి అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం తీసుకొని.. ఏసీసీకి లీజు కేటాయిస్తూ 2023 నవంబరులో వైకాపా ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. తర్వాత ఇదేవిధంగా భారతి సిమెంట్‌కూ 2024 ఫిబ్రవరిలో రెండు లీజులు మంజూరు చేసింది. అనంతరం రామ్‌కో సిమెంట్స్‌కు 2024 మార్చిలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలోని 267.30 ఎకరాల్లో సున్నపురాయిని లీజును మంజూరుచేశారు.

కేంద్ర గనుల శాఖ ఆదేశాలతో కదలిక..

వేలం ద్వారానే లీజులు దక్కించుకోవాలని 2015లో నిబంధన తీసుకొస్తే.. 2023, 2024 సంవత్సరాల్లో భారతి సిమెంట్, ఏసీసీ, రామ్‌కో సిమెంట్‌లకు పాత పద్ధతిలో కేటాయించిన విషయంపై కేంద్ర గనులశాఖ దృష్టికి వచ్చింది. వీటిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర గనులశాఖ కొంతకాలం కిందట ఆదేశించింది. అన్ని అంశాలు పరిశీలించాక.. లీజులు రద్దు చేయడమే ఏకైక మార్గమని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుత అడ్వొకేట్ జనరల్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

బిల్లుల ఆమోదంలో గవర్నర్లకు గడువు నిర్ణయించే వరకు విశ్రమించం

తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై(సైదాపేట), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఆమోదించిన బిల్లులపై గవర్నర్ల నిర్ణయానికి గడువు విధించే వరకు విశ్రమించబోమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించే వరకు పోరాటం చేస్తామని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి ప్రశ్నలకు సుప్రీంకోర్టు ఇచ్చిన సమాధానాలు.. గవర్నర్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పుపై ఎలాంటి ప్రభావమూ చూపవన్నారు. ప్రజల చేత ఎన్నుకున్న ప్రభుత్వమే రాష్ట్రాన్ని పరిపాలించాలని, రాష్ట్రంలో రెండు అధికార కేంద్రాలు ఉండకూడదన్నారు. బిల్లులకు అనుమతి ఇవ్వకపోవటం, నిరవధికంగా నిలిపివేయటానికి గవర్నర్‌కు అధికారం లేదన్నారు.

ట్రావెల్స్ బస్సులో 500 కిలోల మాంసం తరలింపు



మాంసపు పెట్టెలను పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర, సిబ్బంది

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో 500 కిలోల మాంసాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మహేంద్ర వెల్లడించిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో మాంసం తరలిస్తున్నారనే సమాచారం అందడంతో ఎన్‌హెచ్-16పై వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. బస్సు కింది భాగంలో మాంసపు ముద్దలున్న సుమారు 11 బాక్సులను గుర్తించామన్నారు. వెంటనే సింగరాయకొండ పశు వైద్యాధికారిని పిలిపించగా.. ఆయన మాంసాన్ని పరిశీలించారు. దాని శాంపిల్‌ను హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించినట్లు తెలిపారు. బస్సు చోదకుడు గుజ్జుల ప్రేమ్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వైజాగ్‌కు చెందిన పోతుల సతీష్ చేపల లోడు పేరుతో మాంసాన్ని తరలిస్తున్నారని వెల్లడించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఆసక్తి పెంచేలా.. విజ్ఞానం పంచేలా..

పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్న ప్రధానోపాధ్యాయిని



పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

నరసాపురం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం కొప్పర్రులోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉప్పుగంటి రాజశ్రీ పుస్తక పఠనంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా వినూత్నంగా పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్, విశ్వనాథ సత్యనారాయణ, రావూరి భరద్వాజ, సి.నారాయణరెడ్డి, దేవరకొండ బాలగంగాధరతిలక్ వంటి ప్రముఖ కవుల రచనలు, జాతీయ నేతల ఆత్మకథలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన వందల కొద్దీ పుస్తకాలు సేకరించారు. వీటితో పదేళ్లుగా విద్యాశాఖ నిర్వహించే కార్యక్రమాలు, అవగాహన సదస్సుల్లో పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పుస్తకాల వద్దే సంబంధిత కవి చిత్రం, వారి జీవిత విశేషాలను తెలియజేసే బోర్డులు ఉంచుతున్నారు. కొప్పర్రు పాఠశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించే పుస్తక ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు.

మద్యం కేసులో నిందితులకు మళ్లీ రిమాండ్ పొడిగింపు



చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు వచ్చేనెల 5వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారంతో నిందితులకు రిమాండ్ ముగియనుండడంతో వీరిని ఏసీబీ కోర్టు న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. రిమాండ్ విధింపుపై నిందితుల తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏ సెక్షన్ ప్రకారం రిమాండ్ పొడిగించారన్న అంశాన్ని తెలపాలని కోరారు. నిందితులు 90 రోజులకు పైగా జైల్లో ఉన్నారని, ఛార్జిషీట్ కూడా దాఖలైనా.. కేసు దర్యాప్తు ఇంకా జరుగుతోందని సిట్ చెబుతోందని నిందితుల తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. విడతలవారీగా ఛార్జిషీట్లు వేస్తున్నారని.. ఇలా సుదీర్ఘ కాలం దర్యాప్తు జరిగితే.. కేసును కొట్టేయాల్సిందిగా పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఏ సెక్షన్ ప్రకారం పొడిగించాలో స్పష్టం చేయాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాదిని మేజిస్ట్రేట్ కోరారు. దీని కోసం సమయం కోరడంతో మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తిరిగి కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత వాదనలు జరిగాయి. వాదనల అనంతరం రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

రియల్ ఎస్టేట్ ఆస్తులనూ ఎటాచ్ చేస్తామంటున్నారు: చెవిరెడ్డి

'1996 నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాం. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రారంభించలేదు. దీనికి, మద్యానికి సంబంధం లేదు. కానీ సిట్ జప్తు చేస్తామంటున్న ఆస్తుల్లో వంద ఏళ్ల నాటి పూర్వీకుల ఇల్లూ ఉంది. పూర్తిగా మాస్టర్‌ప్లాన్ రోడ్డులో పోయిన రెండు ఎకరాల స్థలాన్ని రూ.35 కోట్లుగా చూపించారు. ప్రతిపక్షంలో క్రియాశీలకంగా ఉన్న నాలాంటి వారిపై ప్రభుత్వం మాట విని అధికారులు కక్ష సాధింపు చర్యలు చేపట్టడం అన్యాయం. మద్యం విషయంలో మాకు సెంటిమెంట్ ఉంది. దాన్ని కాదని లిక్కర్‌లో సంపాదించం. అయినా తప్పుడు కేసుతో నన్ను ఎంతకాలం జైలులో ఉంచి ఆనందించాలని అనుకుంటుందో.. అంతకాలం జైలులో ఉండే శక్తిని భగవంతుడు నాకు ఇచ్చాడు' అని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కోర్టులో న్యాయాధికారి ఎదుట చెప్పారు. దీనిపై న్యాయాధికారి స్పందిస్తూ.. ఆస్తుల జప్తుపై అభ్యంతరాలుంటే పిటిషన్ దాఖలు చేసుకోవాలని చెవిరెడ్డికి సూచించారు.

కోర్టు ఆదేశాలను మరోసారి ధిక్కరించిన చెవిరెడ్డి

ఈ కేసు గురించి కోర్టు ప్రాంగణంలో మాట్లాడవద్దని న్యాయాధికారి ఇప్పటికే రెండుసార్లు చెవిరెడ్డిని హెచ్చరించారు. అయినా మరోసారి ఉల్లంఘించారు. శుక్రవారం రిమాండ్ విధించిన తర్వాత పోలీసులు చెవిరెడ్డిని కారాగారానికి తరలించే సమయంలో ప్రాంగణంలో కరపత్రాలు పంచారు. మీడియా ఎదుట మాట్లాడారు.

గురుకుల విద్యార్థి చికిత్సకు రూ.10 లక్షలు

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: అనారోగ్యంతో బాధపడుతున్న అంబేడ్కర్ గురుకుల విద్యార్థి చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద సీఎం చంద్రబాబు రూ.10 లక్షలు విడుదల చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కొల్లివలస విద్యార్థి బోనెల కిరణ్ జీబీ సిండ్రోమ్‌తో బాధపడుతూ, విశాఖలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఎల్‌వోసీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. పేదింటి విద్యార్థి ప్రాణాలు కాపాడిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్త ఆలోచనలు రావడం లేదా?

- మీకు కొత్త ఆలోచనలు రాకపోతే- పుస్తకాలు చదవండి.
- ఆలోచనలున్నా వాటిని ఇతరులకు స్పష్టంగా వివరించడంలో ఇబ్బంది పడుతుంటే- రాయడం అలవాటు చేసుకోండి.
- మీ ఆలోచనల అమలుపై స్పష్టత వచ్చాక- ఇక ఆలస్యం చేయకుండా వాటి సాకారానికి పని మొదలుపెట్టండి.

– డాన్ కో, రచయిత

రూ.60 లక్షల విలువైన నకిలీ సిగరెట్ల పట్టివేత



నకిలీ సిగరెట్ పెట్టెలను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్సై చంద్రశేఖర్, సీఐ మల్లికార్జునరావు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా రేపల్లె మండలం పెనుమూడి శివారు 216వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి నకిలీ సిగరెట్లు రవాణా చేస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నారు. రేపల్లె సీఐ మల్లికార్జునరావుకు అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిపై అనుమానాస్పదంగా వెళ్తున్న కంటైనర్‌ను ఆపి తనిఖీ చేశారు. వాహనాన్ని నడుపుతున్న యజమాని పొంతన లేకుండా సమాధానాలు చెప్పడంతో కంటైనర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై చంద్రశేఖర్, రెవెన్యూ అధికారుల సమక్షంలో తెరవగా, అందులో నకిలీ సిగరెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఒడిశాలోని కటక్ నుంచి ఒంగోలుకు కంటైనర్‌లో రూ.60 లక్షల విలువైన నకిలీ సిగరెట్లు తరలిస్తున్నారని, వాటికి బిల్లులు లేవని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

(c) eenadu

పోలీసుశాఖకు కళంకం తెచ్చిన సీఐ శంకరయ్య తొలగింపు

- వివేకా హత్య జరిగినప్పుడు ఈయనే పులివెందుల సీఐ
- అప్పట్లో సాక్ష్యాలు ధ్వంసం చేస్తున్నా నిలువరించని వైనం


సీఐ శంకరయ్య

ఈనాడు, కర్నూలు: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు విషయంలో పోలీసుశాఖకు కళంకం తెచ్చేలా వ్యవహరించిన పులివెందుల పూర్వ సీఐ శంకరయ్యను విధుల నుంచి తొలగిస్తూ కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ నిర్ణయం తీసుకున్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగిన విషయం తెలుసుకుని ఘటన స్థలానికి వెళ్లిన శంకరయ్య పోలీసు అధికారిగా చట్టపరంగా తన బాధ్యతలను నిర్వర్తించడంలో ఘోరంగా విఫలమయ్యారు. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి అది హత్య అని స్పష్టంగా తెలిసినప్పటికీ ఆ విషయాన్ని బయటపెట్టలేదు. నాటి పోలీసు ఉన్నతాధికారులకు కూడా సరైన సమాచారం ఇవ్వకుండా తాత్సారం చేశారు. నిందితులు హత్య చేసిన విషయాన్ని కప్పిపుచ్చి దాన్ని గుండెపోటుగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నా.. వాటిని ఆయన ఖండించలేదు. తన కళ్లెదురుగానే ఘటన స్థలంలో సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నప్పటికీ వారిని శంకరయ్య నిలువరించలేదని ఉన్నతాధికారులు గుర్తించారు. హత్య జరిగినట్లు తెలిసినా సుమారు ఏడున్నర గంటలపాటు ఆయన మౌనం వహించినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. దీంతో నాటి తెదేపా ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత జరిగిన విచారణలో సీబీఐకి ఆయన రెండుసార్లు తన స్టేట్‌మెంట్లు ఇచ్చారు. హత్య జరిగిందని చెబితే రాష్ట్రంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందన్న ఉద్దేశంతో అప్పట్లో తాను వాస్తవాలు చెప్పలేదని మొదటిసారి చెప్పిన స్టేట్‌మెంట్‌లో వివరించారు. హత్యోదంతానికి సంబంధించిన సమగ్ర సమాచారం దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, కె.పరమేశ్వర్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి తదితరులకు కచ్చితంగా తెలుసని రెండో స్టేట్‌మెంట్లో పేర్కొన్నారు. అవే వివరాలను తాను సీబీఐ న్యాయమూర్తి ముందు కూడా చెబుతానంటూ శంకరయ్య సీబీఐ అధికారులకు అండర్‌టేకింగ్ కూడా ఇచ్చారు. అనంతరం జరిగిన విచారణలో ఆయన అడ్డం తిరిగారు. మృతికి దారితీసిన కారణాన్ని వైద్యుడు నిర్ధారించకుండా ఆయన చనిపోయినట్లు ఏ విధంగా చెప్పగలనంటూ పోలీసు ఉన్నతాధికారులతో వాదించినట్లు సమాచారం. హత్య జరిగినట్లు తెలిసినా అల్లర్లు జరుగుతాయేమోనని భయపడ్డానని చెప్పి మొత్తం పోలీసుశాఖకే సీఐ శంకరయ్య కళంకం తెచ్చేలా మాట్లాడారని పోలీసు ఉన్నతాధికారులు తేల్చారు. అన్నింటికీ మించి సీబీఐకి రెండుసార్లు స్టేట్‌మెంట్లు ఇచ్చిన తర్వాత కాలంలో ఆయన కొన్ని అదృశ్య శక్తుల సహకారంతో తనపై ఉన్న సస్పెన్షన్‌ను రద్దు చేయించుకున్నట్లు తేల్చారు. సీబీఐ న్యాయస్థానానికి రావాల్సిన ఆయన.. ఆ రోజు న్యాయస్థానానికి రాకుండా డీజీపీ కార్యాలయానికి వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆయన స్వలాభం కోసం వాస్తవాలు చెప్పకుండా నిందితులతో కుమ్మక్కయ్యారని స్పష్టంగా అర్థమవుతోందని పోలీసు ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు.

నాలుగున్నరేళ్లుగా విచారణకు సహకరించని వైనం

వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీఐ జె.శంకరయ్య సుమారు నాలుగున్నరేళ్లపాటు విచారణకు ఏ విధంగానూ సహకరించలేదని పోలీసులు ఉన్నతాధికారులు నిర్ధారించారు. నిందితులతో లోపాయికారీగా కుమ్మక్కై పోలీసు అధికారిగా ఆయన నిర్వర్తించాల్సిన విధులను, బాధ్యతలను నిర్వర్తించలేదని అధికారులు తేల్చారు. వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో పోలీసుశాఖకే కళంకం తెచ్చేలా ఆయన వ్యవహరించిన తీరుకు సంబంధించిన ఉదంతాలన్నింటితో సమగ్ర నివేదికను తయారు చేశారు. వాటి ఆధారంగా కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ కర్నూలు జిల్లాలోని వీఆర్‌లో ఉన్న సీఐ శంకరయ్యను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాగా, వివేకానందరెడ్డి హత్య కేసులో పలు ఆరోపణలు చేసి తన పరువుకు భంగం కలిగించారంటూ ఏకంగా సీఎం చంద్రబాబుకు సీఐ శంకరయ్య లీగల్ నోటీసు పంపించారు. 15రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పటం లేదా వివరణ ఇవ్వకపోతే రూ.1.45 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని నోటీసులో శంకరయ్య పేర్కొన్న విషయం తెలిసిందే.

దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు రుజువులుంటే మళ్లీ కోర్టుకు రండి

- పిటిషనర్లకు స్పష్టంచేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: మావోయిస్టు అగ్ర నేతలు దేవ్‌జీ, రాజిరెడ్డిలు పోలీసుల అదుపులో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లేవని, ఈ నేపథ్యంలో తాము వ్యాజ్యంలో జోక్యం చేసుకోలేమని పిటిషనర్లకు హైకోర్టు తేల్చిచెప్పింది. పోలీసుల అదుపులో ఉన్నట్లు ఆధారాలుంటే మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు ఇచ్చింది. వ్యాజ్యంపై విచారణను మూసివేసింది. న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సీనియర్ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారని, వారిని కోర్టులో హాజరుపరిచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది జై భీమారావు వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. మావోయిస్టు ముఖ్య నేతలకు సంబంధించిన 9 మంది సెక్యూరిటీ సిబ్బంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు ప్రెస్‌మీట్‌లో చెప్పారు తప్ప.. 9 మంది అగ్రనేతలున్నట్లు చెప్పలేదన్నారు. దేవ్‌జీ, రాజిరెడ్డిలు పోలీసుల అదుపులో లేరని స్పష్టంచేశారు. వీడియోలను పరిశీలించిన ధర్మాసనం.. దేవ్‌జీ, రాజిరెడ్డిలు పోలీసుల అదుపులో ఉన్నట్లు పోలీసులు చెప్పలేదని స్పష్టంచేసింది.

ఆ మైనర్లకు 5 వరకు రిమాండ్: మావోయిస్టులతో దొరికిపోయిన ఇద్దరు మైనర్లకు కోర్టు వచ్చేనెల 5 వరకు రిమాండ్ విధించింది. కృష్ణా జిల్లా కానూరు కొత్త ఆటోనగర్‌లో అరెస్టు అయిన వీరిని పోలీసులు శుక్రవారం విజయవాడలోని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయాధికారి బాలికను విశాఖపట్నం, బాలుడిని విజయవాడలోని జువైనల్ హోంలకు తరలించాలని పేర్కొన్నారు.

ఐదుగురు మావోయిస్టుల మృతదేహాల అప్పగింత

- అర్ధరాత్రి వరకు కొనసాగిన పంచనామా
- 'ఈనాడు' కథనంతో కదిలిన యంత్రాంగం

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌కు సంబంధించి ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలకు శుక్రవారం రాత్రి పోస్టుమార్టం పూర్తి చేశారు. ఎదురుకాల్పుల్లో 13 మంది మృతిచెందగా.. గురువారం వరకు కేవలం 4 మృతదేహాలకే పోస్టుమార్టం చేశారు. మిగతావారి బంధువులంతా ఆసుపత్రిలో పడుతున్న ఇబ్బందులపై 'పోస్టుమార్టంలో తీవ్రజాప్యం' అంటూ 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. శవపరీక్షల్లో వేగం పెంచి, శనివారంలోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసుల సాయంతో శవపంచనామా నివేదికలు పూర్తి చేశారు. అదనంగా కొందరు వైద్యులను రప్పించి మొత్తం 12 మంది పర్యవేక్షణలో పోస్టుమార్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి 10.45 గంటల వరకు 5 మృతదేహాలకు


మల్లా మృతదేహాన్ని తరలిస్తున్న బంధువులు

పోస్టుమార్టం చేసి, బంధువులకు అప్పగించారు. 5 గంటలకు జ్యోతి ఎలియాస్ సరిత, రాత్రి 7.30 గంటలకు మల్లా ఎలియాస్ మల్లాలు, ఆ తర్వాత లక్మల్ ఎలియాస్ చైతు మృతదేహాలను పంపించారు. రాత్రి 10.45 గంటలకు సన్ని కారం, లోకేశ్ మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. కమలేష్ మృతదేహానికీ పోస్టుమార్టం చేసి, అర్ధరాత్రి దాటాక అప్పగించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియను చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్ మిశ్రా, రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ పర్యవేక్షించారు. సురేష్, సైను, అనిత మృతదేహాలకు శనివారం పోస్టుమార్టం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాసు బంధువులెవరూ శుక్రవారం రాత్రికీ ఆసుపత్రికి చేరుకోలేదు.

నిపుణుల పర్యవేక్షణలో...

మృతిచెందిన మావోయిస్టుల బంధువులమంటూ ఒకరిద్దరు రావడంతో డీఎన్‌ఏ పరీక్షలు చేయాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. మృతులు, బంధువుల డీఎన్‌ఏలను సరిపోల్చిన తర్వాతే మృతదేహాలను చూపిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులెవ్వరూ నిర్ధారించడం లేదు. రాజమహేంద్రవరం, కాకినాడ జీజీహెచ్‌ల నుంచి ఫోరెన్సిక్ నిపుణుల పర్యవేక్షణలో మృతదేహం ప్రతి అవయవాన్నీ పరీక్షించి, నమూనాలు సేకరించడం వల్ల ఒక్కో పోస్టుమార్టానికి గరిష్ఠంగా 4 గంటలు పడుతోందని తెలుస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన మృతుల బంధువులకు భోజనం, వసతి కల్పిస్తూ, మృతదేహాలను తీసుకెళ్లేందుకు వాహనాలూ సమకూర్చుతున్నామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల సాయం చేస్తున్నట్లు వెల్లడించారు.

★ మరోవైపు ఎన్‌కౌంటర్ మృతులను తీసుకెళ్లేందుకు రంపచోడవరం ఆసుపత్రికి వచ్చిన బంధువులు మృతులతో ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకొని, ఆవేదన వ్యక్తం చేశారు.

టెక్ శంకర్‌కు అంతిమ వీడ్కోలు


టెక్ శంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ ఇన్‌ఛార్జి మెట్టూరు జోగారావు ఎలియాస్ టెక్ శంకర్‌కు కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్థులు అంతిమ వీడ్కోలు పలికారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈనెల 19న జరిగిన ఎన్‌కౌంటర్‌లో శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురానికి చెందిన టెక్ శంకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహం రంపచోడవరం నుంచి శుక్రవారం ఉదయం ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామానికి చేరుకోగా.. అప్పటికే ప్రజాసంఘాల నాయకులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆటోలో మృతదేహాన్ని ఉంచి అంతిమయాత్ర నిర్వహించారు. టెక్ శంకర్ సోదరులు యువరాజు, మధుసూదనరావు సమక్షంలో అంత్యక్రియలు జరిగాయి.

ద్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ద్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో లక్ష మంది ద్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని చెప్పారు. ఇప్పటి వరకు రూ.578 కోట్లతో 39,371 మంది సభ్యులు వ్యాపార సేవా, పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేశారని, మిగతా లక్ష్యాన్ని మార్చిలోపు పూర్తి చేయాలని కోరారు. వారికి అవసరమైన బ్యాంకు రుణాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ద్వాక్రా మహిళల్ని మహిళా వ్యవస్థాపకులుగా తయారు చేసేందుకు విశాఖ ఐఐఎంను ఇంక్యుబేషన్ సెంటర్‌గా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. బ్యాంకుల ద్వారా సభ్యులకు ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.16,846 కోట్ల రుణాలు ఇచ్చారని, 2026 మార్చి నాటికి మిగతా రుణ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.

24 నుంచి అగ్రి బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు చివరి విడత కౌన్సెలింగ్

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) వ్యవసాయం, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 24, 25, 27, 28, 29, 30 తేదీల్లో చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వి.రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు angrau.ac.in వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

చికిత్స కోసం వస్తే హిడ్మాను చంపేశారు..

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ అంతా కట్టుకథ ● మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్

ఈనాడు, అమరావతి, చర్ల, న్యూస్‌టుడే: కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మాడ్వి హిడ్మా, ఆయన భార్య మడకం రాజేలు. . మరికొందరితో కలిసి వైద్య చికిత్సల నిమిత్తం విజయవాడకు రాగా నిరాయుధులుగా ఉన్న వారిని పోలీసులు పట్టుకుని కాల్చి చంపేశారని మావోయిస్టు పార్టీ ఓ ప్రకటనలో ఆరోపించింది. వారిని హత్య చేసిన తర్వాత మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ పేరిట కట్టుకథ అల్లారని పేర్కొంది. వీటిని ఖండిస్తూ నవంబరు 23న దేశవ్యాప్తంగా నిరసన దినంగా పాటించాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో శుక్రవారం ప్రకటన విడుదలైంది. "హిడ్మా, ఆయన భార్య రాజేలు.. మరికొందరితో కలిసి వైద్యం కోసం విజయవాడకు వెళ్లారు. ఈ క్రమంలో కొందరు చేసిన ద్రోహం వల్ల పోలీసులకు సమాచారమందింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ఏపీ ఎస్ఐబీ నవంబరు 15న వీరిని అదుపులోకి తీసుకుంది. వారిని లొంగదీసుకోవడానికి ప్రయత్నించి విఫలమై క్రూరంగా హత్య చేసింది. టెక్ శంకర్‌తో పాటు మిగతా వారినీ పట్టుకుని చంపేశారు' అని అభయ్ వివరించారు.

హిడ్మా స్థానంలో కమాండర్ బార్సె దేవా?



చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టు టాప్ కమాండర్ మడ్వి హిడ్మా మరణం తర్వాత ఆ స్థానంలో మరో కీలక కమాండర్ కోసం అన్వేషణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. హిడ్మాకు సహచరుడు, ఆయన గ్రామం పువర్తికే చెందిన బార్సె దేవాను ఈ కీలక స్థానంలో నియమించే అవకాశాలు ఉన్నట్లు పెద్దఎత్తున చర్చ సాగుతోంది.



EENADU Vol: 52, Issue: 102 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in


రేణుక

రేణుక వంట... లక్షలమంది ఫిదా!

కోరుకున్న ఉద్యోగం రాకపోతే ఎవరైనా నిరుత్సాహానికి గురవుతారు. కానీ జింకల రేణుక అలా కాదు. నచ్చిన వ్యాపకంపై దృష్టిపెట్టారు. లక్షలమంది అభిమానుల్ని సంపాదించుకున్నారు.

రేణుక స్వస్థలం గుంటూరు జిల్లాలోని పెదకాకాని. బీఎస్సీ తరవాత టీచర్ ట్రైనింగ్ కూడా పూర్తిచేశారు. పెళ్లయ్యాక ఖమ్మం జిల్లా మదిర మండలంలోని నాగవరప్పాడుకి వచ్చారు. భర్త సురేష్‌తో కలిసి ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించారు. కానీ విఫలమవడంతో తనకు నచ్చిన వ్యాపకానికే ఊపిరి పోసే మార్గాలను వెతికారు రేణుక. అందులో భాగంగానే యూట్యూబ్‌లోకి వచ్చారు. వంటల తయారీపై తనకున్న ఇష్టాన్ని... సాంకేతిక పరిజ్ఞానం మీద ఉన్న కొద్దిపాటి అవగాహనని సద్వినియోగం చేసుకుని 2017లో 'రేణుక వంటలు' ప్రారంభించారు. సులువైన వంటలు, తేలికగా చేసుకునే తీరుతో విదేశాల్లో స్థిరపడిన తెలుగువారినీ ఆకర్షించారు. సందేహాలను నివృత్తి చేస్తూ ఫాలోయర్లని పెంచుకున్నారు. అలా ఇప్పటివరకూ 1500 వీడియోలను తన ఛానల్‌లో ఉంచారామె. తనను లక్షలమంది పైగా అనుసరిస్తున్నారు. ఆదాయమూ రావడంతో కుటుంబానికి ఆర్థిక వెసులుబాటూ దొరికింది. 'రుచికరమైన భోజనం స్వయంగా చేసుకోవాలనుకునే వారికి సాయపడాలనుకున్నా. అందుకే సులువుగా చేసుకోగలిగిన వంటలకే నా ఛానల్‌లో ఎక్కువ ప్రాధాన్యమిచ్చేదాన్ని. ఇష్టంగా చేస్తే వంట చాలా సులువు. దాన్ని ఎక్కువ మందికి చేరువ చేయాలనుకుంటున్నా. రాజీపడకుండా ఇదేదో ఉద్యోగం చేయకపోయినా... ఆసక్తి, పట్టిన అవకాశాలు అందుకుని అభివృద్ధి చెందొచ్చు' అంటారు రేణుక.

– నిరుకొండ మురళీకృష్ణ, మదిర గ్రామీణం



ముష్టి ముద్ర

పిడికిలి బిగించి ఉంచే ముద్ర... అందుకే 'ముష్టి ముద్ర' అని పేరు.

మ్యాట్‌పైన పద్మాసనం/వజ్రాసనం లేదంటే సుఖాసనంలో కూర్చోండి. ఇప్పుడు నిదానంగా మీ అరచేతిని తెరచి, అన్ని వేళ్లనూ మూసి ఉంచి, వాటిపైన బొటనవేలును ఉంచాలి. మొత్తంగా పిడికిలి బిగించిన విధంగా ఉండాలి. ఇలా రెండు చేతులతో చేయండి. ఆపైన ముద్ర వేసిన చేతులను మణికట్టు వెనకభాగం మోకాళ్లపైన ఆనించి ఉంచండి. ఇప్పుడు వెన్నెముకను నిటారుగా పెట్టి, శ్వాస మీద ధ్యాస ఉంచి 15-40 నిమిషాల వరకూ ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత కాళ్లను చాచి విశ్రాంతి తీసుకోండి.

ప్రయోజనాలు: ఇది కాలేయానికీ, ఉదరానికీ మేలు చేస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. భయం, ఆందోళనలను దూరం చేయడంలో సహకరిస్తుంది. కోపాన్ని నియంత్రిస్తుంది.

ఆహారం: యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉండే ఆకుకూరలు, బెర్రీలు, కూరగాయలు తీసుకోవాలి. ఓట్స్, నట్స్, తృణధాన్యాలు తీసుకోండి. కాఫీ, టీలకి వీలైనంత దూరంగా ఉండండి.

– శిరీష, యోగ గురు



ఓ పక్క వివాదం, మరోపక్క గాయం... వీటిని లెక్కచేయకుండా ఎంతో ధైర్యంగా పోటీల్లో పాల్గొంది. అంతులేని ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించి మిస్ యూనివర్స్‌గా నిలిచింది మెక్సికో సుందరి... ఫాతిమా బాష్!

ఇంట్లో యువరాణి...

ఫాతిమా బాష్ ఫెర్నాండెజ్ మెక్సికోలోని విల్లాహెర్మోసా. ఆరేళ్ల వయసులో డిస్లెక్సియా, ఏడీహెచ్‌డీ, హైపరాక్టివిటీ... వంటి సమస్యలతో ప్రాథమిక విద్యలో ఇబ్బందుల్ని ఎదుర్కొంది. తోటి పిల్లల అవమానాల్ని దాటుకుని పట్టుదలతో ముందుకెళ్లింది. పదహారేళ్ల వయసులో ఏదైనా కోర్సు కోసం అమెరికా వెళ్లింది ఫాతిమా. తిరిగొచ్చాక అందాల పోటీలమీద దృష్టిపెట్టింది. స్థానికంగా టబాస్కో కిరీటాన్ని సొంతం చేసుకున్నాక ఫ్యాషన్ డిజైనింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది భామ. అలా ఈ ఏడాది మిస్ యూనివర్స్ మెక్సికోగా ఎంపికైంది.

విశ్వానికి సుందరి!

నిజమైన అందం సేవలోనే ఉందని నమ్మే ఫాతిమాకి దయ, సహానుభూతి ఎక్కువే. తొమ్మిదేళ్లుగా క్యాన్సర్‌తో పోరాడే పిల్లలకు సేవల్ని అందిస్తోంది. తాజాగా థాయ్‌లాండ్‌లో జరిగిన 74వ విశ్వసుందరి పోటీల్లో పాల్గొని అందం, ఆకర్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం, వాగ్ధాటి, దార్శనికతలతో న్యాయనిర్ణేతల్ని మెప్పించింది. వీక్షకుల్నీ ముగ్ధుల్ని చేసింది. వివాదాల్నీ, గాయాన్నీ అధిగమించి మెక్సికోకి నాలుగో విశ్వసుందరి కిరీటాన్ని అందించింది.



అసలింతకీ ఏం జరిగింది?

ప్రి-పాజెంట్ వేడుకలో... ఓ షూట్‌కి హాజరుకాకపోవడం, ప్రమోషనల్ కంటెంట్‌ను పోస్ట్ చేయనందుకు థాయ్ అందాల పోటీల నిర్వాహకుడైన నవాత్ ఇత్సారగ్రిసిల్... ఫాతిమాను ఘాటుగా విమర్శించారు. భద్రతా దళాలను పిలిపించి ఆమెను వేదిక మీద నుంచి పంపించేందుకూ ప్రయత్నించారు. దానికి అంతే తీవ్రంగా స్పందించింది ఫాతిమా. 'ఆయన నన్ను డమ్మీ అన్నారు. మనం సాధికారత కలిగిన మహిళలం. గొంతు విప్పాలి. అది ప్రపంచం చూడాలి' అంటూ వేదిక నుంచి తనే వాకౌట్ చేసింది. మద్దతుగా మరికొందరు అందాల రాణులూ ఆమె వెంట నడిచారు. ఇదంతా లైవ్‌స్ట్రీమ్ కావడంతో పోటీకి ముందే సోషల్‌మీడియాలో ఫాతిమా వైరలైంది. ఎట్టకేలకు మిస్ యూనివర్స్ సంస్థ నిర్వాహకులతోపాటు నవాత్ క్షమాపణలతో వివాదం ముగిసింది.

'అణచివేత ఎదురైనప్పుడు మనం గట్టిగా సమాధానం ఇవ్వాలి. అందుకు ఫాతిమానే ఉదాహరణ' అంటూ మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా సైతం ఈమెను కొనియాడారు.

గాయమెలా?

సరిగ్గా తుది పోటీలకు ముందు హోటల్ గదిలో పగిలిన గాజు పెంకులమీద అడుగేసింది ఫాతిమా. రిహార్సల్స్ బిజీలో చికిత్సకు సమయం లేకపోయిందనీ, లోపలెక్కడో దిగిన ఓ గాజుపెంకు నడిచినప్పుడల్లా నొప్పి పెడుతున్నా పట్టించుకోకుండా పోటీల్లో పాల్గొన్నాననీ చెప్పుకొచ్చిందీ మిస్ యూనివర్స్. వివాదం తరవాత జరిగిన రిహార్సల్స్‌లో ఆమె కనబరిచిన ప్రశాంతత, వృత్తిపరమైన నిబద్ధతల్ని తోటి అందాల రాణులూ మెచ్చుకున్నారు. మొత్తంగా ధైర్యం, పట్టుదల, స్థితప్రజ్ఞతలతో ఫాతిమా పోటీలో పాల్గొన్న తీరు అందరినీ ఆకట్టుకుంది. కంగ్రాచ్యులేషన్స్ ఫాతిమా!

మీ గొంతు వినిపించండి

'ఆధునిక యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు ఏమిటి, వాళ్ల రక్షణ కోసం ఈ వేదికను ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించగా... 'నేటికీ మహిళలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగని నేటితరం బాధలను వ్యక్తం చేసేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. మార్పుకోసం విశ్వసుందరిగా నా గళాన్ని వినిపిస్తా. కలిసికట్టుగా పోరాడాలి. ధైర్యంగా నిలబడితేనే చరిత్ర సృష్టిస్తాం'

'టైటిల్‌ను గెలిస్తే యువతులను ఎలా శక్తిమంతం చేస్తా'రన్న తుది ప్రశ్నకు...

'మిమ్మల్ని మీ కలల్ని నమ్మండి. మనసు చెప్పిందే చేయండి. మీ విలువను తగ్గించే అవకాశాన్ని ఎవరికీ ఇవ్వకండి. ఈ ప్రపంచంలో అన్నింటికన్నా మీకు మీరే ముఖ్యం. మీరు శక్తిమంతులు. మీ గొంతు వినిపించండి' అని సమాధానమిచ్చి అందరి మనస్సుల్ని గెలిచారు. దీనికి సోషల్‌మీడియాలోనూ ప్రశంసలు వెల్లువెత్తాయి.

హాబీలెన్నో!

'నేను డాగ్ ప్రేమికురాలిని. ఇంట్లో ఉన్నా బయటకు వెళ్లినా నాన్న చెయ్యి పట్టుకుని తిరుగుతా' అని చెప్పే ఫాతిమాకి హాబీలు చాలానే. బీచ్‌లో గంటలకొద్దీ గడుపుతూ ప్రకృతిని ఆస్వాదిస్తుంది. జోగింగ్, స్విమ్మింగ్, సర్ఫింగ్, ఐస్ స్కేటింగ్, పుస్తకాలు చదవడం, చిత్రలేఖనం, గుర్రపుస్వారీ... ఇలా చాలా చేస్తుంది. అన్నట్లు ఈమెకో గుర్రం కూడా ఉంది. వ్యాయామం, యోగా తన ఫిట్‌నెస్ రహస్యాలంటోన్న ఫాతిమా ఇన్‌స్టా ఖాతాని 20 లక్షలమంది అనుసరిస్తున్నారు.

పర్యటనలతో జీవన నైపుణ్యాలు...

పిల్లలు అన్ని పాఠాల్నీ పుస్తకాలు, తల్లిదండ్రుల నుంచి నేర్చుకోలేరు. కొన్నింటిని వాళ్ల అనుభవ పూర్వకంగా తెలుసుకోవాల్సిందే. అందుకున్న మార్గాల్లో ప్రయాణాలు ఒకటి. ఇవి పిల్లలకు ఏమేం నేర్పుతాయంటే...



దైనందిన జీవితానికి దూరంగా అడుగుపెట్టడమంటే పిల్లలు తమ కంఫర్ట్‌జోన్‌ను వదిలి రావడమే. ఇది తెలుసుకోవడం, నేర్చుకోవడంలో మొదటి అడుగు. ఆచరణాత్మక నైపుణ్యాలు, కొత్త దృక్పథాలను ఈ అనుభవాలు తెలియజేస్తాయి.

- పాఠశాల పర్యటనలో భాగంగా ఓ పర్వత ప్రాంతానికి వెళ్లినప్పుడు... కొండపైకి ఎక్కుతూ మధ్యలోనే అలసిపోయి, ఇక చాలని చెప్పడానికి సిద్ధమైపోతారు. అలాంటప్పుడు పక్కనున్న వాళ్ల ప్రోత్సహిస్తే తమ పరిమితులను అధిగమించి, పర్వతారోహణను పూర్తిచేయాలని నిశ్చయించుకుంటారు. ఈ అనుభవం అసౌకర్యాన్ని తట్టుకుని నిలబడాలని, చేపట్టిన పనిని పూర్తి చేయాలనే నిబద్ధతను నేర్పుతుంది.
- సముద్రాన్ని చూడగానే పిల్లలు మొదట భయపడతారు. స్నేహితులు, టీచర్లు చేయందిస్తే... మెల్లమెల్లగా తీరం వెంబడి నడుస్తారు. కాసేపటికి ఆడుకోవడం మొదలుపెడతారు. దూరం నుంచి భయంకరంగా కనిపించిన అలలు... ఒకరి తోడుతో దగ్గరగా వెళ్లేసరికి చిన్నవిగా, ఆనందదాయకమైనవిగా కనిపిస్తాయి. ఇలాంటి అనుభవాలు పరీక్షల్లాంటి అంశాల్ని ఎదుర్కోవడంలో వాళ్లకు సాయపడతాయి.
- ఒక్కోసారి దారి తప్పిపోయి, పెద్దలెవరూ కనిపించనప్పుడు కాసేపు గందరగోళానికి గురైనా... స్వతంత్రంగా ఆలోచిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో సాయంకోసం ఇతరులపై ఆధారపడటం తప్పు కాదని తెలుస్తుంది.
- సానుకూలంగా ఉండటం, ఒకరినొకరు ప్రోత్సహించడం, సహకరించడం ద్వారా సమస్యల్ని ఎలా పరిష్కరించాలో అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. ఇది ఐక్యత విలువను తెలియజేస్తుంది.
- ఉదయాన్నే లేవడం, రాత్రంతా నిద్రపోవడం, ఆకలిని జయించడం... వంటివి వారిలో క్రమశిక్షణను పెంచి, ప్రశాంతంగా, చురుగ్గా తయారుచేస్తాయి.
- ఆర్థిక ప్రణాళిక వేయడంలో భాగం చేస్తే, ఆర్థిక నిర్వహణ నైపుణ్యాలనూ నేర్చుకుంటారు.

ఏడాది క్రితం వరకూ ఇరా బింద్రా అనే పేరే ఎవరికీ తెలియదు. కానీ ఇప్పుడో ప్రపంచ స్థాయిలో ఆమె ఖ్యాతి వినిపిస్తోంది. ఎన్2గ్రోత్ ఇటీవల ప్రకటించిన ఉత్తమ మానవ వనరుల విభాగ సారథుల జాబితాలో చోటు దక్కించుకోవడమే ఇందుకు కారణం.

ఇరా చెబితే... రాజీపడాల్సిందే!



దిల్లీలో పుట్టిపెరిగారు ఇరా. లేడీ శ్రీరామ్ కాలేజీలో బీఏ(ఆనర్స్) పూర్తి చేశారు. నెదర్లాండ్స్‌లోని మాస్ట్రిక్ట్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఎంబీఏ పట్టాను పొందారీమె. స్వదేశానికి తిరిగి వచ్చి... దిల్లీ కేంద్రంగా పనిచేస్తోన్న జీఈ క్యాపిటల్‌లో ఓ సాధారణ హెచ్ఆర్ మేనేజర్‌గా కెరియర్‌ను ప్రారంభించారు. అక్కడ తన విధుల వరకే పరిమితమవ్వకుండా, సంస్థాగత మార్పులెన్నో చేశారు. ఈమె కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఎలాంటి వ్యక్తులనైనా రాజీపడేలా చేసి, వారితో పని చేయించుకునే తత్వాన్ని గమనించిన జీఈ ఇండియా అనే గ్లోబల్ కంపెనీ... టాలెంట్ అండ్ డెవలప్‌మెంట్ లీడర్‌గా ఇరాకు పదోన్నతిని కల్పించింది. ఇక అది మొదలు వెనుదిరగలేదామె. నైపుణ్యాలకు సానపెడుతూ దేశవిదేశాల్లో అవకాశాల్ని అందిపుచ్చుకున్నారు. జీఈ హెల్త్‌కేర్, జీఈ ఆయిల్ అండ్ గ్యాస్ ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ... ఒకటా రెండా గ్లోబల్ స్థాయిలో హెచ్ఆర్‌గా ఆమె సేవలు అందించిన కంపెనీలు చాలానే. ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా టీమ్‌ను ఒక తాటిపై నడిపించే నేర్పు ఈమె సొంతం. 'పోటీని తట్టుకుని నిలబడగలిగే వ్యూహాలు, కీలక సమయాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట ఇరా. ఆ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతున్న రిలయన్స్ గ్రూప్స్‌నకు చాలా అవసరం. అందుకే ఈమెను పీపుల్, లీడర్‌షిప్, టాలెంట్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, సీహెచ్ఆర్ఓ(చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్)గా నియమిస్తున్నా' అని చెబుతూ, ఆమె ప్రతిభను కొనియాడారు ముఖేష్ అంబానీ. అంతేనా, ఏఐని ఉపయోగించి శ్రామిక శక్తి నైపుణ్యాలకి మెరుగులద్దారీమె. ఎన్నో శిక్షణా కార్యక్రమాల్ని చేపట్టారు. నియామకాల ప్రక్రియలో కృత్రిమ మేధను ఉపయోగించి కంపెనీకి 20శాతం వ్యయాల్ని తగ్గించిన గతానుభావాలు చాలానే. ఇవన్నీ నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఇరాది అందెవేసిన చెయ్యి అని చెప్పడానికి ఉదాహరణలు. వీటన్నింటి ఫలితంగా ఇటీవల ఎన్2గ్రోత్ విడుదల చేసిన... ఉత్తమ మానవ వనరుల విభాగ సారథుల జాబితాలో 28వ స్థానంలో నిలిచారు ఇరా బింద్రా. భారత్ నుంచి ఈ జాబితాలో చోటు దక్కించుకున్న మొట్టమొదటి మహిళ ఇరానే కావడం విశేషం.

"కొన్నిసార్లు మనం ఎంత పనిచేసినా తగిన గుర్తింపు ఉండదు. ఒక్కోసారి మన కష్టం బృందం ఖాతాలోకి వెళ్లిపోతుంది. చాలాసార్లు పర్లేదులే అనుకుని మౌనంగా ఉండిపోతాం. వ్యాపారం ప్రారంభించిన కొత్తల్లో బ్యాంకర్లను కలవడానికి వెళితే నన్ను పట్టించుకునేవారు కాదు. కానీ నేను అందరిలా మౌనంగా ఉండలేదు. నా ఉనికిని చాటేదాన్ని. వ్యాపారం ప్రారంభించడంలో నా పాత్రనీ కచ్చితంగా చెప్పేదాన్ని. మనకోసం ఎవరో వచ్చి, నిలబడరు. మనమే నిలబడాలి. ముఖ్యంగా మనల్ని చిన్నచూపు చూస్తున్నారన్నప్పుడు మరింత దృఢంగా వ్యవహరించాలి".

- అద్వైతా నాయర్, సీఈఓ, నైకా ఫ్యాషన్

బంగారం - వెండి

21న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,27,760	1,14,500	1,57,500
విజయవాడ	1,22,440	1,14,100	1,56,600
ప్రొద్దుటూరు	1,24,300	1,14,360	1,55,700
రాజమహేంద్రవరం	1,23,980	1,13,650	1,69,000
విశాఖపట్నం	1,24,000	1,14,100	1,60,000
తమిళనాడు	-----	1,14,600	1,69,000



బొంతలు కావు... బ్యాగులు!

అమ్మ, బామ్మ చీరలు కాస్త పాతబడ్డాయంటే చాలు... ఒకప్పుడు బొంతలుగా మారేవి. చలికాలంలో వెచ్చదనాన్ని ఇచ్చే అవి... అవసరమైతే పరుపులయ్యేవి. ఆడుకునే చోట, చదువుకునేప్పుడు పరుచుకోవాలన్నా బొంతలే కనిపించేవి. వేసవిలో వసారాలో వరుసగా పేర్చిన బొంతల మీద పిల్లలంతా పడుకుని కబుర్లు చెప్పుకోవడం చాలామందికి చిన్ననాటి జ్ఞాపకం. బొంతలంటే వస్త్రాల వరుసేనా? అమ్మ, బామ్మల ప్రేమ, ఆత్మీయ స్పర్శకూ చిహ్నం. కాబట్టే, చాలామంది నోస్టాలజీ అంటూ ఆ జ్ఞాపకాలు, అయినవాళ్ల స్పర్శను పదే పదే గుర్తుచేసుకోవాలంటూ మళ్లీ వాటిని 'క్విల్ట్' రూపంలో తెచ్చేసుకున్నారు. పసిపిల్లల దుస్తులకూ వాటిలో చోటిచ్చేశారు. ఆ జ్ఞాపకాలను ఇంట్లో ఉన్నప్పుడే... పడుకునే సమయంలోనే ఎందుకు గుర్తుచేసుకోవాలి? ఎప్పుడూ వెంట ఉంచుకోవచ్చుగా అనుకున్నారో... వెచ్చదనం చేతిలో ఇమడాలి అనుకున్నారో తెలియదు కానీ... బొంతలు బ్యాగుల్లానూ వచ్చాయి. 'క్విల్టెడ్ బ్యాగ్స్'గా ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నాయి. అరె... భలేగుందే కొత్త ఐడియా అనుకోకండి! ఇవి 18వ శతాబ్దం నుంచే ఉన్నాయి. ఒకప్పుడు మహిళలు... చతురస్రం, డైమండ్, వృత్తాలు బ్యాగు మీద కనిపించేలా వీటిని కుట్టేవారట. వాటి సైజు, క్రమాన్ని బట్టి, వాళ్ల నైపుణ్యాన్నీ అంచనా వేసేవారు. కాలక్రమంలో ఎన్నో ప్రముఖ సంస్థలు వెలిసి ఇవి కాస్త వెనకపడ్డాయి. అయితేనేం క్విల్ట్ తరహా డిజైన్లకు ప్రముఖ యాక్సెసరీల సంస్థలూ ఫిదా అయ్యాయి. దీంతో లెదర్ రూపంలోనూ తీసుకొచ్చాయి. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'షనెల్' కూడా ఇందుకు మినహాయింపు కాదు. కాబట్టే క్విల్ట్‌కి 'టైమ్‌లెస్ డిజైన్'గానూ పేరు. అన్నట్టూ దీన్ని ఆడంబరతకే కాదు మహిళల స్వాతంత్ర్యానికి చిహ్నంగానూ భావించేవారట. ఇప్పుడు ప్రపంచమంతా సస్టెయినబిలిటీ మంత్రం జపిస్తోంది. తిరిగి వాడటంపై దృష్టిపెడుతోంది. యువతా ఇందులో భాగమైంది. కాబట్టే, క్విల్టెడ్ వస్త్ర బ్యాగులకు మళ్లీ గిరాకీ ఏర్పడింది. ఇది గమనించి ప్రముఖ సంస్థలూ భిన్నత్వాన్ని ప్రదర్శిస్తూ ఆకర్షించేలా వీటినిలా తీసుకొచ్చేశారు. సైజుల సంగతైతే సరేసరి. హ్యాండ్ పర్స్, టోటె, హ్యాండ్ బ్యాగ్, ల్యాప్‌టాప్ బ్యాగ్, బ్యాక్‌ప్యాక్... అన్ని రూపాల్లోనూ దొరికేస్తున్నాయి. బాగున్నాయి కదూ! ఇంకేం ఒకటి తెచ్చుకుని ట్రెండ్‌లో భాగమైపోండి. లేదండీ ఇంట్లో పక్కన పెట్టిన వస్త్రాలు బోలెడంటారా? మీరు కోరుకున్న విధంగా చేసిచ్చేవారూ చాలామందే. నచ్చితే ప్రయత్నించేయండి మరి!







ఫ్యాషన్ ఫ్యాషన్


సస్మిత

ఆ అమ్మాయి ఓ విద్యార్థిని. అయితే తను కేవలం చదువుకోవట్లేదు. పాఠాలు చెబుతోంది. .. అదీ పెద్దలకి! వాటిల్లో అక్షరాలకు చోటుండదు. ఎంతోమంది అమ్మాయిల జీవితాలుంటాయి. సస్మితా సాహు... ఇంతకీ ఆ అమ్మాయి చేసేదేంటి?

పెళ్లొద్దు... చదివించండి!

ఇప్పుడంటే సస్మిత డిగ్రీ చదువుతోంది కానీ... ఒకప్పుడు ఆ అవకాశమే దూరమయ్యే పరిస్థితి తనది. పదో తరగతి పూర్తయ్యిందో లేదో ఇంట్లో పెళ్లి చేసేయాలనుకున్నారు. ఈమెది ఒడిశాలోని బ్రహ్మపుర. పేదకుటుంబం, నలుగురు పిల్లల్లో సస్మితానే పెద్ద. తన ఊళ్లో పెద్దమ్మాయికి ఎంత త్వరగా పెళ్లి చేసి భారం దించుకుంటే మిగతా వాళ్లూ అంత త్వరగా స్థిరపడతారనే నమ్మకం ఉండేది. దీంతో చుట్టుపక్కలవాళ్లు, బంధువుల ప్రోత్సాహంతో తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి నిశ్చయం చేశారు. అప్పటికామెకు 16 ఏళ్లే! అమ్మానాన్నలు పడే కష్టం సస్మితకి బాగా తెలుసు. అందుకే బాగా చదివి, ఉద్యోగం సంపాదించాలి... అమ్మానాన్నలకు అండగా నిలబడాలి అనుకునేదామె. కష్టపడి చదివేది. పదో తరగతిలో మంచి మార్కులూ వచ్చాయి. పైచదువులు చదవాలన్న ఆనందంలో ఉంటే పెళ్లన్నారు. చదువుకుంటానని ఎంత బతిమాలినా ఇంట్లోవాళ్లు వినలేదు. ఒప్పించాలని చూసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఒకానొక దశలో కుంగుబాటు, భయం ఆమెను ఆవరించాయి కూడా. కానీ తనకోసం తనే నిలబడాలనుకున్న సస్మిత స్థానిక సంస్థల సాయం తీసుకుంది. వాళ్లు ఆమె పెళ్లిని ఆపడమే కాదు, ఇంట్లోవాళ్లకీ కౌన్సెలింగ్ ఇచ్చారు. వాళ్ల సాయంతో బాల్యవివాహాన్ని తప్పించుకుని, తిరిగి చదువు బాట పట్టిందామె.

ప్రస్తుతం భువనేశ్వర్‌లో డిగ్రీ చదువుతోంది సస్మిత. తనకి టీచర్ కావడం లక్ష్యం. అయితే తను సురక్షితంగా ఉంటే చాలనుకోలేదామె. మిగతా అమ్మాయిలూ బలవ్వకూడదనుకుంది. అందుకే భువనేశ్వర్‌లోని మురికివాడలకు రోజూ వెళ్తుంది. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తోంది. ఎవరికీ భయపడకుండా దాదాపు 15 బాల్యవివాహాలను ఆపింది కూడా. 'భారమనుకుని అమ్మాయిని వేరే ఇంటికి పెళ్లి పేరుతో పంపితే... అక్కడికి వెళ్లాక ఆమెకి ఎదురయ్యేది కష్టమే. అనారోగ్యాలకు తోడు ఇంటి చాకిరీ. అదే చదివించండి... మీకే అండగా నిలుస్తుంది' అంటూ అవగాహన కల్పిస్తోంది. అమ్మాయిల విద్య, పెళ్లికి సాయపడే పథకాల గురించీ వివరిస్తోంది. తన స్ఫూర్తితో ఆమె ఊళ్లో బాల్యవివాహాలు తగ్గుముఖం పట్టాయి. అమ్మాయిలు చదువుకుంటున్నారు. 'నా ధైర్యం కొందరిలోనైనా స్ఫూర్తి నింపడం ఆనందంగా ఉంది. ఏ అమ్మాయీ బాల్యవివాహానికి బలవ్వొద్దు. అందుకోసమే నా తాపత్రయం' అంటోన్న సస్మితని అభినందించాల్సిందే కదూ!

ఈటీవీ భారత్

ఈతరం

youthpage@eenadu.in

సమావేశాల్లో..


ఐటీ, గవర్నమెంట్, ఇతర ఏ సెక్టార్‌లో పనిచేసినా సరే, అక్కడి పని వాతావరణానికి సంబంధించి మనం పాటించాల్సిన ముఖ్యమైన రూల్స్ కొన్ని ఉంటాయి. సమావేశాల్లో ఈ ఆరు అంశాలను తప్పకుండా ఫాలో కావాలని నిపుణులు చెబుతున్నారు.

1. సమావేశ గదుల్లో శుభ్రత పాటించాలి. చర్చించాల్సిన అంశాల మీదే ఫోకస్ ఉండేలా దృష్టిపెట్టాలి.
2. మీటింగ్ అనుకున్న సమయానికి ప్రారంభించి, ముగించేలా మనం అందుబాటులో ఉండాలి.
3. ముందుగా సన్నద్ధత ఉండాలి. అప్పటికప్పుడు హడావుడి పడకూడదు.

నేనే లీడర్



4. డిజిటల్ పరికరాలు ఉపయోగిస్తూ పరధ్యానంగా ఉండకూడదు.
5. ఫుడ్, డ్రింక్స్ ఆఫర్ చేసినా.. పరిమితంగా తీసుకోవాలి.
6. సమావేశానికి అనుగుణంగా దుస్తులు ధరించి, పరిస్థితికి తగినట్టు ప్రవర్తించాలి.



కుక్కర్ రెండు విజిల్స్ తర్వాత స్టవ్ ఆఫ్ చెయ్యమని అమ్మ చెబుతుంది. కానీ మనకు ఎన్ని విజిల్స్ వచ్చాయో గుర్తుండదు.

వచ్చే గురువారం బర్త్‌డే పార్టీకి రమ్మని ఫ్రెండ్ పిలుస్తాడు. అదే రోజు సరిగ్గా మర్చిపోతాం.

బాగా చదివి అర్థం చేసుకున్న కాన్సెప్ట్. సరిగ్గా పరీక్ష సమయానికి గుర్తొచ్చి చావదు.

మర్చిపోతున్నావా..

మనకే కాదు.. మనలాంటి చాలామంది టీనేజర్లకు ఎదురవుతున్న ప్రాబ్లమే ఇది. విషయాలను మర్చిపోవడం పెద్దవాళ్లకు వచ్చే సమస్య అనుకుంటారు కానీ.. ఫర్‌గెట్‌ఫుల్‌నెస్ అనేది టీనేజర్లు, యంగ్ అడల్ట్స్‌లో ప్రస్తుతం అధికంగా ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి కారణాలు లేకపోలేదు. నిరంతరం స్క్రీన్లకు అతుక్కుపోవడం, జీవనశైలి మార్పులతో చిన్నచిన్న విషయాలు కూడా గుర్తుండని సందర్భాలు ఎదురవుతున్నాయట. అలాంటి సమయాల్లో ఇలా చేసి చూడాలి అంటున్నారు నిపుణులు.

- ముందు బాగా నిద్రపోవాలి. సిరీస్‌లు చూస్తూ, చాటింగులు చేస్తూ తెల్లవారుజాము పడుకునే అలవాటు అర్జెంటుగా మానుకోవాలి. లేదంటే ఇది నెమ్మదిగా మెమరీని దెబ్బతీస్తుంది. ఆపైన ఇన్‌సోమ్నియా, స్లీప్ ఆప్నియా వంటివి కూడా వచ్చేయొచ్చట!
- మల్టీటాస్కింగ్ నిజానికి మంచిదే కానీ.. మనం మర్చిపోతున్నాం అని అర్థమవుతున్నప్పుడు ఆగి, ఆలోచించి.. ఒక పనిపై దృష్టిపెట్టడం చెయ్యాలట. లేదంటే ఏ ఒక్క పని సంగతీ గుర్తుండదట.
- మార్కులు, ర్యాంకులు, రిలేషన్‌షిప్స్, ఇంట్లో విషయాలు.. ఇలా దేని గురించైనా అధికంగా ఒత్తిడి తీసుకుంటే కూడా ఇలా అవుతుందట. అందుకే స్ట్రెస్‌ను హ్యాండిల్ చేయడం తెలుసుకోవాలి.
- ఈ వయసులో కలిగే హార్మోన్ల మార్పుల వల్ల కూడా కొంత కారణమవుతుంది. దీనికి ఆరోగ్యకరమైన అలవాట్లు ఉండటం సహకరిస్తుంది.
- ఇంట్లో వండిన హెల్తీ ఫుడ్ తీసుకోవడంతోపాటు మంచి అలవాట్లు చేసుకోవడం, సరైన టైంటేబుల్ ఫాలో కావడం, అనవసర విషయాల జోలికి వెళ్లకుండా ఉంటే.. అవసరమైనవన్నీ చక్కగా గుర్తుంటాయట! చేస్తారుగా మరి..

ఇప్పుడు కెరియర్‌లో ఉరుకులు పరుగులు పెడుతూ.. ఇంటాబయటా ఒత్తిడిలో విసిగి వేసారిపోతూ.. వీకెండ్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసే జీవులంతా.. ఒకప్పుడు 90స్‌లో ఆడుతూపాడుతూ తిరిగిన అల్లరిపిడుగులే! మన చిన్ననాటి సంగతుల్లో ఎన్నో సరదా విషయాలుంటాయి. కొన్ని మన అల్లరి రేంజ్ ఏంటో వివరిస్తే, మరికొన్ని గుండె అడుగున తడిలా మిగిలిపోతాయి.



90ల్లోకి వెళ్దామా?

అలాంటి ఏదైనా మీరు మర్చిపోలేని ఓ జ్ఞాపకాన్ని మాతో పంచుకోండి. స్నేహితులతో కలిసి చేసిన కోతిపనులు, అమ్మానాన్నలకు పిచ్చిపిచ్చిగా కోపం తెప్పించిన సందర్భాలు.. గొప్పగా నేర్చుకున్న ఓ గుణపాఠం.. ఏదైనా కానివ్వండి. మీ చైల్డ్‌హుడ్ అనగానే గుర్తొచ్చే ఆ సంఘటనను మాకు రాసి పంపండి. బాగున్న వాటిని మీ పేరు, ఫొటోతో ప్రచురిస్తాం.

మా మెయిల్ అడ్రస్.. youthpage@eenadu.in

స్టూడెంట్ లైఫ్ ఈజీ మామా!

అసలు ఏం తెలుసు మీకు మా స్టూడెంట్స్ కష్టాలు?
ఓ పక్క చదువులు, కెరియర్లు
మరోపక్క లవ్, రిలేషన్‌షిప్
ఏదైనా సాధించగలమని ఉరకలేసే నెత్తురు
ఆ పరుగులకు అడ్డుకట్ట వేసే వాస్తవ ప్రపంచం
జీవితాన్ని తీర్చిదిద్దుకునే క్లిష్టమైన దశ
అప్పుడే ఆసక్తిగా, అంతలోనే భారంగా అనిపించే రోజులు..
అని కంప్లైంట్ చేస్తున్నారా..?

మనలాంటి వారికి ఎటు పరిగెత్తాలో నేర్పేందుకు మన పెద్దలు ఎప్పుడో కొన్ని మంచి మాటలు చెప్పారు. జెన్‌జీనే కాదు.. జనరేషన్ ఆల్ఫా, బీటా వచ్చినా సరే ఇవి ఆచరించదగినవి, మన మనోవికాసానికి బాటలు వేసేవి. ఆ మాటలేంటో తెలుసుకుని, ఆధునిక సమాజ విద్యార్థులకు అర్థమయ్యేలా వాటిని డీకోడ్ చేద్దామా!



ఎన్నాళ్లు ఉన్నామని కాదు, ఎంత గొప్పగా ఉన్నామనేది ముఖ్యం (లైఫ్ షుడ్ బి గ్రేట్ రాదర్ దాన్ లాంగ్) – డా.బి.ఆర్.అంబేడ్కర్

ఒక రోజు.. కాలేజీలో భారంగా గడుస్తోందా? క్లాస్‌కి వెళ్లడానికే బోర్ కొడుతుందా? దేని మీదా ఆసక్తి నిలవడం లేదా? అప్పుడు ఈ మాటను గుర్తుచేసుకోవాలి. బోరింగ్‌గా ప్రతిరోజూ గడిపేయడం కాదు, కాలేజీకి వెళ్లామా వచ్చామా అన్నట్టు కూడా కాదు. నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు.. ఏదోక కొత్త విషయం తెలుసుకోవాలనే ఆసక్తి పెంచుకోవాలి. 'ఈరోజు ఏదోటి అదరగొడదాం' అనే డైలాగ్ గుర్తుంది కదా! కేవలం క్లాసులకు హాజరుకావడమే కాకుండా, ప్రతి రోజూ మనల్ని మలిచే కొత్త విషయాలు నేర్చుకుంటూ లైఫ్‌ను గ్రేట్‌గా గడపాలి. లేదంటే పీజీలు, పీహెచ్‌డీలు అంటూ విద్యార్థి దశలో ఎన్నేళ్లు గడిపితే ఏం లాభం చెప్పండి!

ప్రతి ప్రశ్నకూ ఒక సమాధానం ఉన్నట్టే, ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం ఉంటుంది. అయితే ఒక విద్యార్థిగా మన రోజువారీ లైఫ్‌లో జరిగే కొన్ని విషయాలు.. చాలా కష్టంగా అనిపిస్తాయి. ఎంత ట్రై చేసినా వాటి నుంచి బయట పడే దారి కనపడదు. అలాంటప్పుడు వీటిని గుర్తుచేసుకోవాలి అంటున్నారు సైకాలజిస్ట్ అర్చన నందూరి.

టన్నుల కొద్దీ చెప్పే మాటల కన్నా.. మొదలుపెట్టిన పని ఒక్కటైనా అది చాలా గొప్పది (ఏన్ ఔన్స్ ఆఫ్ ప్రాక్టీస్ ఈజ్ వర్త్ మోర్ దాన్ టన్స్ ఆఫ్ ప్రీచింగ్) – మహాత్మాగాంధీ

ఇంట్లోనూ, ఫ్రెండ్స్ మధ్యా మనకు చాలా ఒత్తిడి ఉంటుంది, ఏదో సాధించాలని! 'నేను ఈసారి ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకుంటాను, ఫలానా ఆర్ట్‌లో నంబర్ వన్ అయిపోతాను, ఆ ఉద్యోగం కచ్చితంగా క్రాక్ చేస్తాను అంటూ గట్టిగా అనేసుకుంటాం. ఎవరు అడిగినా ఆ మాటే చెబుతాం. కానీ దీనికి తగిన కృషి చేసే సమయంలో మాత్రం కాస్త బద్ధకం ఆవహిస్తుంది. పూర్తిగా పనిచేయకుండా ఫలితం ఆశిస్తాం. ఇది సరికాదనే చెప్పారు గాంధీ. వెయ్యి మాటల కంటే మన లక్ష్యం దిశగా చేసే ఒక్క పని, వేసే ఒక్క అడుగు చాలా గొప్పదని వివరించారు. 'ఈరోజు ఒక్కపనైనా నా లక్ష్యం కోసం చేశానా?' అని ఆలోచించగలిగితే, ఆ ఆలోచనే మన విజయానికి ఒక్కో మెట్టూ పేరుస్తుంది. అప్పుడు ఎంతటి క్లిష్టమైన లక్ష్యం అయినా సులువుగా చేరుకోగలం.

క్రమశిక్షణ, కలిసి నడవడమే అసలైన బలం (డిసిప్లిన్ అండ్ యునైటెడ్ యాక్షన్ ఆర్ రియల్ స్ట్రెంథ్) – లాల్ బహదూర్ శాస్త్రి

నిజానికి విద్యార్థి అనే పదానికి క్రమశిక్షణను మరో అర్థంగా చెప్పుకోవాలి. అంతగా మనలో అది జీర్ణించుకుపోవాలి. అదే సమయంలో బృంద స్ఫూర్తి ఈ దశ నుంచే అలవాటు కావాలి. ఎందుకంటే కుటుంబంలో, ఆఫీసులో, సమాజంలో... ఎక్కడైనా మనం కలిసి నడిచేది బృందాలతోనే! తోటి విద్యార్థులతో కలిసిమెలిసి ఉండటం, చదువు - ప్రాజెక్టుల్లో సహాయపడటం, ఇంట్లో పెద్దవారికి సాయం చేయడం, మన పట్ల, సొసైటీ పట్ల బాధ్యతతో మెలగడం.. ఇవన్నీ చేస్తే మీరే అన్‌స్టాపబుల్!

చిన్నప్పటి నుంచి స్కూల్, పెద్దయ్యాక కాలేజీల్లో గోడల మీద ఇలాంటి ఎన్నో మంచి మాటలు చదివే ఉంటాం. అవి నేర్పుతున్న జ్ఞానాన్ని మళ్లీ మళ్లీ మననం చేసుకుంటే, విద్యార్థి జీవితం ఎంత అద్భుతమైనదో అర్థమవుతుంది. మరి ఈసారి ఎప్పుడైనా ఏదైనా కష్టంగా అనిపిస్తే, ఒక్కసారి కళ్లు మూసుకుని ఇలాంటి పెద్దల మాటలు గుర్తు చేసుకుందామా!

విమర్శ, సొంత ఆలోచన చాలా అవసరం (మెర్సిలెస్ క్రిటిసిజం, ఇండిపెండెంట్ థింకింగ్ ఆర్ ఎసెన్షియల్) – భగత్ సింగ్

నేటి సమాజంలో సమాచారానికి లోటు లేదు. రకరకాలైన సోర్సుల నుంచి కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతూ ఉంటుంది. అయితే, వీటిలో దేన్ని నమ్మాలి అనే విషయంలో ఇండిపెండెంట్ థింకింగ్ అవసరం. సొంతంగా ఆలోచించే సామర్థ్యాన్ని అలవాటు చేసుకున్నరోజే సరైన నిర్ణయాల దిశగా మన అడుగులు సాగేదని భగత్‌సింగ్ ఆ చిన్న వయసులోనే చెప్పారు. విమర్శలను తీసుకోవడం కూడా ఇందులో భాగమే! విశ్లేషణాత్మక దృష్టి, విమర్శనాత్మక ధోరణి.. అటు చదువులోనూ ఇటు కెరియర్‌లోనూ అవసరమవుతాయి. మన చర్యలను విమర్శనాత్మక ధోరణిలో చూడటంలో అస్సలు తగ్గకూడదు. అలా చూసినప్పుడే మన తప్పులు మనకు కనిపించేది.



తెలుసా?

ఇద్దరి మధ్య స్నేహం ఏడేళ్లకంటే ఎక్కువ కాలం కొనసాగితే.. వారి స్నేహబంధం కలకాలం నిలిచి ఉంటుందని.. సోషియాలజిస్ట్ జెరాల్డ్ మాలెన్‌హోర్స్ట్ ఫ్రెండ్‌షిప్‌ల మీద చేసిన అధ్యయనంలో తెలిసింది. అందుకే బెస్ట్‌ఫ్రెండ్స్‌గా ఏడేళ్ల కంటే ఎక్కువ కాలం మన లైఫ్‌లో ఉన్నవారిని చాలావరకూ విషయాల్లో నమ్మొచ్చట.



నవ్వు బ్రో

స్వాతి: బేబీ, ఆ చందమామను చూస్తే నీకేం అనిపిస్తోంది?
స్వాతిముత్యం: నెక్స్ట్ చంద్రయాన్ ఎప్పుడు ఉంటుందా అని డౌట్ వస్తోంది!
'నాకో గులాబీ కొనివ్వొచ్చుగా!'
ఇక్కడైతే ఇరవై రూపాయలు, ముందుకెళ్తే పదిహేనే, అక్కడ కొంటాలే!
'ఈ డ్రెస్‌లో నేనెలా ఉన్నాను?'
కొంచెం లావైనట్టున్నావ్ కదా..

అన్‌రొమాంటిక్

సైకిల్‌తో సాహసం

18,000 కిలోమీటర్లు.. 14 రాష్ట్రాలు.. 12 జ్యోతిర్లింగాలు.. 4 ధామ్‌లు.. 8 శక్తిపీఠాలు సైకిల్‌పై చుట్టేయాలంటే మాటలు కాదు. ఎంతో మనోనిబ్బరం, శారీరక దృఢత్వం కావాలి. కానీ ఈ యువకుడు 367 రోజుల్లోనే ఈ ఘనత సాధించి ఔరా అనిపించాడు. ప్రజల్లో ఆధ్యాత్మికత, పర్యావరణంపై చైతన్యం నింపాలనే సంకల్పంతో ముందుకు సాగాడు మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లికి చెందిన ఎం.మల్లేశ్‌గౌడ్. ఈ ప్రయాణం గురించి తన మాటల్లోనే..



'నాన్న చిన్నతనంలోనే మరణించారు. ముగ్గురు అక్కలు. అమ్మ దినసరి కూలీ. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటర్‌తోనే చదువు ఆపేశాను. ఓ రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేశా. ఆర్మీ, పోలీసు ఉద్యోగాలపై ఆసక్తితో నాలుగేళ్లు కష్టపడి చదివా. రెండుసార్లు పరీక్ష తప్పాను. అయినా నిరాశ చెందకుండా మైదానంలో సాధన చేస్తూనే ఉన్నాను. గ్రౌండ్‌కి వచ్చే వారికి ఉచితంగా ఫిట్‌నెస్ శిక్షణ ఇచ్చా. నా తర్ఫీదులో గతేడాది 16 మంది కానిస్టేబుల్, ఒకరు ఎస్సై ఉద్యోగం సాధించారు. తర్వాతే పర్యావరణం గురించి ఆలోచన మొదలైంది.

దారి మారింది

రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. తెలిసి కొందరు, మరికొందరు తెలియక పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారు. ఈ పరిస్థితిలో కొంతైనా మార్పు తేవాలనే ఉద్దేశంతో సైకిల్‌యాత్ర మొదలుపెట్టా. చిన్నతనం నుంచి సైక్లింగ్ ఇష్టం. కొత్త ప్రదేశాలు చుట్టేయాలనే ఉత్సాహం ఉండేది. ప్రజల్లో భక్తి భావం పెంపొందించాలని, పర్యావరణం కాపాడాలనే ఉద్దేశంతో దేశంలోని అన్ని జ్యోతిర్లింగాలను దర్శించుకోవాలని నిర్ణయించా.

2024 అక్టోబరు 17న సైకిల్ యాత్ర చేపట్టా. 14 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలు తిరిగా. ఇప్పటి వరకు 12 జ్యోతిర్లింగాల దర్శనం చేసుకున్నా. 18 వేల కి.మీ. ప్రయాణించా. నిత్యం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సైకిల్ తొక్కాను. 80 నుంచి 100 కి.మీ. ప్రయాణించేవాణ్ని. ఎక్కడికి వెళ్లినా ఆదరించారు. బోయపల్లి గ్రామంలో ప్రారంభించిన సైకిల్‌యాత్ర తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్, బిహార్ తదితర రాష్ట్రాల మీదుగా సాగింది. అక్కడి నుంచి నేపాల్ చేరుకున్నా. ఆపైన 4,130 మీటర్ల ఎత్తు ఉన్న అన్నపూర్ణ బేస్ క్యాంప్‌నకు చేరా. శ్రీశైలం నుంచి తిరుపతి మీదుగా తమిళనాడు, కన్యాకుమారి, బెంగళూరు మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశించా. నా ప్రయాణంలో వర్షానికి, ఎండకూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. అయినా లక్ష్యాలను చేరుకోవడం ఆనందంగా ఉంది. మరింతగా ప్రజల్లోకి నా అనుభవాలను తీసుకెళ్తా.'

– మహమ్మద్ షుకూర్, మహబూబ్‌నగర్



ప్రేమ కప్పు అందించవా!


వెరైటీ ప్రేమలేఖ

కాలేజీ రోజుల నుంచి నీ వెంట స్పిన్‌లా తిరిగిన నేను... నీకు క్రికెట్ అంటే ఇష్టమని తెలిసి మరింత క్లీన్ బౌల్డ్ అయ్యాను. నిజానికి నిన్ను దక్షిణాఫ్రికా - ఇండియా మ్యాచ్లోనే జాగ్రత్తగా చూశాను. కానీ డిక్లెర్క్ మనోళ్ల బౌలింగ్‌ని ఏమాత్రం దయ లేకుండా ఉతికినట్టు చూశావు చూడు.. నాకు చాలా బాధేసింది. హర్మన్‌ప్రీత్ మ్యాచ్ పోగొట్టుకున్నా ఎలా పట్టుదలగా ప్రయత్నించిందో, అలా నేనూ మళ్లీ నీపై గూగ్లీ వెయ్యడం మొదలెట్టా. మళ్లీ ఆస్ట్రేలియా లీగ్ మ్యాచ్‌కి కూడా వచ్చి నీ ఫేవరెట్ మిథాలీ రాజ్‌ను స్టాండ్‌లో చూశా. నువ్వూ అక్కడే ఉన్నావు కానీ అప్పుడు హీలీ ఇండియా బౌలింగ్‌ని ఊడించినట్టు చూశావు. ఎవరికి చెప్పుకోను నా బాధ? ఆఖరికి సెమీఫైనల్ చూడటానికి ముంబయి వెళ్తున్నావని తెలిసి అక్కడికీ వచ్చా. నా లవ్వు గెలవాలని జెమీమాలా ఎన్ని ప్రార్థనలు చేశానో! మరీ ఖాకా, మ్లాబా హెయిర్‌కట్ నీకు బాగోదు అనడమే నేను చేసిన నేరమా? ఏం.. ఎంచక్కా వోల్వార్ట్ స్టైల్‌లో ఉండొచ్చుగా! నువ్వు బ్యాటింగ్‌లో రిచాలా పవర్‌ఫుల్ షాట్లు కొడతావని తెలుసు కానీ అవి నా మీద ప్రయోగించకు. ఆ మ్యాచ్ గెలిచాక నీ మనసు కొంచెం మారిందని అర్థమైంది. క్రికెట్ నీకెంత ఇష్టమో కూడా తెలిసింది. నువ్వు కోరుకున్నట్లు ఎప్పటికైనా భారత మహిళా క్రికెట్ జట్టులో ఆడటానికి నా వంతు కృషి చేస్తానని నీకోసం కొనబోయే బ్యాటు మీద ప్రమాణం చేస్తున్నా. నువ్వు గ్రౌండ్‌కి వెళ్తే కిట్ మోస్తా, ఆడి అలిసిపోతే చెమట తుడుస్తా, గెలిచి ఇంటికొస్తే హారతిపళ్లెంతో ఎదురొస్తా. ఇప్పటికైనా నన్ను అర్థం చేసుకుని నువ్వు ఊ అంటే వెంటనే మన పెళ్లికి ఏర్పాట్లు మొదలెట్టేస్తా. శ్రీచరణిలా తెలుగు ఫ్రెండ్స్‌నే కాదు.. డియోల్, ఠాకూర్, గౌడ్, యాదవ్, సింగ్, కౌర్, శర్మ, ఘోష్, రానా ఇలా ఎక్కడెక్కడి నీ స్నేహితురాళ్లనీ పిలుద్దాం. మన వైజాగ్ స్టేడియం సరిపోదంటే ముంబయి పటేల్, అదీ కాదంటే అహ్మదాబాద్ మోదీ స్టేడియం మాట్లాడేద్దాం. మహిళా జట్టు వరల్డ్ కప్ అందుకున్నంత ఆనందంగా నీ చేయి అందుకుంటా. నా టెస్ట్ మ్యాచ్ తీరుకి, నీ వన్‌డే స్పీడుకి.. మనకు పుట్టబోయే పిల్లలు సరిగ్గా టీ20 రేంజులో మోత మోగించడం గ్యారెంటీ. పెళ్లి కానుకలు జట్టుకు వచ్చిన నజరానా అంత కాకపోయినా ఎంతోకొంత ఉంటాయి. అవి నీ క్రికెట్ అవసరాలకే వాడుకో, ఇప్పుడే చెప్పేస్తున్నా. విమెన్స్ కప్ కోసం భారతీయులు సంవత్సరాలు ఎదురుచూసినట్టుగా, నువ్విచ్చే జవాబు కోసం నేను ఎదురుచూస్తుంటా..!


ఇట్లు,
నిన్ను కోరుకునే నీ ఫ్యాన్ పరుగేష్!

– చుండూరి సత్య, విశాఖపట్నం

కొంటె కొటేషన్



1. బాగుంది నీ సిట్టింగు ఆగింది నా షూటింగు – రాజారామ్, కర్నూలు
2. వాలావుగానీ పిట్ట.. ప్లీజ్ వేయకు రెట్ట! – సాయిరామ్, నెల్లూరు
3. పైన ఈకను కాదు.. కింద తోకను తియ్యి – సాయి కిరణ్
4. లెన్స్ మీద ల్యాండ్ అయిన అందం – సంధ్య
5. బాగుంది నీ పోజు.. తీరింది కదా ఫొటో మోజు – అద్విక్, ఆస్ట్రేలియా
6. నన్ను కెమెరాలో చూడాలని నువ్వు.. నిన్ను కంటితో చూడాలని నేను – జి.శ్రీపాద, నెల్లూరు




ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

నిన్ను నువ్వు తెలుసుకునేలా..

టీన్ మూవీ

కైలా ఎయిత్ గ్రేడ్ చదువుతున్న అమ్మాయి. నలుగురిలోనూ కలవడానికి ఇబ్బంది పడుతూ ఉంటుంది. ఎవరితో మాట్లాడినా తడబడటం, తన క్లాస్‌మేట్స్‌లా ఉండలేకపోవడంతో ఒత్తిడికి గురవుతూ ఉంటుంది. అదే సమయంలో తనకెన్నో సాధించాలని ఆశలు, కలలు ఉంటాయి. మరో వారంలో ఎయిత్ గ్రేడ్ అయిపోతుంది అనగా తన జీవితంలో కొత్త మార్పులు జరుగుతాయి. అవేంటి, వాటిని తను ఎలా ఎదుర్కొంది, తన లోపాలను ఎలా అధిగమించింది, చివరిగా ఏం జరుగుతుంది అనేది మిగతా సినిమా కథ. గంటన్నర నిడివి గల ఈ కామెడీ డ్రామా చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో ఉంది. స్కూల్ దశ నుంచి యుక్తవయసులోకి వస్తున్న పిల్లలు కచ్చితంగా చూడాల్సిన మూవీల్లో దీన్ని ఒకటిగా చెబుతారు సినిమా ప్రియులు. ప్రధాన పాత్రలో కనిపించిన ఎల్సీ ఫిషర్ సినిమా మొత్తం అచ్చమైన టీనేజ్ అమ్మాయిలా మొహం మీద మొటిమలు, యాక్నే నిండిన స్కిన్‌తో సహజంగా కనిపించడం ఓ విశేషం. మీరు కూడా చూసి ఎలా ఉందో చెప్పండి, వచ్చే వారం మరో సినిమాతో కలుద్దాం!



జిప్ కోడింగ్ అంటే..

అమ్మాయి ఇక్కడ ఉంటుంది, అబ్బాయి ఎక్కడో! లాంగ్ డిస్టన్స్ రిలేషన్‌షిప్స్‌లో ఉండే ప్రధానమైన సమస్య దూరం. ఎంత వీడియోకాల్స్‌లో మాట్లాడినా, ఏదో తెలియని బెంగ, వెలితి ఉండిపోతూ ఉంటుంది. ప్రేమించిన వారు ఎక్కడికో దూరంగా వెళ్లాల్సి వచ్చినా, ఆ దూరాన్ని దాటుకుని ప్రేమను కొనసాగించే రోజులు నెమ్మదిగా తగ్గుతున్నాయి. డేటింగ్‌లో ఇప్పుడో కొత్త ట్రెండ్ హల్‌చల్ చేస్తోంది, అదే జిప్‌కోడింగ్. అంటే దగ్గర్లో ఉన్నవారిని మాత్రమే ప్రేమించడం. ఒకవేళ దూరంగా వెళ్లాల్సి వస్తే టాటా బైబై చెప్పేసుకోవడం.

ఒక్కసారి ఊహించుకోండి, మన లవర్ మన పక్క ఫ్లాట్‌లోనే ఉంటే! ఒకే ఆఫీసులో జాబ్ చేస్తుంటే! వీధి చివర ఉన్న జిమ్‌కే రోజూ వచ్చే వాళ్లయితే.. భలే ఉంది కదా! అప్పుడు దూరం మనల్ని వారి నుంచి దూరంగా ఉంచలేదు. డేటింగ్ చేస్తున్న వారు ఇలా దగ్గర్లో ఉండాలి అనుకోవడానికి మరో కారణం కూడా ఉందట.. అదే మనుషులను దగ్గరగా గమనించడం. ఎదురుగా ఉంటేనే కదా ఎలాంటి వారో తెలిసేది! ఆ బంధాన్ని పెళ్లి వరకూ తీసుకెళ్లాలా లేదా అనే అవగాహన వచ్చేది! అందుకే 'దూరం ప్రేమలు మాకొద్దు' అనేస్తున్నారు యూత్ జనాలు. ఎందుకంటే వారు తరచూ తమ ఉద్యోగాలు, నివాస ప్రాంతాలు, జీవిత లక్ష్యాలను మారుస్తూ ఉంటారు. అందుకే స్థిరమైన, శాశ్వతమైన బంధాల్లోకి వెళ్లాలంటే.. ముందు ఇలా చెక్ చేసుకుంటున్నారట. ఇందులో మరో అంశం కూడా ఉంది. ఇక్కడ ఒకరితో జిప్‌కోడింగ్‌లో ఉన్నప్పుడు.. ప్రాంతం మారితే ఇతర వ్యక్తులనూ చూసే వీలుంటుంది. అంటే ఇది ఒక తరహా ఓపెన్ రిలేషన్ అని చెప్పొచ్చు. ఇది ప్రేమబంధంగా మారేందుకు అవసరమైన టైమ్, ఎఫర్ట్స్, ఒకే చోట ఉండి ఇస్తారు. వర్కౌట్ అయ్యిందా సరే సరి, లేదంటే హుందాగా విడిపోతున్నారు, అదీ సంగతి.

పోలీసు నుంచి పొలానికి..

అతడో కానిస్టేబుల్. హఠాత్తుగా అమ్మ అనారోగ్యం పాలయ్యింది. దానికి కారణం కలుషితమైన తిండి కూడా అనే విషయం తనను ఆలోచనలో పడేసింది. 'అసలు రసాయనాలు వాడకుండా పంటలే పండించలేమా?' అనే ప్రశ్న మొదలైంది. వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

అలా అని వారికేం భూముల్లేవు. కౌలుకు తీసుకున్న అరెకరంలోనే పంటలు, పాడి పరిశ్రమ మొదలుపెట్టి.. నెలకు రూ.70వేలు సంపాదిస్తున్నాడు. ఇటు అమ్మను బాగా చూసుకుంటూ, ఇటు సేంద్రియసాగుతో ఆర్థికంగా ఎదిగి మరికొంత మందికి తనలా శిక్షణ ఇస్తున్నాడు అల్లం అనిల్.

వరంగల్ జిల్లా కరీమాబాద్‌కు చెందిన అనిల్‌కు చిన్నతనం నుంచి వ్యవసాయం అంటే ఇష్టం. అల్లం సంజీవ్ - పుష్పలీల దంపతులకు ముగ్గురు సంతానం. అందులో ఆఖరి వాడైన అనిల్‌కు ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడే తండ్రి చనిపోయారు. తల్లి చిన్న చిన్న వస్తువులు అమ్ముతూ ముగ్గురు పిల్లలనూ చదివించారు. అనిల్ బీకాం చదివి, 2020లో కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించాడు. ఏడాది పనిచేశాక ఉద్యోగంపై అనాసక్తి మొదలైంది. అదే సమయంలో అమ్మ ఆరోగ్యం పాడవ్వడంతో.. తానే కావాల్సిన కూరగాయలు ఆర్గానిక్‌గా పండించాలనే సంకల్పంతో రాజీనామా చేశాడు.



- మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఖాదర్‌వలీ, శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్‌ను ఆదర్శంగా తీసుకొని సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు మొదలుపెట్టాడు. కల్తీ వంటనూనెలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పూర్తిగా సంప్రదాయ పద్ధతిలో గింజలను ఆడించి.. స్వచ్ఛమైన నూనెలను తీసే గానుగ కేంద్రాన్ని నడుపుతున్నాడు. ఎటువంటి మిషన్‌లు ఉపయోగించకుండా ప్రస్తుతం నాలుగు ఎద్దులతో, తాను స్వయంగా పనిచేస్తూ.. ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. అన్నిరకాల కూరగాయలతోపాటు నాటు ఆవులు, గేదెల పాలు విక్రయిస్తున్నాడు. త్వరలో పాల పదార్థాలతో తయారు చేసే పన్నీర్‌తోపాటు కారం, చిరుధాన్యాలు, వివిధ రకాల బియ్యం అమ్మకాలు చేసేలా ప్రణాళిక సైతం సిద్ధం చేసుకున్నాడు.

ఆసక్తి ఉన్నవారికి శిక్షణ

అనిల్ పాటిస్తున్న పద్ధతిలో.. 12 కిలోల చొప్పున పల్లీలు, నువ్వులు, కుసుమ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ వంటి గింజలను గానుగలో పోసి మూడుగంటలు ఆడిస్తే 5 లీటర్ల నూనె తయారవుతోంది. ప్రస్తుతం 10 రకాల నూనెలు ఇలా సిద్ధం చేస్తున్నాడు. వీటికి కిలో రూ.420 నుంచి రూ.600 వరకూ ధర పలుకుతోంది. వరంగల్ కోటను చూసేందుకు వస్తున్న పర్యటకులు ఇతడి వద్ద ఆసక్తిగా కొంటున్నారు. వరంగల్, హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి ఎక్కువగా ఆర్డర్లు వస్తున్నాయని అనిల్ చెబుతున్నాడు. తన వ్యాపారంపై ఆసక్తి ఉన్నవారికి ఎలా చేయాలో శిక్షణ కూడా ఇస్తున్నాడు. మరింతగా ఈ వ్యాపారాన్ని విస్తరించడమే తన లక్ష్యమని చెబుతున్న అనిల్‌కు మనమూ ఆల్ ది బెస్ట్ చెప్పేద్దాం!

– దాడి శ్రీనివాస్, వరంగల్

ఈనాడు సినిమా

కలర్‌ఫుల్ రెబల్‌సాబ్



ప్రభాస్

పాటల హంగామాకి షురూ చేయబోతున్నారు 'ది రాజాసాబ్'. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలోని తొలి పాటని ఈ నెల 23న విడుదల చేస్తున్నట్టు సినీ వర్గాలు శుక్రవారం ప్రకటించాయి. 'రెబల్‌సాబ్..' అంటూ సాగే ఈ పాట కలర్‌ఫుల్‌గా ఉండబోతోందని చిత్ర బృందం విడుదల చేసిన లుక్ స్పష్టం చేస్తోంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమే 'ది రాజాసాబ్'. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలకపాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భారీ హంగులున్న హారర్ కామెడీ కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: కార్తీక్ పళని, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు.

ఆ ముద్ర అవసరం లేదేమో!



అనుపమ

'డ్రాగన్', 'కిష్కింధపురి', 'ది పెట్ డిటెక్టివ్', 'బైసన్'.. ఇలా ఈ ఏడాది ఐదుకు పైగా సినిమాలతో తెరపై సందడి చేసింది అందాల తార అనుపమ పరమేశ్వరన్. తన సహజమైన నటనతో కుర్రకారుని విశేషంగా ఆకట్టుకునే ఈ భామ.. ఇటీవలే చిత్రపరిశ్రమలో పదేళ్ల పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ తన సినీ ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది. "ఈ పదేళ్ల ప్రయాణం నాలో ఎన్నో మార్పుల్ని తీసుకొచ్చింది. ఈ మైలు రాయిని ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. నిన్ననే సినీరంగంలోకి వచ్చినట్లు అనిపిస్తుంది. నటిని అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. చాలా భయంతో ప్రారంభమైన నా కెరీర్‌కు.. ఈ పదేళ్ల ప్రయాణం ఆత్మవిశ్వాసాన్ని, బలంగా ఉండటం నేర్పింది. 2016లో 'అఆ'తో టాలీవుడ్‌లోకి వచ్చాను. తొలి అడుగులోనే నాపై అభిమానులు చూపించిన ప్రేమ గురించి మాటల్లో చెప్పలేను. అందుకే ఎప్పటికీ నాకు తెలుగు ప్రేక్షకులు ప్రత్యేకమే. నాకు అవకాశాలిచ్చిన దర్శకనిర్మాతలందరికీ కృతజ్ఞతలు. దీంతో పాటు ఈ మధ్యకాలంలో ఫస్ట్, సెకండ్ లీడ్ అని ముద్ర వేస్తుంటారు. కానీ ఈ పదాలన్నీ ఇప్పుడు అవసరం లేదేమో అనిపిస్తుంటుంది. 'ప్రేమమ్'లో నేను, సాయిపల్లవి, మడోన్నా. మేము నటించిన ముగ్గురు మహిళా పాత్రలు కథకు చాలా కీలకమైనవి. నిజంగా ముఖ్యమైనది పాత్ర బలమే. నిడివికి కూడా ప్రాధాన్యం ఇవ్వన'ని చెప్పుకొచ్చింది అనుపమ.

ధర్మమే యుద్ధానికి దిగినట్టుగా

అఖండ 2: తాండవం



సంయుక్త, బాలకృష్ణ, శివరాజ్‌కుమార్, బోయపాటి శ్రీను, గోపి

"భావి తరానికీ... భారతదేశానికీ మహా శక్తి అయిన యువత పెడదారిలో కాకుండా, మంచి దారిలో నడవడానికి నా ప్రతి సినిమాలోనూ ఒక సందేశం ఉంటుంది. అలాంటి ఒక గొప్ప సందేశం ఉన్న సినిమానే 'అఖండ 2: తాండవం'. మన హైందవ ధర్మం, మన సమాజపు మూలాల్ని ఆవిష్కరిస్తుంది" అన్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా... బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన సినిమానే 'అఖండ 2: తాండవం'. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి ప్రతినాయకుడిగా నటించారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో... 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర జిల్లాలోని చింతామణిలో శుక్రవారం రాత్రి ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని విడుదల చేశారు. శక్తిమంతమైన పాత్రలు, యాక్షన్ ఘట్టాలతోపాటు, కట్టిపడేసే విజువల్స్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. 'ఈ ప్రపంచంలో ఏ దేశం వెళ్లినా మీకు అక్కడ కనిపించేది ఒక మతం. ఈ దేశంలో ఎటు చూసినా మీకు కనిపించేది ఒక ధర్మం... సనాతన హైందవధర్మం. దేశం జోలికి వస్తే మీరు దండిస్తారు, దైవం జోలికి వస్తే మేం ఖండిస్తాం. మీ భాషలో చెప్పాలంటే సర్జికల్ స్ట్రైక్, 'ఇప్పటివరకూ ప్రపంచ పటంలో ఉన్న దేశం రూపాన్ని మాత్రమే చూసుంటావు. ఎప్పుడూ మా దేశం విశ్వరూపాన్ని చూసి ఉండవు. మేం ఒకసారి లేచి శబ్దం చేస్తే ఈ ప్రపంచమే నిశ్శబ్దం' అంటూ సాగే సంభాషణలు ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ "ఇది కేవలం తెలుగు సినిమా కాదు, కన్నడ సినిమా కాదు. ఇది పాన్ ఇండియా సినిమా. ఇందులో సనాతన హైందవధర్మం గురించి చెప్పాం. ధర్మంగా జీవించాలి, సత్యం కోసం పోరాడాలి, అన్యాయం ముందు తల వంచకూడదన్నదే హైందవధర్మం. దర్శకుడు బోయపాటి శ్రీనుతో ఇది నాకు నాలుగో సినిమా. ప్రతి ఒక్కరూ అణువణువులోనూ పాత్రల్ని నింపుకుని సినిమాకి న్యాయం చేశారు. నేను ఏ పాత్ర చేసినా అది నన్ను ఆవహిస్తుంది. దర్శకుడు ఈ సినిమాని ఎంత బాగా తీశారో అందరూ చూస్తారు. తమన్ మరోసారి బాక్సులు బద్దలైపోయేలా సంగీతం అందించారు" అన్నారు. తమ్ముడు శివరాజ్‌కుమార్‌లోనూ, నాలోనూ తండ్రుల రక్తం ప్రవహిస్తోందన్నారు బాలకృష్ణ. 'వీరసింహారెడ్డి' కోసం శివరాజ్‌కుమార్ నటించిన 'మఫ్టీ'లోని గెటప్‌ని తాను కాపీ కొట్టాననీ, అలా ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోవడం తమకు అలవాటేనన్నారు. ఈ సినిమా విజయోత్సవాన్ని ఇదే వేదికపై చేస్తామని ఆయన చెప్పారు. శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ " బాలయ్య నటన, సంభాషణలు, యాక్షన్ ఎంతో శక్తిమంతంగా ఉంటాయి. 'అఖండ 2' ప్రేక్షకుల్ని ఎంతగానో అలరిస్తుంది" అన్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ "శివతత్వంతో తెరకెక్కిన ఒక అద్భుతమైన సినిమా ఇది. శివన్న చేతులమీదుగా ట్రైలర్ ఆవిష్కరించుకోవడం గర్వంగా ఉంది. దేశాన్ని అపకీర్తిలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుంటే ధర్మమే త్రిశూలం పట్టుకుని యుద్ధానికి దిగినట్టుగా ఉంటుందీ చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

పబ్లిసిటీ స్టంట్ అన్నవాళ్లే ప్రశంసలు కురిపిస్తున్నారు



వంశీ, సాయికృష్ణ, తేజస్విని, అఖిల్, బన్నీవాస్, సాయిలు, వేణు ఊడుగుల, చైతన్య, నితిన్,రాహుల్

"ప్రేమలో ఉన్న అమ్మాయి - అబ్బాయి.. ఆ ప్రేమను వద్దనే తండ్రి. ప్రతిష్ఠకు 'రాజు వెడ్స్ రాంబాయి'కి కనెక్ట్ అవుతున్నార"న్నారు నిర్మాత బన్నీవాస్. ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్‌లో వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించిన ఈ సినిమాని సాయిలు కంపాటి తెరకెక్కించారు. అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటించారు. ఇది నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ.. "కొత్త వాళ్లను ప్రోత్సహించడంలో ఈటీవీ విన్ మరోసారి విజయవంతమైంది. ఊరి నుంచి వచ్చిన దర్శకుడు సాయిలు తన నిజాయతీ, స్వచ్ఛతతో ఈ సినిమా రూపొందించారు. దీనికి ఇప్పుడు అందరూ కనెక్ట్ అవుతున్నారు. ఈ చిత్రంలో కథానాయిక తండ్రి కొట్టే సీన్ చూసి కొందరు బాధపడ్డారు. నేనూ బాధపడ్డా. అయితే ఆ తండ్రి కూతుర్ని దండించడంలోనూ ప్రేమే ఉంది" అన్నారు. "సాలిత అందించిన విజయాన్ని.. వేదికను ఇచ్చిన ఈటీవీ విన్‌కు కృతజ్ఞతలు. ఇలాంటి వాళ్లు ఉంటే ఎంతోమంది కొత్త వాళ్ల జీవితాలు బాగుపడతాయి" అన్నారు దర్శకుడు సాయిలు. దర్శక నిర్మాత వేణు ఊడుగుల మాట్లాడుతూ.. "సినిమా చివరి 30నిమిషాలు హృదయాల్ని బలంగా తాకుతుందని చెబితే దాన్ని కొందరు పబ్లిసిటీ స్టంట్ అనుకున్నారు. అలా అన్నవారే ఇప్పుడు మంచి సినిమా అని ప్రశంసలు కురిపిస్తున్నారు. మేము ఓడిపోయేందుకు సిద్ధమే కానీ దిగజారి మాట్లాడము. మా చిత్రం భావోద్వేగభరితంగా ఉంది. చిన్న చిత్రాల్ని జనాల్లోకి తీసుకెళ్లడంలో ఈటీవీ విన్ ఓ బెంచ్ మార్క్‌ను సృష్టించింది" అన్నారు. "ఈ చిత్రంలోని నటిదాన్ని ఆస్వాదిస్తున్నారు. అలాగే భావోద్వేగాలకు గురవుతున్నారు" అంది నటి తేజస్విని. హీరో అఖిల్ రాజ్ మాట్లాడుతూ.. "నేను పడిన పదేళ్ల కష్టానికి ఈ చిత్రంతో ఫలితం దక్కింద"న్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు జొన్నలగడ్డ, వంశీ నందిపాటి, రాహుల్ మోపిదేవి, సాయి కృష్ణ, నితిన్, నాగేశ్వరరావు పూజారి, తన్మయ్, సురేశ్ బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.


వచ్చే నెల్లో బరిలోకి



వెంకటేశ్

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు త్రివిక్రమ్ కలయికలో ఓ చిత్రం రూపొందుతోంది. ఇది లాంఛనంగా మొదలై చాలా రోజులైనా ఇంకా చిత్రీకరణ మొదలు కాలేదు. వెంకీ ప్రస్తుతం చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమాని పూర్తి చేయడంపై దృష్టి సారించడమే దీనికి కారణం. ఆయన దీన్ని డిసెంబరు తొలి వారానికి ముగించి.. రెండో వారం నుంచి త్రివిక్రమ్ చిత్రం కోసం రంగంలోకి దిగనున్నట్లు సమాచారం. దీని కోసం చిత్ర బృందం ఇప్పటికే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసింది. ఈ చిత్ర తొలి షెడ్యూల్ డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగనుందని.. ఆ తర్వాత షెడ్యూల్ తిరిగి సంక్రాంతి ముగిశాక మొదలయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఇది ఆద్యంతం వినోదం, భావోద్వేగాల మేళవింపుగా సాగే కుటుంబ కథా చిత్రంగా ముస్తాబు కానుంది. ఇందులో వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధి శెట్టి కనువిందు చేయనుంది. దీనికి హర్ష వర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తుండగా.. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది.

రా.వన్ ఇప్పుడు తీసుంటే ఆడేదేమో!



"నాలాంటి హీరోలు విభిన్న రకాల పాత్రలు పోషించడం ముఖ్యం. అభిమానులను నిరాశపరచకూడద"ంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్. ఆయన 60వ పుట్టినరోజుని పురస్కరించుకుని ఇటీవల ముంబయిలో జరిగిన ఫ్యాన్ మీట్‌లో పాల్గొని తన రాబోయే చిత్రం 'కింగ్' విశేషాలతో పాటు పలు ఆసక్తికర సంగతులను పంచుకున్నారు.

■ "హీరో, విలన్ అనే తేడాను ప్రేక్షకులే సృష్టించారు. నా కెరీర్ ప్రారంభంలో నేను 'డర్', 'అంజామ్', 'బాజీగర్' లాంటి సినిమాలు చేశాను. వాటిలోని పాత్రల్ని విలన్, స్టాకర్‌గా పరిగణిస్తారు. నటులుగా మనం ఆసక్తికరమైన పాత్రలను అన్వేషించకపోతే సినిమాలు ఊహించదగినవిగా మారతాయి. అంటే హీరో వస్తాడు, రెండు పాటలు పాడుతూ ఫైట్స్ చేస్తాడు. కథలు చెప్పడం మాత్రమే కాదు. యువత సినిమాలు చూస్తుంది. అలాంటప్పుడు నాలాంటి హీరోలు విభిన్న రకాల పాత్రలు చేయడమనేది ముఖ్యం. వాటిలో కొన్ని స్ఫూర్తిదాయకంగా, హాస్యభరితంగా, రొమాంటిక్‌గా ఉండాలి. ఇప్పుడు సినిమాలు తీయడం కొంచెం కష్టంగా మారింది. అయినప్పటికీ ప్రేక్షకులను నిరాశపరచకుండా జాగ్రత్తగా సినిమాలు తీయాలి. నేను 'రా.వన్' తీసినపుడు గొప్ప సినిమా తీశా అనుకున్నాను. కానీ అది అంచనాలు అందుకోలేకపోయింది. అప్పట్లో అలాంటి సినిమాలకు ప్రాధాన్యత లేదు. ఇప్పుడు తీసుంటే సినిమా ఆడేదేమో. ఈ సినిమా సీక్వెల్ తీయాలని అనుభవ్ సిన్హా నిర్ణయించుకుంటే 'రా.వన్' విశ్వంలోకి తిరిగి రావడానికి నేను సిద్ధం. ప్రస్తుతం నటిస్తున్న 'కింగ్'లో చాలా ఆసక్తికరమైన గ్రే షేడ్స్ ఉన్న పాత్ర నాది. అతను చాలా క్రూరమైన వ్యక్తి. ప్రోమోలోని డైలాగ్స్ అన్నీ అతనికి సరిగా వర్తిస్తాయి. సిద్ధార్థ్, సుజయ్ చాలా ప్రేమతో ఈ పాత్రని రాశారు. గొప్పస్థాయిలో రూపొందుతున్న చిత్రమిది. మీరందరూ సినిమాను ఇష్టపడతారని నేను ఆశిస్తున్నాను. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకురానుంది".

■ "పిల్లలు ఏం చేయాలో ఏం చేయకూడదో చెప్పాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను. నేను 35ఏళ్లుగా సినిమాల్లో పనిచేస్తున్నాను. అలా అని నాన్న చెప్పేది వినాలి.. ఎందుకంటే ఆయన షారుక్ ఖాన్ అనే భావన వారికి ఉండకూడదని నేను కోరుకుంటున్నాను. సుహానా నటనలో, ఆర్యన్ రచన, దర్శకత్వంలో ఉన్నప్పుడు వారు దానిని స్వయంగా చేయాలని కోరుకుంటాను. ఏదైనా వారికి అవసరమైనపుడు వాళ్లే ఎలా ఉందని అడుగుతారు. అప్పుడు నేను దాని పట్ల నా అభిప్రాయాన్ని చెబుతాను. కొన్నిసార్లు అది మంచిది కావచ్చు. కొన్నిసార్లు చెడు అవుతుంది. ఆర్యన్ స్క్రిప్ట్ రాసినప్పుడు స్వయంగా దర్శకత్వం వహించమని సలహా ఇచ్చాను. తన మనసుని అనుసరించి దర్శకత్వం వహించమని చెప్పాను".

ఆధునిక బంధాలతో విత్ లవ్



అభిషన్, అనస్వర

'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో మంచి సందేశాన్ని అందించిన దర్శకుడు అభిషన్ జీవింత్.. హీరోగా తెరపై సందడి చేయడానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. ఆయన, అనస్వర రాజన్ జంటగా ఓ చిత్రంలో నటిస్తున్నారు. సౌందర్య రజనీకాంత్ నిర్మిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామాకు మదన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పుడీ సినిమాకు 'విత్ లవ్' అనే పేరును ఖరారు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం అగ్రహీరో రజనీకాంత్ ఈ సినిమా టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేశారు. ఇందులో సత్య పాత్రలో అభిషన్, మనీషాగా అనస్వర కనువిందు చేయనున్నారు. యువతరాన్ని ఆకట్టుకునే ఆధునిక సంబంధాలు, ప్రేమ లాంటి అంశాలతో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్లలోకి రానుంది.

40 ఏళ్లుగా ఇదే నా ఫిర్యాదు

- కమల్ హాసన్



కమల్, రాజ్‌కుమార్, సాయి పల్లవి, శివకార్తికేయన్

స్వతంత్ర సినిమాలకు థియేటర్లలో చోటు దొరకడం లేదని, నలభై ఏళ్లుగా ఇదే తన ఫిర్యాదని అంటున్నారు అగ్రహీరో కమల్ హాసన్. ప్రతిష్ఠాత్మక 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫి) వేడుక ఇటీవలే మొదలైంది. గోవా వేదికగా జరుగుతున్న ఈ చిత్రోత్సవాల్లో కమల్ నిర్మించిన 'అమరన్' చిత్ర ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఈ వేడుకకు హాజరైన కమల్ హాసన్ మాట్లాడుతూ.. "దశాబ్దాలుగా వాణిజ్యేతర సినిమాలకు చోటు దక్కడం లేదు. స్వతంత్ర సినిమాలకు భారతదేశంలో ఎంతో స్వేచ్ఛ ఉంది. దాన్ని వాణిజ్య సినిమాల పరిధుల్లోకి తీసుకురావద్ద"ని అన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ.. "ఇఫి వేదిక కేవలం సినిమాల గురించి మాత్రమే కాదు.. ఒకరి భాష, సంస్కృతి, వంటకాలను కూడా ప్రదర్శించడానికి అద్భుతమైన వేదిక. ఈ ఉత్సవం ద్వారా గోవా తన ప్రత్యేకతను ప్రపంచానికి చూపించగలుగుతుంద"ని చెప్పారు. "అద్భుతమైన ప్రతిభ.. సాంకేతిక సామర్థ్యాలతో భారతదేశం భవిష్యత్తులో ప్రపంచానికి స్టూడియోగా మారుతుందనేలా పరిస్థితులు మారుతున్నాయ"ని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్ అన్నారు.

సీరియల్ కిల్లర్‌గా మాధురీ దీక్షిత్



ఎన్నో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించిన బాలీవుడ్ సీనియర్ నటి మాధురీ దీక్షిత్. . ఇప్పుడు సీరియల్ కిల్లర్‌గా తెరపైకి రాబోతుంది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'మిసెస్ దేశ్‌పాండే'. ఫ్రెంచ్ థ్రిల్లర్ సిరీస్ 'లా మాంటే'కు రీమేక్‌గా నగేశ్ కుకునూర్ దీన్ని రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ వీడియోను విడుదల చేసింది మాధురి. ' 'మీరు ఇంతకముందెప్పుడూ చూడని ట్విస్ట్ ఇవ్వబోతున్నా. డిసెంబరు 19న సిద్ధంగా ఉండండి'' అనే వ్యాఖ్యను జోడించింది. "ఇప్పటి వరకు ఎనిమిది హత్యలు జరిగినప్పటికీ హంతకుడి గురించి ఎటువంటి సమాచారం లేదు. పోలీసుల దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది" లాంటి సంభాషణలతో సాగుతోన్న ఈ వీడియో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. సిద్ధార్థ్ చందేకర్, ప్రియాంష ఛటర్జీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్ జియోహాట్‌స్టార్ వేదికగా అలరించనుంది.

ఓ సైనికుడి త్యాగం... 'నా తెలుగోడు'

సమాజానికి ఉపయోగపడే అంశాలతో రూపొందించిన చిత్రమే 'నా తెలుగోడు' అంటున్నారు హరినాథ్ పొలిచర్ల. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకనిర్మాణంలో రూపొందించిన చిత్రమిది. తనికెళ్ల భరణి, రఘుబాబు, జరీనా వహాబ్, నైరా పాల్, రోనీ కౌలా కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు దర్శకనిర్మాత హరినాథ్. "ఒక సైనికుడి త్యాగం నేపథ్యంలో, బలమైన సందేశంతో రూపొందిన చిత్రమిది. ఆడపిల్లల రక్షణ, మత్తు పదార్థాలతో పొంచి ఉన్న ముప్పు తదితర అంశాల్ని ఇందులో ఆలోచన రేకెత్తించేలా స్పృశించాం. నందమూరి తారక రామారావు అంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన తెలుగువాళ్లకు తీసుకొచ్చిన గుర్తింపే స్ఫూర్తిగా సినిమాకి 'నా తెలుగోడు' అనే పేరు పెట్టాం. యుద్ధ నేపథ్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. గోవా, మున్నార్, హైదరాబాద్ తదితర ప్రదేశాల్లో చిత్రీకరణ చేశామ"ని చెప్పారు హరినాథ్. ఈ చిత్రానికి సంగీతం: శివ.

ఆలస్యమైనా.. వెనక్కి తగ్గలేదు



మమ్ముట్టి

"ఆలస్యమయింది.. కానీ 'కలాంకావల్' వెనక్కి తగ్గలేదు. త్వరలో మీ ముందుకు వస్తుంది'' అంటూ తన రాబోయే సినిమా వాయిదా పడినట్లు తెలిపారు అగ్రహీరో మమ్ముట్టి. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. జితిన్ కె.జోస్ దర్శకత్వం వహించారు. ఈ నెల 27న రావాల్సిన ఈ సినిమా అనుకోని కారణాలతో వాయిదా పడింది. ఈ విషయాన్ని ఇన్‌స్టా వేదికగా తెలుపుతూ.. కొత్త విడుదల తేదీని మరికొద్ది రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు మమ్ముట్టి. 'ఏది మనకు ఆనందాన్ని ఇస్తుందో తెలుసా?' అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్‌లో ఆయన్ను శక్తిమంతమైన పాత్రలో చూపించి సినీప్రియుల్ని అలరించింది చిత్రబృందం. క్రైమ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దిన ఈ చిత్రంలో వినాయకన్, జిబిన్ గోపీనాథ్, రజిషా విజయన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం మమ్ముట్టి.. మోహన్‌లాల్‌తో కలిసి 'పేట్రియాట్' సినిమాతో బిజీగా ఉన్నారు.

మృణాల్ అసంపూర్ణ ప్రేమకథ

కథ ఎలాంటిదైనా.. ఆ ఊహా ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని సులువుగా తీసుకెళ్లగలిగే సత్తా ఉన్న బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ. ఇప్పుడాయన మరో ప్రేమకథను తెరపై ఆవిష్కరించడానికి సిద్ధమయ్యారు. కథానాయిక మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది జంటగా నటిస్తున్న చిత్రం 'దో దీవానే సహర్ మే'. రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తున్నారు. భన్సాలీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. "రెండు హృదయాలు.. ఒక నగరం.. ఒక అసంపూర్ణమైన ప్రేమకథ'' అనే వ్యాఖ్యల్ని జోడించింది. మనసుల్ని హత్తుకునే నేపథ్య సంగీతంతో సాగుతున్న ఈ వీడియోతో ఈ చిత్రాన్ని ఒక స్వచ్ఛమైన ప్రేమకథగా తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇందులో రోష్నిగా మృణాల్, శశాంక్ పాత్రలో సిద్ధాంత్ కనిపించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 20న దీన్ని విడుదల చేయనున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి.




సిద్ధాంత్, మృణాల్

(c) eenadu



మొగల్ సామ్రాజ్య అధికారాన్ని ధిక్కరించి.. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పారు ఛత్రపతి శివాజీ. హిందు ధర్మ పరిరక్షకుడిగా, పరమత సహనంతో రాజ్య పరిపాలన గావించిన శివాజీ భారత నేలపై నేటికీ స్మరణీయుడిగా మిగిలారు. పలు యుద్ధాలు గెలుస్తూ మరాఠా రాజ్యాన్ని విస్తరించారు. శివాజీ పరిపాలన కాలంలో వీరి ప్రభ ఉన్నతస్థితికి చేరింది. మొగల్ పరిపాలనాధికారులకు కొరకరాని కొయ్యగా మారారు. ఈ సామ్రాజ్య ఆవిర్భావం, విస్తరణ, చేసిన యుద్ధాలు తదితర అంశాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన ఉండాలి.



భౌగోళిక పరిస్థితులు అనుకూలం.. గెరిల్లా పోరుతో విజయం!

మరాఠాలు - శివాజీ (క్రీ.శ. 17వ శతాబ్దం)

17వ శతాబ్దంలో మరాఠా రాజ్య స్థాపన, 18వ శతాబ్దంలో భారతదేశంపై మరాఠాల ఆధిపత్యం, 19వ శతాబ్దపు ఆరంభంలో వీరి అంతం భారతదేశ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయం.

- మరాఠాలు అత్యంత ప్రాచీనమైన వారైనప్పటికీ 17వ శతాబ్దం వరకు వారికంటూ ఒక రాజ్యం ఉండేది కాదు.
- 14వ శతాబ్దంలో బహమనీ సుల్తానులు మరాఠాలను భారీగా తమ సైన్యంలోకి చేర్చుకోవడంతో వీరు రాజకీయంగా వెలుగులోకి వచ్చారు. బహమనీ సామ్రాజ్యానంతరం మరాఠాలు బీజాపూర్, అహ్మద్ నగర్ మొగల్ కొలువుల్లో చేరారు. మధ్యయుగంలో ముస్లిం రాజ్యాలకు తమ సేవలందిస్తూ మరాఠాలు అంచలంచెలుగా ఎదిగారు.
- శివాజీ పూర్వీకులు అహ్మద్ నగర్ సుల్తానుల కొలువులో పనిచేశారు. శివాజీ తాత మాలోజి భోంస్లే అహ్మద్ నగర్ రాజ్యంలో సామాన్య సైనికుడిగా పని చేసేవారు. శివాజీ తండ్రి షాజీ భోంస్లే అహ్మద్ నగర్ రాజ్యానికి ప్రధానమంత్రి అయ్యాడు. ఈ సుల్తానులు ఇతడికి పూనా జాగీర్‌ను ఇచ్చారు. తండ్రి నుంచి వారసత్వంగా పొందిన జాగీర్‌ను శివాజీ ఒక బలమైన మరాఠా రాజ్యంగా మార్చారు.
- అహ్మద్ నగర్ ప్రధానమంత్రిగా పనిచేసిన మాలిక్ అంబర్ నుంచి మరాఠాలు గెరిల్లా యుద్ధం నేర్చుకున్నారు.

శివాజీ (1627-80)

భారతదేశ చరిత్రలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న వారిలో శివాజీ ఒకరు. ఈయన 1627లో పూనా జిల్లా జున్నర్ సమీపంలోని శివనేరు దుర్గంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు జిజియాబాయి, షాజీ భోంస్లే. ఈయన గొప్పవ్యక్తిగా ఎదగడానికి తల్లి జిజియాబాయి, గురువు దాదాజీ కొండదేవ్, మతగురువు సమర్థ రామదాస్ ప్రధాన కారకులు. శివాజీ తండ్రి నుంచి వారసత్వంగా పొందిన పూనా జాగీర్‌ను బీజాపూర్, మొగల్ రాజ్యాలపై దాడులు చేసి ఒక బలమైన మరాఠా రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. ఇతడు అన్ని మతాలను ఆదరించిన లౌకికవాది.

మరాఠాల విజృంభణ - దోహదపడిన పరిస్థితులు

భారతదేశంపై మొగల్, ఇతర ముస్లిం పాలకుల ఆధిపత్యం కొనసాగుతున్న 17వ శతాబ్దంలో మరాఠాలు తమకంటూ ఒక స్వరాజ్యాన్ని స్థాపించుకున్నారు. వీరు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి చేసిన పోరాటానికి వారి ధైర్యసాహసాలతో పాటు భౌగోళిక, ఇతర అంశాలు దోహదపడ్డాయి.

- మరాఠాలు నివసించే ప్రాంతం దట్టమైన అడవులు, కొండలు, లోతైన లోయలతో కూడిన పీఠభూమి ప్రాంతం. ఇది దక్కన్‌లో ఒక విశిష్టమైన భౌగోళిక స్వరూపాన్ని కలిగి ఉంటుంది. పశ్చిమాన అరేబియా సముద్రం ఉండి, మిగతా వైపుల నుంచి ఎత్తయిన సహ్యాద్రి పర్వతాలతో వేరుచేసి ఉంటుంది.
- వేల అడుగుల ఎత్తయిన ఈ పర్వతాల్లోనూ మరాఠాలు సునాయాసంగా బలమైన కోటలను నిర్మించుకోగలిగారు. ఫలితంగా ఇవి శత్రుదుర్భేద్యంగా మారాయి.
- కొండలు, పర్వతాలు, అడవులు మరాఠాలు కొనసాగించిన గెరిల్లా పోరాటానికి అనుకూలంగా ఉండేవి.
- 13వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు పండరీపురం కేంద్రంగా కొనసాగిన భక్తి ఉద్యమం మరాఠాల విజృంభణకు నాంది పలికింది. జ్ఞానదేవుడు, ఏకనాథుడు, రామదాసు, తుకారాం లాంటి సంస్కర్తలు మరాఠాల్లో జాతీయ భావాలను పెంపొందించారు. వీరు కులం ఆధారంగా కొనసాగుతున్న వివక్షను తూర్పారబట్టి మరాఠాల్లో సమానత్వ భావాలను పెంచారు. మరాఠీ భాషను ప్రచారం చేయడం ద్వారా భాష ఏకత్వాన్ని సాధించి మరాఠాలను ఏకతాటిపైకి తీసుకువచ్చారు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

బీజాపూర్ రాజ్యంపై దాడులు:

శివాజీ బీజాపూర్ రాజ్యంపై దండెత్తి అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొండన, తోరణ, జావళి, కొంకణ్ ముఖ్యమైనవి. తోరణలో రాయ్‌గఢ్, జావళిలో ప్రతాప్‌గఢ్ అనే కోటలను నిర్మించారు.

◆ 1659లో బీజాపూర్ సుల్తాన్ అలీ ఆదిల్ షా-II శివాజీని అంతం చేయడానికి అఫ్జల్ ఖాన్ అనే సేనానిని పంపాడు. కానీ కృష్ణాజీ భాస్కర్ అనే దూత ద్వారా విషయం తెలుసుకున్న శివాజీ ఆతడిని హత్య చేశారు. అనంతరం ఇస్లామిక్ సంప్రదాయాలతో అఫ్జల్ ఖాన్ సమాధిని ప్రతాప్‌గఢ్‌లో నిర్మించారు.

మొగల్ సామ్రాజ్యంపై దాడులు:

శివాజీ మొగల్ సామ్రాజ్యంలోని నగరాలపై దాడిచేసి వాటిని దోచుకున్నారు. 1657లో అహ్మద్ నగర్‌ను దోచుకున్నారు మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ ఆదేశాలతో ఆనాటి దక్కన్ సుబేదార్ షయిస్తాఖాన్ 1663లో పూనాపై దండెత్తి దాన్ని ఆక్రమించుకున్నాడు. తర్వాత శివాజీ గెరిల్లా దాడి చేసి షయిస్తాఖాన్‌ను తరిమేశారు.

● 1664లో శివాజీ మొగల్ సామ్రాజ్య ఆర్థిక రాజధాని సూరత్‌పై దాడి చేసి సుమారు రూ.కోటి సంపదను దోచుకున్నారు. శివాజీ సూరత్‌లో అత్యంత సంపన్నుడైన వర్జీవోహ్రా ఇంటిని దోచుకున్నారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఔరంగజేబ్ ఆతడిని అంతం చేయడానికి కచ్చవ రాజపుత్ర వంశస్థుడు రాజా జైసింగ్‌ను పంపాడు. ఇతడు 1665లో శివాజీని ఓడించి, పురందర్ సంధి చేసుకున్నాడు.

పురంధర్ సంధి - ముఖ్యాంశాలు

☛ శివాజీ తన 35 కోటల్లో 23 కోటలు మొగలులకు అప్పగించాలి.

☛ యువరాజు శంభాజీ మొగల్ కొలువులో 5000/5000 మున్సబ్‌దార్‌గా చేరి, సైనిక సేవలందించాలి.

☛ శివాజీ మొగల్ దర్బారును సందర్శించాలి.

☛ పురందర్ సంధి ప్రకారం, 1666లో శివాజీ ఆగ్రాలోని ఔరంగజేబ్ దర్బారును సందర్శించారు. కానీ అక్కడ తనకు అవమానం జరగడంతో శివాజీ తిరుగుబాటు చేశారు. దీంతో ఔరంగజేబ్ శివాజీని చెరసాలలో బంధించగా... తర్వాత ఆయన తప్పించుకున్నారు. ఈయన 1670లో రెండోసారి సూరత్‌ను దోచుకున్నారు.

☛ 1674లో ఛత్రపతి అనే బిరుదుతో రాయ్‌గఢ్‌లో శివాజీ పట్టాభిషేకం జరుపుకున్నారు. రాజధానిని పూనా నుంచి రాయ్‌గఢ్‌కు మార్చారు.

శివాజీ బిరుదులు:

గోబ్రాహ్మణ ప్రతిపాలక, హైందవ ధర్మోద్ధారక, హిందూ పద్ పద షాహీ, ధర్మపారాయణ.

▼ 1677లో గోల్కొండ పాలకుడు కుతుబ్‌షాహీ వంశస్థుడైన అబుల్ హసన్ తానీషా సహకారంతో శివాజీ జింజి, వేలూరు, బళ్లారి ప్రాంతాలను జయించారు. ఈయన 1680లో రాయఘడ్‌లో మరణించారు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day 838

Permeate

Telugu meaning: చొచ్చుకురావడం, వ్యాప్తి చెందడం


English meaning: Permeate (పర్మియేట్) means to spread throughout something, to pass through, or to be present in every part.

Synonyms: Penetrate, Spread; ***Antonyms:*** Block, Seal

Usage: 1. The fragrance of fresh flowers permeated the entire room, creating a calming atmosphere.

2. Negative attitudes began to permeate the team, affecting their confidence and performance.

కరెంట్ అఫైర్స్



జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ-నల్సా) కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నియమితులయ్యారు. 2025 నవంబరు 24 నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుంది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ నవంబరు 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ పదవిలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఈ నెల 23న సీజేఐ జస్టిస్ గవాయ్ పదవీ విరమణ చేసిన తర్వాత 24న జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. దీంతో ఆ స్థానంలో జస్టిస్ విక్రమ్‌నాథ్‌ను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు వెలువరించింది.

❖ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో సీనియారిటీ పరంగా రెండోస్థానంలో ఉన్నవారిని ఈ పదవిలో నియమిస్తారు.



చిలీ మాజీ అధ్యక్షురాలు, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల విభాగం మాజీ చీఫ్ మిషెల్ బచెలెట్ ఇందిరా గాంధీ శాంతి పురస్కారం (2024) అందుకున్నారు. 2025 నవంబరు 19న దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ దీన్ని ఆమెకు ప్రదానం చేశారు. నిరాయుధీకరణ, అభివృద్ధి కోసం చేసిన సేవలకుగాను బచెలెట్‌కు ఈ పురస్కారం దక్కింది.



అతి శీతల వాతావరణంలో సైనికులు ధరించే సరికొత్త సైనిక జాకెట్ "కోట్ కంబాట్"ను భారత సైన్యం రూపొందించింది. డిజిటల్ ప్రింట్‌తో కూడుకున్న ఈ జాకెట్‌కు సంబంధించి మేధో ఆస్తి హక్కుల్ని (Intellectual Property Rights) భారత సైన్యం దక్కించుకుంది. దిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ) దీన్ని రూపొందించింది.

ఆర్థిక వ్యవహారాల ఆడిట్ కోసం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ని ఏర్పాటు చేయనుంది. ఈ జాతీయ కేంద్రం ఆర్థిక ఆడిట్ రంగంలో ఆవిష్కరణలు, పరిశోధన, వృత్తిపరమైన అభివృద్ధికి తోడ్పడుతుందని డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కమర్షియల్, రిపోర్ట్ సెంట్రల్) ఏఎం బజాజ్ వెల్లడించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అణుశక్తి - అణు విద్యుత్ కేంద్రాలు

స్టడీ జోన్


ఇంధన వ్యవస్థలో అణుశక్తి ముఖ్య భాగం. స్థిరమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఇది పునరుత్పాదక శక్తి వనరు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ తమ రోజువారీ కార్యకలాపాలకు శక్తి (ఎనర్జీ)పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. శక్తిని జీవనోపాధికి, పురోగతికి జీవనాడిగా పేర్కొంటారు. ఉద్యోగాలు, ఆదాయాన్ని సృష్టించడం; భారీ స్థాయిలో వాణిజ్యాన్ని సులభతరం చేయడం ద్వారా అణుశక్తి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ముఖ్య భూమిక పోషిస్తోంది. పోటీపరీక్షల నేపథ్యంలో దీని గురించి ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

అణుశక్తి ఉత్పత్తి

అణుశక్తి ఉత్పత్తి యురేనియం, థోరియం అణు ఖనిజాలపై ఆధారపడి ఉంటుంది. ఈ పరమాణువుల కేంద్రకంలో నిల్వ చేసిన శక్తి నుంచి అణుశక్తిని పొందొచ్చు. ఇవి సహజంగా స్వయం విభజన శక్తిని (రేడియో యాక్టివ్) కలిగి ఉంటాయి.

✦ ఇవి అణు రియాక్టర్‌లో కేంద్రక విచ్ఛిత్తి అనే ప్రక్రియ ద్వారా శక్తిని విడుదల చేస్తాయి.

✦ ఐరోపా దేశాలు, అమెరికా అణుశక్తిని అధికంగా ఉత్పత్తి చేస్తున్నాయి.




భారత్‌లో అణువిద్యుత్ కేంద్రాలు

భారతదేశంలో అణువిద్యుత్ ఉత్పత్తి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) అధీనంలో ఉంటుంది. దీన్ని 1987, సెప్టెంబరు 1న ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది. దీన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ) నిర్వహిస్తుంది. అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణం, రూపకల్పన, నిర్వహణలను ఎన్‌పీసీఐఎల్ పర్యవేక్షిస్తుంది.

దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలకు సంబంధించి గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

ఉత్ప్రేరణ - రకాలు



రసాయన చర్యలో వినియోగించే చర్యా మిశ్రమానికి బాహ్య పదార్థాన్ని కలిపి, చర్య వేగాన్ని పెంచే ప్రక్రియను ఉత్ప్రేరణ (Catalysis) అంటారు. ఇలా కలిపిన బాహ్య పదార్థాన్ని ఉత్ప్రేరకం (Catalyst) అంటారు. రసాయన చర్యలో తాను వినియోగం చెందకుండా చర్యా వేగాన్ని పెంచే ఇతర పదార్థమే ఉత్ప్రేరకం. వీటిలోని రకాలు, వాటి చర్యలు, అభిలాక్షణిక ధర్మాలు తదితరాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.

ఉత్ప్రేరణ రకాలు

ఉత్ప్రేరకం భౌతిక స్థితి, క్రియాజనకాల భౌతిక స్థితుల ఆధారంగా ఉత్ప్రేరణాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1. సజాతి ఉత్ప్రేరణ
2. విజాతి ఉత్ప్రేరణ

ఉత్ప్రేరకం అభిలాక్షణిక ధర్మాలు

ఉత్ప్రేరకం చర్య వేగాన్ని మారుస్తుంది తప్ప చర్యను ప్రారంభించదు.

✦ ఉత్ప్రేరకం చర్యలో వినియోగం కాదు. రసాయనికంగా ఎలాంటి శాశ్వత మార్పు చెందదు.

✦ ఒక రసాయన చర్య వేగాన్ని పెంచేందుకు కొద్దిపాటి పరిమాణంలో ఉత్ప్రేరకం సరిపోతుంది.

స్వయం ఉత్ప్రేరణ చర్యలు

చర్యలో ఏర్పడే ఒక మధ్యస్థ పదార్థమే చర్యకు ఉత్ప్రేరకంగా పనిచేసే దృగ్విషయాన్ని స్వయం ఉత్ప్రేరణ అంటారు. ఈ రకం ఉత్ప్రేరకాన్ని స్వయం ఉత్ప్రేరకం అంటారు.

ఉత్ప్రేరణ - ఉదాహరణలు, విజాతి ఉత్ప్రేరణ, ద్రవ ప్రావస్థలో చర్యలకు ఉదాహరణలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ (టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 124. దరఖాస్తు ఫీజు రూ.1050. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 డిసెంబరు 5.

టీచింగ్ పోస్టులు

సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఆర్ఎఫ్‌టీఐ) ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 14. దరఖాస్తు ఫీజు రూ.1200. అర్హులైన అభ్యర్థులు 2025 డిసెంబరు 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (నవంబరు 22) చివరి తేదీ

- సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 77 ప్రొఫెసర్ ఉద్యోగాలు. ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ పీహెచ్‌డీలో ఉత్తీర్ణత, ఉద్యోగానుభవంతో పాటు తెలంగాణ రాష్ట్ర వైద్య మండలిలో తప్పనిసరిగా పేరు నమోదై ఉన్నవారు అర్హులు.
- ఏవీఎన్ఎల్‌లో మేనేజర్ పోస్టులు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- ఎయిమ్స్ మంగళగిరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు. ఎంసీఐ/ఎన్ఎంసీ/డీసీఐ గుర్తించిన సంస్థ నుంచి పీజీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams
Mathematics
Boats & Streams

1. Aarav can row a boat at 12 km/h in still water. It takes him three times as long to row upstream as to row downstream for the same distance. What is the rate of the stream (in km/h)?
A) 4 km/h B) 6 km/h
C) 3 km/h D) 2 km/h

2. A boatman takes 20 minutes to row 10 km downstream, which is 20% less than the time he takes to row the same distance upstream. What is the speed (in km/h) of the boat in still water?
A) 24 km/h B) 20.5 km/h
C) 27.5 km/h D) 25 km/h

3. The speed of a boat downstream is 150% of its speed in still water. If the boat takes 1 hour to cover 24 km in still water, then how much time (in hours) will it take to cover 18 km upstream?
A) 1.5 hours B) 2 hours
C) 2.4 hours D) 2.25 hours

4. The time taken by a boat to travel 18 km downstream is the same as the time taken to travel 12 km upstream. If the speed of the stream is 4 km/h, then how much time (in hours) will it take to cover 64.8 km in still water?
A) 3 hours B) 3.24 hours
C) 4 hours D) 4.5 hours

5. The speed of a boat in still water is 12 km/h. If the speed of the stream is 3 km/h, then what distance (in km) will the boat cover in 4 hours going upstream?
A) 32 km B) 36 km
C) 40 km D) 48 km

6. The speed of a boat in still water is 18 km/h, and the speed of the stream is 6 km/h. In how much time (in hours) will the boat travel a distance of 72 km upstream and the same distance downstream?
A) 12 hours B) 10 hours
C) 9 hours D) 8 hours

7. A person can row 60 km downstream in 5 hours and 48 km upstream in 8 hours. What is the speed (in km/h) of the current?
A) 2 km/h B) 3 km/h
C) 4 km/h D) 5 km/h

8. A boat covers a distance of 96 km downstream in 8 hours, while it takes 16 hours to cover the same distance upstream. What is the speed (in km/h) of the boat in still water?
A) 9 km/h B) 10 km/h
C) 11 km/h D) 12 km/h

9. A boatman rows 8 km against the current in 2 hours and 2 km with the current in 10 minutes. How long (in hours) will it take him to cover 40 km in still water?
A) 2.5 hours B) 3 hours
C) 4 hours D) 5 hours

10. A boat travels upstream from B to A and downstream from A to B in a total of 4 hours. If the speed of the boat in still water is 10 km/h and the speed of the current is 2 km/h, what is the distance (in km) between A and B? (correct up to two decimal places)
A) 16.00 km B) 17.50 km
C) 18.00 km D) 19.2 km

11. A boat covers 120 km upstream and back (i.e. 120 km upstream + 120 km downstream) in 15 hours. It also covers 24 km upstream and 48 km downstream in 4 hours. How much distance (in km) will the boat cover in 16 hours in still water?
A) 240 B) 288 C) 320 D) 360

12. A boat goes 12 km upstream in 48 minutes, and the speed of the stream is 4 km/h. Find the speed of the boat in still water (in km/h).
A) 12 km/h B) 10 km/h
C) 11 km/h D) None of these

13. Rohit can row his boat in still water at a speed of 14 km/h. If the speed of the stream is 4 km/h, how long (in hours) will it take him to cover a distance of 72 km downstream?
A) 4 hours B) 5 hours
C) 6 hours D) 7 hours

14. The speed of a boat in still water is 20 km/h. The time taken by the boat to cover a distance of 25 km upstream is equal to the time taken by it to travel 45 km downstream. What is the speed of the stream (in km/h)?
A) 4 km/h B) 5.71 km/h
C) 6 km/h D) 8.65 km/h

15. The speed of a boat in still water is 10 km/h. If the speed of the current is 3 km/h, then what distance will the boat cover in 4 hours going upstream?
A) 20 km B) 28 km
C) 30 km D) 32 km

16. The speed of a boat in still water is 15 km/h, and the speed of the stream is 5 km/h. In how much time (in hours) will the boat travel a distance of 60 km upstream and the same distance downstream?
A) 9 hours B) 12 hours
C) 14 hours
D) 16 hours

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

(c) eenadu

కరెంట్ అఫైర్స్



✿ కంట్రోలర్ జనరల్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (సీజీసీఏ)గా ఇటీవల ఎవరు బాధ్యతలు స్వీకరించారు?
జ: వందనా గుప్తా

✿ ప్రపంచ ఖడ్గమృగాల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2025లో ఈ దినోత్సవాన్ని 'ప్రోగ్రెస్, ఛాలెంజెస్, అండ్ ది రోడ్

మాదిరి ప్రశ్నలు

ఎహెడ్' అనే థీమ్‌తో నిర్వహించారు.)
జ: సెప్టెంబరు 22

✿ జీఎస్‌టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ (జీఎస్‌టీఏటీ - గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్)ను 2025, సెప్టెంబరు 24న దిల్లీలో ఎవరు అధికారికంగా ప్రారంభించారు? (నాగరిక్ దేవోభవ (సిటిజన్ ఈజ్ గాడ్) అనే సూత్రంతో జీఎస్‌టీఏటీ పనిచేస్తుంది.)
జ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

✿ సేంద్రియ ఉత్పత్తుల పరస్పర గుర్తింపు ఒప్పందంపై ఇటీవల భారత్‌తో ఏ దేశం ఒప్పందం కుదుర్చుకుంది?
జ: ఆస్ట్రేలియా

మరింత సమాచారం

అదనపు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్నారా..! — జాబ్ స్కిల్స్



ప్రస్తుత కాలంలో ప్రతి రంగంలోనూ టెక్నాలజీ ప్రమేయం పెరుగుతోంది. ఈ పరిణామంతో విద్యార్థులు, ఉద్యోగార్థులతోపాటు కొలువుల్లో కొనసాగుతున్నవారూ అదనపు నైపుణ్యాల (అప్‌స్కిల్లింగ్)ను నేర్చుకోవాల్సిన పరిస్థితి. సంస్థలన్నీ తమ ఉద్యోగుల్లో ఆధునిక నైపుణ్యాల స్థాయిని పరిశీలిస్తున్నాయి. ఈ సమయంలో పోటీలో స్థిరంగా నిలబడాలంటే అప్‌స్కిల్లింగ్ తప్పనిసరి. వృత్తిపరంగా ఎదగడానికి అవసరంగా మారిన అదనపు, డిజిటల్ నైపుణ్యాలు ఏమిటి? వాటిని ఏవిధంగా అలవరచుకోవాలో, ఎలా మెరుగుపరచుకోవాలో తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ — రీజనింగ్

ర్యాంకింగ్ టెస్ట్

ఒక వరుసలో లేదా సమూహంలో ఉన్న వ్యక్తుల లేదా వస్తువుల స్థానాలు లేదా ర్యాంకుల గురించి ర్యాంకింగ్ టెస్ట్ వివరిస్తుంది. దీనిపై పోటీ పరీక్షల్లో రీజనింగ్‌లో భాగంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ర్యాంకులు తెలిసినప్పుడు సమూహంలోని మొత్తం వ్యక్తుల సంఖ్యను కనుక్కోవచ్చు. మొత్తం, ఒక ర్యాంకు తెలిస్తే మరో ర్యాంకును గుర్తించవచ్చు. కనీస సమాచారంతో గరిష్ఠ ఫలితాన్ని రాబట్టే నైపుణ్యాన్ని అభ్యర్థుల్లో అంచనా వేయడానికీ, ఇచ్చిన డేటాను అర్థం చేసుకుని ఒక నిర్ణయానికి రాగలిగిన తార్కిక సామర్థ్యాన్ని పసిగట్టడానికీ ఈ టెస్ట్ ఉపయోగపడుతుంది. సంబంధిత ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకుని, రెండు లేదా అంతకంటే ఎక్కువమంది వ్యక్తులు ఉండే సందర్భాల ప్రశ్నలను ప్రాక్టీస్ చేస్తే జవాబులు వేగంగా రాయడం అలవాటవుతుంది. దాంతోపాటు ర్యాంకుల అతివ్యాప్తి జరిగే సంక్లిష్ట స్థితుల్లో తగిన సూత్రాలను వాడటాన్నీ నేర్చుకోవాలి.

స్థానాల లెక్కకు పక్కా పరీక్ష!



ర్యాంకింగ్ టెస్ట్‌నే 'కోటీ పరీక్ష' అని కూడా అంటారు. దీనిలో ఉన్న ముఖ్య ఉద్దేశం ఒక సమూహంలోని వ్యక్తి లేదా వస్తువు స్థానాన్ని కనుక్కోవడం. సమూహంలో ఒక వ్యక్తి స్థానం ఒకవైపు నుంచి ఇస్తే మరొక వైపు నుంచి కనుక్కోవడం; ఒకే వ్యక్తి స్థానం రెండు వైపులా ఇస్తే సమూహంలోని మొత్తం వ్యక్తులను కనుక్కోవడం; వ్యక్తుల స్థానాలు పరస్పరం మారితే కొత్త స్థానాలను కనుక్కోవడం లాంటి ప్రశ్నలు ఈ అధ్యాయం నుంచి సాధన చేయాలి.

సమూహంలోని వ్యక్తులు లేదా వస్తువుల స్థానాలను కనుక్కోవడానికి కింది సూత్రాన్ని ఉపయోగిస్తారు.

T = n + K – 1

T = సమూహంలోని మొత్తం వ్యక్తులు

n = ఒక వ్యక్తి స్థానం ఒకవైపు నుంచి


K = అదే వ్యక్తి స్థానం మరొకవైపు నుంచి

★ ఒకే వ్యక్తి స్థానం ఇరువైపుల నుంచి తెలిసిన సందర్భంలో మాత్రమే పై సూత్రాన్ని ఉపయోగిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. ఒక తరగతిలోని 40 మంది విద్యార్థుల్లో అమర్ ముందు నుంచి 16వ ర్యాంకు సాధించాడు. అయితే అతడి ర్యాంకు వెనక వైపు నుంచి ఎంత?
1) 24 2) 25 3) 26 4) 21


వివరణ: T = n + K – 1



⇒ 40 = 16 + K – 1
40 – 15 = K ⇒ K = 25
∴ అమర్ వెనక వైపు నుంచి 25వ స్థానంలో ఉన్నాడు.
జ: 2

2. 78 మంది ఉన్న ఒక సమూహంలో అభినవ్ తూర్పు నుంచి 21వ స్థానంలో ఉన్నాడు. అయితే అతడు పడమర నుంచి ఎన్నో వ్యక్తి?
1) 58 2) 85 3) 54 4) 83

వివరణ: T = n + K – 1




⇒ 78 = 21 + K – 1
78 – 20 = K ⇒ K = 58
∴ అభినవ్ పడమర నుంచి 58వ వ్యక్తి **జ: 1**

3. ఒక పాఠశాలలో జరిగిన జె.వి.వి. పరీక్షలో కృతన్ మొదటి నుంచి 17వ స్థానంలో, చివరి నుంచి 64వ స్థానంలో ఉన్నాడు. ఆ పరీక్షలో 16 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. 9 మంది హాజరు కాలేదు. అయితే మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?
1) 103 2) 106 3) 104 4) 105

వివరణ: T = n + K – 1
= 17 + 64 – 1
= 81 – 1 = 80



ఉత్తీర్ణులైన విద్యార్థులు = 80
ఉత్తీర్ణులు కానివారు = 16
హాజరు కానివారు = 09
105



∴ మొత్తం విద్యార్థులు సంఖ్య = 105
జ: 4

4. ఒక పక్షుల వరసలో ఒక పక్షి రెండు వైపుల నుంచి 13వ స్థానంలో ఉంది. అయితే ఆ వరసలో ఉన్న మొత్తం పక్షుల సంఖ్య ఎంత?
1) 25 2) 28 3) 26 4) 24

వివరణ: T = n + K – 1
= 13 + 13 – 1 = 26 – 1 = 25
∴ ఆ వరసలో ఉన్న మొత్తం పక్షుల సంఖ్య = 25
జ: 1

5. ఒక సమూహంలో హస్విక పై నుంచి 19వ స్థానంలో, కింది నుంచి 22వ స్థానంలో ఉంది. అయితే ఆ సమూహంలోని మొత్తం వ్యక్తుల సంఖ్య ఎంత?
1) 42 2) 45 3) 40 4) 48

వివరణ: T = n + K – 1
= 19 + 22 – 1 = 41 – 1 = 40
మొత్తం వ్యక్తుల సంఖ్య = 40 **జ: 3**



6. ఒక వరసలో **A** అనే వ్యక్తి ముందు నుంచి 8వ స్థానంలో, **B** అనే వ్యక్తి వెనక నుంచి 11వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ వరుసలో ఉన్న మొత్తం వ్యక్తులు ఎంత మంది?
1) 19 2) 18 3) 20 4) కనుక్కోలేం

వివరణ: ముందు నుంచి A స్థానం = 8
వెనక నుంచి B స్థానం = 11
ఒకే వ్యక్తి స్థానం ఇరువైపుల నుంచి తెలియదు. కాబట్టి సమాధానం చెప్పలేం. **జ: 4**

7. ఒక వరసలో **P** అనే వ్యక్తి ముందు నుంచి 12వ స్థానంలో ఉన్నాడు. **Q** అనే వ్యక్తి అదే వరసలో వెనక నుంచి 15వ స్థానంలో ఉన్నాడు. **P, Q** ల మధ్య 8 మంది ఉంటే ఆ వరసలోని మొత్తం విద్యార్థులు ఎంతమంది?
1) 38 2) 35 3) 42 4) 36

వివరణ: ముందు నుంచి P స్థానం = 12
L —P(12)— 8 —Q(15)— R



వెనక నుంచి Q స్థానం = 15
వరసలో ఉన్న మొత్తం విద్యార్థులు
= 12 + 8 + 15 = 35 **జ: 2**

8. ఒక సమూహంలో ఉన్న 60 మంది వ్యక్తుల్లో **A** అనే వ్యక్తి ఎడమవైపు నుంచి 13వ స్థానం, **B** అనే వ్యక్తి కుడివైపు నుంచి 10వ స్థానంలో ఉన్నారు. **A, B** లకు మధ్యలో **C** ఉంటే, **C** స్థానం **A** నుంచి ఎన్నోది?
1) 19 2) 18 3) 21 4) 20

వివరణ: L —A(13)— 18 — C — 18 —B(10)— R
= 60 – (13 + 10) = 37 – 1
= 60 – 23 = 37 = 36
A, B లకు మధ్యలో C ఉన్నాడు. అంటే A, C; C, B ల మధ్య 18 మంది ఉన్నారు.
A నుంచి C స్థానం = 1 + 18 + 1
= 20వ స్థానం **జ: 4**

9. ఒక తరగతిలో **A** అనే వ్యక్తి ఎడమ నుంచి 13వ స్థానంలో, **B** అనే వ్యక్తి కుడివైపు నుంచి 17వ స్థానంలో ఉన్నారు. వారు తమ స్థానాలను పరస్పరం మార్చుకున్న తర్వాత **A** ఎడమ వైపు నుంచి 23వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?
1) 39 2) 38 3) 40 4) 41

వివరణ:
L —A(13) ⇄ B(17)— R
B = ; A = 23
A స్థానం ఎడమవైపు నుంచి = 13
B స్థానం కుడివైపు నుంచి = 17
స్థానాలు మార్చుకున్న తర్వాత
A స్థానం ఎడమ వైపు నుంచి = 23
(ఇది కుడి నుంచి B స్థానం)
అంటే ఎడమ నుంచి A స్థానం = 23
కుడి వైపు నుంచి A స్థానం = 17
T = n + K – 1
= 23 + 17 – 1 = 40 – 1 = 39
∴ తరగతిలోని మొత్తం విద్యార్థులు = 39 **జ: 1**



10. ఒక తరగతిలో అనిల్ ఎడమ వైపు నుంచి 18వ స్థానంలో, ఆకాష్ కుడివైపు నుంచి 16వ స్థానంలో ఉన్నారు. వారు తమ స్థానాలను పరస్పరం మార్చుకున్న తర్వాత ఆకాష్ కుడివైపు నుంచి 27వ స్థానంలో ఉన్నాడు. అయితే అనిల్ స్థానం ఎడమవైపు నుంచి ఎంత?
1) 30 2) 29 3) 28 4) 32

వివరణ:
+11
L —అనిల్(18) ⇄ ఆకాష్(16)— R
ఆకాష్ = 27 ; అనిల్ =
+11
ప్రారంభంలో కుడివైపు నుంచి ఆకాష్ స్థానం = 16



ప్రస్తుతం కుడివైపు నుంచి ఆకాష్ స్థానం = 27 (+11)
ఆకాష్ 11 స్థానాలు ఎడమవైపు జరిగాడు కాబట్టి అనిల్ కూడా 11 స్థానాలు కుడివైపు జరగాలి.
= 18 + 11 = 29
∴ అనిల్ స్థానం ఎడమ వైపు నుంచి = 29 వ స్థానం **జ: 2**


11. ఒక వరుసలో P అనే వ్యక్తి ఎడమవైపు నుంచి 17వ స్థానంలో, Q అనే వ్యక్తి కుడివైపు నుంచి 12వ స్థానంలో ఉన్నారు. వారు తమ స్థానాల సంఖ్య పరస్పరం మార్చుకున్న తర్వాత Q అనే వ్యక్తి కుడివైపు నుంచి 21వ స్థానంలో ఉన్నాడు. అయితే P యొక్క స్థానం ఎడమ వైపు నుంచి ఎంత?
1) 25 2) 26 3) 23 4) 24

వివరణ:
+9
L —P(17) ⇄ Q(12)— R
21 = Q ; P
+9
కుడివైపు నుంచి 12వ స్థానంలో ఉన్న Q, 21వ స్థానానికి మారాడు. అంటే Q ఎడమ వైపునకు 9 స్థానాలు మారాడు. వారు తమ స్థానాలను పరస్పరం మార్చుకున్నారు. కాబట్టి P అనే వ్యక్తి కూడా 9 స్థానాలు కుడివైపునకు జరగాలి.
∴ 9 యొక్క స్థానం = 17 + 9
= 26 **జ: 2**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

దరఖాస్తు చేశారా?




☛ యూఓహెచ్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్-I పోస్టులు
చివరి తేదీ: 27.11.2025.

☛ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ తిరుపతిలో ఉద్యోగాలు
చివరి తేదీ: 24.11.2025.

మన విశ్వం

ఆ గ్రహం చుట్టూ అందమైన వలయాలు!

రాత్రిపూట ఆకాశంలోకి చూస్తే కోట్ల నక్షత్రాలు అనంత దూరాల వరకు కనిపిస్తుంటాయి. అదే బిగ్‌బ్యాంగ్ మహావిస్ఫోటం వల్ల ఆవిర్భవించిన విశ్వం. అందులో నక్షత్రాలు, గెలాక్సీలు, గ్రహాలు, ఉపగ్రహాలు ఉంటాయి. అంతటా గురుత్వాకర్షణ శక్తి విస్తరించి ఉంటుంది. అఖండమైన ఆ ఖగోళ వస్తుసముదాయం గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. నక్షత్రాల పుట్టుక నుంచి అవి నశించిపోయే వరకు సంభవించే పరిణామాలను అర్థం చేసుకోవాలి. సౌరకుటుంబంలో భూమి సహా ఇతర గ్రహాల అమరిక, వాటి పరిమాణాలు, చంద్రుడి స్వరూప స్వభావాలు, ప్రత్యేక నక్షత్రాలు, ప్రసిద్ధ ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించిన అంశాలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న అంతరిక్ష పరిశోధనలు, వాటి లక్ష్యాలపై అవగాహన పెంచుకోవాలి.



జనరల్ స్టడీస్ - ఫిజిక్స్

1. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ) విశ్వం జననం, పరిమాణం మొదలైన వాటి గురించి చదివే శాస్త్రాన్ని 'కాస్మాలజీ' అంటారు.
బి) నక్షత్రాలు, గ్రహాలు, చంద్రుడు.. ఇలా ఆకాశంలో ఉండే అనేక వస్తువులను 'ఖగోళ వస్తువులు' అంటారు.
సి) ఖగోళ వస్తువులకు సంబంధించిన అధ్యయనమే 'మైథాలజీ'.
1) ఎ, బి, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, సి

2. కింది వాటిలో సరికానివి గుర్తించండి.
ఎ) చంద్రబింబం మొత్తం కనపడే రోజును 'పౌర్ణమి' అంటారు.
బి) అమావాస్యకు మరుసటి రోజు కనిపించే చంద్రుడిని 'నెలవంక' అంటారు.
సి) నెల మొత్తం కనిపించే చంద్రుడి ఆకారాలు చంద్రకళలు. వీటి ఆధారంగా భారతదేశంలో పండగలు చేసుకుంటారు.
డి) క్షీణిస్తున్న చంద్రుడి పదమూడో రాత్రిని మహాశివరాత్రిగా నిర్వహిస్తారు.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
3) ఎ, బి, సి 4) ఎ, బి, డి

3. చంద్రుడి ఉపరితలం పెద్ద పెద్ద గోతుల (క్రేటర్స్)తో ఉండి, వాతావరణం లేకుండా దుమ్ము, ధూళితో ఉంటుంది. దీనిపై మొదట కాలు మోపిన వ్యక్తి?



1) ఎడ్విన్‌ఆల్డ్రిన్
2) సునీతా విలియమ్స్
3) నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ 4) ఆర్యభట్ట

4. కింది వాటిలో సరికానిది?
ఎ) సూర్యుడి తర్వాత భూమికి సమీపాన ఉన్న తదుపరి నక్షత్రం ప్రాక్సిమా సెంటారీ.
బి) నక్షత్రాలు తూర్పు నుంచి పడమర వైపునకు కదులుతాయి.
సి) ఆకాశంలో ఎప్పటికీ కదలని నక్షత్రం సిరియస్.
1) ఎ, బి 2) బి, సి 3) సి 4) బి

5. కింది వాటిలో ధ్రువ నక్షత్రానికి సంబంధించి సరికానిది?
ఎ) ఇది ప్రధానంగా భూమి అక్షం దిశలో ఉంటుంది.
బి) ఇది ఏడుగురు ప్రసిద్ధ భారతీయ రుషులతో సంబంధం వల్ల దీన్ని 'సప్తర్షి'గా పిలుస్తారు.
సి) దీన్నే 'గ్రేట్ బేర్ పోల్‌స్టార్' అంటారు.
డి) దీనిలో ఏడు నక్షత్రాలు కలిసి ఒక సరళరేఖపై ఉంటాయి.
1) ఎ, బి 2) సి, డి 3) డి 4) బి

6. నక్షత్రాలు అనేవి నిహారికల (నెబ్యూలు) నుంచి ఏర్పడతాయి. ఒక నక్షత్రం దృశ్యా పరిమాణం దేనికి సంబంధించింది?
1) నక్షత్ర దూరం
2) నక్షత్రానికి చెందిన ప్రకాశం
3) నక్షత్ర జీవితకాలం 4) నక్షత్ర వర్ణం

7. ధ్రువ నక్షత్రంలోని ఏడు నక్షత్రాల్లో ఉండే రుషుల పేర్లలో లేనివి?
1) అత్రి, పులస్య
2) వశిష్ఠ, అంగీరస, మరీచి
3) క్రతు, పులహ 4) జ్వాల, బృత, కపిల

8. కింది వాటిలో బ్లాక్‌హోల్‌కు సంబంధించి సరికానిది?



ఎ) ఒక నక్షత్రం గురుత్వాకర్షణ బలం బాగా పెరిగి తన వైపునకు వస్తున్న ప్రతి వస్తువును ఆకర్షిస్తుంది. వెలువడిన కాంతిని దాని నుంచి బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకుంటుంది.
బి) ఈ పేరు పెట్టిన శాస్త్రవేత్త - జాన్ వీలర్ (అమెరికా)
సి) విశ్వంలో పుట్టిన నక్షత్రం బ్లాక్‌హోల్ దశకు చేరాలంటే దాని ద్రవ్యరాశికి 10,000 కేజీలుగా ఉండాలి.
డి) నక్షత్రాల ద్రవ్యరాశికి అతిపెద్ద ప్రమాణం - చంద్రశేఖర్ లిమిట్.
1) ఎ, బి, సి, డి 2) బి, సి
3) సి, డి 4) సి

9. కింది వాటిలో నక్షత్ర రాశికి సంబంధించి సరికానిది?
ఎ) నక్షత్రరాశిలో 5 నుంచి 10 నక్షత్రాలు మాత్రమే ఉంటాయి.
బి) ఓరియన్ అనేది ప్రసిద్ధ నక్షత్రరాశి. దీనిని శీతాకాల సాయంకాలం సమయంలో చూడొచ్చు.
సి) ఓరియన్‌ను 'హంటర్' అని పిలుస్తారు. దీని మధ్యలో మూడు నక్షత్రాలు వేటగాడి బెల్టును పోలి ఉంటాయి.
1) ఎ, బి 2) ఎ 3) బి, సి 4) బి

10. ఓరియన్ నక్షత్రం తలభాగం వద్ద ఉన్నట్లు కనిపిస్తూ, ఆకాశంలో అత్యంత ప్రకాశమంతంగా ఉండే నక్షత్రం ఏది?



1) ప్రాక్సిమా సెంటారి
2) సిరియస్
3) కాసియోపియా
4) సూర్యుడు


11. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ) శీతాకాలంలో రాత్రి మొదటి భాగంలో కనిపించే నక్షత్ర రాశి - కాసియోపియా
బి) 2006 వరకు సూర్యుడికి దూరంగా ఉన్నట్లు పరిగణించిన గ్రహం - ప్లూటో
సి) అంతర్జాతీయ ఖగోళశాస్త్ర సంఘం (ఐఏయూ) గ్రహ నిర్వచనాన్ని ఆమోదించింది. దీని ప్రకారం ప్లూటో గ్రహం కాదు.
1) ఎ, బి, సి 2) ఎ 3) బి, సి 4) సి

12. కింది వాటిని జతపరచండి.
1) అతిపెద్ద ఉపగ్రహం ఎ) టైటాన్
2) భూమిని పోలిన ఉపగ్రహం బి) శుక్రుడు
3) అతిపెద్ద గ్రహం సి) గనిమెడ
4) ప్రకాశమంతమైన గ్రహం డి) బృహస్పతి
1) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
2) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
3) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
4) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ

13. MOM అంటే ఏమిటి? దీనిని ప్రయోగించిన తేదీ?
1) మార్స్ ఆర్బిటాల్ మిషన్. 2014, నవంబరు 5
2) మార్స్ ఆర్బిటర్ మిషన్. 2013, నవంబరు 5
3) మార్స్ ఆర్కిటెక్ మిషన్. 2015, నవంబరు 5
4) మార్స్ ఆస్ట్రాలజీ మిషన్. 2014, నవంబరు 5

14. కింది వాటిలో గ్రహాలకు సంబంధించి సరికానిది?
ఎ) బుధ, శుక్ర గ్రహాలకు సహజ ఉపగ్రహాలు లేవు.
బి) అన్నిటికంటే ఎక్కువ ఉపగ్రహాలున్న గ్రహం - బృహస్పతి
సి) శని, శుక్ర గ్రహాల చుట్టూ అందమైన వలయాలు ఉంటాయి.
డి) అరుణ గ్రహం అని కుజ గ్రహానికి పేరు.
1) ఎ, బి, సి, డి 2) బి, సి
3) ఎ, సి, డి 4) సి

15. కింది వాటిని సరిచూడండి.
ఎ) ఖగోళ శాస్త్రం కోసం ఆర్యభట్ట తన గ్రంథం ఆర్యభట్టీయంలో ప్రచురించారు.



బి) గ్రహగమన నియమాలను ప్రతిపాదించిన శాస్త్రవేత్త - కెప్లర్
1) ఎ, బి సరైనవి.
2) ఎ సరైంది, బి సరికాదు.
3) ఎ సరికాదు, బి సరైంది.
4) ఎ, బి సరికావు.

16. కింది వాటిలో బుధ గ్రహానికి సంబంధించి సరికానిది?
ఎ) ఇది సౌరవ్యవస్థలో చిన్నది. సూర్యుడికి సమీప గ్రహం.
బి) దీనికి రెండు ఉపగ్రహాలున్నాయి.
సి) సూర్యోదయానికి ముందు, తర్వాత క్షితిజం వద్ద దీన్ని గమనించవచ్చు.
డి) దీన్ని ఉదయ తార, సాయంత్ర తార అంటారు.
1) ఎ, బి, సి, డి 2) సి, డి
3) బి, డి 4) బి, సి, డి

17. కింది వాటిలో శుక్ర గ్రహానికి సంబంధించి సరికానిది?
ఎ) ఇది భూమికి అత్యంత సమీప గ్రహం.
బి) పశ్చిమ నుంచి తూర్పునకు తిరుగుతుంది.
సి) ఇది చంద్రుడిలాగా కళలను చూపుతుంది.
డి) దీన్ని తేజస్సు వల్ల (సూర్యుడి లాగే) గుర్తించవచ్చు.
1) ఎ, బి, సి, డి 2) బి, సి 3) బి 4) సి

18. కింది వాటిలో సరికానిది?
ఎ) భూ కక్ష్య బయట ఉన్న ఉపగ్రహం - అంగారకుడు
బి) ఇది ఎరుపు వర్ణంలో కనిపిస్తుంది. అందుకే అరుణ గ్రహం అంటారు.
సి) దీనికి రెండు సహజ ఉపగ్రహాలున్నాయి.
డి) దీని పరిశోధనకు మంగళయాన్ (మామ్)ను విజయవంతంగా ప్రవేశపెట్టారు.
1) ఎ, సి 2) ఎ 3) బి 4) సి

19. కింది వాటిలో బృహస్పతి గ్రహానికి సంబంధించింది?



ఎ) సౌరవ్యవస్థలో అతిపెద్దది. దీని లోపల 1300 భూమి గ్రహాలు పట్టేంత పెద్దది.
బి) చుట్టూ అందమైన వలయాలు ఉంటూ ప్రకాశమంతంగా ఉంటుంది.
సి) దీని ద్రవ్యరాశి భూమి కంటే రెండు రెట్లు ఎక్కువ.
డి) దీన్ని టెలిస్కోప్‌తో చూస్తే నాలుగు పెద్ద చంద్రులను చూడొచ్చు.
1) ఎ 2) బి 3) సి 4) డి

20. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ) దీనికి వలయాలు చుట్టూ ఉంటాయి. కానీ కంటికి కనిపించవు - శని
బి) గ్రహాలన్నింటి కంటే తక్కువ సాంద్రత ఉన్న గ్రహం - శని
సి) సౌర వ్యవస్థలో పెద్ద నీటి కొలనులో శనిగ్రహం ఉంచితే తేలుతుంది.
డి) దీన్ని సౌర వ్యవస్థలో అంతర గ్రహం అంటారు.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
3) ఎ, బి 4) ఎ, బి, డి

సమాధానాలు

1-1; 2-1; 3-3; 4-3; 5-3; 6-2; 7-4; 8-4; 9-2; 10-2; 11-1; 12-2; 13-2; 14-4; 15-1; 16-3; 17-3; 18-2; 19-3; 20-2.

(c) eenadu

ట్రంప్ ఒత్తిడి ఫలిస్తుందా..!

- రష్యాకు తన భూభాగాలను ఉక్రెయిన్ అప్పగిస్తుందా..!
- జెలెన్‌స్కీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న 28 పాయింట్ల శాంతి ప్రణాళిక



ఇరవై సూత్రాల శాంతి ప్రణాళికతో గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇప్పుడు ఉక్రెయిన్ విషయంలో అదే తరహాలో పావులు కదుపుతున్నారు. గతంలో ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ పలు దఫాలుగా చర్చలు జరిపారు. అవి ఫలితాలను ఇవ్వలేదు. ఇక ఈ యుద్ధం ముగియడం ఇప్పట్లో సాధ్యం కాదనుకుంటున్న తరుణంలో 28 పాయింట్ల శాంతి ప్రతిపాదనను ట్రంప్ తెరపైకి తీసుకొచ్చారు. గత నెల రోజులుగా దీనిపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. అయితే ఈ శాంతి ప్రణాళికను ఉక్రెయిన్ అంగీకరిస్తుందా లేదా అన్నదే కీలక ప్రశ్న. ఎందుకంటే ఒప్పందంలో భాగంగా దొనెట్స్క్ సహా పలు కీలక ప్రాంతాలను మాస్కోకు కీవ్ బదిలీ చేయాలి. ఇది జెలెన్‌స్కీకిససేమిరా ఇష్టం లేదు. ట్రంప్ మాత్రం ఆ భూభాగాలను అప్పగించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. గురువారంలోగా తన శాంతి ప్రతిపాదనపై నిర్ణయం తెలపాలని ఉక్రెయిన్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారు. మరి ఈ ఒత్తిడికి జెలెన్‌స్కీ తలొగ్గుతారా..? మరోవైపు ఐరోపా నేతలు.. ట్రంప్ రూపొందించిన ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒప్పందం పూర్తిగా రష్యాకు అనుకూలంగా ఉందంటున్నారు. ఇంతకీ ఆ శాంతి ఒప్పందంలో ఏముందంటే..

ఒప్పంద అంశాలు...

1. ఉక్రెయిన్‌కు సార్వభౌమత్వం అంగీకరించడం
2. ఇకపై దురాక్రమణలు జరగకుండా రష్యా, ఉక్రెయిన్, ఐరోపా మధ్య ఒప్పందం. గత 30 ఏళ్లుగా ఉన్న సమస్యలు ఇక సమసిపోయాయని అంగీకరించడం.
3. పొరుగుదేశాలను రష్యా ఆక్రమించకూడదు. నాటోలో కొత్త దేశాలేవీ చేరకూడదు.
4. భద్రతాపరమైన అన్ని సమస్యలను పరిష్కరించుకోవడానికి అమెరికా మధ్యవర్తిత్వాన రష్యా, నాటో మధ్య చర్చలు జరపడం.
5. ఉక్రెయిన్‌కు భద్రతా గ్యారంటీలు.
6. ఉక్రెయిన్ సాయుధ దళాలను 6 లక్షలకే పరిమితం చేయడం.
7. నాటోలో చేరబోమని ఉక్రెయిన్ తన రాజ్యాంగంలో పొందుపరచాలి. భవిష్యత్తులోనూ కీవ్‌ను అనుమతించబోమనే నిబంధనను తమ చట్టాల్లో చేర్చేందుకు నాటో అంగీకరించాలి.
8. ఉక్రెయిన్‌లో తమ బలగాలను మోహరించబోమని నాటో అంగీకరించాలి.
9. ఐరోపా ఫైటర్ జెట్‌లను పోలండ్‌లో మోహరించాలి.
10. అమెరికా గ్యారంటీలు:

✦ హామీలు ఇచ్చినందుకు అమెరికా పరిహారాన్ని అందుకుంటుంది; ✦ రష్యాపై దాడి చేస్తే హామీలను ఉక్రెయిన్ కోల్పోతుంది; ✦ రష్యానే ఉక్రెయిన్‌పై దాడికి దిగితే... సైనిక ప్రతిస్పందనతోపాటు, ప్రపంచ దేశాల ఆంక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొత్త భూభాగం గుర్తింపు సహా ఈ ఒప్పందం వల్ల రష్యాకు వచ్చే ప్రయోజనాలన్నీ రద్దవుతాయి. ✦ ఎటువంటి కారణం లేకపోయినా మాస్కోపై ఉక్రెయిన్ మిస్సైళ్లను సంధిస్తే...దానికి ఇచ్చిన భద్రతా హామీలు చెల్లుబాటు కావు.

11. ఐరోపా యూనియన్ (ఈయూ)లో చేరేందుకు ఉక్రెయిన్‌కు అర్హత లభిస్తుంది. సమస్యను పరిష్కరిస్తున్నంత సమయంలో ఐరోపా మార్కెట్‌లోకి ఉక్రెయిన్ అడుగుపెట్టవచ్చు.
12. ఉక్రెయిన్‌ను పునరుద్ధరించడం కోసం ప్రత్యేక ప్యాకేజీ

✦ డేటా సెంటర్లు, కృత్రిమ మేధ (ఏఐ), సాంకేతికతతో సహా వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టడానికి ఉక్రెయిన్ అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయడం. ✦ ఉక్రెయిన్ గ్యాస్ మౌలిక సదుపాయాలను, పైప్‌లైన్ల నిల్వలను పునర్నిర్మించడానికి, నిర్వహించడానికి అమెరికా పూర్తి సహకారం. ✦ యుద్ధంలో దెబ్బతిన్న ప్రాంతాలను, పట్టణాలను పునరుద్ధరించడానికి ఉమ్మడి సహకారం. ✦ ఖనిజాలు, సహజ వనరుల వెలికితీత. ✦ ప్రపంచ బ్యాంకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ.

13. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో రష్యా తిరిగి విలీనం –

✦ దశలవారీగా కేసులను చర్చించి ఆంక్షలను ఎత్తివేయడం. ✦ చమురు, సహజ వనరులు, మౌలిక సదుపాయాలు, ఏఐ, డేటా సెంటర్లు, ఆర్కిటిక్‌లో అరుదైన భూ ఖనిజాల వెలికితీత ఇతర పరస్పరం ప్రయోజనం కలిగే అంశాలపై రష్యాతో అమెరికా దీర్ఘకాలిక ఆర్థిక సహకార ఒప్పందం కుదుర్చుకుంటుంది. ✦ రష్యా తిరిగి జీ-8లో చేరుతుంది.

14. 100 బిలియన్ డాలర్ల విలువైన రష్యా జప్తు ఆస్తులను ఉక్రెయిన్‌ను పునర్నిర్మించడానికి వెచ్చించాలి. ఇందుకు మరో 100 బిలియన్ డాలర్లను ఐరోపా అందించాలి. అప్పుడు జప్తు చేసిన ఐరోపా ఆస్తులను విడుదల చేస్తారు. మిగిలిన రష్యా ఆస్తులను వాషింగ్టన్-మాస్కో ప్రారంభించే ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెడతారు. ✦ ఇందులోంచి అమెరికా 50శాతం లాభాలను పొందుతుంది.
15. ఈ ఒప్పందంలోని అన్ని నిబంధనలను పర్యవేక్షించడానికి, భద్రతా సమస్యలను నిర్ధారించడానికి అమెరికా-రష్యా నేతృత్వంలో వర్కింగ్ గ్రూప్ కమిటీ ఏర్పాటు.
16. ఉక్రెయిన్, ఐరోపాపై ఆక్రమణకు దిగనని రష్యా తమ చట్టంలో పొందుపరచాలి.
17. వ్యూహాత్మక అణ్వాయుధాల తగ్గింపు ఒప్పందం 'స్టార్ట్-1' సహా, అణ్వాయుధాల వ్యాప్తి నియంత్రణ ఒప్పందాల చెల్లుబాటును పొడిగించడానికి అమెరికా, రష్యా అంగీకరించడం.
18. అణ్వాయుధాలకు ఉక్రెయిన్ దూరంగా ఉండాలి.
19. ఐరోపాలోనే అతిపెద్ద అణువిద్యుత్ కేంద్రం 'జపోరిజియా'ను అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) ఆధ్వర్యంలో తిరిగి ప్రారంభమవుతుంది. ఇందులో ఉత్పత్తి చేసే విద్యుత్తును ఉక్రెయిన్, రష్యా సమానంగా పంచుకోవాలి.
20. విభిన్న సంస్కృతులపై అవగాహనను, సహనాన్ని పెంపొందించేందుకు జాత్యాహంకారం, పక్షపాతాన్ని తొలగించేందుకు ఇరు దేశాలు పాఠశాలలు, విద్యాసంస్థల్లో కార్యక్రమాలను అమలు చేయాలి.

✦ నాజీ భావజాలాన్ని నిషేధించాలి.

21. భూభాగాలు:

✦ క్రిమియా, లుహాన్స్క్, డొనెట్స్క్‌లను రష్యా భూభాగాలుగా గుర్తించడం. అమెరికా సైతం వీటిని రష్యా భూభాగాలుగా గుర్తిస్తుంది. ✦ ఖేర్సన్, జపోరిజియాను జప్తు చేసే విధంగా కొనసాగిస్తారు. ఇవి విభజన రేఖగానే ఉంటాయి. ✦ ఈ రెండు ప్రాంతాల వెలుపల తాను నియంత్రిస్తున్న ఇతర ప్రదేశాలను రష్యా వదులుకుంటుంది. ✦ ఉక్రెయిన్ దళాలు దొనెట్స్క్ ప్రాంతం నుంచి వెనక్కు రావాలి. దీనిని తటస్థ బఫర్ జోన్‌గా గుర్తిస్తారు. ఇందులోకి రష్యా సైన్యం ప్రవేశించకూడదు.

22. భవిష్యత్తు భూభాగాలపై అంగీకరించిన తర్వాత రష్యా గానీ, ఉక్రెయిన్ గానీ...ఒప్పందం నుంచి తప్పుకోకూడదు.
23. వాణిజ్య కార్యకలాపాల కోసం నిప్రో నదిని ఉపయోగించడానికి ఉక్రెయిన్‌ను రష్యా నిరోధించకూడదు. నల్ల సముద్రం మీదుగా ఉచితంగా ధాన్యాన్ని తరలించేందుకు ఐరోపాతో ఒప్పందం కుదుర్చుకోవాలి.
24. బందీలను, పిల్లలను, మృతదేహాలను అందజేయడం కోసం, కుటుంబాలు తిరిగి కలపడం కోసం ఓ మానవతా కమిటీ ఏర్పాటు.
25. 100 రోజుల్లో ఉక్రెయిన్ ఎన్నికలు నిర్వహించాలి.
26. యుద్ధంలో పాల్గొన్న అన్ని పక్షాలకు క్షమాపణ లభిస్తుంది. భవిష్యత్తులో వీరు ఎటువంటి ఫిర్యాదులు గానీ, ఆరోపణలు గానీ చేయకూడదు.
27. ఈ ఒప్పందం చట్టానికి కట్టుబడి ఉంటుంది. దీని అమలును అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని శాంతి కమిటీ పర్యవేక్షిస్తుంది. ఉల్లంఘనలు జరిగితే ఆంక్షలు తప్పవు.
28. ఈ మెమోరాండంపై రెండు దేశాలు అంగీకరించిన వెంటనే.. ఒప్పందం అమల్లోకి వస్తుంది.

✦ అమెరికా శాంతి ప్రణాళిక సమస్య తుదిపరిష్కారానికి ప్రాతిపదిక అవుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అభిప్రాయపడ్డారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు

- భారత సంస్థలపైనా ప్రభావం

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్ నుంచి చమురును వివిధ దేశాలకు సరఫరా చేయకుండా అడ్డుకునేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆ దేశంలోని పలు కంపెనీలు, వ్యక్తులపై తాజాగా ఆంక్షలు విధించింది. ఇందులో భారత్‌కు చెందిన కంపెనీలతోపాటు కొందరు వ్యక్తుల పేర్లు ఉన్నాయి. 'ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధికి, ఉగ్రవాద గ్రూపులకు నిధులు అందకుండా చేసేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 17 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించింది. ఆ దేశంపై ఆర్థిక ఒత్తిడి తెచ్చేందుకు ఇది ఉపయోగపడుతుంది' అని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. అమెరికా ఆంక్షలు విధించిన కంపెనీల జాబితాలో భారత్ కేంద్రంగా పని చేస్తున్న టీఆర్6 పెట్రో కంపెనీ ఉంది. ఈ సంస్థ 2024-25 మధ్య పలు కంపెనీల నుంచి 8 మిలియన్ డాలర్ల చమురును దిగుమతి చేసుకుంది. దీంతోపాటు ఆర్ఎన్ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థ, మరికొందరు భారతీయుల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.




భూకంప తీవ్రతకు ఢాకాలో దెబ్బతిన్న ఇళ్లు ✦ కోల్‌కతాలో భూ ప్రకంపనల నేపథ్యంలో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలు

బంగ్లాదేశ్‌లో భూకంపం.. 10 మంది మృతి

- పశ్చిమ బెంగాల్‌లోనూ ప్రకంపనలు

ఢాకా, కోల్‌కతా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకా సమీపంలో శుక్రవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. దీంతో 10 మంది మృతి చెందగా, 100 మందికి పైగా గాయపడ్డారు. వివిధ ప్రాంతాల్లో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల మంటలు అంటుకొని ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.7గా నమోదైంది. ఈ భూకంపం నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లోని పలు ఈశాన్య ప్రాంతాల్లో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. బంగ్లాదేశ్‌లోని నర్సింగ్డీ ప్రాంతానికి నైరుతి దిక్కున 13 కి.మీల దూరంలో, 10 కి.మీల లోతులో భూకంప కేంద్రం ఉందని పేర్కొంది. ఈ భూకంపం కారణంగా సంభవించిన ప్రకంపనలతో కోల్‌కతా సహా అస్సాంలోని గువాహటి ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

ప్రతి చొరబాటుదారునూ గెంటివేస్తాం

- అమిత్‌షా హెచ్చరిక

భుజ్: దేశంలో ఉన్న ప్రతి చొరబాటుదారునూ గెంటివేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తున్నాయని, ఓటరు జాబితాలో చొరబాటుదారుల పేర్లు కొనసాగాలని వారు కోరుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. గుజరాత్‌లోని భుజ్‌లో శుక్రవారం జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) వజ్రోత్సవ వేడుకల్లో అమిత్ షా ప్రసంగించారు. ఎస్ఐఆర్ కసరత్తును తక్షణం నిలిపివేయాలని కోరుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్‌కు లేఖ రాసిన నేపథ్యంలో అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎస్ఐఆర్ అరాచకంగా, బలవంతంగా, ప్రమాదకరంగా సాగుతోందని మమత ఆరోపించిన సంగతి తెలిసిందే. "ఈరోజు బీఎస్ఎఫ్ అన్ని దిశలా దేశ సరిహద్దుల్లో చొరబాట్లను నివారించడానికి పనిచేస్తోంది. చొరబాట్ల నిరోధం దేశ భద్రత కోసమే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థ కలుషితం కాకుండా రక్షించడానికీ ఎంతో అవసరం" అని అమిత్‌షా పేర్కొన్నారు.

బిహార్ హోంమంత్రిగా భాజపా నేత

- 20ఏళ్లు ఆ శాఖను నిర్వహించిన సీఎం నీతీశ్
- జేడీయూ నాయకుడు బిజేంద్ర ప్రసాద్‌కు ఆర్థికం

పట్నా: దాదాపు రెండు దశాబ్దాలుగా తన వద్దే కొనసాగించిన కీలకమైన హోంశాఖను బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఈ సారి భాజపా సీనియర్ నేత డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరికి కేటాయించారు. మరో డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు రెవెన్యూ, గనుల శాఖ అప్పగించారు. శుక్రవారం బిహార్‌లో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు జరిగింది. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్.. సాధారణ పరిపాలన, కేబినెట్ సెక్రెటేరియట్, విజిలెన్స్ శాఖలను నిర్వహించనున్నారు. కీలకమైన ఆర్థిక శాఖను జేడీయూ సీనియర్ నేత బిజేంద్ర ప్రసాద్ యాదవ్‌కు కేటాయించారు. ఇప్పటివరకూ భాజపాతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ప్రతిసారీ ఆ పార్టీకి చెందిన మంత్రికే ఆర్థిక శాఖను కేటాయిస్తూ వచ్చారు. జేడీయూ సీనియర్ శ్రవణ్ కుమార్‌కు పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, రవాణా శాఖలను ఇచ్చారు. ఆ పార్టీకే చెందిన అశోక్ చౌదరికి రూరల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కేటాయించారు.

అప్పటివరకూ అక్కడ తవ్వకాలను ఆపేయాలి

- ఆరావళి రక్షణపై సుప్రీంకోర్టు

దిల్లీ: ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన ఆరావళి కొండలు, పర్వత శ్రేణి రక్షణకు సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అధ్యక్షతలోని సుప్రీం ధర్మాసనం ఆరావళి కొండలు, పర్వతశ్రేణికి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల నిరోధ మంత్రిత్వ శాఖ ఇచ్చిన నిర్వచనాన్ని ఆమోదించింది. దాని ప్రకారం ఆరావళి జిల్లాలు విస్తరించిన ప్రాంతంలో 100 మీటర్లు, అంతకు ఎక్కువ ఎత్తైన కొండలను ఆరావళి కొండలుగా పరిగణిస్తారు. అటువంటి కొండలు రెండు మూడు ఒకదానికొకటి 500 మీటర్ల దూరంలో ఉంటే ఆరావళి పర్వత శ్రేణిగా గుర్తిస్తారు. పర్యావరణానికి భంగం కలగని రీతిలో ఆరావళిలో గనులు, క్వారీల తవ్వకానికి సంబంధిత మంత్రిత్వ శాఖ శాస్త్రీయ ప్రణాళికను సిద్ధం చేసే వరకు అన్ని తవ్వకాలనూ ఆపేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే నిబంధనల ప్రకారం జరుగుతున్న గనుల తవ్వకం మాత్రం కొనసాగవచ్చని తెలిపింది.

దిల్లీ పేలుడు..

పిండి మరతో బాంబు తయారీ

దిల్లీ: ఎర్రకోట పేలుడు కేసు విచారణ ముందుకు సాగుతున్న కొద్దీ విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు పేలుడు పదార్థాలు, బాంబులను తయారు చేసేందుకు అనుసరించిన విధానాలను చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. తాజాగా పేలుడు పదార్థాలను తయారు చేయడానికి పిండి మరను ఉపయోగించినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితుల్లో ఒకడైన ముజమ్మిల్ షకీల్ పిండి మర సాయంతో యూరియాను గ్రైండ్ చేసినట్లు తెలిసింది. కొన్ని విద్యుత్తు యంత్రాలను వాడినట్లు వెల్లడైంది. వీటన్నింటినీ దర్యాప్తు అధికారులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉన్న ట్యాక్సీ డ్రైవర్ ఇంటి నుంచి సేకరించారు. అద్దెకు తీసుకున్న ఆ ఇంట్లోనే అతడు దాన్ని ఉపయోగించినట్లు తెలిసింది. గతంలో అక్కడే 360 కిలోల అమ్మోనియం నైట్రేట్ లభ్యమైన విషయం తెలిసిందే. యూరియాను పిండి మరలో మెత్తగా రుబ్బి.. దాన్ని విద్యుత్తు యంత్రాలతో రిఫైన్ చేసేవాడని విచారణలో వెల్లడైంది. వాటి నుంచి బాంబులకు కావాల్సిన కెమికల్స్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు అధికారులు ట్యాక్సీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తన కుమారుడిని అల్-ఫలా వైద్య కళాశాలకు చికిత్స కోసం తీసుకెళ్లినప్పుడు మొదటిసారి ముజమ్మిల్‌ను కలిసినట్లు విచారణలో వెల్లడించాడు.

ఉగ్ర డాక్టర్‌కు పాక్ నుంచి

బాంబు తయారీ వీడియోలు

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీ పేలుడు కేసులో మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. దిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడు, ఆ సమయంలో కారు నడిపిన డాక్టర్ ఉమర్ నబీకి బాంబుల తయారీలో శిక్షణనివ్వడానికి ఉగ్ర సంస్థలు పాకిస్థాన్ నుంచి బాంబు తయారీ వీడియోలు పంపినట్లు దర్యాప్తు బృందం గుర్తించింది. హంజుల్లా అనే జైషే మహమ్మద్ హ్యాండ్లర్ ఈ వీడియోలను అతడికి పంపినట్లు తెలుస్తోంది. మొత్తం 42 వీడియోలు వచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. ఉగ్ర కుట్రల గురించి నిందితులు టెలిగ్రామ్ యాప్‌లో చర్చించుకునేవారని.. ఇతరులకు అనుమానం రాకుండా ఆయుధాలు, బాంబుల గురించి వంటకాల పేర్లను సీక్రెట్ కోడ్‌లుగా వాడేవారని అధికారులు తెలిపారు. పేలుడు పదార్థాలకు బిర్యానీ అని, ఉగ్ర ఘటనలు అమలు చేయడానికి దావత్ అని కోడ్ నేమ్‌లను ఉపయోగించినట్లు గుర్తించారు.

కశ్మీర్ ఆసుపత్రుల్లో

ఆయుధ నిల్వలు!

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీ పేలుడు వెనుక ఉన్న జైషే ఉగ్ర మాడ్యూల్ పన్నాగాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గాజాలో హమాస్ తరహాలో జమ్మూ కశ్మీర్ ఆసుపత్రుల కింద ఆయుధ నిల్వలను ఏర్పాటు చేసేందుకు ఈ ముఠా ప్లాన్ చేసినట్లు దర్యాప్తు వర్గాలు అనుమానిస్తున్నాయి. దిల్లీ పేలుడు కేసులో అరెస్టయిన నిందితులను విచారించగా ఈ కుట్ర కోణం బయటపడినట్లు తెలుస్తోంది. ఎర్రకోట పేలుడుకు ముందే ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో సంబంధం ఉన్న జమ్మూ కశ్మీర్ డాక్టర్ ఆదిల్ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతడిని విచారించగా.. ఆసుపత్రుల కుట్ర విషయం తెలిసినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. భద్రతా సిబ్బందికి ఎలాంటి అనుమానం రాకుండా మెడికల్ స్టాఫ్ ముసుగులో వీరు ఉగ్ర కార్యకలాపాలు సాగించినట్లు తెలిపాయి. విదేశాల నుంచి తెప్పించుకున్న ఆయుధాలను దాచేందుకు అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లా, బుద్గాం, నౌగమ్‌లోని ఆసుపత్రులను ఈ ఉగ్ర మాడ్యూల్ పరిశీలించినట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి.



దేదీప్యమానంగా దిల్లీ


- ఫొటో పంచుకున్న ఐఎస్ఎస్

ఇంటర్నెట్‌డెస్క్: రాత్రి వేళల్లో ప్రకాశవంతంగా వెలుగులీనే ప్రపంచంలోని పలు నగరాలకు సంబంధించిన చిత్రాలను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) సోషల్ మీడియాలో షేర్ చేసింది. వాటిలో టోక్యో, సింగపూర్ వంటి ప్రముఖ నగరాలతో సమానంగా భారత రాజధాని దిల్లీ కాంతులీనుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గురువారం రాత్రి 10.54 గంటల సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ దృశ్యాలను చిత్రీకరించినట్లు ఐఎస్ఎస్ వెల్లడించింది. ఐఎస్ఎస్ షేర్ చేసిన చిత్రాల్లో దిల్లీ విద్యుత్ కాంతులతో వెలుగులీనుతుండగా.. చిత్రంలోని కుడివైపున ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దీర్ఘచతురస్రాకారంలో కనిపిస్తోంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి కనిపించే అత్యంత ప్రకాశవంతమైన పట్టణాలలో దిల్లీ, సింగపూర్, టోక్యో, సావోపాలో వంటి నగరాలు ఉన్నట్లు పేర్కొంది.

సైబర్ కేసుల్లో బ్యాంకు ఖాతా స్తంభింపజేయడానికి వీల్లేదు: బాంబే హైకోర్టు

ముంబయి: సైబర్ కేసుల్లో మోసపూరిత లావాదేవీలకై ఉపయోగించిన బ్యాంకు ఖాతాలను భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్) కింద పూర్తిగా స్తంభింపజేయడానికి వీల్లేదని బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ శుక్రవారం పేర్కొంది. అయితే బ్యాంకు ఖాతా నుంచి నేరం ద్వారా సంక్రమించిన మొత్తాన్ని మాత్రమే తీసుకోకుండా నిరోధించి మిగతా లావాదేవీలను అనుమతించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. సైబర్ మోసాల ద్వారా సంపాదించిన సొమ్ముతో లావాదేవీలు నడిపారన్న ఆరోపణ ఎదుర్కొంటున్న ఏడుగురు దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందిస్తూ కోర్టు ఈ ఆదేశం వెలువరించింది.

అరేబియా సముద్రంలో కొత్త ఆక్టోపస్ జాతి



కొచ్చిన్: కేరళలోని కొల్లం తీరం.. అరేబియా సముద్రంలో 390 మీటర్ల లోతులో సరికొత్త ఆక్టోపస్ జాతిని కేంద్ర సాగర మత్స్య పరిశోధనా సంస్థ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు గుర్తించారు. అది రెండు మీటర్లకన్నా ఎక్కువ పొడవు, 61 కిలోల బరువుకు పెరుగుతుంది. దానికి సీఎంఎఫ్ఆర్ఐ మాజీ డైరెక్టర్, కేరళ విశ్వవిద్యాలయ మాజీ ఉప కులపతి డాక్టర్ ఈజీ సీలాస్ పేరిట టానింజియా సీలాసీ అని నామకరణం చేశారు. టానింజియా అనే వర్గం కింద కనుగొన్న రెండవ ఆక్టోపస్ జాతి ఇదే. దీనికి ముందు టానింజియా వర్గంలో ఒకే ఒక జాతి ఆక్టోపస్ ఉందనీ, అదీ అట్లాంటిక్ మహాసముద్రంలో సంచరించే టానింజియా దానే అని నిపుణులు భావించేవారు. సాధారణ ఆక్టోపస్‌లకు ఎనిమిది చేతులతో పాటు రెండు పొడవైన తొండాలు ఉంటాయి. టానింజియా సీలాసీకి ఎనిమిది చేతులే ఉన్నాయి కానీ తొండాలు లేవు.



కాక్టస్‌తో పానీయాలు, వీగన్ లెదర్



బ్రహ్మజెముడు (కాక్టస్) అంటే చాలామందికి నిరర్థక మొక్కగానే అనిపిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో పశువులు కూడా దీన్ని తినవు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ అయిన 'సెంట్రల్ అరిడ్ జోన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (సీఏజడ్ఆర్ఐ) ఇటీవలి కాలంలో కాక్టస్ సాగును బాగా ప్రోత్సహిస్తోంది. ఈ మొక్కల ప్రయోజనాలను రైతులకు వివరించి చెబుతున్న అధికారులు ఉప ఉత్పత్తులతో ఆదాయ వనరుగా ఉపయోగపడే ముళ్లు లేని కాక్టస్‌ను పంపిణీ చేస్తున్నారు. "ఈ కాక్టస్ సాగుకు కొద్దిగా నీరున్నా చాలు. పశువులకు ఏడాది పొడవునా పచ్చిమేత దొరుకుతుంది. వీటి ఫలాలతో గుజరాత్‌లో పానీయాలు తయారు చేస్తున్నారు. మానవ శరీరానికి ఇది చాలా ఉపయోగకరం. ఈ మొక్కలతో వీగన్ లెదర్ వస్తువులనూ ఉత్పత్తి చేయవచ్చు" అని జోధ్‌పుర్ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌నారాయణ్ కుమావత్ తెలిపారు. ముళ్లు లేని కాక్టస్ మొక్క నాటడానికి రూ.10 ఖర్చవుతుంది. హెక్టారుకు దాదాపు 10,000 మొక్కలు నాటవచ్చు. ఈ కాక్టస్ సాగు చేసే రైతులతో పారిశ్రామికవేత్తలు నేరుగా సంప్రదింపులు జరుపుతున్నారు.

తేజస్‌పై నెగెటివ్ శక్తి!



దుబాయ్ ఎయిర్ షోలో భారత స్వదేశీ యుద్ధవిమానం తేజస్ కూలిపోవడం, అందులో ఒక పైలట్ మృత్యువాతపడటం మన దేశ రక్షణ విభాగాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాద ఘటన సమయంలో ఈ పోరాట విమానం.. 'నెగెటివ్ జి'ని కలిగించే 'లూప్ విన్యాసాన్ని' నిర్వహిస్తున్నట్లు వీడియో దృశ్యాలను చూసిన విమానయాన నిపుణులు పేర్కొన్నారు. ఆ తర్వాత అది సాధారణ స్థితికి వచ్చే క్రమంలో అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి.. వేగంగా నేలను ఢీ కొట్టి పేలిపోయినట్లు గుర్తించారు. ప్రమాదానికి నిర్దిష్ట కారణం ఇంకా తెలకపోయినా.. ఈ 'నెగెటివ్ జి' తీవ్ర చర్చనీయాంశమైంది.

ఏమిటీ జి బలం?

నింగిలో పయనించేటప్పుడు అస్థిరంగా ఉండేలా ఆధునిక యుద్ధవిమానాలను ఉద్దేశపూర్వకంగా తీర్చిదిద్దుతారు. అందువల్ల అవి గాల్లో మెరుపు విన్యాసాలు చేయగలుగుతాయి. ఈ క్రమంలో విమానాన్ని స్థిరంగా ఉంచే బాధ్యతను 'ఫ్లై-బై-వైర్' అనే ఎలక్ట్రానిక్ నియంత్రణ వ్యవస్థ తీసుకుంటుంది. తేజస్ యుద్ధవిమానంలోనూ ఇలాంటి ఏర్పాటు ఉంది. గాల్లో కొన్ని విన్యాసాలు చేసేటప్పుడు పైలట్లపై జి బలాల ప్రభావం పడుతుంది. అంటే.. గురుత్వాకర్షణ శక్తి ప్రభావమన్నమాట! ఇది పాజిటివ్ జి, నెగెటివ్ జి అనే రెండు రకాలుగా ఉంటుంది.

పాజిటివ్ జి

యుద్ధవిమాన విన్యాసాల్లో చాలా సాధారణం. దీనివల్ల పైలట్‌పై గురుత్వాకర్షణ బలాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అతడి శరీరంలోని రక్తం.. దిగువ భాగాల్లో (కాళ్ల)కి దూసుకెళుతుంది. ఫలితంగా మెదడుకు సరఫరా తగ్గిపోతుంది. 2-3 జి బలాల వద్ద ఒక యుద్ధ విమాన పైలట్ కంటి చూపు కొద్దిసేపు మసకబారుతుంది. 4-5 జి బలాల వద్ద తాత్కాలిక అంధత్వం ఎదురవుతుంది. 6జి మించితే పైలట్ కొద్దిసేపు స్పృహ కోల్పోవచ్చు. పాక్షిక మతిమరుపునకూ ఇది దారితీయవచ్చు. ఉదాహరణకు 80 కిలోల బరువున్న ఒక పైలట్‌కు 9జి మేర గురుత్వాకర్షణ బలం ఎదురైతే.. అతడిపై 720 కిలోల బరువుకు సమానమైన ఒత్తిడి పడుతుంది. దీనివల్ల అతడు కదలలేని పరిస్థితి తలెత్తుతుంది.

నెగెటివ్ జి

ఈ తరహా బలాలు పైలట్‌కు ఎదురుకావడం తక్కువే. సహజసిద్ధ గురుత్వాకర్షణకు వ్యతిరేక దిశలో ఒక యుద్ధవిమానం, అందులోని పైలట్‌పై పడే బలాలను నెగెటివ్ జిగా పిలుస్తారు. అందువల్ల పైలట్ శరీరం తేలికైనట్లు, గాల్లో తేలియాడుతున్న భావన కలుగుతుంది. యుద్ధవిమానం గాల్లో నిటారుగా కిందికి దిగడం వంటి విన్యాసాలు, గాల్లో తీవ్ర గందరగోళం (టర్బులెన్స్) వంటి సమయాల్లో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతుంది. నెగెటివ్ జి బలాలను పైలట్ సరిగా నియంత్రించకుంటే.. అతడి శరీరంలోని రక్తం తల దిశగా పయనిస్తుంది. దీనివల్ల అతడికి పరిసరాలు ఎర్రగా, మసకమసకగా కనిపించడం, కంట్లో పీడనం పెరగడం, తీవ్ర తలనొప్పి, గందరగోళం, స్పృహ కోల్పోవడం వంటివి జరగొచ్చు. నెగెటివ్ జి బలాన్ని శరీరం పెద్దగా తట్టుకోలేదు. గరిష్ఠంగా మైనస్ 3జి వరకూ మాత్రమే ఎదుర్కోగలదు. నెగెటివ్ జి వల్ల యుద్ధవిమానానికి పైకిలేచే శక్తి తగ్గుతుంది. ప్రయాణమార్గంలోనూ మార్పులు వస్తాయి. దీనివల్ల నియంత్రణ, స్థిరత్వంపై ప్రభావం పడుతుంది. తాజాగా తేజస్ చేసిన చివరి విన్యాసం ఇదే. శత్రు యుద్ధవిమానంతో నింగిలో ముఖాముఖి తలపడే (డాగ్ ఫైట్)టప్పుడు పైలట్.. కొద్దిసేపు పాజిటివ్ జి, మరికొద్దిసేపు నెగెటివ్ జిని ఎదుర్కొంటాడు. ఇలా రెండు దశల మధ్య వేగంగా పరివర్తన జరగడం వల్ల అతడి శరీరంపై తీవ్ర ప్రభావం పడుతుంది. అందువల్ల పైలట్ తక్షణమే ఈ పరిస్థితులకు సర్దుబాటు కావాల్సి ఉంటుంది. జి సూట్లను ధరించడం ద్వారా వీటిని ఎదుర్కొంటారు.


శిక్షణతో రక్షణ

ఏరోబిక్ వ్యాయామాలు, కండరాలను పటిష్ఠం చేసుకునే శిక్షణ ద్వారా జి బలాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పైలట్లు పొందుతారు. కోర్ వ్యాయామాలు, పుష్ అప్స్, పుల్ అప్స్, స్క్వాట్స్ వంటివి నడుం, కాళ్లను బలోపేతం చేస్తాయి. యుద్ధవిమాన పైలట్లు హెల్మెట్లు ధరిస్తారు కాబట్టి జి బలాలను ఎదుర్కొనే సమయంలో వారి మెడ కండరాలపై ఒత్తిడి పడుతుంది. రెసిస్టెన్స్ రొటేషన్స్ వంటి వ్యాయామాలు దీన్ని అధిగమించడానికి దోహదపడతాయి. అలాగే పైలట్లు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి. డీహైడ్రేషన్, అలసట, మద్యపానం వంటివి జి బలాలను ఎదుర్కొనే శక్తిని తగ్గిస్తాయి. పూర్తిస్థాయిలో దేహదారుఢ్యం కలిగిన పైలట్.. 9జి బలాన్ని 10 నుంచి 15 సెకన్ల పాటు తట్టుకోగలడని రుజువైంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

(c) eenadu

వైకాపా తెచ్చిన జీవో 217 రద్దు చేశాం: లోకేశ్



ఈనాడు, అమరావతి: మత్స్యకారుల జీవనోపాధికి ముప్పుగా మారిన.. వైకాపా హయాంలో తెచ్చిన జీవో 217ను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మత్స్యకారులందరికీ ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా 'ఎక్స్' వేదికగా శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. "మత్స్యకారుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నాం. వేట నిషేధ సమయంలో అందించే భృతిని రూ.20 వేలకు పెంచాం. మత్స్య సంపద ఉత్పత్తిలోనూ రాష్ట్రాన్ని అగ్రపథాన నిలుపుతాం' ' అని లోకేశ్ వివరించారు.

అన్నదాతల మేలు కోరే 'రైతన్నా.. మీకోసం'

వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, అమరావతి: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతులకు దిశానిర్దేశం చేసేందుకు సీఎం చంద్రబాబు 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమాన్ని రూపొందించారని వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 24 నుంచి 29 వరకూ రాష్ట్రవ్యాప్తంగా దీన్ని నిర్వహించనున్నట్టు వివరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ హయాంలో అడుగడుగునా అన్నదాత దగాపడ్డాడని, కనీసం పెట్టుబడి రాయితీ కూడా ఇవ్వలేదని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం: జగన్

ఈనాడు, అమరావతి: సముద్రాన్ని జీవనాధారంగా చేసుకొని, ఎగిసిపడుతున్న కెరటాలతో నిత్యం పోరాటం చేస్తూ జీవనం సాగిస్తున్న గంగ పుత్రులందరికీ ప్రపంచ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు అని మాజీ సీఎం జగన్ శుక్రవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వైకాపా హయాంలో మత్స్యకారుల సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండ్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టామని, పలు పథకాలతో మత్స్యకారులకు రూ.4,913 కోట్లు లబ్ధి చేకూర్చామని వివరించారు. అన్నివేళలా మత్స్యకారులందరికీ వైకాపా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

శైలజానాథ్‌కు జగన్ పరామర్శ

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి, శింగనమల వైకాపా సమన్వయకర్త సాకే శైలజానాథ్ తల్లి గంగమ్మ మృతి పట్ల మాజీ సీఎం జగన్ విచారం వ్యక్తం చేశారు. శైలజానాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టెలీమెట్రీల నిధులు.. బోర్డు నిర్వహణకు మళ్లింపు

రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖలు

ఈనాడు, హైదరాబాద్: బోర్డులో నిధుల నిల్వలు అడుగంటిన నేపథ్యంలో గత్యంతరం లేని పరిస్థితుల్లో టెలీమెట్రీలకు తెలంగాణ ఇచ్చిన నిధులను నిర్వహణకు మళ్లించుకుంటామంటూ కృష్ణా బోర్డు తెలంగాణ, ఏపీలకు తెలిపింది. ఈ మేరకు తాజాగా తెలంగాణ నీటిపారుదల శాఖ, ఏపీ జలవనరుల శాఖలకు బోర్డు లేఖలు రాసింది. బోర్డుకు గతేడాది, ఈ ఏడాది రెండు రాష్ట్రాలు బడ్జెట్ కేటాయించలేదు. 'ఈ ఏడాది జనవరిలో జరిగిన బోర్డు 19వ సమావేశంలోనూ రెండు రాష్ట్రాలు రూ.12 కోట్ల చొప్పున జమచేస్తామని భరోసా ఇచ్చాయి. ఇప్పటి వరకు పైసా విడుదల చేయలేదు. బోర్డు ఉద్యోగుల వేతనాలు, నిర్వహణకు నిధులు లేవు. ఈ క్రమంలో టెలీమెట్రీల ఏర్పాటుకు తెలంగాణ ఇచ్చిన రూ.4 కోట్లను బోర్డు నిర్వహణకు మళ్లించుకుని రాష్ట్రాలు బడ్జెట్ ఇవ్వగానే తిరిగి టెలీమెట్రీలకు జమ చేస్తాం' అని బోర్డు స్పష్టం చేసింది.

మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలివ్వండి

హైకోర్టులో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ పిటిషన్లు

ఈనాడు, అమరావతి: ముందస్తు బెయిలు కోసం మద్యం కుంభకోణం కేసులోని నిందితులు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి(ఏ-2), ఎక్సైజ్ శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్(ఏ-3) దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. దీనిపై పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీకి కోర్టు ఆదేశించింది. అనంతరం విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులిచ్చారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. అప్రూవర్లుగా మారాలని పిటిషనర్లు నిర్ణయం తీసుకున్నారని, దర్యాప్తునకు సహకరిస్తున్నారని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు వస్తున్నారని చెప్పారు. ఏపీపీ ప్రియాంక స్పందిస్తూ.. వివరాలు సమర్పించడానికి స్వల్ప గడువు కావాలని కోరారు. దీంతో విచారణ ఈ నెల 28కి వాయిదా పడింది.

పాఠశాల బస్సులో అగ్నిప్రమాదం

ప్రాణాలతో బయటపడిన విద్యార్థులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులోని మదురై జిల్లాలో ఓ పాఠశాల బస్సులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ అప్రమత్తతో విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. జిల్లాలోని తిరుమంగళంలో తమ విద్యార్థుల కోసం ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం మినీ బస్సు నడుపుతోంది. శుక్రవారం ఉదయం 24 మంది విద్యార్థులతో వెళ్తుండగా బస్సు డీజిల్ ట్యాంకు నుంచి పొగ రావడం మొదలైంది. అప్రమత్తమైన డ్రైవర్ రవిచంద్రన్ వెంటనే బస్సు ఆపి విద్యార్థులదరినీ కిందకు దించేశారు. అధికారులకు సమాచారం అందించగా.. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలోపే మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా కాలిపోయింది. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల తీరుపై అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ ఆగ్రహం

- సభాహక్కుల ఉల్లంఘనపై విచారణకు రాని అధికారులకు నోటీసులు

ఈనాడు, అమరావతి: సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడి.. దానిపై విచారణకు రాకుండా ఎగ్గొడుతున్న అధికారులపై సభాహక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్) కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల వ్యవహార శైలిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగిస్తున్నారని, అధికారుల తీరుతో ఇలాంటి ఫిర్యాదులు ఎమ్మెల్యేల నుంచి పెరుగుతున్నాయని కమిటీ అభిప్రాయపడింది. శుక్రవారం అసెంబ్లీలోని కమిటీ హాలులో ఈ కమిటీ సమావేశమైంది. కమిటీ ఛైర్మన్ పితాని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై చర్చించారు. గతంలో కడపలో ప్రొటోకాల్ విషయంలో అప్పటి డీఆర్‌ఓపై, తర్వాత రిమ్స్‌లో అదనపు భవనం ప్రారంభం సందర్భంగా శిలాఫలకంపై ఎమ్మెల్యే పేరు లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేశ్వరరెడ్డిపై ఎమ్మెల్యే చేసిన ఫిర్యాదులను కమిటీ సమీక్షించింది. బాధ్యుడైన డీఆర్‌ఓ రాకపోవడంపై కమిటీ అసహనం వ్యక్తం చేసింది.

సీఎం పేరు చెప్పి..

శుక్రవారం కమిటీ ముందు హాజరవ్వాలని ఈ నెల 15న కడప కలెక్టర్ కార్యాలయానికి కమిటీ సమన్లు పంపింది. 19న ముఖ్యమంత్రి కడప జిల్లా పర్యటన ఉన్నందున అధికారులు రాలేదని కమిటీ దృష్టికి వచ్చినట్లు తెలిసింది. సీఎం పర్యటన 19నే ముగిసింది. కమిటీకి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, విచారణకు రాకుండా ఉంటే ఎలా అని కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. రిమ్స్‌పై ఫిర్యాదులోనూ గతంలో విచారణకు పిలిస్తే బాధ్యుడైన రిమ్స్ సూపరింటెండెంట్ సురేశ్వరరెడ్డి కాకుండా వేరే అధికారి వచ్చారని కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది.

'సాక్షి'పై మరోసారి

సాక్షి పత్రికలో ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులపై ఫిబ్రవరిలో ప్రచురించిన కథనం సభాహక్కుల ఉల్లంఘనకు వస్తుందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఆ ఫిర్యాదుపై కమిటీ శుక్రవారం విచారణ చేపట్టలేదు.

✦ వైకాపా హయాంలోనూ ఎమ్మెల్యేగా ఉన్న తన హక్కులకు భంగం కలిగిస్తూ, ప్రొటోకాల్ నిబంధనలనూ అప్పట్లో అధికారులు ఉల్లంఘించారని మండపేట ఎమ్మెల్యే జోగేశ్వరరావు సమర్పించిన ఫిర్యాదులను ప్రివిలేజ్ కమిటీ పరిగణనలోకి తీసుకుంది. అధికారులకు నోటీసులివ్వాలని నిర్ణయించింది.

సమావేశంలో కమిటీ సభ్యులు సభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, పి.ధర్మరాజు, బొగ్గుల దస్తగిరి, మామిడి గోవిందరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అనిల్ ఛోక్రా కస్టడీపై పిటిషన్

ఈనాడు, అమరావతి: అనిల్ ఛోక్రాను వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ కోరుతూ ఛోక్రా పిటిషన్ వేశారు. వీటిపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు.

✦ తాను శీతాకాలం పార్లమెంట్ సమావేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. జైలులో వసతులపై చెవిరెడ్డి పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును 25న వెల్లడించనున్నట్లు కోర్టు ప్రకటించింది.

✦ వెంకటేష్‌నాయుడు, బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ బెయిల్ పిటిషన్లపై విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. పోలీసులు తమ కుటుంబసభ్యులను వేధిస్తున్నారని నిందితుడు పైలా దిలీప్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది. రూ.11కోట్ల సీజ్‌పై రాజ్ కెసిరెడ్డి వేసిన పిటిషన్లపై విచారణను డిసెంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది. తనను అరెస్ట్ చేసిన సమయంలో సిట్ అధికారులు సీజ్ చేసిన రూ.3లక్షలు తిరిగి ఇప్పించాలని కోరుతూ నిందితుడు బాలాజీకుమార్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 5వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది.

కొత్తగా 15 పోషకాహార పునరావాస కేంద్రాలు

- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఈనాడు, అమరావతి: ఐదేళ్లలోపు చిన్నారులకు సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 15 పోషకాహార పునరావాస కేంద్రాలు (ఎన్‌ఆర్‌సీ) ఏర్పాటు చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాల్లో 11 గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తున్నామని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 340 పడకలతో 21 ఎన్‌ఆర్‌సీలు ఉన్నాయని, కొత్తగా ఏర్పాటయ్యే వాటితో మరో 115 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా రెండు వారాల పాటు వైద్యంతోపాటు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు ప్రాంతీయ ఆసుపత్రి, ముంచింగిపుట్టు, చింతపల్లి సీహెచ్‌సీలు, అనకాపల్లి జిల్లా ఆసుపత్రి, బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రి, పల్నాడు జిల్లా నరసారావుపేట ప్రాంతీయ ఆసుపత్రి, నంద్యాల జీజీహెచ్, సున్నిపెంట ప్రాంతీయ ఆసుపత్రుల్లో 10 చొప్పున పడకలతో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తారని వెల్లడించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రులు, భద్రగిరి, కురుపాం, చిన్నమరంగి సీహెచ్‌సీలతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల, రామవరం సీహెచ్‌సీల్లో ఐదు చొప్పున పడకలతో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

బీఎస్సీ నర్సింగ్ యాజమాన్య కోర్సు ప్రవేశానికి దరఖాస్తులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరానికి (2025-26) రాష్ట్రంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల యాజమాన్య కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. ఏపీఎన్‌సెట్‌లో అభ్యర్థులు 20 పర్సంటైల్ కంటే ఎక్కువ, 85-17 కటాఫ్ స్కోరు మధ్య ఉన్న వారంతా 25న సాయంత్రం 6 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మార్గ నిర్దేశకాల్లో సమస్యలుంటే 89787 80501, సాంకేతిక సందేహాలుంటే 90007 80707 నంబర్లపై సంప్రదించవచ్చని సూచించారు.

సరాసరి మార్కులతోనే టీచర్ పనితీరు మదింపు

ఈనాడు, అమరావతి: తరగతి సరాసరి మార్కులనే ఉపాధ్యాయుడి పనితీరుగా పరిగణించాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన చోట అకడమిక్ ఫోరంల ద్వారా మద్దతు ఇస్తామని వెల్లడించింది. ఉపాధ్యాయుల అవార్డులకు సైతం తరగతి సరాసరి మార్కులనే ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పేర్కొంది. ఏటా ఏప్రిల్‌లో తమ విద్యార్థులు ఎఫ్‌ఎల్‌ఎన్ పూర్తి స్థాయిలో అభ్యసించినట్లు సర్టిఫికెట్ జారీ చేయాలని, అనంతరం దీనిపై థర్డ్ పార్టీ తనిఖీలు ఉంటాయని తెలిపింది. వంద రోజుల కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని పదో తరగతి విద్యార్థుల సిలబస్‌ను డిసెంబరు ఐదు లోపు పూర్తి చేయాలంది. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి లోపు సిలబస్ పూర్తిచేసి ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని, మార్చి, ఏప్రిల్ నెలల్లో పదో తరగతి పాఠాలు బోధించాలని సూచించింది.

సర్వీసులో చేరగానే నిర్లిప్తత ఆవహిస్తోంది

- అర్థంలేని నిబంధనలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు
- ప్రభుత్వ వైద్యుల వైఖరిని తప్పుపట్టిన హైకోర్టు
- శ్యామలకు 'మానసిక' వైకల్య పరీక్ష చేసి 'శారీరక' వైకల్య పరీక్షలు చేయకపోవడంపై ఆగ్రహం




ఈనాడు, అమరావతి: 'ప్రభుత్వ సర్వీసులో చేరగానే డాక్టర్లను నిర్లిప్తత ఆవహిస్తోంది. అర్థంలేని నిబంధనలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రోగులకు సేవ చేయడానికి ఉన్నారనే విషయాన్ని వారు మర్చిపోతున్నారు. అకారణ జాప్యం చేస్తున్నారు' అని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన శ్యామలకు కేవలం 'మానసిక' వైకల్య పరీక్షలు చేసి 'శారీరక' వైకల్య పరీక్షలను విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. మనిషిని చూసి శారీరక స్థితిని అంచనా వేయవచ్చని తెలిపింది. శ్యామలకు బహుళ వైకల్యం ఉందని, ఆమెను పరీక్షించాలని డాక్టర్లకు తాము చెప్పాల్సిరావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. నిపుణులైన వైద్య సిబ్బందిని శ్యామల వద్దకు పంపి శారీరక వైకల్యం ఏ మేరకు ఉందో తేల్చాలని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

✦ నిరక్షరాస్యత కారణంగా తమ 5 సెంట్ల స్థలాన్ని పొరపాటున సీఆర్‌డీఏకు అప్పగించామని, దానిని తిరిగి అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ రాయపూడికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు శేషగిరమ్మ, మానసిక వైకల్యంతో బాధపడుతున్న ఆమె మనవరాలు శ్యామల హైకోర్టులో ఇటీవల వ్యాజ్యం వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి.. ప్రభుత్వ పథకాల కింద ఆర్థిక సాయం అందించే నిమిత్తం శ్యామలకు ఎంత శాతం మానసిక వైకల్యం ఉందో తేల్చాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శ్యామల కుటుంబ సభ్యులు సదరం సర్టిఫికెట్ కోసం అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం జరిగిన విచారణకు 'సదరం' నోడల్ అధికారి డాక్టర్ సురేశ్ కోర్టు ముందు హాజరయ్యారు. తాము పరీక్ష నిర్వహిస్తే శ్యామలకు 95 శాతం మానసిక వైకల్యం ఉన్నట్లు తేలిందన్నారు. శారీరక వైకల్యం గురించి తమ వద్ద వివరాలు లేవన్నారు. దీంతో న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు.

✦ సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ప్రస్తుతం నివాసం ఉంటున్న నిర్మాణాలు, బోర్‌వెల్స్ మొత్తం రూ.6లక్షల విలువ చేస్తాయన్నారు. ఆ రూ.6 లక్షలకు మరో రూ.6 లక్షలు కలిపి ఇవ్వాలని అధికారులు నిర్ణయించారన్నారు. పిటిషనర్లు మరో చోటికి వెళ్లాలని భావిస్తే ప్రత్యామ్నాయంగా 5 సెంట్ల స్థలం ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ కోటాలో 'స్థానిక రిజర్వేషన్లు' ప్రస్తుత ప్రవేశాలకు వర్తించవు

- తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- ప్రభుత్వ తీరు.. ఆట మొదలయ్యాక నిబంధనలు మార్చినట్లుందని వ్యాఖ్య



ఈనాడు, హైదరాబాద్: ప్రైవేట్, అన్ ఎయిడెడ్, మైనారిటీ, నాన్‌మైనారిటీ కళాశాలల్లో పీజీ వైద్య విద్య (మెడికల్, డెంటల్)లో స్థానిక కోటా రిజర్వేషన్లు ప్రస్తుత ప్రవేశాలకు వర్తించవంటూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలోనూ స్థానిక కోటా 85 శాతం, అఖిలభారత కోటా కింద 15 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఈ సారి ప్రవేశాలకు వర్తించవని పేర్కొంది. ప్రవేశాల ప్రక్రియను అక్టోబరు 4న ప్రారంభిస్తూ కాళోజీ వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత ప్రభుత్వం నవంబరు 3న రిజర్వేషన్లు కేటాయిస్తూ జీవో ఇచ్చిందని.. ప్రాథమికంగా చూస్తే ఇది ఆట మొదలయ్యాక నిబంధనలు మార్చినట్లుందని పేర్కొంది. పిటిషన్లపై 4 వారాల్లో కౌంటరు దాఖలు చేయాలంటూ ప్రభుత్వం, కాళోజీ వర్సిటీలను, ఆ తర్వాత రెండు వారాల్లో రిప్లయ్ కౌంటర్లు దాఖలు చేయాలంటూ పిటిషనర్లను ఆదేశిస్తూ విచారణను జనవరి 19కి వాయిదా వేసింది.

మేనేజ్‌మెంట్ కోటాలోని పీజీ మెడికల్, డెంటల్ ప్రవేశాల్లో స్థానికులకు 85 శాతం, అఖిల భారత కోటా 15 శాతం రిజర్వేషన్ల నిమిత్తం నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం నవంబరు 3న జారీచేసిన జీవో 200, 201లను సవాల్ చేస్తూ కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన పలువురు అభ్యర్థులు హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ప్రైవేట్, అన్ ఎయిడెడ్, మైనారిటీ, నాన్ మైనారిటీ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద పీజీ వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించిన నిబంధన 3(7)(ఎ)ను సవరిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. స్థానికతకు సంబంధించి ప్రభుత్వం గత ఏడాది జీవో 148 జారీ చేసిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, పీడబ్ల్యూడీలకు తక్కువ శాతం మార్కులు కేవలం అర్హత నిమిత్తమేనని.. మేనేజ్‌మెంట్ కోటాలో రిజర్వేషన్లు లేనందున ఆ కోటాలో వర్తించవన్నారు. మేనేజ్‌మెంట్ కోటా కింద ఎలాంటి రిజర్వేషన్లు అమలు కావడంలేదన్నారు. ప్రభుత్వ ప్రస్తుత ఉత్తర్వులు పీఏ ఇనాందార్ వర్సెస్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నారు. నివాసం ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లను కేటాయించవచ్చని.. పీజీ స్థాయిలో కాదంటూ డాక్టర్ తన్వీ బెహెల్ వర్సెస్ శ్రేయ్ గోయల్ కేసులో సుప్రీంకోర్టు తేల్చిచెప్పిందన్నారు. కేవలం 15 శాతం అఖిలభారత కోటాలో సీటు పొందాలంటే పిటిషనర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం ప్రస్తుత ప్రవేశాలకు రిజర్వేషన్ల అమలు వర్తించదంటూ తేల్చిచెప్పింది.

ఫ్యాక్టరీల్లో థర్డ్‌పార్టీ భద్రత ఆడిట్‌కు మార్గదర్శకాల విడుదల

ఈనాడు, అమరావతి: పరిశ్రమల్లో థర్డ్ పార్టీ భద్రత ఆడిట్ మార్గదర్శకాలను కార్మికశాఖ విడుదల చేసింది. ఈ మేరకు కార్యదర్శి శేషగిరిబాబు ఏపీ ఫ్యాక్టరీల నియామకాల-2025 నోటిఫికేషన్ ఉత్తర్వులను విడుదల చేశారు. పరిశ్రమల్లో నిర్వహించే థర్డ్ పార్టీ భద్రత ఆడిట్ రాష్ట్రప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఫ్యాక్టరీల విభాగం ఎంపికచేసిన సంస్థలతోనే ఆడిట్ చేయించాలి. ఎంప్యానల్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో సంస్థలు లేదా వ్యక్తులు ఫ్యాక్టరీస్ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలి. సంస్థ రూ.50వేలు, వ్యక్తి రూ.25వేల చొప్పున దరఖాస్తు రుసుము చెల్లించాలి. ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మందితో కూడిన బృందం ఆడిట్ చేయాలి. భద్రతా ఆడిట్ సమయంలో ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గుర్తిస్తే ఆ సమాచారాన్ని సంబంధిత అధికారికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో నాణేల జాతీయ సదస్సు: మంత్రి జూపల్లి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వారసత్వ శాఖ ఆధ్వర్యంలో 107వ వార్షిక జాతీయ నాణేల సదస్సును హైదరాబాద్‌లో డిసెంబరు 11, 12వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సదస్సు బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. . నాణేల చరిత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటిచెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఈ సదస్సు జరగనుందని తెలిపారు.



మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు. చిత్రంలో కొణతాల రామకృష్ణ, ఆర్.కూర్మనాథ్, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు,

అభ్యంతరాల పరిష్కార గడువు రెండేళ్లకు పొడిగింపు

ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్న పిటిషన్ల కమిటీ

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: భూముల రీసర్వే సందర్భంగా వచ్చే అభ్యంతరాల పరిష్కార గడువు తహసీల్దార్ స్థాయిలో రెండేళ్లకు పొడిగించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు రాష్ట్ర అసెంబ్లీ పిటిషన్ల కమిటీ ఛైర్మన్, శాసనసభ ఉప సభాపతి కె.రఘురామకృష్ణరాజు తెలిపారు. సమగ్ర భూ సర్వే అంశంపై శుక్రవారం విశాఖ కలెక్టరేట్‌లో కమిటీ సమావేశం నిర్వహించి, పలువురి నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ 'భూముల రీసర్వే సందర్భంగా అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి తహసీల్దార్ స్థాయిలో కేవలం ఏడాది మాత్రమే గడువు ఉంది. నిర్ణీత గడువులోపు పరిష్కారం కాకుంటే సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆ గడువు రెండేళ్లకు పెంచితే, రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుందని ప్రభుత్వానికి సూచిస్తాం' అని తెలిపారు. సర్వే అండ్ సెటిల్‌మెంట్ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల గ్రామాలు ఉన్నాయని, ప్రస్తుతం 6,688 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. సర్వేకు సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 7 లక్షల అభ్యంతరాలు వచ్చాయని, వాటిలో 3 లక్షల వరకు జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మేనేజ్‌మెంట్)కు సంబంధించి ఉన్నాయన్నారు. రెండు లక్షల సమస్యల్ని పరిష్కరించామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని తొమ్మిది పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, రాజాం, గూడూరు (తిరుపతి జిల్లా)ల్లో ప్రత్యేక అధికారుల పాలన 2025 నవంబరు 6తో ముగిసింది. ఈ మేరకు 2026 మే 5 వరకు ప్రత్యేక అధికారులు కొనసాగుతారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

29న ఆఫ్ షోర్ నౌకల కమిషనింగ్ వేడుక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడలో నిర్మించిన నాలుగు ఆఫ్ షోర్ నౌకల కమిషనింగ్ వేడుక, తొలి ఎలక్ట్రిక్ టగ్ స్టీల్ కట్టింగ్ కార్యక్రమం ఈ నెల 29న జరగనుంది. ఈ మేరకు శుక్రవారం ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా నిర్మించిన నాలుగు నౌకలు ఏపీ పరిశ్రమ రంగంలో మైలురాయిగా నిలుస్తాయని ఛైర్మన్ సత్యనారాయణ తెలిపారు. ఈ వేడుకకు కేంద్ర ఫిషింగ్, జల మార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

25 నుంచి భాజపా కార్యశాలలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి 29 వరకు జోన్లవారీగా కార్యశాలలు నిర్వహిస్తున్నట్లు భాజపా రాష్ట్ర కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. "ఈ నెల 25న కోస్తాంధ్ర జోన్ పరిధిలోని నాయకులకు నెల్లూరులో, 27న గోదావరి జోన్ పరిధిలోని వారికి రాజమహేంద్రవరంలో, 28న ఉత్తరాంధ్ర జోన్ పరిధిలోని వారికి విశాఖలో, 29న రాయలసీమ జోన్ పరిధిలోని నాయకులకు కడపలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. భాజపా ముఖ్య నాయకులు, అధికార ప్రతినిధులు, కొత్త కమిటీల అధ్యక్షులు తదితరులు ఈ కార్యశాలల్లో పాల్గొంటారు" అని వెల్లడించింది.

చెంచులకు ఉచిత స్పర్శ దర్శనం అభినందనీయం

భాజపా ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు

ఈనాడు, అమరావతి: శ్రీశైలం క్షేత్రం ఏర్పడినప్పటి నుంచి ప్రథమ పూజారులుగా, ఆలయ పరిరక్షకులుగా ఉన్న స్థానిక చెంచులకు ప్రతినెలా చివరి బుధవారంలో ఉచిత స్పర్శదర్శనం కల్పిస్తూ పాలక మండలి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని భాజపా ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు అన్నారు. దేవస్థానానికి భక్తుల తాకిడి పెరిగి ఆలయ నిబంధనలు మారడంతో చెంచు గిరిజనులు స్వామి స్పర్శదర్శన భాగ్యానికి దూరమయ్యారని శుక్రవారం ఓ ప్రకటనలో గుర్తు చేశారు. తాజా నిర్ణయంతో చెంచులకు మళ్లీ అవకాశం కల్పించిన శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ పి.రమేష్‌నాయుడుకు, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.

గాలి జనార్దన్‌రెడ్డికి పట్టిన గతే జగన్‌కూ

మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు

ఈనాడు, అమరావతి: గతంలో లాలూప్రసాద్‌యాదవ్, శశికళ, గాలి జనార్దన్‌రెడ్డిలకు పట్టిన గతే వైకాపా అధినేత జగన్‌కూ పట్టనుందని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు విమర్శించారు. శుక్రవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ మందీమార్బలంతో విచారణకు వెళ్లిన తీరును తీవ్రంగా ఆక్షేపించారు. 11 సీబీఐ, 9 ఈడీ కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తి న్యాయస్థానానికి ఇంత హడావుడి చేస్తూ వెళ్లడం దేశచరిత్రలో ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు.

'నిర్దేశిత జాబ్ చార్ట్ ప్రకటించాలి'

ఈనాడు, అమరావతి: అంబేడ్కర్ గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు, అధ్యాపకుల విధుల నిర్వహణకు నిర్దేశిత జాబ్‌చార్ట్ ప్రకటించాలని అంబేడ్కర్ గురుకుల పార్ట్‌టైం ఉపాధ్యాయుల, అధ్యాపకుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 వేల మంది వరకు ఉన్నామని, రోజువారీ తరగతులతో పాటు రాత్రి విధులు, సెలవు రోజులు, హౌస్ డ్యూటీలు చేయిస్తున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో వాపోయింది. జీతాలు క్రమం తప్పకుండా అందించాలని, ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరింది.

స్టార్ హోటళ్లలోనూ పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించాలి

ప్రభుత్వానికి హోటళ్ల అసోసియేషన్ విజ్ఞప్తి



మీనాకు వినతిపత్రం అందిస్తున్న స్టార్ హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: త్రీ స్టార్ కంటే మించిన హోటళ్లలో పర్యాటక కార్యకలాపాలకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం వెసులుబాట్లు కల్పించాలని రాష్ట్ర స్టార్ హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆతిథ్య రంగానికి ప్రోత్సాహకంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోవడంపై అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. విదేశీ పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని ప్రీమియం లిక్కర్, సీజనల్, ఎడిషనల్, అంతర్జాతీయ బ్రాండ్‌ల కోసం సింగిల్-బాటిల్ ఇండెంట్‌లకు స్టార్ హోటళ్లను అనుమతించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ స్వామి ఆధ్వర్యంలో ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. సమయానుకూలంగా ఈవెంట్ల నిర్వహణకు 24 గంటల్లోపు అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనుమతులకు కృషి చేస్తానని మీనా హామీ ఇచ్చారని ఆర్వీ స్వామి తెలిపారు.

(c) eenadu

ఒక్కడే చూపించాడా... ఐ బొమ్మ!

- ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో లింకులపై ఆరా
- రెండో రోజు ముగిసిన రవి పోలీసు కస్టడీ
- యూకేలో టెకీలు, కరేబియాలో కార్యాలయం గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: సినీ రంగాన్ని, పోలీసులను ఆరేళ్లపాటు ముప్పుతిప్పలు పెట్టిన ఐ బొమ్మ నిర్వాహకుడు రవి కేసులో పోలీసుల విచారణ అన్ని కోణాల్లో సాగుతోంది. దేశవిదేశాల్లో వందల మంది ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో సంబంధాలు, 100కు పైగా వెబ్‌సైట్లు, 21 వేల పైరసీ సినిమాలు... ఇదంతా ఒక్కడితోనే సాధ్యమవుతుందా..? తెర వెనుక ఎంతమంది సహకరిస్తున్నారనే అంశాలపై కూపీలాగుతున్నారు. ఐదు రోజుల కస్టడీలో భాగంగా శుక్రవారం రెండోరోజు పోలీసులు అతడి నుంచి కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. యూకే, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో లింకులపై ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. తమిళ వెబ్‌సైట్ల నుంచే అధిక శాతం సినిమాలు కొనుగోలు చేసినట్టు గుర్తించారు. కరేబియన్ దీవుల్లో కార్యాలయం ఏర్పాటు చేసుకుని... యూకేలోని టెకీల సాయంతో పైరసీ సినిమాల దందా యథేచ్ఛగా సాగించినట్లు అంచనాకు వచ్చారు. రవి అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ హెచ్‌డీ క్వాలిటీతోనే ఉన్నాయి. థియేటర్లలో సెల్‌ఫోన్‌తో కొత్త సినిమాలను రికార్డ్ చేసి తమిళ వెబ్‌సైట్లకు విక్రయించే వారి నుంచి కొన్న సినిమాలను సాఫ్ట్‌వేర్ సాయంతో హెచ్‌డీ క్వాలిటీగా మార్చి వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశాడు.

బెట్టింగ్‌యాప్‌ల ప్రకటనలతో వచ్చిన సొమ్ముతో పైరసీ సినిమాలు కొన్నట్లు వెల్లడించినట్లు సమాచారం. యూకేలో ఉన్న బృందాల ద్వారా వెబ్‌సైట్ల నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. తన ఆనవాళ్లను పసిగట్టకుండా ప్రహ్లాద్‌కుమార్ పేరుతో డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, అదే పేరుతో బ్యాంకు ఖాతాలు, విదేశీ పౌరసత్వం తీసుకున్నట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. కరేబియన్ దీవుల్లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పినట్లు సమాచారం.

కష్టాలను అనుభవించి... అర్ధాకలితో అలమటించి...

రవి తల్లిదండ్రులిద్దరూ అతని చిన్నప్పుడే వేరుపడ్డారు. ఎన్నో తంటాలు పడుతూ బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ముంబయి వెళ్లినప్పుడు ఎన్నో రోజులు అర్ధాకలితో అలమటించినట్లు పోలీసులతో చెప్పినట్లు సమాచారం. ఐటీ కోర్సులు పూర్తిచేసిన అనుభవంతో హైదరాబాద్‌లో ఐటీ కంపెనీలు ప్రారంభించాడు. ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకున్నా వైవాహిక జీవితంలో ఇబ్బందులతో భార్య నుంచి విడిపోయాడు. ఎనిమిదేళ్ల కూతురున్నా నాలుగేళ్లుగా ఒంటరిగా బతుకీడుస్తున్నాడు. ప్రతి అడుగులో ఎదురైన చేదు అనుభవాలతో డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో పనిచేశానంటూ పోలీసులకు రవి వివరించినట్లు తెలిసింది.

తొలగించింది రెండే.. మరెన్నో ఉండే అవకాశం

పైరసీ సినిమాల వేదికల్లో ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్లను మాత్రమే పోలీసులు తీసివేశారు. అయితే, వీటిలో అప్‌లోడ్ చేసిన సినిమాలు మరో వెబ్‌సైట్‌కు లింక్ అయ్యేలా(గేట్‌వే) ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. ఈ కారణంగానే ఈ రెండు వెబ్‌సైట్‌ల లింక్‌లను క్లిక్ చేస్తే మిగిలిన పైరసీ సైట్లలోకి వెళ్లి సినిమాలు వీక్షించే అవకాశమున్నట్లు పోలీసులు తాజాగా గుర్తించారు. ఇలాంటివి తమిళనాడు కేంద్రంగా 50కిపైగా నడుస్తున్నాయి. ఐబొమ్మ తమిళ్.కామ్ వెబ్‌సైట్‌లో సినిమా సమీక్షలు, వార్తలను ఉంచారు. అక్కడ కనిపించే ప్రకటనలు క్లిక్ చేస్తే ఇన్వెస్ట్‌మెంట్ వేదికలకు తీసుకెళ్తాయి. ఇప్పటివరకు ఐ బొమ్మ వేదిక బెట్టింగ్ యాప్‌లకే పరిమితమని భావించారు. తాజాగా సైబర్ మోసగాళ్లు తమ నేరాలకు ఐబొమ్మ వెబ్‌సైట్లను పూర్తిస్థాయిలో వేదికగా మలచుకున్నట్టు అంచనాకు వస్తున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దిల్‌రాజు, ప్రియాంక

అందరినీ ఏకం చేసేది సినిమా

తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల చిత్రోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నారాయణగూడ, న్యూస్‌టుడే: సరిహద్దులు లేని భాష.. సినిమా. ఇది ప్రాంతీయ, జాతి, భాషాభేదాలు లేకుండా మనుషులను ఏకం చేస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ప్రసాద్ ఐమాక్స్‌లో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే 'తెలంగాణ- నార్త్ ఈస్ట్ కనెక్ట్' చిత్రోత్సవం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణల మధ్య సాంస్కృతిక, సాంకేతిక, యువశక్తి, మహిళా సాధికారత, ఐటీ, ఆరోగ్య రంగాల్లో విస్తృత భాగస్వామ్యానికి ఈ చిత్రోత్సవం తోడ్పడుతుందన్నారు. ఈశాన్య భారత వైవిధ్యం, తెలంగాణ చైతన్యం కలిస్తే మరింత బలమైన జాతీయ ఐక్యత సాధ్యమవుతుందని చెప్పారు. త్రిపుర, మణిపుర్, అస్సాం తదితర రాష్ట్రాల కథలు, సంస్కృతి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

రామోజీ ఫిల్మ్‌సిటీ మాకు గర్వకారణం: తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్దదైన రామోజీ ఫిల్మ్ సిటీ హైదరాబాద్‌లో ఉండటం తమకెంతో గర్వకారణమన్నారు. అక్కడి సాంకేతిక నిపుణుల పరిశ్రమ, నైపుణ్యం వల్లే వెండితెరపై అద్భుతాలు ఆవిష్కృతం అవుతున్నాయని చెప్పారు. సినిమా నిర్మాణాలకు అవసరమైన వివిధ సౌకర్యాలు, ముఖ్యంగా షూటింగ్‌లకు వెళ్లడానికి రహదారులను మెరుగుపర్చడం, అనుమతులను త్వరగా ఇవ్వడం వంటి ప్రక్రియలు సులువుగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ రెండు రోజుల పాటు త్రిపుర, మణిపుర్, అస్సాం, మేఘాలయ, సిక్కింతోపాటు తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన 12 చిత్రాలను ప్రదర్శిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, సీనియర్ ఐఏఎస్ అధికారి దానకిశోర్, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కిశోర్‌బాబు, అదనపు డైరెక్టర్ డీఎస్ జగన్, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు, దర్శకులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక.. దంపతుల ఆత్మహత్య



మల్లేశ్, సంతోష

ఎల్బీనగర్ క్రైం, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారం కలిసి రాలేదు.. సొమ్మంతా పోయింది.. రుణాలతో వడ్డీలు పెరిగాయి.. కొత్తగా హైదరాబాద్‌లో కూరగాయల వ్యాపారం చేపట్టినా అప్పులు తీరే మార్గం కనిపించలేదు. ఈ క్రమంలో మానసిక ఒత్తిడితో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం హైదరాబాద్‌లోని నాగోలు, చైతన్యపురి ఠాణాల పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మక్బూల్‌జానీ, ఎస్సై వెంకటయ్యల కథనం ప్రకారం.. యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన గడ్డమీది మల్లేశ్(45), సంతోష(37) దంపతులు హైదరాబాద్ కొత్తపేట సమీపంలోని మార్గదర్శి కాలనీలో ఏడేళ్లుగా ఉంటున్నారు. వీరికి శివ(20), మేఘన(17), మౌనిక(15) సంతానం. గతంలో మల్లేశ్ స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. ఊళ్లోని పొలం, ఇల్లు అమ్మేశారు. అప్పటి నుంచి కొత్తపేటలోని రైతు బజార్‌లో దంపతులిద్దరూ కూరగాయలు అమ్ముతున్నారు. వడ్డీలతో అప్పులు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ఉదయపు నడకకు వెళ్లారు. తట్టిఅన్నారం సమీపంలో జనావాసాలకు దూరంగా ఉన్న ప్రాంతానికి బైక్‌పై వెళ్లారు. వెంట తెచ్చుకున్న పురుగు మందును కూల్‌డ్రింక్‌లో కలుపుకొని తాగారు. ఉదయం 7.45 గంటలకు కుమారుడు శివ నంబరుకు ఓ వాయిస్ మెసేజ్ వచ్చింది. తనపేరిట రూ.20 లక్షలు, తల్లి పేరిట రూ.20 లక్షలు ఎస్‌బీఐలో లభిస్తాయని తండ్రి చెప్పిన మాటలు విని భయపడ్డాడు. వెంటనే మల్లేశ్‌కు ఫోన్ చేసినా తీయలేదు. భయంతో చైతన్యపురి ఠాణాలో సంప్రదించాడు. పోలీసులు అతని తండ్రి చేసిన చివరి కాల్ ఆధారంగా లొకేషన్ తెలుసుకుని తట్టిఅన్నారం సమీపంలోకి వెళ్లారు. చెట్ల పొదల్లో అపస్మారకస్థితిలో ఉన్న దంపతులిద్దరినీ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సంతోష అప్పటికే చనిపోగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మల్లేశ్ మృతి చెందారు.



కెరీర్లో ఎదుగుదలకు నాలుగు సూత్రాలు

1. మీ మాటల కన్నా మీ పనే మీ గురించి చెప్పేలా శ్రద్ధతీసుకోవడం.
2. ఎట్టి పరిస్థితుల్లోనూ సాకుల కోసం వెతుక్కోకుండా పరిష్కార మార్గాలను అన్వేషించడం.
3. మీకు అప్పగించిన ప్రాజెక్టును గడువు కన్నా ముందే పూర్తి చేయడం.
4. మీ పనితీరుపై సారథితో పాటు బృందసభ్యుల అభిప్రాయాలు స్వీకరించి మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకోవడం.

– డేనియల్ స్కటెరి, కంటెంట్ క్రియేటర్

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలి

- వామపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నిరసన



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్. చిత్రంలో కూనంనేని, ప్రొ.హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఊచకోతకు పాల్పడుతుంటే.. సుప్రీంకోర్టు మౌనంగా ఉండటం అత్యంత బాధాకరమని సీపీఐ తెలంగాణ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇప్పటికైనా స్పందించి బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ వ్యవస్థ సుమోటోగా సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష, రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూనంనేని మాట్లాడుతూ.. బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెజస అధ్యక్షుడు ప్రొ.కోదండరాం మాట్లాడుతూ.. ప్రజాస్వామిక స్వభావానికి బూటకపు ఎన్‌కౌంటర్లు గొడ్డలిపెట్టు వంటివని అన్నారు. రాజ్యాంగం, చట్టం ప్రకారం ప్రాణాలు తీసే అధికారం రాజ్యానికి లేదన్నారు ప్రొ.హరగోపాల్. ఎన్‌కౌంటర్లపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్. నిరసనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పోటు రంగారావు, సాదినేని వెంకటేశ్వరరావు, ప్రొ.లక్ష్మణ్, మురహరి, రమేశ్ రాజా, భాస్కర్, ఈటీ నరసింహ, సయ్యద్ అజీజ్ పాషా, పల్లా నరసింహారెడ్డి, అంజయ్య నాయక్, ఛాయదేవి, నేదునూరి జ్యోతి, వెంకటేశం, నర్సింహ, చలపతిరావు, సంధ్య, గోవర్ధన్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

అప్పుడే కళ్లు తెరిచి.. అంతలోనే కన్నుమూసి

ఆసుపత్రిలో నవజాతశిశువు మృతి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: తమ కలలకు ప్రతిరూపంగా బాబు జన్మించాడని మురిసిపోయిన ఆ తల్లిదండ్రుల సంతోషం కొన్ని గంటలైనా నిలవలేదు. ఆసుపత్రి సిబ్బంది అజాగ్రత్తతో ఆ కన్నవాళ్లకు పుత్రశోకమే మిగిలింది. కప్‌బోర్డు.. మృత్యువు రూపంలో నవజాత శిశువును కబళించిన విషాద ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. సారంగాపూర్ మండలానికి చెందిన దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు. రెండోసారి గర్భం దాల్చిన ఆ తల్లి నెలలు నిండటంతో నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవం కోసం చేరారు. శుక్రవారం సాయంత్రం పండంటి బాబుకు జన్మనిచ్చారు. ఆరోగ్యంగా జన్మించిన ఆ శిశువును శుభ్రం చేసి, వైద్య పరీక్షలు నిర్వహించడం కోసం స్థానికంగా ఉన్న ఓ పిల్లల ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాబును బెడ్‌పై ఉంచి క్లీనింగ్ కోసం నర్సు తగిన ఏర్పాట్లు చేస్తున్న సమయంలో.. ఆ గదిలో ఉన్న ర్యాక్ (కప్‌బోర్డు) హఠాత్తుగా కూలి బాబుపై పడింది. దీంతో శిశువు అక్కడికక్కడే మృతి చెందాడు. డెలివరీ అయిన గంటల వ్యవధిలో తమ కుమారుడు చనిపోయాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. పుట్టిన పిల్లాడిని తనివితీరా కళ్లారా చూసుకోకముందే శ్మశనానికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని కన్నీరుమున్నీరయ్యారు.

దేశంలో 56.35% మందిలో ఉద్యోగ అర్హత నైపుణ్యాలు

- ఉపాధి సామర్థ్యాలున్న వారిలో 75.7% మంది 22-25 ఏళ్ల వారే
- మహిళలు పని చేయడానికి ఇష్టపడే రాష్ట్రాల్లో ఏపీకి నాలుగో స్థానం
- భారత నైపుణ్యాల నివేదిక-2026 వెల్లడి

ఈనాడు, అమరావతి: ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన వారు దేశవ్యాప్తంగా 56.35% మంది ఉన్నట్లు భారత నైపుణ్యాల నివేదిక-2026 వెల్లడించింది. ఉద్యోగ అర్హత నైపుణ్యాలున్న వారిలో ఉత్తర్‌ప్రదేశ్ (78.64%) మొదటి స్థానంలో నిలవగా.. ఆ తర్వాత స్థానాల్లో మహారాష్ట్ర (75.42%), కర్ణాటక (73.85%), కేరళ (72.16%), దిల్లీ (71.25%) నిలిచాయి. ఏఐసీటీఈ, సీఐఐ సహకారంతో వీబాక్స్ సంస్థ నిర్వహించిన ఈ సర్వే నివేదికను తాజాగా విడుదల చేశారు. సర్వేలో భాగంగా దేశవ్యాప్తంగా మొత్తం 7 లక్షల మందికి గ్లోబల్ ఎంప్లాయిబిలిటీ టెస్ట్(గెట్) నిర్వహించగా.. ఇందులో 60% పైగా మార్కులు సాధించిన వారు 56.35% మంది ఉన్నారు. మహిళలు పని చేయడానికి ఇష్టపడే మొదటి 10 రాష్ట్రాల్లో ఏపీ నాలుగో స్థానంలో నిలిచింది. దీనికి ముందు రాజస్థాన్, కేరళ, తెలంగాణ వరుసగా ఉన్నాయి. జాతీయ సగటున ఉద్యోగ నైపుణ్యాల్లో మహిళలు.. పురుషులను అధిగమించారు. మహిళలు 54% మంది ఉండగా.. పురుషులు 51.5% మంది ఉన్నారు. హైబ్రిడ్ పని, డిజిటల్ నైపుణ్యాభివృద్ధి మహిళల నైపుణ్య మెరుగుదలకు దోహదం చేశాయి. 2022లో అత్యధికంగా 53.28% మంది ఉద్యోగ నైపుణ్యాలు కలిగి ఉండగా.. 2026కు ఇది 54%గా ఉంటుందని తేలింది. ఎంబీఏ పూర్తి చేస్తున్న వారిలో 72.76% మందికి ఉద్యోగ అర్హత నైపుణ్యాలు ఉండగా.. బీటెక్‌లో 70.15% మందిలో ఉపాధి సామర్థ్యాలున్నాయి. 2025తో పోల్చితే 2026లో ఎంబీఏ పూర్తి చేసే వారిలో 5%, బీటెక్ వారిలో 1.35% తగ్గింది.

ఆంగ్ల భాష నైపుణ్యాల్లో మహారాష్ట్ర టాప్..

◆ ఆంగ్ల భాష నైపుణ్యాలు అత్యధికంగా కలిగిన వారిలో మహారాష్ట్ర 68.23%తో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పంజాబ్, దిల్లీ ఉన్నాయి.

◆ క్రిటికల్ థింకింగ్ నైపుణ్యాల్లోనూ మహారాష్ట్ర (68.23%), ఉత్తర్‌ప్రదేశ్ 67.89% ముందు వరసలో ఉన్నాయి.

◆ ఉద్యోగాలు చేసేందుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే రాష్ట్రాల జాబితాలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళతో పాటు దిల్లీ ఉన్నాయి. నగరాల్లో హైదరాబాద్, బెంగళూరు, పుణే, ముంబయి, చెన్నై నిలిచాయి.

◆ మగవారు గ్రాఫిక్ డిజైన్(83.11%), ఇంజినీరింగ్ డిజైన్(64.67%) వంటి పరిశ్రమలను ఇష్టపడుతుండగా.. మహిళలు లీగల్ (96.4%), హెల్త్‌కేర్(85.95%) రంగాల వైపు ఆసక్తి చూపుతున్నారు. ◆ ఉద్యోగ నియామకాల్లో కృత్రిమ మేధ ఇంటిగ్రేషన్ పెరిగింది. ఐటీలో 70%, బ్యాంకింగ్, ఫైనాన్స్, సర్వీస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో 50% ఏఐని పూర్తిగా లేదా పాక్షికంగా వినియోగిస్తున్నారు.

◆ ఉద్యోగ అర్హత నైపుణ్యాలున్న వారిలో 22-25 ఏళ్ల వారు 75.7% ఉండగా.. 18-21 ఏళ్ల వారు 71.38%, 26-29 ఏళ్ల వారు 71.79% మంది ఉన్నారు. 22-25 ఏళ్ల వారు ఎంట్రీలెవల్ ఉద్యోగాల్లో ఎక్కువగా ఉన్నారు.

◆ బీఎఫ్ఎస్ఐ, విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఉత్తర్‌ప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో టైర్-2, టైర్-3 ప్రాంతాల్లో బలమైన మహిళా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి.

జాతీయ స్థాయిలో ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన వారు

సంవత్సరం	శాతం
2020	46.21
2021	45.9
2022	46.2
2023	50.3
2024	51.25
2025	54.81
2026	56.35

బీటెక్‌లో బ్రాంచీల వారీగా ఉపాధి నైపుణ్యాలు

బ్రాంచీ	శాతం
కంప్యూటర్ సైన్సు	80
ఐటీ	78
ఇన్‌స్ట్రుమెంటేషన్	77
ఈసీఈ	75
మెకానికల్	63

కోర్సుల వారీగా ఉద్యోగ అర్హత నైపుణ్యాలు కలిగిన వారు శాతాల్లో

కోర్సు	2025	2026
ఎంబీఏ	78	72.76
బీఈ/బీటెక్	71.50	70.15
ఎంసీఏ	71	68.25
బీకాం	55	62.81
బీఎస్సీ	58	61
బీఫార్మా	56	58
ఆర్ట్స్	54	55.55
ఐటీఐ	41	45.95
పాలిటెక్నిక్	29	32.92

బెట్టింగ్ యాప్‌ల కేసులో మరో ముగ్గురి విచారణ

- ఇంతవరకు 22 మంది వాంగ్మూలాల నమోదు
- మిగిలింది మంచు లక్ష్మి, భయ్యా సన్నీయాదవ్, రీతూచౌదరి

ఈనాడు, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ కొనసాగుతోంది. తెలంగాణ పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా దర్యాప్తు చేస్తున్న సిట్ శుక్రవారం ముగ్గురు నిందితుల్ని విచారించింది. సినీనటి నిధి అగర్వాల్, యాంకర్ శ్రీముఖి, యూట్యూబర్ అమృత చౌదరిని వేర్వేరుగా విచారించి వాంగ్మూలాల్ని నమోదుచేసింది. బెట్టింగ్ యాప్‌లకు ఎందుకు ప్రచారం చేయాల్సి వచ్చిందనే ప్రశ్నలకు మిగతా నిందితుల మాదిరిగానే సమాధానమిచ్చినట్లు తెలిసింది. గేమింగ్ యాప్‌లు అనుకొని మాత్రమే ప్రచారం చేశామని వాంగ్మూలమిచ్చినట్లు సమాచారం. పారితోషికం గురించి ప్రశ్నించగా.. బ్యాంకు లావాదేవీల సమాచారాన్ని అప్పగిస్తామని వెల్లడించినట్లు తెలిసింది. ఈ కేసులో మొత్తం 25 మంది నిందితుల్ని గుర్తించిన సిట్ ఇంతవరకు 22 మంది నుంచి వాంగ్మూలాలు సేకరించింది. సినీనటులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్‌తోపాటు వైకాపా నేత శ్యామల, యాంకర్లు విష్ణుప్రియ, హర్షసాయి, టేస్టీ తేజ, అనన్య నాగళ్ల, సిరి హనుమంతు తదితరులు ఇప్పటికే వాంగ్మూలాలిచ్చారు. సినీనటి మంచు లక్ష్మితోపాటు రీతూచౌదరి, భయ్యా సన్నీయాదవ్‌ను విచారించాల్సి ఉంది. సన్నీయాదవ్ విదేశాల్లో ఉన్నందున.. రీతూచౌదరి బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్న కారణంగా కొంత గడువు అడిగినట్లు తెలిసింది. మంచు లక్ష్మి సైతం ఇతర పనుల్లో ఉన్న కారణంగా కొంత సమయం అడిగినట్లు సమాచారం. ఈ ముగ్గురినీ విచారించి వాంగ్మూలాలు సేకరించిన అనంతరం తదుపరి కార్యాచరణ దిశగా సిట్ అడుగులు వేయనుంది. నిందితులిచ్చిన వాంగ్మూలాల్లో వాస్తవికతపై ఆరా తీయనుంది. తప్పుడు సమాచారంతోపాటు కేసును తప్పుదోవ పట్టించేలా ఆధారాలు సమర్పించినట్లు తేలితే కఠినంగా వ్యవహరించాలనే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే గేమింగ్ యాప్ అనుకొని మాత్రమే తాము ప్రచారం చేసినట్లు నిందితులు చెబుతున్న దాంట్లో వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరంగా ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది.

గుజరాత్‌లో 'ఎస్ఐఆర్' బీఎల్‌వో ఆత్మహత్య

పని ఒత్తిడే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ

కొడినార్: గుజరాత్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)లో బీఎల్‌వోగా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐఆర్ పని ఒత్తిడి భరించలేకే ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గిర్ సోమ్‌నాథ్ జిల్లా కొడినార్ నియోజకవర్గం దేవ్లీ గ్రామానికి చెందిన అరవింద్ వాధేర్ ఇక్కడి ఛారా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొన్ని రోజుల కిందట ఆయనకు ఎస్ఐఆర్‌లో భాగంగా బీఎల్‌వో బాధ్యతలు అప్పగించారు. ఆ విధులు నిర్వహిస్తున్న ఆయన శుక్రవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకున్నారు. ''ఎస్ఐఆర్ విధులతో కొన్ని రోజులుగా ఒత్తిడికి గురవుతున్నాను. ఇక ఈ పని చేయడం నా వల్ల కాదు. వేరే దారి లేక ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. కుమారుడిని జాగ్రత్తగా చూసుకో'' అని అరవింద్ తన భార్యకు లేఖ రాసి చనిపోయారని కుటుంబసభ్యులు చెబుతున్నారు. దీనిపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎన్‌వీ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ.. బాగా పనిచేస్తున్న బీఎల్‌వోలలో అరవింద్ ఒకరని, ఆయన ఇప్పటికే 40 శాతం పని కూడా పూర్తి చేశారని, ఇలా ఆత్మహత్య చేసుకోవడం నమ్మలేకపోతున్నామని చెప్పారు. ఈ ఆత్మహత్యపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

నేపాల్ ఘర్షణల్లో జన్‌జీ కార్యకర్తలకు గాయాలు

కాఠ్‌మాండూ: నేపాల్‌లో ఇటీవల ప్రభుత్వాన్ని కూలదోసిన జన్‌జడ్ కార్యకర్తలకు, పదవీచ్యుతుడైన ప్రధాని కె.పి.శర్మ ఓలీ మద్దతుదారులకు మధ్య శుక్రవారం ఘర్షణ జరిగింది. ఇందులో పదుల సంఖ్యలో జన్‌జడ్ కార్యకర్తలు గాయపడ్డారు. కాఠ్‌మాండూలోని మైతెఘర్ మండల భవనం ముందు పలువురు జన్‌జీ కార్యకర్తలు ఓలీకి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన ప్రదర్శన ఘర్షణకు దారితీసింది. గత సెప్టెంబరులో నిర్వహించిన నిరసన ప్రదర్శనల్లో 76 మంది విద్యార్థుల మరణానికి కె.పి.శర్మ ఓలీదే బాధ్యత అని నిరసనకారుల ఆరోపణ. మరోవైపు ఓలీకి చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ - యునైటెడ్ మార్క్సిస్టు లెనినిస్టు (సీపీఎన్-యూఎంఎల్) పార్టీ కూడా అదే ప్రదేశంలో పార్టీ కార్యక్రమం నిర్వహించడంతో ఇరుపక్షాలూ పరస్పరం ఆందోళనకు దిగాయి. ఘర్షణను నివారించడానికి భారీగా బలగాలు మోహరించారు.

ఫార్ములా-'ఈ' నిబంధనలకు చెల్లుచీటీ!

- హెచ్‌ఎండీఏ చట్టానికి వ్యతిరేకంగా చెల్లింపులు
- అనిశా దర్యాప్తు నివేదికలో కీలకాంశాలు • సిద్ధమవుతున్న అభియోగ పత్రాలు



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫార్ములా-ఈ రేసు నిర్వహణ అంశంపై అవినీతి నిరోధక శాఖ(అనిశా) జరిపిన దర్యాప్తులో మరెన్నో అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. రేసు నిర్వహించాలన్న ఆలోచన వచ్చినప్పటి నుంచి.. రెండోసారి నిర్వహణ బాధ్యత తలకెత్తుకొని నిధులు మంజూరుచేసే వరకు.. ఏదశలోనూ నిబంధనలు పట్టించుకోలేదని, దీన్ని తీవ్రమైన అంశంగానే పరిగణించాల్సి ఉంటుందని అనిశా దర్యాప్తు తేల్చిచెప్పింది. ఈ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడంతో గత ఏడాది డిసెంబరులో నమోదయిన ఈ కేసుకు సంబంధించి అనిశా అధికారులు అభియోగపత్రాలు సిద్ధం చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు డీవోపీటీ అనుమతి లాంఛనప్రాయమే కావడంతో తాము జరిపిన దర్యాప్తులో సేకరించిన ఆధారాలను క్రోడీకరిస్తున్నారు. అనిశా దర్యాప్తునకు సంబంధించిన నివేదిక 'ఈనాడు'కు చిక్కింది. ఇందులో పేర్కొన్న కీలకాంశాలివీ..

ప్రతిచోటా ఉల్లంఘనలే!

సీజన్-9 నిర్వహణకు 2022 జులై 11న.. కేటీఆర్ ఆధ్వర్యంలో మేనేజింగ్ కమిటీ, పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ కమిటీలను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఈ కమిటీల ఏర్పాటుకు ఆర్థికశాఖ నుంచి గానీ, ఇతరత్రా ప్రభుత్వ విభాగాల నుంచి గానీ ఎలాంటి అనుమతులు లేవు. కమిటీల సమావేశాలు, విధుల నిర్వహణకు సంబంధించి మినిట్స్ కూడా ఎక్కడా నమోదు కాలేదు.

➡ సీజన్-9, 10ల నిర్వహణకు 2022 అక్టోబరు 25న అర్వింద్‌కుమార్, ఫార్ములా-ఈ ఆపరేషన్స్ ప్రతినిధి అల్బెర్టో లోంగో, రేసు స్పాన్సర్లలో ఒకరైన చలమలశెట్టి సునీల్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. దీని ప్రకారం రేసు నిర్వహణకు అవసరమైన వసతులు కల్పించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాగా మిగతా ఖర్చులు, ఫీజులు వంటివి చెల్లించడం స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఏస్‌నెక్స్ట్‌జెన్ బాధ్యత. కేటీఆర్ ఆదేశాల మేరకే అర్వింద్‌కుమార్ ఈ ఒప్పందంలో సంతకం చేశారు. ఇలా చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 166(1), 299తోపాటు తెలంగాణ సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్, ఫైనాన్స్ కోడ్ ఉల్లంఘన కిందికే వస్తుంది.

➡ ఈ మొత్తం వ్యవహారంలో హెచ్‌ఎండీఏకి ఏమాత్రం సంబంధం లేకపోయినప్పటికీ సీజన్-9 నిర్వహణకు అయిన ఖర్చులో రూ.20,99,78,136, ట్రాక్ ఏర్పాటుకు రూ.30 కోట్లు చెల్లించింది. అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ఇతర ఖర్చుల కోసం మరో రూ.4,27,64,878 చెల్లించింది. హెచ్‌ఎండీఏ చట్టం ప్రకారం ఏర్పాటయిన మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎండీఏ) అనుమతి లేకుండానే అర్వింద్‌కుమార్ ఈ చెల్లింపులన్నింటినీ ఆమోదించారు. ఖర్చుపెట్టిన తర్వాత కూడా ఎండీఏ లేదా దాని కార్యనిర్వాహక కమిటీ నుంచి ఎలాంటి ఆమోదం పొందలేదు. అంతర్జాతీయ క్రీడల కోసం డబ్బు ఖర్చుపెట్టడం హెచ్‌ఎండీఏ చట్టం ప్రకారం చెల్లదు.

➡ ఈ రేసు నిర్వహణ కోసం కుదుర్చుకున్న ఒప్పందంలో భాగస్వామి అయినప్పటికీ పట్టణాభివృద్ధిశాఖలో ఎలాంటి రికార్డులు లేవు. దాంతో భవిష్యత్తులో కూడా ఖర్చులు సరిచూడటానికి, ఆడిట్ నిర్వహించడానికి సాధ్యం కాదు. అక్రమాలకు బాధ్యులైన వారిని రక్షించి, చట్టానికి దొరక్కుండా చూడటమే దీన్ని ముఖ్యోద్దేశంగా కనిపిస్తోంది. అసలు రికార్డులే లేకుండా చేయడం ఉల్లంఘనలు అన్నింటికంటే ఘోరం.

➡ ఈ ఖర్చంతా ఒక రేసు నిర్వహణ కోసమే అన్నట్లు నోట్‌ఫైల్‌లో చిత్రీకరించారు. వాస్తవానికి మొత్తం మూడు సీజన్ల నిర్వహణకు ఈ ఖర్చు వర్తిస్తుంది. అలాంటప్పుడు క్యాబినెట్ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. క్యాబినెట్ ఆమోదంతో అవసరం లేకుండా ఉండేందుకే నోట్‌ఫైల్‌లో కేవలం ఒక రేసు నిర్వహణ కోసమే అని పేర్కొన్నారు. ఇది కూడా బిజినెస్ రూల్స్, ఫైనాన్స్ కోడ్ ఉల్లంఘన కిందికే వస్తుంది.

➡ పన్నులు మినహాయించుకోవడం, ఒప్పందం ప్రతిని సమర్పించడం వంటివి లేకుండానే విదేశాలకు చెల్లింపులు జరపడం ఆర్బీఐ నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుంది. అర్వింద్‌కుమార్, అప్పట్లో.. హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేసిన బీఎల్ఎన్ రెడ్డిల ఒత్తిడి వల్లే హెచ్‌ఎండీఏ సీఈవో విజయలక్ష్మి, ఐఓబీ బ్యాంకు చీఫ్ మేనేజర్ సమీర్ బిస్వాల్‌లు వ్యవహరించడం వల్ల ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.8,06,75,404 అదనపు భారం పడింది. హెచ్‌ఎండీఏ ఆడిటర్ కైలాశ్‌కుమార్ బంగ్‌కు కూడా అందులో భాగస్వామ్యం ఉంది.

➡ రాష్ట్ర శాసనసభ ఎన్నికల కోసం 2023 అక్టోబరు 9న నోటిఫికేషన్ వెలువడగా అదేరోజు నుంచి ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయి. అయినప్పటికీ సీజన్-10 నిర్వహణ కోసం అక్టోబరు 30న జరిగిన ఒప్పందాన్ని ఆమోదించారు. ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన.

➡ వ్యక్తిగత పేరు ప్రఖ్యాతుల కోసం కేటీఆర్ పాకులాడటం వల్ల హెచ్‌ఎండీఏకి భారీ నష్టం వాటిల్లింది. వాస్తవానికి ఫార్ములా-ఈ రేసు వంటి అంతర్జాతీయ క్రీడల నిర్వహణ అంశం హెచ్‌ఎండీఏ పరిధిలోకి రాదు. అయినప్పటికీ తన సొంత ప్రయోజనాల కోసం కేటీఆర్ మరో ఇద్దరు నిందితులైన అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డిల సహకారంతో సీజన్-9, 10 కోసం హెచ్‌ఎండీఏ నిధులు ఖర్చుపెట్టారు. ఇది హెచ్‌ఎండీఏ చట్ట ఉల్లంఘనే.

(c) eenadu